# కౌముది కిరణాలు

(సంపాదకీయాలు)

- కిరణ్‌ప్రభ



శ్రీ

కౌముది

మీ మనోగతిలో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 100

# కౌముది మాసపత్రిక

# జనవరి 2007 సంచిక నుంచి ఏప్రిల్ 2015 సంచిక వరకూ

# సంపాదకీయాలు

# 2015

**ప్రతివ్యక్తీ ఊపిరి తీసుకోవడం ఎంత సహజమో,** జీవితంలో సమస్యలనెదుర్కోవడం అంత సహజం. ఎదురైన సమస్యలని ఎంత ప్రతిభావంతంగా పరిష్కరించుకోగలరన్న అంశమే విజేతలని మిగతా వ్యక్తులనుంచి విభిన్నంగా చూపిస్తుంది. సమస్య కారణం, పుట్టుక, స్వరూపం, తీవ్రత..ఇలాంటి అంశాలని బట్టి పరిష్కారమార్గాలు వేర్వేరు కావొచ్చు. అలానే ఒక వ్యక్తికి ఎదురయ్యే వ్యక్తిగత సమస్యలు, అదేవ్యక్తి ఒకబృందానికి నాయకుడు ఐనప్పుడు (ఆఫీసులో, స్కూల్లో, సంస్థలో..) ఎదురయ్యే సమస్యలు వేర్వేరుగా ఉంటాయి. ఒక బృందాన్ని లక్ష్యం వైపు నడిపించాల్సిన నాయకుడికి - తన వల్ల కాకపోయినా, బృందంలో ఎవరి వల్లనైనా సమస్య ఉత్పన్నం కావొచ్చు. ఆఫీసులో సమయానికి పూర్తికావల్సిన పని ఏదో కారణం వల్ల అలశ్యమౌతుంది, స్కూల్లో ఏదో అవాంఛనీయ సంఘటనకి ఒక విద్యార్థో, ఉపాధ్యాయుడో కారణం ఔతాడు, ఇంట్లో పిల్లాడు చెప్పిన మాట వినకుండా బయటికెళ్ళి దెబ్బలు తగిలించుకొస్తాడు.. ఇలాంటి సందర్భాల్లో ఆ ఆఫీసరో, ప్రిన్సిపాలో, కుటుంబపెద్దోచెయ్యాల్సిన పని –ముందుగా ఎదురైన సమస్యని ఎలా పరిష్కరించాలా అని ఆలోచించి, ఆ దిశగా ప్రయత్నాలు చేయడం. ఒకసారి సమస్య పరిష్కారమయ్యాక సావధానంగా అందరితో కూర్చుని, సమస్యని పోస్టుమార్టమ్ చేసి, మూలకారణాలని వెదికి మళ్ళీ అలాంటిసమస్యరాకుండా నివారణ చర్యలు రూపొందించుకోవడం వివేకవంతులు చేసే పని. ఈ వ్యవహార సరళిని - Being Part of the Solution అంటారు. అలా కాకుండా సమస్య ఎదురుకాగానేకనిపించిన వాళ్ళనందరినీ విసుక్కోవడం, 'నేను ముందునుంచీ చెబుతున్నా ..ఎవరన్నా వింటేనా?' అనో , 'ఇలాంటి అసమర్థులతో పనిచేయడం నా ఖర్మ' అనో పక్కనున్న వాళ్ళందరినీ నిందించడం.. ఇలాంటి వ్యవహారశైలిని Being Part of the Problem అంటారు. కంగారు, చిరాకు, కోపం, అవగాహనాలేమి, తొందరపాటు, సమ్యమనం కోల్పోవడం.. ఇలాంటివన్నీ సమస్యని పరిష్కారానికి దోహదం చెయ్యవు కదా, మరింత జటిలం చేస్తాయి.ఇలాంటి నెగిటివ్ భావోద్వేగాలకి లోనయ్యే వ్యక్తి బృందనాయకుడిగా విజయం సాధించలేడు.పదవిలో ఉన్నాడు కాబట్టి తనదగ్గర పనిచేసేవాళ్ళు కొంతకాలం ఈ నెగిటివ్ భావాలని భరించగలరేమో కానీ దీర్ఘకాలంలో ఇలాంటి ప్రవర్తనా శైలి, ఉత్పాదకతకి దోహదం చెయ్యదని విశ్లేషకుల అభిప్రాయం. నాయకుడిగా ఉన్నవాళ్ళు , ఎదుగుతున్న వాళ్ళు, ఎదగాలనుకున్నవాళ్ళు Being Part of the Solution ఔతారా లేక Being Part of the Problem ఔతారా అనే అంశం వారి విజయావకాశాలని నిర్ణయిస్తుంది. ఈ కొత్తసంవత్సరం మిమ్మల్ని Being Part of the Solution వ్యక్తులుగా కొనసాగించి, మీకు అన్ని రంగాల్లో విజయాలను సమకూర్చాలని 'కౌముది' మనసారా ఆశిస్తోంది.

- ***జనవరి, 2015***

***

**అప్పుడప్పుడూ వినిపించే మాటలు** 'నేను ఒంటరిని', ' నాకు ఎవ్వరూ లేరు', ' నన్నెవరూ పట్టించుకోరు',' పుట్టేటప్పుడు ఒంటరిగానే పుట్టాము, పోయేప్పుడు ఒంటరిగానే పోతాము'.. ఇలా! నిజంగా ఆలోచిస్తే మనిషి ఎప్పుడూ ఒంటరివాడు కాదు. పుట్టేటప్పుడే బంధాలు ఏర్పడతాయి. అమ్మా, నాన్నా, బంధువులు, తోబుట్టువులూ.. ఇవన్నీ వద్దనుకున్నా ఏర్పడే అనుబంధాలే కదా. ఇంకా జీవనప్రయాణంలో ఏర్పరచుకునే స్నేహాలూ, బంధాలు, అనుబంధాలు ఎలానూ ఉంటాయి. వీటిని ఎవరు, ఎంతవరకూ, ఎంతకాలం నిలబెట్టుకుంటారనేది ఆయా  వ్యక్తుల వ్యవహార శైలిని బట్టి ఉంటుంది. 'నా కవసరమైనప్పుడే ఎదుటివారితో మాట్లాడుతాను' 'ఫలాన వాళ్ళు నాకు నచ్చని  విధంగా ప్రవర్తించారు. వాళ్ళతో మాట్లాడేదేంటి?''ఫలానా వాళ్ళు నా స్థాయికి సరితూగరు..వాళ్ళతో నేనెందుకు మాట్లాడాలి..?'... ఇలా అనుకోవడం,  ప్రవర్తించడం ఎవరిష్టం వారిది కావొచ్చు కానీ ఇవన్నీ వ్యక్తిగత ప్రపంచాన్ని కుంచించుకుపోయేలా చేసే స్వభావాలు. 'నాకు ఎదుటివారితో అవసరమైనప్పుడు వారికి నాతో అవసరం లేకపోవచ్చు.  అప్పుడు పలకరిస్తే వాళ్ళు మాట్లాడకపోవచ్చు. ఎప్పుడూ  మంచిగా ఉంటే పోయేదేముంది?' 'ఎదుటివారు నాకు నచ్చకపోవడమనేది నేను విధించుకున్న పరిధి. ఎవరినైనా నా ఆలోచనల్లోంచికాక వాళ్ళ ఆలోచనల్లోంచి చూసేందుకు ప్రయత్నిస్తే తప్పేముంది?' 'ప్రపంచంలో ఆస్తి, అంతస్తు, వయసు, హోదా..ఇవన్నీ ఎంతవరకూ శాశ్వతం? నేను గొప్పవాడిని అని గిరిగీసుకోకుండా అందరితో మామూలుగా  ఉంటే?' .. ఇలా అనుకోవడం 'నేనొంటరిని ' దృక్పథం నుంచీ 'నాకెంతోమంది ఉన్నారు' అని ధైర్యమిచ్చే దిశగా ఎదగడాన్ని ప్రోత్సహిస్తుంది. మనసునీ, ఆలోచనలనీ, ప్రవర్తనా శైలినీ విశాలం చేసుకున్నప్పుడు ఆప్తులూ, ఆత్మీయులూ ఎటువైపు చూసినా కనిపిస్తారు.  నిరాశా, నిస్పృహల్లో మునిగినప్పుడు 'ఎవ్వరూ లేరు' అనుకోవడం ఒక విధమైన న్యూనతా భావమే తప్ప యదార్థం కాదని మానసిక శాస్త్రవేత్తలు చెబుతారు. 'నేను ఒంటరిని'అనుకునేది ఆయా వ్యక్తుల మానసిక స్థితే . జీవితరంగం నుంచీ నిష్క్రమించేప్పుడు కూడా ప్రతివారూ ఏదో జ్ఞాపకాన్ని వదిలే వెళ్తారు. ఎంతమందిలో? ఎలాంటి జ్ఞాపకాలు? - అనేవి ఆయా వ్యక్తుల జీవన శైలిని బట్టి ఉంటుంది. 'అయినవాళ్ళు ఉన్న లోగిళ్ళలో - ఆయువాగిపోదు నూరేళ్ళతో!' సానుకూల దృక్పథంతో ముందడుగువేస్తుంటే  దొరికేది 'జగమంత కుటుంబం' ప్రతికూల భావాలతో ముడుచుకుపోతుంటే మిగిలేది 'ఏకాకి జీవితం'!!

*- ఫిబవరి, 2015*

***

**సంభాషణ అనేది మన నిత్యజీవితంలో** చాల ముఖ్యమైన అంశం. మన భావాలు ఎదుటివారికి తెలియచేయడానికి మనం మాట్లాడాలి. ఎదుటి వారి భావాలు తెలుసుకునేందుకు మనం వారి మాటలు వినాలి. వీటితోబాటుగా మనిషి తనతో తాను, తనలో తాను మాట్లాడుకోవడం అలవాటు చేసుకోవాలని అనుభవజ్ఞులు చెబుతుంటారు. మనిషి తనలో తాను మాట్లాడుకోవడం అంటే బుద్ధికీ హృదయానికి మధ్య వారధి నిర్మించడమే. ఇలాంటి వంతెన లేని సందర్భాలనే ఆత్రేయగారు " బుద్ధికి హృదయం లేక - హృదయానికి బుద్ధేరాక - నరుడే ఈ నరలోకాన్ని నరకం చేశాడు" అన్నారు. మనిషిలో సమతుల్యత లేకపోవడమే అతనికీ నరకం, చుట్టుపక్కల వారికీ నరకం! ఇలాంటి పరిస్థితుల్ని సరిదిద్దుకునే క్రమంలోనే - కొన్నిసార్లు బుద్ధి హృదయంతో మాట్లాడాలి, మరికొన్నిసార్లు హృదయం బుద్ధిని మందలిస్తూ ఉండాలి. ఒకే సందర్భాన్ని బుద్ధి, మెదడు, ఆలోచన.. ఒక కోణంలోంచి చూస్తే హృదయం, మనసు, అనుభూతి .. ఇవన్నీ వేరే కోణంలో చూడవచ్చు. బుద్ధి వాస్తవంలో ఉంటే మనసు ఊహల్లో ఉండొచ్చు. హృదయం భావోద్వేగాలకి లోనైనప్పుడు ఆలోచన పక్కకి తప్పుకోవచ్చు. ఆలోచనలు పూర్తిగా మెటీరియలిస్టిక్ ఐపోయి, బంధాలూ అనుబంధాలూ గడ్డి పోచల్లా కనిపిస్తున్నప్పుడు మనసు మెదడుతో మాట్లాడాలి. కేవలం కళ్ళముందు కనిపించే సంపద, హోదా, పదవి మాత్రమే శాశ్వతం కాదు అంతకు మించిన మానవత్వపు బంధాలు కూడా జీవితంలో ముఖ్యమైనవేనని హృదయం బుద్ధికి గుర్తు చేస్తూ ఉండాలి. దీనికి విలోమం కూడ ఉంటుంది. ప్రతికూల భావోద్వేగాలకు లోనై అతలాకుతలమైపోతున్న మనసుని మెదడులోని ఆలోచనలు హెచ్చరిస్తూ ఉండాలి. ఉద్రేకాలకి బానిసై పోకుండా సవ్యమైన ఆలోచనలతో సరైన మార్గంలో నడవడం ఎలానో బుద్ధి హృదయానికి నచ్చచెప్పాలి. ఇదే - మనిషి తనలో తాను సంభాషించుకోవడం అంటే. ఈ సమన్వయం కొరవడినప్పుడే మనిషి పూర్తిగా అవేశపరుడై పోవడమో, అతి సున్నితమై పోవడమో లేదా స్పందనే లేని యాంత్రిక జీవితంలో ముడుచుకు పోవడమో జరుగుతుంది. మనిషి తనకి తాను పరిపూర్ణుడవడానికీ, స్థితప్రజ్ఞత సాధించడానికీ, తన పరిసరాలని ప్రకాశవంతం చేయడానికీ తొలి అడుగు - మనసుకి, మెదడుకీ మధ్య సమన్వయం సాధించడం. !!

- *మార్చి, 2015*

***

**గొల్లపూడి మరుతిరావు - అతిథి సంపాదకీయం**

*శతమాసం భవతి*



అక్షరాన్ని ఆరాధించే అదృష్టవంతులు ఆ దంపతులు. సాహిత్యం వ్యసనం.ఆయన్ని పెళ్ళిచేసుకున్న కారణంగా ఆ వ్యసనాన్ని వ్యావృత్తి చేసుకున్న ఇల్లాలు ఆయన భార్య. ఇంతవరకు ఈ విషయాలు నాకూ వర్తిస్తాయి. కానీ సాహిత్యానికి ఒక వేదికని ఏర్పరిచిన ఉద్యమం ఆ ఇద్దరిదీను. ఇది వారికి మాత్రమే ప్రత్యేకత.

తెలుగుదేశంలో పత్రికను నడపడం ముందుగా డబ్బుతో కూడిన సమస్య. తర్వాత దాని పాపులారిటీ, రాబడి వగైరా. నాకు తెలిసి ఇంటర్నెట్ పత్రికని నిర్వహించడం విపరీతమైన కమిట్‌మెంట్. ప్రపంచంలో చాలా దేశాల, ప్రాంతాల పాఠకుల్ని సమీకరించడం. పత్రికకు రెండు కారణాలుగా ప్రాచుర్యం వస్తుంది. మొదటిది 'పాలన' – రెండవది 'నిర్వహణ'. మొదటిది సాహిత్యంలో ప్రమేయంలేని వారెవరో కేవలం వ్యాపారాన్ని దృష్టిలో పెట్టుకుని నడిపే వ్యవహారం. అలా కాకుండా సాహిత్యాభిమానంతో ఈ దేశంలో పత్రికను నడిపిన ముగ్గురు ప్రముఖులు నాకు కనిపిస్తారు – ప్రధానంగా – కాశీనాధుని నాగేశ్వరరావుగారు. అందుకే అలనాడు ఆంధ్రపత్రిక, భారతి చరిత్రను సృష్టించాయి. అలాగే ముట్నూరు కృష్ణా రావుగారి 'కృష్ణాపత్రిక'ని మరిచిపోలేము. తర్వాత కిన్నెర సంపాదకులు పందిరి మల్లిఖార్జున రావుగారు. రెండవది – అతి ముఖ్యమైన లక్షణం – నిర్వహణ. పాఠకునికి ఆ పత్రిక స్వభావం మీదా, ధోరణిమీదా, అభిప్రాయాల మీదా, వెరసి – 'వ్యక్తిత్వం' (తెలుగులో మరో మాట 'కేరెక్టర్'కి గుర్తురాక ఈ మాట వాడుతున్నాను) – చాలా ముఖ్య లక్షణం. పత్రికా రంగంలో కొన్ని పత్రికలు కొందరు పాఠకులకి వ్యసనమయిపోతాయి. అవి చదవనిదే తోచదు. నేను వారణాశిలో ఉన్న పదిహేను రోజులు అక్కడికి సాయంకాలం అయిదున్నరకి వచ్చే 25 'హిందూ' పేపర్లలో ఒకదాన్ని దక్కించుకోడానికి రిక్షాలో వెళ్ళేవాడిని. పత్రిక యొక్క ఈ 'కేరక్టరు' డబ్బు పెట్టి కొనేదికాదు. కేవలం ఒక వ్యక్తి జీనియస్సే సమకూర్చేదికాదు. తెలుగు దేశంలో నార్ల సంపాదకీయాలు, భారతి పత్రిక వ్యసనమయిన వారిని నాకు తెలుసు. ఏమిటి దీనికి పెట్టుబడి? పాఠకుని అభిరుచులతో జోక్యం చేసుకోని objectivity . పాఠకుని అభిరుచిని గౌరవించే డిగ్నిటీ. అన్నిటికీ మించి పాఠకుని మనస్సుని ఈ సంపాదకుడు గుర్తించి, గౌరవిస్తున్నాడనే స్పృహ. A successful periodical is essentially democratic and for that very reason, it practices autocracy. ఈ మాట ఆశ్చర్యంగా కనిపించవచ్చు. పసిబిడ్డ అనుపానులు ఎరిగిన తల్లి అత్యంత నిరంకుశంగా తన నిర్ణయాలను చేస్తుంది. తెలుగుదేశంలో మంచి ఉదాహరణ – స్వాతి.

నేను పత్రిక మంచి చెడ్డలను గురించి మాట్లాడడం లేదు. తన పాఠకుని గుర్తించిన పత్రిక నిరంకుశంగా ఆ పాఠకునికి సేవ చేయగలదు. It is the ego of a servant. సర్వెంటు అనే మాట యజమాని అనుపానులను ఎరిగిన సేవకునిగా పేర్కొంటున్నాను. ఈ పనిని అసిధారా వ్రతంలాగా నూరు నెలలుగా చేస్తున్న పత్రిక కౌముది. ఈ మాటని నేను సాధికారికంగా చెప్పగలగడానికి కారణం ఈ నూరు నెలలు వరస తప్పకుండా ఈ సంచికకి రచనలు చేయడం. నేను కౌముదికి పాతకాపుని.

అద్భుతమైన క్రమశిక్షణ, ఎవరినీ నొప్పించని ప్రసన్నత, ఆయా రచయితలను రచనలు పురికొల్పే కిరణ్‌ప్రభ 'ఎర', తనకంటూ నిర్దుష్టమయిన అభిప్రాయాలు ఉన్నా (ఉన్నవని నాకు బాగా తెలుసు) ఏనాడూ రచయితల అభిప్రాయాల జోలికి రాని కిరణ్‌ప్రభ 'మడికట్టుకునే ' సమయమనం – ఇది చాలా అరుదయిన objectivity. నేను రాసిన చాలా విషయాలు చాలా సందర్భాలలో ఆయన అభిప్రాయాలకు ఏ మాత్రం దగ్గరగా లేవని, ఉండవని నాకు తెలుసు. నాకు తెలుసునని ఆయనకీ తెలుసు. కానీ ఏనాడూ నా అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛకి భంగం రానివ్వలేదాయన. భంగం రానివ్వదని నా గర్వం. ఇలా రచయితల 'ఇగో'ని నీరు పోసి పోషించిన ఘనత కిరణ్‌ప్రభది. పత్రికలో వచ్చే రచనలలోని విషయాల 'ఫోకస్'కు ఏనాడూ వ్యక్తిగతమైన ముసుగు వెయ్యని గడుసయిన సంపాదకుడు కిరణ్‌ప్రభ. అందుకు నేను ఆశ్చర్యపోయిన సందర్భాలూ, స్వేచ్ఛగా విశృంఖలంగా రాసిన సందర్భాలూ ఎన్నో

ఉన్నాయి. నా స్వేచ్ఛ, అహంకారానికి అభ్యంతరంలేని రహదారి కిరణ్‌ప్రభ స్ట్రాంగ్ పాయింట్. అదే 'కౌముది ' స్ట్రాంగ్ పాయింట్ కూడా.

నన్ను చాలా తక్కువమంది ఒప్పించగలరు. నేను చాలా ఎక్కువమందిని నొప్పించగలను. ఈ రెంటినీ తూకంలో నిలిపిన సంపాదకుడు కిరణ్‌ప్రభ. ఎంతమంది రచయితలు! విషయంలో ఎంత విస్తృతి! ఒక యండమూరి, ఒక మల్లాది వెంకటకృష్ణమూరి, నేను, కొమ్మూరి సాంబశివరావు – వీరుకాక ఈ తరం రచయితలు. నవలలు, ఆత్మకథలు, ట్రావెలాగ్స్, కవితలు, వ్యాసాలు – ఇంత సమగ్రమైన కంప్లీట్ సంచికను నేను ఎరగను. నన్నెలా ఒప్పించారో – ఆరేళ్ళుగా ఏ వారం వరస తప్పక కాలం రాస్తున్నాను – కాదు – రాయించాడాయన. గమనించండి – మాస పత్రికలో వీక్లీ కాలం. ఏ ఒక్కరోజు ఆలశ్యమైనా – ఆయన పలకరిస్తాడు. నా క్రమ శిక్షణతో నిభాయించుకోగల మొదటి వ్యక్తి కిరణ్‌ప్రభ. Anyday, he can match my commitment and discipline. I find my match in him.

అన్నిటికన్నా గొప్ప ఉపకారం – రచయితలకి తమ రచనలకు దక్కే విస్తృతి. కౌముది ద్వారా – ఆశ్చర్యంగా – చాలా దేశాల తెలుగువారు నాకు అభిమానులయారు. ఇంతమంది ఈ పత్రిక చదువుతారని చాలాకాలం నాకు తెలీదు. ఫలానా కాలం 'ఇన్ని వేలమంది' చదివారని కిరణ్‌ప్రభ మధ్య మధ్య రెచ్చగొడతారు.

అన్నిటికన్నా ఈ పత్రిక విజయానికి గొప్ప వాటాదారు ఆయన శ్రీమతి. ఆవిడ చేతినుంచి రాకుండా బహుశా ఏ అక్షరమూ పత్రికలో చోటు చేసుకోదనుకుంటాను. రచయితలందరికీ ఆమె అభిమాని. ముఖ్యంగా నాకూ, మా ఆవిడకీ. ఈ దంపతుల కుటుంబం ఎన్ని దేశాలకు విస్తరించిందో!

ఈ నిరంతరమైన కృషిలో ఎంతో తృప్తినీ, మైకాన్నీ, అలౌకికమైన కమిట్‌మెంటునీ అనుభవించకపోతే ఈ పత్రిక ఇంతకాలం నిలవదు. Honesty is not a performance. వ్యక్తిగతమైన Job satisfaction డబ్బు, కీర్తి ఇవ్వగలిగేది కాదు. రోజూ పీల్చే గాలిలాగ, చేసే భోజనంలాగ, పలికే మాటలాగ – ఈ పత్రిక కిరణ్‌ప్రభ దంపతుల జీవనంలో ఒక భాగమయిపోయిందనడానికి ఈ నూరవ మజిలీ ఒక నిదర్శనం.

ఇది నిశ్శబ్ద విప్లవం. రచయితలకు అపూర్వమైన వేదిక. వీరు సమకూర్చిన గ్రంధాలయం ముందు తరాలకు ఇచ్చే సంపద. ఈ దశలో ఈ నూరవ సంచిక సంపాదకీయాన్ని కోరి తీసుకోవడానికి కారణం సోదర రచయితలు, రచయిత్రులందరి తరఫునా ఈ కిరణ్‌ప్రభ దంపతులకు కృతజ్ఞతలు చెప్పడానికి. కొన్ని కొన్ని గొప్ప అనుభూతులను ప్రకటించడానికి కొన్ని మాటల శక్తి అరిగిపోతుంది. అలాగే ' కృతజ్ఞత' అనే మాట ఈ సందర్భంలో చాలా తేలికయినట్టు నాకనిపిస్తుంది. ఇది భావం ముందు భాష ఓడిపోయిన సందర్భం.

- *ఏప్రిల్-2015*

***

# 2014

**రెండేళ్ళక్రిందట విశాఖపట్నంలో** మారుతిరావుగారిని కలుసుకోడానికి వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఓ వ్యక్తి పరిచయమయ్యారు. ఆరోజు రాత్రి జరగబోతున్న ఓ ఫంక్షన్‌కి మారుతిరావుగారిని ఆహ్వానించడానికి వచ్చారాయన. ఆయన ఓ దినపత్రిక యజమాని, సంపాదకులు కూడా అని మాటల మధ్యలో తెలిసింది. ఐతే ఆ దినపత్రిక పేరు ఎప్పుడూ విన్నట్లు లేదు. అదేమాట ఆయన్ని అడిగాను. "అవునండీ.. మా పత్రిక ఈనాడు, ఆంధ్రజ్యోతి లాంటి వాటితో పోటీపడే డైలీకాదు. ఇది స్థానికంగా వస్తుంది. గవర్నమెంటు ఆఫీసులకీ, లైబ్రరీలకి, మరికొన్ని సంస్థలకీ మేమే ఉచితంగా పంపిస్తుంటాం.. " అన్నాడాయన. "దినపత్రిక ఉచితంగానా..?" "అవునండి.. పత్రిక నడపడం అంటే నాకిష్టం. అందుకే ఇలా చేస్తున్నాను.." "దినపత్రిక అంటే చాలా పెట్టుబడి, స్టాఫ్ అంతా ఉండాలి కదా.?" అడిగాను. "మీరన్నది నిజమే. చాలా పెట్టుబడి కావాలి. ఎప్పటినుంచో దినపత్రిక నడపాలని కోరిక. అందుకే ఇది నడుపుతున్నాను.." "మరి లాభాలు..?" "అస్సలు రావండీ.. రెండేళ్ళుగా నష్టాల్లోనే నడుస్తోంది. ఐనా ఇది నాకిష్టమైన పని." "పత్రిక పేరు కూడా ఏదో సంస్కృతం పేరులా ఉంది..? మామూలు ప్రజలకి అర్థమయ్యేలా లేదు..?" "కావొచ్చు, కానీ నాకా పేరంటే ఇష్టమండీ. అందుకే ఆ పేరు పెట్టాను.." "మరి రోజూ సంపాదకీయాలూ.. ?" "నేనే రాస్తుంటానండి. అలా రాయడమంటే నాకిష్టం.." మొత్తం సంభాషణలో ఆయన చెప్పింది "ఈ పని నాకిష్టం. నష్టాలొచ్చినా నడుతున్నానందుకే.." అని. (అఫ్‌కోర్స్ ఆయనకి రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉందట, అందులోని లాభాలు ఇందులో నష్టాలని భర్తీచేసేందుకు వాడు తున్నారట.. అది వేరే కోణం అనుకోండి.)

ఇష్టమైన పనిచేయడంలో ఉన్న తృప్తి - వచ్చిన నష్టాలనీ, ఎదురైన కష్టాలనీ కూడా ఎదిరించి నిలిచే స్థైర్యమిస్తుందనడానికి ఆయన ఒక ఉదాహరణగా కనిపించారు. మమ్మల్ని చాలామంది అడుగుతుంటారు "ఈ కౌముది వల్ల మీకేమొస్తుంది?" అని. ఏం చెప్పాలీ..!? "ఇది మాకిష్టమైన పని..సంతృప్తినిచ్చే పని." అని తప్ప.! సరిగ్గా పది సంవత్సరాల క్రిందట వెబ్ మాసపత్రిక రంగంలో ఈ తొలి అడుగులు మొదలయ్యాయి. సిలికానాంధ్ర సంస్థ తరఫున "సుజనరంజని" మాసపత్రికని మొదలుపెట్టి 2004 జనవరి నుంచి 2006 డిసెంబర్ వరకూ మూడేళ్ళపాటు నిర్వహించాం. 2007 జనవరిలో ఈ "కౌముది"కి శ్రీకారం చుట్టడం జరిగింది. సరిగ్గా ఈ నెలతో "కౌముది" ఏడేళ్ళు పూర్తిచేసుకుని ఎనిమిదవ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. మొత్తం పదేళ్ళలో 120 సంచికలు వచ్చాయి. ఏ ఒక్కనెలా, ఒక్కరోజుకూడా ఆలశ్యం కాకుండా విడుదలచేసే శక్తినీ, సామర్థ్యాన్ని ఇచ్చింది అసంఖ్యాకమైన అభిమానులు, ఆత్మీయులు, పెద్దలు, రచయిత/త్రులూ, పాఠకులూ! "కౌముది" ఈ జన్మదిన శుభసందర్భంలో, అప్పటి నుంచి ఇప్పటిదాకా దాటివచ్చిన కొన్ని మైలురాళ్ళగురించి, పాఠకుల అభిరుచులకనుగుణంగా క్రమక్రమంగా నిరంతరం చోటుచేసుకున్న, చేసుకుంటున్న మార్పుల గురించి ఓసారి మీతో "చెప్పాలని ఉంది - మనసు విప్పాలని ఉంది"

రూపురేఖల్లోనూ, నిర్మాణంలోను, ముఖచిత్రం విషయంలోనూ ప్రింట్ పత్రికలని పోలి ఉండాలనేది ప్రారంభ సంచికనుంచే ఉన్న ప్రణాళిక. తదనుగుణంగానే ప్రతిసంచికా కొనసాగుతోంది. మొదటి సంచిక 70-80 పేజీలతో వెలువడితే మీ ముందున్న ఈ సంచిక సుమారుగా 350 పేజీలతో రూపుదిద్దుకుంది. ఆనాడు సుమారు 20 అంశాలతో మొదలై ప్రస్తుతం 55 అంశాల స్థాయికి చేరుకుంది.

మొట్టమొదటి సంచికనుంచి ముఖచిత్ర రూపకల్పనలోని వైవిధ్యం పాఠకులని ఎంతగానో ఆకర్షిస్తోంది. ప్రారంభమైన ఐదారు నెలల తర్వాత ముఖచిత్రానికి కవితకూడా జోడిస్తే ఎలా ఉంటుంది అన్న ఆలోచన కవర్ పేజీ కవితలకి పునాది వేసింది. తరువాతి దశలో వాటికి ఆడియోని కూడా జతచేయడం ఇంకో విశేషం. ముఖచిత్ర రూపకల్పనకి తమ రేఖాచిత్రాలని ఉపయోగించుకోడానికి అనుమతినిచ్చిన అభిమాన చిత్రకారులకు ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా సరిపోదు.

ఇంటర్నెట్ మాసపత్రికల్లో నెలవారీ ధారావాహికలు అన్న అంశాన్ని మొట్టమొదటిసారిగా "సుజనరంజని"లో "శాంతిలేదు మనసుకు" అన్న సరికొత్త నవలతో మొదలుపెట్టడం జరిగింది. "కౌముది" మొదటి సంచికనుంచి సరికొత్త ధారావాహికలు మొదలయ్యాయి. తరువాత అలనాటి అరుదైన నవలల పునర్ముద్రణలు కూడా జతచేరాయి. ప్రస్తుతం ఐదు పునర్ముద్రణలు, ఏడు సరికొత్త నవలల స్థాయికి

చేరుకోగలిగింది కౌముది. కథాకౌముదిలో కూడా సగటున నెలకి 5 కథలుచోటుచేసుకుంటున్నాయి. ఏడాది విడిచి ఏడాది నిర్వహిస్తున్న కథలపోటీలతో మరింతమంది రచయితలకి కౌముది దగ్గరౌతోంది.

మొదటి సంచికనుంచీ మొదలైన సిలికాన్ వేలీ సి.యి.ఒ ల విజయగాధలు, ఆ తరువాత ఐదేళ్ళ పాటు సాగిన 'మొదటి సినిమా' శీర్షికలో 60 మంది సినీ దర్శకుల అనుభవాలు, 'అంతరంగ తరంగాలు' శీర్షికలో ఆసక్తికరమైన వ్యక్తుల పరిచయాలు.. ఇవన్నీ పాఠకుల ఆదరణకి నోచుకున్నాయి. నెలవారీ శీర్షికల విషయానికొస్తే కనీసం ఒక సంవత్సరమైనా కొనసాగించాలి అన్న నియమంతో ఏ శీర్షికైనా ప్రారంభించడం  జరుగుతోంది. కొన్ని శీర్షికలు ఐదారేళ్ళుగా కూడా కొనసాగడం ఆయా రచయితలకు / రచయిత్రులకు కౌముది పట్ల గల అభిమానానికీ , పాఠకులు వాటిని ఆదరిస్తున్న వైనానికీ నిదర్శనాలు.

కౌముదిలో వచ్చిన రచనలతో కూర్చబడుతున్న 'గ్రంథాలయం'లో 75 పైగా పుస్తకాలు చోటుచేసుకున్నాయి. అలానే కౌముదిలో వచ్చిన రచనలతో ఆయా రచయిత/త్రులు ప్రింట్ చేసి పబ్లిష్ చేసుకున్న  పుస్తకాలు కూడా దాదాపు 20 వరకూ ఉన్నాయి. ఇవన్నీ ఆంధ్రదేశంలోని  పుస్తక విక్రేతలందరి వద్దా లభ్యమౌతున్నాయి. ఇంకా..వ్యాస కౌముది, హాస్యకౌముది,కవితా కౌముది,  పాఠకులు పాల్గొనే శీర్షికలు... ఏది తీసుకున్నా కౌముదిని ప్రయోగాల పుట్టినిల్లుగా ప్రోత్సహిస్తున్న పాఠకులని అభినందించి తీరాలి. గత రెండేళ్ళుగా వస్తున్న రేడియో టాక్ షోలు, ఇటీవలే ప్రారంభమైన "కౌముది - వీక్లీ ఆడియో మేగజైన్" కౌముది ప్రస్థానంలో మరికొన్ని తీపిగురుతులు.

కౌముదిలో చోటుచేసుకుంటున్న  రచనల  మిశ్రమాన్ని గమనిస్తే మొదటినుంచి కూడా ప్రసిద్ధ, వర్తమాన, వర్ధమాన రచయితల రచనలన్నింటికీ సమానప్రాతినిథ్యం కలిగిస్తోంది అన్న విషయం స్పష్టంగా తెలుస్తుంది. ప్రచురిస్తున్న ఏరచననైనా పాఠకులకి ఆకర్షణీయంగా అందించే క్రమంలో అన్ని శీర్షికలకీ అందమైన బేనర్స్‌ని డిజైన్ చేయడం, కొన్నిసార్లు టాగ్‌లైన్ కామెంట్స్ జతచేయడంతో ప్రతిరచనకీ అదనపు విలువని జోడించే ప్రయత్నం జరుగుతోంది.  పరిశీలనకి వచ్చిన రచనల విషయంలో నిర్ణయాన్ని ఒకటి రెండు రోజుల్లోనే తెలియచేయడమనే నిబద్ధతని కూడా 95 శాతం వరకూ అమలుచేయగలగడమనే విషయం కౌముదికి రచనలు పంపించిన వారందరికీ విదితమే.

"ఒక రచన 'మంచి-చెడు' అనేది నిర్ణయించాల్సింది పాఠకులు. విమర్శ మంచి రచనని తక్కువచేయలేదు, సమర్థింపు పాఠకుల అభిరుచిని ప్రభావితం చేయలేదు అనేది చరిత్ర నిరూపించిన సత్యం. ఎక్కువమంది పాఠకులకి నచ్చితే అది నిలుస్తుంది, లేకపోతే లేదు. ఎక్కువమంది పాఠకులని చేరలేని రచనని, రచయిత ఎన్ని వివరణలిచ్చి నిలబెట్టాలనుకున్నా తుది నిర్ణయం కాలానిదే " అని నమ్మే కౌముది మొదటి నుంచి వివాదాలకీ, విమర్శలకి దూరంగా ఉండడాన్ని కూడా పాఠకులు హర్షిస్తున్నారు.

"కౌముది" నిర్వహణ వెనుక ఎంతమంది ఉన్నారు అనే అంశం కంటే కౌముదిని సుసంపన్నం చేస్తున్న వారెంతమంది అనేది ముఖ్యమైన అంశం కదా! ఈ బృహత్కర కార్యక్రమానికి జీవం పోస్తోంది వందలాది మంది రచయితలు/రచయిత్రులు, చిత్రకారులు, కార్టూనిస్టులు, కవులూ లక్షలాది మంది పాఠకులు, అభిమానులు, ఆత్మీయులు.. అందరికి మరోసారి ఈ శుభసందర్భంలో మనస్ఫూర్తిగా నమస్సుమాంజలులు అందిస్తున్నాం.

- ***జనవరి, 2014***

***

**గతనెలలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ** ఇద్దరు తొలితరం సినీప్రముఖుల్ని కోల్పోయింది. అంజలీదేవిగారు, అక్కినేనిగారు తెలుగుసినీ పరిశ్రమకి అందించిన సేవలు, వారు ధరించిన పాత్రలు, నటించిన, నిర్మించిన కళాఖండాలు..తెలుగు సినిమాపరిశ్రమ ఉన్నంతకాలం నిలిచి ఉంటాయి. వారి వెండితెర జీవితాలు,వ్యక్తిగత జీవితాలుకూడా వ్యక్తిత్వ వికాస గ్రంథాలు. అందుకే వారి గురించి ఇక్కడ ప్రస్తావించడం జరుగుతోంది. రెండు మూడు సంవత్సరాల వ్యవధిలో ఇద్దరూ చలనచిత్ర రంగ ప్రవేశం చేయడం, ఆ రంగంలో ఎదిగే క్రమంలో ఇద్దరూ కలిసి నటించడం జరిగింది. ఇద్దరి భాగస్వామ్యంలో ఒక సినిమా నిర్మాణం కూడా జరిగింది. చివరి రోజుల్లో ఒక వారం వ్యవధిలోనే ఇద్దరూ మరణించడం చాలా యాదృచ్ఛికం. అంజలీదేవిగారు బిడ్డల తల్లి అయ్యాక సినీరంగ ప్రవేశం చేశారు. మొదటగా వాంప్ పాత్రలతో మొదలుపెట్టి హీరోయిన్ స్థాయికి చేరుకున్నారు. సినీరంగ ప్రవేశం చేసిన మొదటి రెండేళ్ళలోనే 20 సినిమాల్లో నటించారు. ఆ రోజుల్లోనే సినిమాకి 30,000 రూపాయల పారితోషికం తీసుకునే స్థాయికి ఎదిగారు. రోజుకి రెండు షిఫ్ట్లల్లో పనిచేసిన తొలి హీరోయిన అంజలీదేవి గారే. 22 సంవత్సరాలకే సినీ నిర్మాణాన్ని చేపట్టారు. శివాజీగణేశన్ని తెలుగుతెరకి మొదటిసారి పరిచయం చేసింది అంజలీదేవిగారే. 24 సంవత్సరాల వయసులోనే South India FilmChamber of Commerceకి ఉపాధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. ఎన్టీఆర్ హీరోగా నటించిన మొదటి సినిమా (పల్లెటూరి పిల్ల)లో అంజలీదేవిగారే హీరోయిన్. భర్తతో కలిసి ఆమె నిర్మించిన సువర్ణసుందరి, అనార్కలి లాంటి సినిమాలు చిరస్థాయిగా నిలిచిపోయే కళాఖండాలు. సినీనిర్మాణంలో ఒకానొక దశలో సర్వస్వం కోల్పోయినా మళ్ళీ కోలుకుని చిత్రనిర్మాణాన్ని కొనసాగించిన అంజలీదేవి, ఆదినారాయణరావు గార్ల దృఢదీక్ష గమనార్హం. అక్కినేనిగారి విషయానికి వస్తే ఆయన వెండితెర జీవితంలోని అనేక సినిమాపాత్రలూ, వ్యక్తిగత జీవితంలోని అనేక సంఘటనలూ.. ఎంతో స్ఫూర్తిదాయకాలు. తెలుగుతెరమీద అతి తక్కువ వయసులో కథానాయకుడిగా ప్రవేశించిన మొదటి వ్యక్తికూడా అక్కినేనిగారే. ఆయన నటజీవితంలోని తొలిరోజుల్ని గమనిస్తే, ఒక మనిషి తన బలహీనతల్ని గమనించడం, అంగీకరించడం, వాటిని తనకి అనుకూలంగా మలచుకోవడం ఎంత ముఖ్యమో స్పష్టంగా తెలుస్తుంది. సినిమాల్లోకి అడుగుపెట్టక ముందు రంగస్థలం మీద ఆయన వేసినవి స్త్రీ పాత్రలే. అందుకే గొంతు పీలగా ఉండేది. భారీ పర్సనాలిటీ కాదు. లోతుగా కనిపించే కళ్ళు. కథానాయకుడికి కావల్సిన లక్షణాలకి ఇవన్నీ ఆమడ దూరం. ఎన్టీఆర్ చిత్రరంగ ప్రవేశానికి వచ్చినప్పుడే అక్కినేనిగారు ఊహించారట-ఆయన గంభీరస్వరం, భారీ పర్సనాలిటీ తో తను పోటీపడాలంటే తనకనువైన పాత్రలనే ఎంచుకోవాలని, ఆ దిశలో ఆయన కృషిచేసి తనకి నప్పే పాత్రలనే ఎంపికచేసుకుని బలహీనతల్ని అనుకూలంగా మలచుకుని తన కెరీర్లో ఉన్నత శిఖరాలకి ఎదిగారు. ఇదీ ఆయన జీవితం చెప్పే తొలిపాఠం. హైస్కూలుకూడ చేరని చదువు, పుస్తకాలు చదివిన అనుభవమూలేదు. సినిమాల్లో దేవదాసులాంటి పాత్రలని పోషించాలంటే వాటి మూలాలు తెలియాలి కాబట్టి సముద్రాల, చక్రపాణిగారి లాంటి పెద్దలతో చర్చలు జరిపి, ఆయా పాత్రలమీద సంపూర్ణ అవగాహనని పెంచుకున్నారు.. అనే సంఘటన అక్కినేనిగారి నుంచి నేర్చుకోదగిన మరో వ్యక్తిత్వ వికాసపాఠం. 'ఇతను ఈ పాత్రకి పనిరాడు ' అని సినీ పండితులు తీర్మానించిన ప్రతిసారీ దాన్నో సవాలుగా స్వీకరించి, శ్రమించి, విజయం సాధించడం - ఇంకోపాఠం.. అక్కినేనిగారి జీవితంలో అడుగడుగునా ఇలాంటి స్ఫూర్తిదాయకమైన సంఘటనలే. వ్యక్తిగతజీవితంలోని ఒడిదుడుకుల్ని ఆయన స్థితప్రజ్ఞతతో స్వీకరించి, మనసుమీద ఆ ప్రభావం లేకుండా జాగ్రత్త వహించారనడానికి, చివరి వరకూ ఆయన ముఖంలో వెలిగిన ప్రశాంతతే నిదర్శనం. ప్రపంచ చలనచిత్ర రంగంలో సుదీర్ఘకాలం వెండితెరమీద వెలిగిన నటుల్లో అక్కినేని రెండోవారు కావడం తెలుగువారందరికీ గర్వకారణం. తన జీవితాన్నే ఉదాహరణగా నిలిపిన అక్కినేని లాంటి నటులు చాలా అరుదుగా కనిపిస్తారు. అందుకే అక్కినేనిగారికి సాటి ఆయన మాత్రమే అనడంలో అతిశయోక్తి లేదు.

*- ఫిబ్రవరి, 2014*

***

**మంచి వ్యక్తుల గురించి చదివినప్పుడు,** సానుకూల దృక్పథాన్ని పెంపొందించే సంఘటనల గురించి తెలుసుకున్నప్పుడూ - ఒక విధమైన స్ఫూర్తి, ప్రేరణ, ఉత్తేజం లభిస్తాయి. అందుకే చిన్నప్పటినుంచి పాఠ్యపుస్తకాల్లో కార్యసాధకుల గురించి, చరిత్రలో విజయాలు సాధించిన వ్యకులగురించి విశేషాలు పొందుపరుస్తారు. చాలాసార్లు.. గమనించ గలిగితే, సరిగ్గా అన్వయం చేసుకోగలిగితే మన చుట్టుపక్కల కూడ ఇలా స్ఫూర్తి కలిగించే వ్యక్తులు చాలామంది తారసపడుతుంటారు. వాళ్ళు చరిత్రలోకి ఎక్కగలిగేంతటి విజయాలు సాధించకపోవచ్చు, పెద్దపెద్ద ప్రణాళికలు అమలు పరచలేకపోవచ్చు కానీ తమ పరిధిలో తమకంటూ ఒక మార్గాన్ని ఎంచుకుని జీవిస్తూ ఉంటారు. 'మేము ఆదర్శవంతులం.. మమ్మల్ని అనుసరించండి..' అని ప్రచారాలకి కూడా వెళ్ళరు. వాళ్ళు ఏ వ్యక్తిత్వ వికాస గ్రంథాలని చదివినవాళ్ళు కాదు, మేనేజ్‌మెంట్ కోర్సులకి వెళ్ళిన వాళ్ళు కాదు.. ఐనా స్ఫూర్తి నివ్వగలరు. ఇటీవల ఇండియా వెళ్ళినప్పుడు ఎదురైన, ఇలాంటి కొంతమందిలో, ముగ్గురు విభిన్నమైన వ్యక్తుల్ని పరిచయం చేస్తాను.

ఎప్పుడూ ఎవరో ఒకరు ఫలానా మంచి పని చెయ్యమని చెప్పాల్సిన అవసరం లేదు. మంచి పనులు చేయడం, మంచి నిర్ణయాలు తీసుకోవడం అనేది ఎవరికి వారే అలవాటి చేసుకోవచ్చు. దివితాలూకాలో హంసలదీవి చూడ్డానికి వెళ్ళినప్పుడు అక్కడ సమీపగ్రామంలో నివసించే ఒక పెద్దమనిషి కనిపించారు. టీ తాగడానికి ఇంటికి రమ్మని పిలిచారు. ఆయన స్థానికంగా సివిల్ కాంట్రాక్టులు చేసేవారట. మాటల మధ్యలో చెప్పారు 'గత పదేళ్ళుగా ఒక నియమం పెట్టుకున్నానండీ. రోజూ ఉదయం లేచినవద్దనుంచి మధ్యాహ్నా భోజనం చేసే లోగా కనీసం ఒక్కరికైనా ఏదైనా సహాయం చెయ్యాలి. అది మాటసాయం కావొచ్చు. ధన సహాయం కావొచ్చు. ఏ రోజైనా ఎవరికీ సహాయం చేసే అవకాశం దొరక్కపోతే ఆరోజు భోజనం చెయ్యను. ఇంత చిన్నచిన్న వూర్లలో ప్రతి రోజూ సహాయం కోసం ఎదురుచూసే వాళ్ళుంటారాఅనే మీకు సందేహం రావొచ్చు. మనం ఆ దృష్టితో చూస్తుంటే సహాయం కోసం ఎదురు చూసేవాళ్ళుఎప్పుడైనా కనిపిస్తారు..'.

వర్తమాన సమాజంలో వేగం పెరిగిపోయింది. సొంత కుటుంబసభ్యుల మధ్య సంబంధాలు కూడా ఆర్థిక సంబంధాలై పోయాయి. - ఇవి తరచూ వింటున్న మాటలు, వార్తాపత్రికల్లో చూస్తున్న వార్తలు. విజయవాడలో పాత మిత్రుడొకతన్ని కలిశాను. సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. నగరం నడిబొడ్డున చక్కటి నివాసభవనం. మూడో అంతస్థులో అతని నివాసం. పాత కబుర్లు చాలా మాట్లాడుకుని తిరిగి వస్తుంటే రెండో అంతస్తులో ఆగాం. తాళం వేసి ఉంది. 'లోపల చూపిస్తాను రా..' అని తీసుకెళ్ళాడు.'ఇక్కడ మా నాన్నగారు ఉండేవాళ్ళు. ఆయన చనిపోయి రెండేళ్ళయింది. చివరి రోజుల్లో ఇదిగో ఈ మంచం మీదనే పడుకునేవారు. ఈ పుస్తకాలు చదువుకునే వారు..' తను చెబుతుంటే ఇంతకుముందెన్నడూ నేను చూడని వాళ్ళ నాన్నగారు కళ్ళ ముందు కదిలారు. 'ఆయన గుర్తుగా ఈ పోర్షన్ ఇలానే తాళం వేసి ఉంచేశాను.. అప్పుడప్పుడు కాస్సేపు ఇక్కడ కూర్చుంటే నాన్నగారితో ఉన్నట్లే ఉంటుంది..'. అక్కడనుంచి మొదటి అంతస్థుకి వచ్చాం. అదీ తాళం వేసి ఉంది. నాలుగేళ్ళ క్రిందట ఇంజినీరింగ్ చదివే రెండో అబ్బాయి, తప్పు మెడికల్ ట్రీట్‌మెంట్ వల్ల మరణించాడు. అతను వాడిన గదులన్నింటినీ అలానే ఉంచేశాడు. లోపలికి వెళితే ఆ అబ్బాయి చదువుకున్న పుస్తకాలు, వాడిన కంప్యూటరూ.. అన్నీ యథాస్థానాల్లో ఉన్నాయి. మనుషులు దూరమైనా జ్ఞాపకాలని మనసులో పచ్చగా ఉంచుకున్న మిత్రుడికి వీడ్కోలు చెప్పి వచ్చేస్తుంటే మనసంతా ఆర్ద్రమైంది.

'నవ్వు.. నవ్వించు.. నీ నవ్వులు పదిమందికీ పంచు' అంటారు పెద్దలు. హైదరాబాదులో ఓ డెబ్భైఏళ్ళ పెద్దమనిషిని కలుసుకున్నాను. ఎక్కడో ఉత్తరభారతంలో పెద్ద ఉద్యోగమే చేసి పదవీ విరమణ చేశాక, హైదరాబాదు వచ్చి స్థిరపడ్డారు. చాలా సరదాగా మాట్లాడే ఆయన ఎంతోమంది కుర్రవాళ్ళకంటే హుషారుగా ఉన్నారు. 'మీకు కాలక్షేపం అలా ఔతుంది?' అని అడిగాను. 'నాకు రోజూ ఒక కార్యక్రమం ఉందండీ.. రోజూ కనీసం అరడజను మంది అపరిచితుల్ని నవ్వించడం లక్ష్యంగా పెట్టుకున్నాను. ఉదయమూ, సాయంకాలము ఎపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ బయట కాస్సేపు నిలబడతాను. కొత్తవాళ్ళతో కబుర్లు కలుపుతాను. జోక్స్ చెబుతాను. కూరగాయలు, పండ్లూ అమ్మే వాళ్ళతో బేరం ఆడతాను. కానీ చివరికి వాళ్ళు అడిగిన ధరే ఇస్తాను. వాళ్ళు చాలా ఆనందంతో ఆశ్చర్యపోతారు. వాళ్ళ మొహాల్లో కనిపించే ఆనందం నాకు ఎంతో శక్తినిస్తుంది..'

ఎంత స్వల్పమైనా కానీ, ఏదో రకంగా మంచితనాన్ని పంచే వ్యక్తుల్ని కలిసినప్పుడు – లోకంలో ఇంకా మంచితనం మిగిలి ఉందన్న భావన మనమీద మనకి నమ్మకాన్ని కూడా పెంచుతుంది.

- *మార్చి, 2014*

***

**'సలహా' అనే ప్రక్రియని** ఎవరు ఎప్పుడు కనిపెట్టారో కానీ పురాణగాథల్లోనూ, చారిత్రక కథల్లోనూ కూడా ఈ 'సలహాలు' ఇచ్చి పుచ్చుకోవడం వల్ల జరిగిన అనేక పర్యవసానాలు మనకు పరిచయమే. మంచి సలహాల వల్ల కొన్ని రాజ్యాలు నిలబడితే దుష్టసలహాల వల్ల సర్వనాశనం జరిగిన సంఘటనలు కూడా గత గాథల్లో చాలా కనిపిస్తాయి. ఇప్పటికీ అన్ని వ్యవస్థల్లోనూ ఈ 'సలహా' అనే ప్రక్రియ చాలా ప్రాధాన్యతతో కొనసాగుతోంది. ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలోని అన్ని స్థాయిల్లోనూ 'సలహా సంఘాలు' కీలకపాత్ర వహిస్తుంటాయి. పెద్ద పెద్ద స్థాయిల్లోని 'సలహా' వ్యవస్థని కాస్సేపు పక్కనపెట్టి వ్యక్తిగత జీవితాల్లో మనకి తరచూ ఎదురయ్యే 'సలహా' ఇవ్వడం, పుచ్చుకోవడం అనే ప్రక్రియలని ఒకసారి పరిశీలిద్దాం. ఎవరి జీవితం వాళ్ళది, ఎవరి బాధలు వాళ్ళవి ఐనప్పుడు ఈ సలహాల అవసరమేముంది - అంటే -ఏ ఒక్క వ్యక్తికీ అన్ని అనుభవాలూ ఎదురవ్వవు. ఏదైనా సమస్య వచ్చినప్పుడో, చిక్కులు ఎదురైనప్పుడో తనకంటే ముందు అలాంటి వాటిని పరిష్కరించుకున్న అనుభవజ్ఞులనుంచి 'సలహా'లు ఆశించడం సహజం.అలానే జీవితంలో ఢక్కామొక్కీలు తిన్నవాళ్ళు ఇంకా ఎదుగుతున్న వాళ్ళకి తమ అనుభవాలని పంచుతూ 'సలహా'లు ఇవ్వడం పరిపాటి. ఐతే సలహాలు ఇవ్వడంలోనూ, స్వీకరించడంలోనూ కూడా కొన్నిసార్లు అనుకోని అపార్థాలు ఉత్పన్నమౌతాయి. ఎలాగంటే..

సలహాలు ఇవ్వడం : 'జీవితంలో అతి తేలికైన పని ఎదుటివారికి సలహాలు ఇవ్వడం' అనేది ఒక వాడుక. ఆత్రేయగారు దీన్నే కొంచెం హుందాగా 'ఎదుటి మనిషికి చెప్పేటందుకె నీతులు ఉన్నాయి' అన్నారు.మంచి సలహా ఇవ్వడం అనేది నిజంగా గొప్పపనే అని చెప్పుకోవాలి. అది మంచిమాట సాయం, పెద్దగా పెట్టుబడి అవసరంలేని త్యాగం. ఇచ్చే సలహాలో నిజాయితీ, నిబద్ధత ఉంటే సమస్యల్లో ఉన్నవాళ్ళకది నడిసముద్రంలో నావలాగ పనిచేస్తుంది. ఏదో అడిగారు కదా అని తెలిసీ తెలియకుండా ఇచ్చే సలహాలు ఎదుటి వారికి హాని చేయడమే కాక , మనిషిమీద నమ్మకాన్ని తగ్గిస్తాయి కూడా. అలాంటి వ్యవహార శైలితో తాత్కాలికంగా పెద్దమనిషి అని పేరు తెచ్చుకున్నా కాలక్రమేణా ఆ 'సలహాల'న్నీ నీటిమూటలని తెలిసిన రోజు మనిషి పరువుకది అగ్నిపరీక్షే. ఎవరైనా ఏదైన అడిగినప్పుడు రూఢిగా తెలిస్తే చెప్పడం, లేదంటే 'ఇలా అనుకుంటున్నాను. ఇంకెవరినైనా కనుక్కుంటే మంచిది' అనో ' నిజం చెప్పాలంటే ఈ విషయంలో నాకస్సలు అనుభవం లేదండీ..' అనో చెబితే ఎదుటివారికి సరైన అంచనాలు ఇచ్చినట్లు ఔతుంది. ఇవన్నీ అనుభవాలు నేర్పే పాఠాలు.

సలహాలు స్వీకరించడం : సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నప్పుడు స్థితప్రజ్ఞతతో ఉండడం చాలా తక్కువమందికి చేతనౌతుంది. అలా కానప్పుడు సహాయం కోసం, కనీసం సలహాకోసం ఎదురుచూడ్డం సహజమే. సుడిగుండంలో చిక్కుకున్నవాళ్ళకంటే ఒడ్డున ఉన్నవాళ్ళే కొంచెం స్థిమితంగా ఆలోచించగలరు. సలహా పొందిన తర్వాత దానిని అమలుపరచడంలోనూ, తదుపరి పర్యవసానాలకీ ఎవరికి వారే బాధ్యత వహించగలగాలి. 'ఫలానా ఆయన ఇచ్చిన సలహా వల్లనే ఇలా ఐపోయాను' అని ఎప్పుడైనా ఎవరైనా తమ వైఫల్యాలను పక్కవారిమీదకి నెట్టేసినా చివరికి ఫలితం అనుభవించేది మాత్రం ఎవరికి వారే. అందుకే 'వినదగు నెవ్వరు చెప్పిన' అన్నారు విజ్ఞులు. ఎవరి వద్దనుంచి ఎన్ని సలహాలు స్వీకరించినా తను తీసుకున్న నిర్ణయానికి తానే బాధ్యుడినన్న విషయం గుర్తుంచుకుంటే అపార్థాలకి ఆపోహలకి తావుండదు. 'చూశావా నేనప్పుడే చెప్పాను. వాడు నా మాట వింటేనా.. ఇప్పుడు అనుభవిస్తున్నాడు..' అనే గోడమీద పిల్లులు ఎప్పుడూ ఉంటారు. వాళ్ళ గురించిన ఆలోచనలతో సమయం వృథాచేసుకునేకంటే స్వీయ అనుభవాలతో పాఠాలు నేర్చుకోవడం ఉత్తమం. సలహాలు ఇవ్వడమైనా, తీసుకోవడమైనా ఎవరి చర్యలకి వారు బాధ్యత వహించే నిజాయితీ ముఖ్యం - అనేది పెద్దలు చెప్పినమాట.!

*- ఏప్రిల్, 2014*

***

**'మాట్లాడడం ఒక కళ'** అనేది చాలామంది చెప్పే విషయం, ఒప్పుకునే విషయం. పదిమందినీ ఆకట్టుకునేలా మాట్లాడడం ఎలా - అనే అంశం మీద పుస్తకాలు చాలా వచ్చాయి, అనేక శిక్షణా కేంద్రాలు కూడా ఉన్నాయి. ఐతే 'వినడం కూడా ఒక కళ' అనే సంగతి మరిచిపోకూడదని అనేక సందర్భాల్లో అనుభవం నేర్పుతుంది. సమయాన్ని బట్టి సరిగ్గా మాట్లాడడం ఎంత ముఖ్యమో, ఓపిగ్గా వినడం కూడా అంతే ముఖ్యం. ఓ డాక్టర్ దగ్గరకువెళ్ళగానే వ్యాధి సగం నయమైనట్లనిపిస్తుంది. ఎందుకంటే ముందుగా రోగి చెప్పేదంతా ఓపిగ్గా వింటాడాయన. కొంతమంది డాక్టర్లని చూస్తుంటాం - రోగి తన వ్యాధి లక్షణాలని వివరించడం పూర్తయే లోగానే ఆయన రోగనిర్ధారణ చేసేసి, ప్రిస్క్రిప్షన్ రాయడం కూడా పూర్తయిపోతుంది! కొంతమందిని గమనించండి - మనం ఏదైనా చెబుతుంటే మధ్యలోనే మన మాటలకి అడ్డుపడి ఆపేసి, మిగతాది వాళ్ళు పూర్తిచేస్తుంటారు. దాన్ని వాళ్ళు పెద్ద లోపంగా భావించకపోవచ్చు కానీ కొన్నాళ్ళకి అలాంటివాళ్ళతో ఏ విషయమైనా చర్చించాలంటే ఒకటి రెండుసార్లు ఆలోచించాల్సి వస్తుంది. దీనికి అతిచక్కటి ఉదాహరణలు - మన తెలుగు టివి ఛానెళ్ళలో ప్రతి ఉదయం వచ్చే రాజకీయ చర్చలు. ఎవరికీ వినే ఓపిక ఉండదు, అందరూ ఒకేసారి మాట్లాడుతుంటారు. ప్రతి రోజూ ఇదే వ్యవహారం. కొన్ని టి.వి. ఇంటర్వ్యూల్లో కూడ ఇదే జరుగుతుంది. వచ్చిన అతిథి సమాధానం చెప్పేలోగానే ఇంటర్వ్యూ చేసే పెద్దమనిషి మిగతాది పూర్తిచేసేసి తనే తెలివికలవాడినని నిరూపించుకోవాలనుకుంటాడు. వీళ్ళందరినీ చూస్తుంటే అనిపిస్తుంది 'వినడం కూడా ఒక కళ' అని! వాద, ప్రతివాదనల్లో కూడ ఎదుటి వ్యక్తిని పూర్తిగా మాట్లాడనిచ్చి తర్వాత మనం మాట్లాడ్డం మొదలు పెడితే రెండు ఉపయోగాలుంటాయి - మొదటిది తన వాదన పూర్తిగా విన్నామన్న విషయం ఎదుటి వ్యక్తికి కొంతలో కొంతైనా తృప్తినిస్తుంది. రెండోది, అతని వాదన పూర్తిగా వినే సమయంలో మనకీ ఆలోచించుకునే వ్యవధి ఉంటుంది. కొత్త ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళేప్పుడు కూడా ఇదే జాగ్రత్త చెబుతారు -ప్రశ్న పూర్తిగా విన్నాక సమాధానం ఇవ్వడం మొదలుపెట్టాలి అని. ఉత్తరోత్తరా పదిమందితో పనిచేసేప్పుడు ఈ అంశం ఉపయోగపడుతుందన్న విషయాన్ని కూడ ఇంటర్వ్యూ చేసే వాళ్ళు పరిగణనలోకి తీసుకుంటారని చాలా విశ్లేషణలు చెబుతున్నాయి. 'మాట్లాడ్డం అనే కళ'ని అభ్యసించడానికి చాలా నేర్పు, సమయం కావాలి కానీ 'వినడం అనే కళ'ని అలవాటు చేసుకోడానికి కొంచెం సహనం ఉంటేచాలు. మంచిగా మాట్లాడ్డం వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో ఓపిగ్గా వినడం వల్ల అన్ని ఉపయోగాలూ ఉంటాయన్నది పెద్దల సలహా.

- ***మే, 2014***

***

**ఆస్కార్ ఎవార్డు తీసుకున్న సందర్భంలో** ప్రముఖ సంగీతదర్శకుడు ఏ.ఆర్. రెహ్మాన్ చెప్పిన మాటలు "నా జీవిత ప్రయాణంలో ప్రేమ, ద్వేషం - వీటిల్లో దేన్ని ఎంచుకోవాలి అన్న ప్రశ్న ఎదురైన ప్రతిసారీ నేను ప్రేమనే ఎంచుకున్నాను. అదే నన్ను ఇక్కడిదాకా తీసుకొచ్చిందని నమ్ముతున్నాను". ప్రతి మనిషి జీవితంలోనూ ఎదురయ్యే ప్రశ్నలకీ , సమస్యలకీ ప్రత్యామ్నాయాలు ఉంటాయి. చాలాసార్లు ప్రత్యామ్నాయాల గురించి అలోచించక పోవడం లేదా సరైన ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోకపోవడమే వైఫల్యాలకి ఒక కారణం అని విజ్ఞులు చెబుతారు. మనిషి శారీరకంగా, భౌతికంగా ఎదురైన ఇబ్బందులని, అటంకాలని అధిగమించేందుకు అలోచించినన్ని ప్రత్యామ్నాయాలని- మానసిక సంఘర్షణలోనూ, మానవసంబంధాల గురించినసమస్యల్లోనూ ముఖ్యంగా ప్రతికూలాత్మక భావోద్వేగాల విషయంలోనూ చూడలేకపోవడం మానసిక అశాంతికి తద్వారా మరెన్నో సమస్యలకీ దారితీస్తుంది. -- ప్రయాణంలో త్రోవ తప్పినప్పుడో, డెడ్ ఎండ్ ఎదురైనప్పుడో అక్కడ ఆగిపోయేవాళ్ళుండరు. ప్రతివాళ్ళూ వాళ్ళకున్న పరిధిలో మళ్ళీ త్రోవ వెదుక్కుని అనుకున్న గమ్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నాలు చేస్తారు. పక్కవాళ్ళని అడగడమో, ఒకటి రెండు త్రోవలు ప్రయత్నించడమో.. అవసరార్థం ఎన్నో ప్రత్యామ్నాయాలు కనిపిస్తాయి.

ఓ లక్ష్యం కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలించనప్పుడూ.. సమస్యల ఊబిలో చిక్కుకున్నప్పుడో..!?

"ఇంక ఇది ఇంతే.. దీనిలో విజయం సాధించలేను. అనవసరంగా ఎంతో శ్రమనీ, కాలాన్నీ ఖర్చుపెట్టాను.. నేనెందుకూ పనికి రాని వాడ్నయిపోయాను.." అనుకోవడం ఒక పద్ధతి. "సమస్యని విశ్లేషిస్తాను. అవసరమైతే అనుభవజ్ఞుల సలహా తీసుకుంటాను. అప్పటికీ కుదరకుంటే ఇందునుంచీ పాఠాలు నేర్చుకుని మరో ప్రయత్నానికి పునాదులు వేస్తాను.." ఇలా ఆలోచించడం మరో ప్రత్యామ్నాయం. -- ఇంట్లో ఏదో వస్తువు పాడైపోయింది. ఫేనో, గడియారమో, రేడియోనో.. పనిచెయ్యని వస్తువుని వెంటనే నేలకేసి కొట్టడమో, లేదంటే వెనకా ముందూ చూడకుండా పారెయ్యడమో చేసేవాళ్ళు చాలా అరుదుగా ఉంటారు. అసలు సమస్యఏమిటో తెలుసుకోడానికి ప్రయత్నించడమో, స్వానుభవం సరిపోకపోతే రిపేరు షాపుకో తీసుకెళ్ళడం ఇంకో మార్గం.

స్నేహితులతో పొరపొచ్చాలు వచ్చాయి. ఎక్కడో మాట తేడా రావడమో, ఏదో సందర్భంలో అపార్థాలు తలెత్తడమో జరిగింది. "హుఁ.. ఇలాంటి వాడా? ఇలా అనుకుంటే అసలు స్నేహమే చేసేవాడిని కాదు. అంతా మోసం.. దగా.." అనుకుంటూ అంతవరకూ ఎదిగిన సంబంధాలని పుటుక్కున తెంపేసుకోవడం ఒక ప్రత్యామ్నాయం. "పోనీ నేనే ఒకసారి పలకరించి చూస్తాను. అతను అలాంటి వాడు కాదే.. ఎందుకిలా జరిగిందో. సూటిగా మాట్లాడితే ఆపోహలు తొలుగుతాయి కదా.. ప్రయత్నించి చూస్తే తప్పేముంది..." ఇది ఇంకో ప్రత్యామ్నాయం.

- హఠాత్తుగా కరెంటు పోయింది. ఎలెక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌ని తిట్టుకుంటూ చీకట్లోనే గడిపెయ్యడం విజ్ఞులెవ్వరూ చేసేపని కాదు. తమకున్న పరిధిలో ఎమెర్జెన్సీ పరికరం వాడుకునో, కొవ్వొత్తి వెలిగించుకునో వెలుతురు సృష్టించుకుని కొనసాగడం ఇంకో పరిష్కారం.
- ఇంకొకరితో కలిసి పనిచేసినప్పుడో మరో సందర్భంలోనో ఎవరివల్లో తీవ్రంగా నష్టపోయాం. ఎదురంతా అంధకారం.. ఎదుటివాడిని తిట్టుకుంటూనో, వాడిమీద పగసాధించే ప్రయత్నాలు చేస్తూనో మిగతాసమయాన్ని ప్రతికూలాత్మకంగా గడపడం ఒక పద్ధతి. ప్రతీకారం తీర్చుకోవాలనుకోవడం, ద్వేషం పెంచుకోవడం.. చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం లాంటివి. జరిగిన అనుభవాలని పునాదిరాళ్ళుగా మార్చుకుని మరో వెలుగుకోసం అన్వేషించడం, ఉన్న సమయాన్నీ శక్తినీ అనుకూలాత్మక పనులకోసం ఉపయోగించుకోవడం ఇంకో ప్రత్యామ్నాయం.

■ ఇలా... ఎన్ని ఉదాహరణలైనా చెప్పుకోవచ్చు. ప్రతికూలాత్మక ప్రత్యామ్నాయాలు మనిషిని మరింత దిగజారుస్తాయనే విషయాన్ని గ్రహించి, అనుకూలాత్మక ప్రత్యామ్నాయాలని ఎంచుకుని అనూహ్యమైన విజయాలని సాధించిన విజేతల నెందరినో చూడొచ్చు... ఏది ఎంచుకుంటున్నాం అనే మార్గం, మనం ఎక్కడికి వెళతామో నిర్దేశిస్తుంది.

*- జూన్, 2014*

***

**సమాజక్షేమం కోసం,** ప్రజా సంక్షేమం కోసం శ్రమించిన, త్యాగాలు చేసిన ఎందరో మహానుభావుల గురించి చరిత్రపాఠాల్లో చదువుకున్నాం. దశాబ్దాలు గడిచినా, శతాబ్దాలు దాటినా వాళ్ళ త్యాగాల ఫలితాలు నిలిచి ఉండడం వారి ముందుచూపుకి నిదర్శనం. శాస్త్రజ్ఞులు, విద్యావంతులు, ధనవంతులు, ఉద్యమకారులు.. ఇలాంటి విజయాలు సాధించడం మనకి తెలుసు. ఐతే ఎలాంటి విద్యాగంధం లేకపోయినా, ఆర్థికంగా అట్టడుగు స్థాయిలో ఉన్నా ...ఆశ్చర్యం కలిగించే గొప్పవిజయాలు సాధించిన వ్యక్తులు కూడా ఉన్నారు. వారికంటూ చరిత్రలో కొన్ని అధ్యాయాలులేకపోవచ్చు, వారి గురించి పాఠ్యగ్రంథాల్లో ప్రస్తావించకపోవచ్చు. కానీ వాళ్ళు చేసిన త్యాగాలు శాశ్వతంగా నిలిచిపోయిన ఉదాహరణలు చాలా ఉన్నాయి. పెద్దపెద్ద ప్రణాళికలు, ఉద్యమాలు, పథకాలు,..ఇలాంటివి వారి ఆలోచనల్లోకి వచ్చే అవకాశం ఏమాత్రం లేకపోవచ్చు. ఎందుకంటే రాకెట్ వేగంతో దూసుకుపోయే కాలప్రవాహంలో వాళ్ళు ఒంటరి బాటసారులు. వాళ్ళు చేసిన పనులు చూస్తే నిజమైన త్యాగం, నిస్వార్థం.. అనే పదాలకి నిలువెత్తు అర్థం కనిపిస్తుంది. ప్రసారమాధ్యమాల్లో ఎక్కడో ఒక మూల కనిపించే అలాంటి వ్యక్తులు చేసిన ప్రత్యేక కృషి గురించి, వాళ్ళ త్యాగాల ఫలితాల గురించి 'కౌముది' వీక్లీ ఆడియో వారపత్రికల్లో తరచూ వివరించడం జరుగుతోంది. వాళ్ళు చేసిన పనుల గురించి తెలుసుకుంటుంటే 'ఇది నిజమా?', 'ఒంటరిగా ఇంతకృషి చేశారా?', 'కొన్ని దశాబ్దాలపాటు అంత పట్టుదలగా శ్రమించారా?',' 'మనుషుల్లో ఇంత నిస్వార్థం ఉంటుందా?',' నిరక్షరాశ్యులైన వారి సంస్కారానికి చేతులెత్తి నమస్కరించక తప్పదు' - అనిపించక మానదు. వారిలో కొంతమందిని ఈ సంపాదకీయంలో పరిచయం చేసుకుందాం..

కోదాడలో చెప్పులుకుట్టుకుంటూ జీవనం సాగించే పల్లె వెంకటేశ్వర్లు అనే పెద్దాయన చెత్తకుప్ప దగ్గర వున్న ఓ మతిస్థిమితం లేని అనాధని చేరదీశాడు. ఏమాత్రం సంబంధంలేని వ్యక్తి, భాషకూడా రాని అమ్మాయిని చేరదీసి ఆమెని మామూలు మనిషిని చేసే ప్రయత్నంలో వెంకటేశ్వర్లుగారు చేసిన కృషి గమనిస్తే హృదయం కరిగిపోతుంది.'అసలు ఇలాంటి త్యాగం చేయాలని ఎలా అనిపించింది ?' అన్న ప్రశ్నకి అతను చెప్పిన సమాధానం ' నేనూ మనిషినే కదా!' అని. ఈ ఒక్కవాక్యంలో ఎన్నో కావ్యాల సారాంశం ఇమిడి ఉందన్న విషయాన్ని ఎవరూ కాదనలేరు.గత పదిహేనేళ్ళుగా ఆ అమ్మాయిని పెద్దకూతురిలా చూసుకుంటున్నాడు. వాళ్ళ గురించి లోగడ ఒకసారి ఇదే సంపాదకీయంలో పరిచయం చేశాను(ఇక్కడ క్లిక్ చేయండి). వారి కథనాన్ని కౌముది ఆడియోవారపత్రిక 27వ సంచికలో ప్రసారం చేయడం జరిగింది( ఇక్కడ క్లిక్ చేయండి).

బీహార్ లోని గయ జిల్లాకి చెందిన దశరథ్ మాన్జి అనే వ్యక్తి రెండు దశాబ్దాలు పైగా కష్టపడి తమ ఊరిని చుట్టి ఉన్న కొండని తొలిచి రోడ్డుని వేశాడు. ఇరవయ్యేళ్ళు పైగా సాగిన అతని శ్రమలో కేవలం ఉలి, సుత్తి లాంటి చిన్న, చిన్న పరికరాలే అతనికి తోడు. అతను చేసిన త్యాగాల ఫలితం ఈ రోజు ఆ గ్రామప్రజలు పట్టణానికి ప్రయాణించే దూరం కొన్ని మైళ్ళు తగ్గిపోయింది. ఇది శతాబ్దాలకి నిలిచిపోయే త్యాగం.

కర్ణాటక రాష్ట్రంలో తిమ్మక్క అనే మహిళ, భర్తతో కలిసి, తమ ఊరినుంచి పక్కఊరికి వెళ్ళే నాలుగు కిలోమీటర్ల పొడవునా సుమారు 284 మర్రిచెట్లు నాటింది. తనూ, భర్తా కలిసి ఇరవయ్యేళ్ళపాటు ఆ మర్రి వృక్షాలని సొంత బిడ్డల్లా పెంచి పోషించారు. ఈ బృహత్కార్యంలో వాళ్ళు ఏ ప్రభుత్వ సహాయమూ కోరలేదు. రోజుకూలీ చేసుకుంటూనే ఇంత త్యాగం చేశారు. కర్ణాటక కల్పవల్లిగా గుర్తించబడిన సాలుమరద తిమ్మక్క గురించిన పూర్తి వివరాలు కౌముది ఆడియో వారపత్రిక 30వ సంచికలో వినవచ్చు.

పైన పేర్కొన్న వాళ్ళెవరూ బడికి వెళ్ళలేదు, పుస్తకాలు చదువుకోలేదు, పాఠాలు వంటబట్టించుకోలేదు, శాస్త్రవిజ్ఞానం తెలీదు.. వాళ్ళకి తోచిందల్లా మంచి పనిచెయ్యాలనే సంకల్పం, ఆ సంకల్పానికి రూపం ఇవ్వాలన్న పట్టుదల, రూపం ఇచ్చేవరకూ వాళ్ళు చేసిన త్యాగాలు, కృషీ. ఇవీ విస్మయం కలిగించే విషయాలు.

అస్సాంలోని బ్రహ్మపుత్రా నదీ తీరంలో జాదవ్ పేయెంగ్ అనే 16 సంవత్సరాల కుర్రాడు మొక్కలు నాటే కూలీగా పనిచేసేవాడు. ఆ ప్రోజెక్టు పూర్తయ్యాక మిగతా అందరూ వెళ్ళిపోయినా ఒక్కడే అక్కడ ఉండిపోయి ఇంకా వందలాది ఎకరాల్లో అడవుల్ని పెంచాడు. ఈ కృషి అంతా కొన్ని దశాబ్దాలపాటు కొనసాగింది. దశాబ్దాల తర్వాత కానీ అతను చేసిన మహత్తర కార్యం బయటి ప్రపంచానికి తెలీలేదు. ఇప్పటికీ తను సృష్టించిన సహజారణ్యంలోనే జీవిస్తున్నాడు.

వీళ్ళంతా అసామాన్యులు.. నిజమైన స్ఫూర్తి ప్రదాతలు అనడంలో సందేహం లేదు. వెదికితే, ఇలాంటి చరిత్రకెక్కని అతి సామాన్యులు కోకొల్లలుగా కనిపిస్తారు.

- **జూలై,2014**

***

**ఏ రంగంలోనైనా గొప్పస్థాయికి చేరుకున్న వాళ్ళని గమనిస్తే -** ఏ కొద్దిమందో తప్ప - చాలా మంది అత్యంత సాధారణమైన నేపథ్యంనుంచీ వచ్చిన వాళ్ళై ఉంటారు. జీవితంలో దుర్భరమైన పరిస్థితులని తట్టుకుని, పేదరికాన్ని జయించి, అవరోధాలని అధిగమించి, అటంకాలని దాటుకుంటూ..'ప్రాణాలే పందెం వేసి' పోరాడి గెలిచిన వాళ్ళ అనుభవాలు ఎంతో స్ఫూర్తినిస్తాయి. ఐతే ఇలాంటివారిలో తమ గతాన్ని గుర్తుంచుకునేవాళ్ళూ ఉంటారు, వెనక్కి తిరిగి చూసుకోవడం ఇష్టం లేని వాళ్ళూ ఉంటారు. అది వారి వారి వ్యక్తిగత విషయమే ఐనా ఉన్నత స్థాయికి చేరుకున్నాక నడిచొచ్చిన దారులని గుర్తుంచుకోవడం ఉన్నత వ్యక్తిత్వానికి కొలమానం.
"ఆకాశం తాకే ఏ మేడకైనా/ ఆధారం లేదా ఈ నేలలో / పుడమిని చూడని కన్ను / నడపదు ముందుకు నిన్ను!"అన్నారు ఓ పాటలో సిరివెన్నెలగారు.

ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకులు, బందరు ఆంధ్ర జాతీయ కళాశాల వ్యవస్థాపకుల్లో ఒకరు, భారతదేశ స్వాతంత్ర్యపోరాటంలో మహాత్మాగాంధీకి కుడిభుజంగా నిలిచిన తెలుగువాడు, చదివింది మెడికల్ డిగ్రీ ఐనా అద్భుతమైన ఆర్థిక శాస్త్రవేత్తగా పేరుతెచ్చుకున్న వారు ఐన - భోగరాజు పట్టాభి సీతారామయ్యగారిని ఒక సందర్భంలో ఎవరో అడిగారు. "మీ పేదరికపు రోజులను జ్ఞాపకం చేసుకోవడం మీకు రుచిస్తుందా? " - అని. దానికి ఆయన సమాధానం - "ఓహ్! తప్పకుండాను. ఆ రోజులను తలచుకోడానికి నేనేమీ బిడియపడను. ఆ రోజులను తలచుకుంటుంటే నేనెంతో గర్వపడతాను. వాటిని గుర్తు చేసుకుని ఉల్లాసం పొందుతాను. విజయం పొందినట్లు భావిస్తాను. పేదరికం పాపమూ కాదు, నేరమూ కాదు. దాన్ని అధిగమించినప్పుడు నీ వెనక ఒక చరిత్ర రూపుదిద్దుకుంటుంది. నీవు చరిత్ర నిర్మించినవాడవవుతావు. నిజానికి బానిసలే స్వాతంత్ర్యం సాధించుకుంటారు. .. పేదరికం, దాస్యం, రుగ్మతలు లేకపోతే చరిత్ర లేదు. చరిత్రను సృష్టించే వారు తమ మూలపదార్థాన్ని విస్మరించకూడదు, కుమ్మరి బంకమట్టిని మరిచిపోవడం, చెప్పులుకుట్టే వ్యక్తి తోళ్ళను, చర్మాలను మరిచిపోవడం లాంటిది చరిత్ర సృష్టికర్తలు తమ ముడిపదార్థాన్ని మరిచిపోవడం.." అక్కినేని నాగేశ్వరరావుగారు ఎప్పుడూ చెబుతూ ఉండేవారు "నేను సినిమాల్లోకి వెళ్ళినప్పుడు పెద్దలకి నమస్కారం పెట్టాలన్న సంస్కారం తెలీని వాడిని. ఎదురైన వ్యక్తుల వ్యక్తిత్వాలని పరిశీలిస్తూ నా వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నాను" అని. చిన్నతనంలో తెల్లవారు ఝామునే లేచి పశువుల పాలు పితికి, ఇంటింటికీ తిరిగి పాలు పోసి కుటుంబ పోషణకోసం అమ్మానాన్నలకి సహాయం చేసిన విషయం చెప్పుకునేందుకు ఎన్టీరామారావు గారెప్పుడూ సందేహించలేదు.'వీరాభిమన్యు' సినిమా తర్వాత కూడా సరైన వేషాల్లేక, పిల్లలకి పాలడబ్బాలు కూడా లేక ఇబ్బందుల పడ్డ పరిస్థితుల గురించి చెప్పుకునేందుకు శోభన్‌బాబు గారెప్పుడూ సిగ్గుపడలేదు. బాధలు పడ్డ గతాన్ని పదేపదే గుర్తు చేసుకోమని ఎవరూ సలహా ఇవ్వరు కానీ, అవసరమైనప్పుడు గతాన్ని నిర్భయంగా ఒప్పుకోవడం వారి వ్యక్తిత్వాన్ని మరింత ఉన్నతం చేస్తుంది. కొన్ని సంవత్సరాల క్రిందట ఒక పత్రికలో 'విజేతల విజయ గాథలు' అని కాకుండా ' ఫెయిల్యూర్ స్టోరీస్' అని ఒక శీర్షిక కొనసాగించారు. ఎంత ఉన్నతస్థాయికి చేరుకున్నా గతాన్ని మరచిపోని వాళ్ళు ఎంత ఎదిగినా ఒదిగి ఉండడానికి ఉదాహరణలుగా నిలుస్తారు. అలాంటి వారు నిజమైన స్ఫూర్తి ప్రదాతలుగా, ఆదర్శవ్యక్తులుగా మిగిలిపోతారు.

- *ఆగస్ట్, 2014*

***

**ఒక రచయిత ఎంతకాలం రచనలు చేయగలడు?** అన్న ప్రశ్నకి ఖచ్చితంగా 'ఇదీ సమాధానం' అని చెప్పడం కష్టం. అసలు రచనలు చేయడమనే ప్రక్రియని ప్రారంభించడమే ఒక్కొక్కరి విషయంలో ఒక్కో రకంగా ఉంటుంది. కొంతమంది అతి చిన్నవయసునుంచే ప్రారంభిస్తే మరికొంతమంది మధ్య వయస్సులో ప్రారంభించవచ్చు. పదవీ విరమణ తర్వాత రచనలు ప్రారంభించి పేరొందిన రచనలు చేసిన వాళ్ళగురించీ విన్నాం. 15-20 సంవత్సరాల అతిచిన్న వయసులోనే రచనలు ప్రారంభించి పేరు తెచ్చుకున్న రచయితలు సాధారణంగా ఏ 50 సంవత్సరాల వయసో రాగానే రచనలు తగ్గించడమో, లేదా రచనల్లో పదును తగ్గడమో సహజం. కానీ వయసుమీదపడినా రచనా వ్యాసంగంలో ఏమాత్రం వాడి వేడి తగ్గకుండా దశబ్దాలపాటు రచయితగా కొనసాగుతూ పాఠకుల అభిమానాన్ని అలానే నిలబెట్టుకోగలగడం చెప్పుకోదగ్గ విషయం.

మన కౌముదిని సుసంపన్నం చేస్తున్న రచయితల్లో గొల్లపూడి మారుతిరావుగారు ఆరు దశాబ్దాలుపైగా రచనలు చేస్తున్నారు. ఎన్ని మధ్యమాల్లో ప్రవేశించినా తనలోని రచయితని మాత్రం పదునుతగ్గకుండా కాపాడుకుంటున్న మారుతిరావుగారిని ఇదే విషయం అడిగినప్పుడు 'నిరంతర అధ్యయనం, మారుతున్న కాలంతో పాటు మనమూ మారడం, వ్రాయలన్న తపనని, వ్రాయగలనన్న విశ్వాసాన్నీ కోల్పోకుండా ఉండడం..అన్నింటినీ మించి ఆలోచనల్లో క్రమశిక్షణ..- ఇలాంటివన్నీ రచయిత సుదీర్ఘకాలం సజీవమైన రచనలు చేయడానికి తోడ్పడతాయి' అన్నారు. ఎందుకీ విషయం ప్రస్తావించుకుంటున్నాం అంటే - గొల్లపూడి మారుతిరావుగారు కౌముదిలో వీక్లికాలమ్ వ్రాయడం ప్రారంభించి ఈ నెల 15తో (సెప్టెంబర్ 15, 2008న ప్రారంభమైంది) ఆరు సంవత్సరాలుపూర్తవుతుంది. అంటే 314 వారాలు. ఇందులో కేవలం రెండంటే రెండు వారాలు మాత్రమే మినహాయించి క్రమం తప్పకుండా ఈ శీర్షిక వెలువడుతోంది. అందరూ కౌముది సంచికలు క్రమం తప్పకుండా వెలువడడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తుంటారు. నిజానికి ప్రతినెలా కౌముది ఖచ్చితంగా విడుదలవడానికి - రచయితలందరూ సమయానికి రచనలు అందించి సహకరించడం ముఖ్యకారణం. మారుతిరావుగారి విషయంలో ఇది ప్రతివారం వెలువడే శీర్షిక. 75 సంవత్సరాల వయసులోకూడా మారుతిరావుగారు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా, ఏ పరిసరాల్లో ఉన్నా ఖచ్చితంగా శనివారం ఉదయానికల్లా కాలమ్ మేటర్‌ని ఆడియోతో సహా పంపిస్తున్నారు. రాబోయే వారాల్లో ఏవైనా ప్రయాణాలు, అనివార్యమైన సంఘటనలు ఉన్నాయనుకుంటే అన్ని వారాలకి ముందుగానే వ్రాసి మరీ పంపిస్తున్నారు. క్రమశిక్షణ వ్యసనమే కాదు అది ఒకరినుంచి ఒకరికి పాకుతుంది అనడానికి ఈ శీర్షికా నిర్వహణలో మారుతిరావు గారు చూపిస్తున్న అంకితభావం నిలువెత్తు నిదర్శనం.

మధ్యమధ్యలో ఈ కాలమ్ మేటర్ వేరే పత్రికల్లో వస్తున్నా ఆరు సంవత్సరాలుగా నిరాఘాటంగా, అందునా ఆడియోతో సహా ( ముందులో కొన్ని వారాలు మినహాయించి) వస్తోంది మన కౌముదిలోనే. వారం వారం వెలువడే ఈ శీర్షికలో మారుతిరావుగారు స్పృశిస్తున్న అంశాలు, ఆయా అంశాలలో చూపిస్తున్న కోణాలు, వాటిని వ్యక్తపరిచే విధానం - ఇవన్నీ మారుతిరావుగారికి మాత్రమే సొంతమైన ప్రత్యేకతలు. వివిధ అంశాల మీద ఆయనకున్న సాధికారతని సమయానుకూలంగా ఎక్కడ ఎలా ఎంతవరకూ ఉపయోగించుకోవాలో చెప్పడానికి ఈ వ్యాసాలు నిలువెత్తు నిదర్శనాలు. ఈ ఆరేళ్ళ ప్రయాణంలో 310 పైగా వచ్చిన వ్యాసాల్లో వివాదాలు సృష్టించిన వ్యాసాలు చాలానే ఉన్నాయి. ఈ వ్యాసాలకున్న పాఠకుల్లో యువతరం శాతం చాలా ఎక్కువ అనేది ఆనందించాల్సిన విషయం. చెప్పే విషయం ఏదైనా తనదైన శైలిలో అన్వయిస్తూ మధ్య మధ్యలో పదునైన జీవనసూత్రాలని ఇమడ్చడం కూడా మారుతిరావుగారి ప్రత్యేకత. ఆరేళ్ళుగా క్రమం తప్పకుండా వచ్చిన ఈ వ్యాస పరంపరలోని అంశాలు నడుస్తున్న చరిత్రకి స్వచ్ఛమైన దర్పణాలు. ఎప్పుడు వెనక్కి తిరిగి ఏ

వ్యాసం చదివినా ఆ  వారం చరిత్రలో జరిగిన ఒక ముఖ్యమైన అంశం కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది. అన్ని వ్యాసాలని ఆడియోలతో సహా భద్రపరిచే అరుదైన అవకాశం మన కౌముదికి లభించింది. ఈ 310 పైగా ఉన్న వ్యాసాలన్నింటినీ ఈ లింక్‌లో చదవొచ్చు, వినొచ్చు.

కౌముదిలో ఈ 'గొల్లపూడి కాలమ్' మరిన్ని సంవత్సరాలు నిరాఘాటంగా కొనసాగుతుందని పాఠకులకి మనవి చేస్తూ, ఈ అవకాశాన్ని మనకి ఇస్తున్న గొల్లపూడి మారుతిరావుగారికి మనందరి తరుఫునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

- ***సెప్టెంబర్, 2014***

***

**ఏదైనా విషయం తెలియచేయడానికో** లేదా బలమైన సందేశం అందించడానికో వందల పేజీల పుస్తకాలు వ్రాయొచ్చు, నాలుగైదు పేజీల వ్యాసం వ్రాయొచ్చు. ఒక్కోసారి ఒక్క వాక్యంలో కూడ చెప్పొచ్చు. నిజానికి ఒకటి రెండు వాక్యాల్లో చెప్పదలచుకున్నదంతా ఇమడ్చడం పైకి కనిపించినంత తేలికేం కాదు.

ఒకటి రెండు వాక్యాల్లో బలమైన సందేశం అందించడానికి కొన్ని ఉదాహరణలు మన సామెతలు, నీతి శతక పద్యాల్లోని పంక్తులు. 'అంత్య నిష్టూరం కన్నా ఆది నిష్టూరం మేలు,'ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారు','పిండి కొద్దీ రొట్టె', 'నిలువ దగని చోట నిలువ నిందలు వచ్చు','తన కోపమె తన శత్రువు',' అనువుగాని చోట అధికులమనరాదు'. ఇలాంటిఒక్కొక్క వాక్యంలో వందల పేజీల సారాంశాన్ని గమనించవచ్చు. సుభాషితాలు కూడా ఇలాంటి కోవకి చెందినవే.

నిత్యజీవితంలో కనిపించే వాణిజ్య ప్రకటనలని కూడ మరికొన్ని ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. చాలా యేళ్ళక్రిందట చార్మినార్ సిగరెట్లకనుకుంటా ఒక ప్రకటనలో వ్రాసిన వాక్యం - Attitude is all that matters. అలానే అజంతా గడియారాల ప్రకటనల్లో కనిపించిన వాక్యం - There is no wrong time to do right things. కొన్ని ప్రకటనల్లో ఐతే అస్సలు వాక్యాలే లేకుండా మాట్లాడని బొమ్మతో సైతం లోతుగా ఆలోచింప చెయ్యగలరు.

కార్పొరేట్ ప్రపంచంలో Elevator Pitch అనే వాడుక పదం ఉంది. మన గురించి, మన ప్రణాళికల గురించి గంటల తరబడి ఉపన్యాసం ఇవ్వడం కాకుండా 30 – 40 సెకండ్లలో చెప్పదలచుకున్నది ప్రతిభావంతంగా, బలీయంగా చెప్పడాన్ని Elevator Pitch అంటారు. కొద్ది సెకండ్లలోఎదుటి వ్యక్తిని ఆకట్టుకునేలా మనల్ని మనం వ్యక్తపరచుకోవడం ఆషామాషీ వ్యవహారం ఏమీ కాదు.

జాగ్రత్తగా ఆలోచిస్తే 'చిన్నది', ' స్వల్పమైనది' , 'క్షణకాలం', 'తక్కువ' ఇలాంటి పదాలు అల్పత్వానికి, బలహీనతకి చిహ్నాలు కాదు. ఒక్కోసారి అవే విలువైనవి, బలమైనవి.!

సన్నజాజి రేకలు చిన్నవే కానీ అవి విరజిమ్మే పరిమళాల జ్ఞాపకాలు మనసుల్లో కలకాలం నిలిచిపోవూ..! అల్పమనిపించేవే కొన్నిసార్లు అనల్పమైన పాఠాలు చెబుతుంటాయి..!

- ***అక్టోబర్, 2014***

***

**సక్రమమైన వ్యక్తిత్వం,** వ్యక్తిత్వవికాసం, వ్యక్తిత్వవికాస పుస్తకాలు, వ్యక్తిత్వవికాస శిక్షణా తరగతులు... ఎప్పటి నుంచో ఈ అంశాలప్రస్తావన తెలుగు సాహిత్యంలో వివిధ సందర్భాల్లో ఉంది. ఐనప్పటికీ గత రెండు దశాబ్దాలుగానే ఈ అంశాల పట్ల భారతదేశపు యువతరం ప్రత్యేకమైన ఆసక్తి చూపిస్తోంది. అలానే తెలుగు యువత కూడా. ఇందుక్కారణం - కొంతవరకూ - చాలా మంది యువకులు అంతర్జాతీయ సంస్థలలో పనిచేయడం, వివిధ జాతీయులతో కలిసి పనిచేయాల్సిన సందర్భాలూ. . కావొచ్చు. ఈ వ్యక్తిత్వవికాసం అనే అంశం మీద అనేక పుస్తకాలు కూడా విరివిగా వస్తున్నాయి. ఆంధ్రదేశంలో వ్యక్తిత్వవికాస శిక్షణా కేంద్రాలు కూడా పెరిగాయి. కొంతమందికళాశాలలకి వెళ్ళి మరీ ఇలాంటి తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకతరం క్రిందటో, రెండుతరాల క్రిందటో ఇంట్లో ఉన్న అమ్మమ్మ, తాతయ్యలు ఇలాంటి సలహాలు ఇస్తుండేవాళ్ళు. ప్రపంచం విస్తరించి, జీవితాలు కుదించుకుపోతున్న ఈ కాలంలో మంచివిషయాలు నేర్చుకునేందుకు ప్రత్యేక శిక్షకులు అవసరమౌతున్నారు. ప్రతిరోజూ ఉదయం టి.విల్లో ప్రవచనాలూ వీక్షకులని ఆకర్షిస్తున్నాయి.పత్రికల్లో తరచూ వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన వ్యాసాలు వస్తున్నాయి. సరే.. అసలింతకీ ఒక మనిషి వ్యక్తిత్వాన్ని అంచనావేసే అంశాలేమిటి? - అన్న ప్రశ్నకి నిపుణులు ఏం చెబుతున్నారంటే - ఒక వ్యక్తి ప్రవర్తనా శైలి, ఆలోచనా విధానం, సమాజంపట్ల అతని దృక్పథం,జీవితంలో ఎదురైన అనుభవాలని స్వీకరించే విధానం, సమస్యలని పరిష్కరించుకునే సామర్థ్యం, లక్ష్యాన్ని నిర్దేశించుకునే విధానం, ఆ లక్ష్యాన్ని చేరుకునే మార్గం, భావోద్వేగాల నియంత్రణ .. ఇలాంటిఅంశాల మొత్తం ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిర్వచిస్తుంది. అన్ని సుగుణాలూ అందరిలో ఉండవనేది అందరికీ తెలిసిన విషయమే. ఎందుకు కొందరిలోనే కొన్ని గుణాలు ఉంటాయీ అంటే దానికీ శాస్త్రీయపరమైన కారణాలున్నాయని విజ్ఞులు చెబుతుంటారు. వాటిల్లో కొన్ని - ఒక వ్యక్తికి తల్లిదండ్రుల నుంచి వచ్చిన జన్యుపరమైన లక్షణాలు, ఒక వ్యక్తి యొక్క ఆర్థిక పరిస్థితుల నేపథ్యం, అతని స్నేహితులు, అతను చదివే పుస్తకాలు, విద్యార్హతలు, గురువుల ప్రభావం, అన్నింటినీ మించి భావోద్వేగాలపై ప్రభావం చూపించే శరీరంలోని రసాయనచర్యలు --- ఇలాంటి ఎన్నో అంశాలు ఒకవ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తాయంటారు. సక్రమమైన వ్యక్తిత్వం అనేది కేవలం వ్యక్తిగతమే కాదు, ఒక వ్యక్తి మంచితనం కానీ చెడ్డగుణం కానీసమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఒక వ్యక్తిత్వం వ్యక్తినీ, అతని కుటుంబసభ్యులనీ, సన్నిహితులనీ, పరిసరాలనీ..తద్వారా సమాజాన్నీ ప్రభావితంచేస్తుంది. ప్రతి వ్యక్తీ నూటికి నూరుశాతం పరిపూర్ణుడు కాలేక పోయినా ఎవరికీ హాని కలుగని ప్రవర్తనతో, మంచిగుణాలని పెంపొందించుకునే ప్రయత్నంలో వేసే అడుగులే వ్యక్తిత్వవికాసానికి తొలిపాఠాలు..!

- *నవంబర్, 2014*

***

**కార్పొరేట్ ప్రపంచంలో** అనుసరించే కొన్ని విధానాలు, లక్ష్యనిర్దేశనలూ, ప్రణాళికా పద్ధతులూ, వ్యక్తగత జీవన విధానాలకి కూడా ఎలా వర్తిస్తాయో గత సంచికల్లో కొన్నిసార్లు ప్రస్తావించుకున్నాం. ఆ కోవకి చెందిన మరో అంశం - సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల తయారీలో ( Agile) ఎజైల్ అనే విధానం. గత పది - పదిహేను సంవత్సరాలుగా వాడుకలోకి వచ్చింది. చాలా కుప్తంగా మనభాషలో ఎజైల్ విధానం అంటే ఏమిటో తెలుసుకుందాం. సాఫ్ట్‌వేర్ అనేది వినియోగదారుడి కోసం డెవలప్ చేస్తారు. డెవలప్ చెయ్యాల్సిన ప్రోడక్ట్ సంక్లిష్టతని బట్టి అది కొన్ని వారాలు పట్టవచ్చు, నెలలు పట్టవచ్చు,సంవత్సరాలు పట్టవచ్చు. ఐతే ఈ ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ అనే ప్రణాళికని చిన్న చిన్న లక్ష్యాలుగా విభజించి రెండువారాలలోనో, మూడు వారాలలోనో (దీన్నే స్ప్రింట్ అంటారు) అర్థవంతమైన ఒక చిన్న ఫలితాన్ని డెవలప్ చేయడం, వెంటనే వినియోగదారుడికి చూపించి ఏమైనా మార్పులు కావాలంటే తరువాతి రెండు మూడు వారాల్లో పూర్తి చేయడం.. ఇలా ప్రోడక్ట్ పూర్తయే వరకూ జరిగే ప్రణాళికని ఎజైల్ పద్ధతి అంటారు. (ఇందులో ఇంకా చాలా కోణాలున్నాయి కానీ మనకి అర్థవంతమనిపించే ఒకటి రెండు అంశాలని మాత్రమే ప్రస్తావించుకుందాం). ఈ ఎజైల్ పద్ధతి యొక్క ఒక ముఖ్యలక్షణం - వెసులుబాటు తనం. దీనివల్ల చేస్తున్న పనిని నిత్యం సమీక్షించుకుంటూచేస్తున్న పనిలో మార్పు అవసరమైతే దాన్ని త్వరితంగా అమలు చేయగలగడం సాధ్యపడుతుంది. జాగ్రత్తగా గమనిస్తే నిత్యజీవితంలో కూడా ఏ లక్ష్యసాధనకైనా ఈ ఎజైల్ అనే విధానాన్ని అనుసరించడం మంచి ఫలితాలనిస్తుంది. లక్ష్యసాధన ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తులో ఉందనిపిస్తే దాన్ని జాగ్రత్తగా విశ్లేషించండి. దాన్ని చిన్న చిన్న లక్ష్యాలుగా విభజించుకునే మార్గం కనిపిస్తుంది. ఫలానా పరీక్షలో ఉత్తీర్ణులు కావాలి అనేది పెద్దలక్ష్యమే కావొచ్చుకానీ అందుకోసం ఏమేం చదవాలీ, పరీక్షాసమయం వరకూ ఉన్న కాలంలో ఏ అంశానికి ఎన్ని గంటలు కేటయించుకోవాలీ - ఇలాంటివిశ్లేషణ చేస్తే ప్రతివారం ఎంత సబ్జెక్ట్ పూర్తిచేయాలో తెలుస్తుంది. (అదే ఎజైల్ విధానంలోని స్ప్రింట్).అనుకున్న ప్రకారం కొనసాగగలుగుతున్నామా లేక ఏమైనా మార్పులు కావాలా అనే విషయాన్ని ప్రతి రోజూ విశ్లేషించుకోవాలి (దీన్నే ఎజైల్ విధానంలో రోజువారీ స్క్రమ్ మీటింగ్ అంటారు). లక్ష్యసాధనకోసం జరిగే ప్రయత్నాలకి ఆటంకం కలిగించే పనులేవైనా వాటిని నియంత్రించుకునే నేర్పు ఉండాలి (ఎజైల్ విధానం ఐతే స్క్రమ్ మాస్టర్ అనే వ్యక్తి ఇలాంటి ఆటంకాలని నిరోధిస్తూ ఉంటాడు. నిత్యజీవితంలో ఎవరికి వారే స్క్రమ్ మాస్టర్ కావాలి!). మనిషికి దృఢచిత్తం, కర్తవ్యదీక్ష, పరిస్థితులకి చలించని పట్టుదల ఉండాలన్న మాట నిజమే కానీ వీటితో బాటు వెసులుబాటు తనం కూడా చాలా ముఖ్యం. దృఢచిత్తంతో ఉండాలి కదా అని, ముంచెత్తడానికి వస్తున్న కెరటానికి అడ్డంగా నిలబడ్డం తెలివిగల వ్యక్తి చేసే పనికాదు. సామర్థ్యం ఉంటే ఉంటే కెరటం పైగా దూకాలి, లేదంటే కనీసం తలవంచి కెరటం వెనక్కి వెళ్ళేదాకా వేచిచూడాలి. గమ్యం చేరుకునే ప్రయాణంలో అవసరమైతేమార్గాన్ని మార్చుకోగలిగేందుకు సిద్ధపడాలి. ఎగరడం, దూకడంతో బాటు లొంగడం, వొంగడం కూడా అలవాటు చేసుకోవాలి.

( Note: ‘Agile’ word, in the above comments, is not used in Dictionary meening)

- ***డిసెంబర్,2014***

***

# 2013

పాతసంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్తసంవత్సరం వచ్చేసింది.జీవనపయనంలో మరో మైలురాయిని చేరుకున్నాం.ఈ మైలురాయి దగ్గర ఒక్కసారి ఆగి, ఎంతదూరం ప్రయాణించాం, గమ్యం చేరుకోడానికి ఇంకెంత దూరం ప్రయాణించాలి, నేర్చుకున్న పాఠాలేమిటి, గుణపాఠాలేమిటి, ముందు ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటికొనసాగించాల్సిన స్నేహాలెన్ని, క్షమించి వదిలెయ్యాల్సిన సంఘటనలెన్ని ...ఒక్కో మజిలీ వద్ద ఒక్కో సమీక్ష అవసరమే. జీవితాన్ని చాలా ప్రక్రియలతో పోల్చవచ్చు కానీ అన్నింటికంటే నూటికి నూరుశాతం సరిపోల్చదగిన ప్రక్రియ ప్రయాణం. ప్రతి జీవితం ఒక ప్రయాణం, కోరుకున్న తీరంకోసం ప్రయాణం. మనిషి స్థాయిని బట్టి ఒక్కోసారి కాలి నడక, ఇంకోసారి సైకిల్, మరోసారి స్కూటర్ , ఇంకా కలిసొస్తే నాలుగుచక్రాల వాహనం. విధానం ఏదైనా, వాహనం ఏదైనా ప్రతి క్షణం ముందుకి సాగడమే జీవనపయనానికి మూలసూత్రం. ఈ ప్రయాణం అర్థవంతం కావాలంటే లక్ష్యనిర్దేశం అతి ముఖ్యం. ఎక్కడికి వెళ్ళాలో నిర్ణయించుకున్నాక కావల్సినవి ప్రయాణ వాహనానికి ఇంధనాలు -మానసిక సంసిద్ధత, ఆలోచనల్లో స్పష్టత, చేతల్లో చిత్తశుద్ధి, క్రమశిక్షణ, దృఢ దీక్ష, కఠోర పరిశ్రమ. చుట్టుపక్కల వాహనాలు రద్దీగా ఉంటే మన వాహనాన్ని జాగ్రత్తగా నడిపించాలి. కాస్త వెసులుబాటు దొరికినప్పుడు చుట్టూ కనిపించే ప్రకృతిదృశ్యాలని ఆస్వాదించాలి. త్రోవలో పరిచయమయ్యేసహప్రయాణీకులతో సత్సంబంధాలు నిలుపుకోవడం కూడా గమ్యం చేరడానికి ఒక్కోసారి ఎంతో ఉపయోగిస్తాయి. అలసి ఆగినచోట ఒక్కింత విశ్రాంతి అవసరమే. ఒక్కోసారి దారి మార్చుకుని వేరే త్రోవలో ప్రయాణించడానికైనా సిద్ధపడాలి. వాహనానికి మరమ్మతులు అవసరమైతే సరిచేసుకోవడానికి పరికరాలు ఎప్పుడూ తోడుండాలి- పునర్విమర్శ, చేసిన తప్పులు సరిదిద్దుకోవడం, రేపటి మీద ఆశతో ప్రయాణానికి సిద్ధమవడం..ఇలాంటిపరికరాలు. ఎంతదూరం ప్రయాణించినా గమ్యం కనిపించనట్లు అనిపిస్తోందా, 'ఎన్నడూ వదులుకోవద్దురా ఓరిమి'. లక్ష్యసాధన చాలా చాలా దూరం అనిపిస్తోందా..చిన్న చిన్న లక్ష్యాలని పెట్టుకుంటే - అదిగో ఆ వూరు..అదిగో ఆ పైన మరో వూరు .. లక్ష్యసాధనవైపు ప్రయాణంలో అలసట తెలీకుండా ఉంటుంది. ఒక్కో వూరు చేరుకున్నప్పుడు ముందుకి వెళుతున్నామన్న తృప్తి ఆశావహ దృక్పథం కొనసాగుతాయి..అన్నింటికీ మించి 'గమనమే నీ గమ్యమైతే బాటలోనే బ్రతుకు దొరుకు..!' ..జిందగీ ఏక్ సఫర్..!! కోరుకున్న తీరాన్ని చేరుకునే ప్రయాణంలో అందరికీ శుభం చేకూరాలని ఈ నూతన సంవత్సరాగమన సందర్భంగా మనసారా ఆశిద్దాం.

***జనవరి, 2013***

***

*ఐదారేళ్ళ వయసులో పక్కింటి పిల్లలతో ఆడుకునేప్పుడు తగాదాలొస్తే, తప్పు ఎవరిదైనా కానీ, పక్కింటావిడ వెంటనే మామీద పోట్లాటకి వచ్చేసేది. మా అమ్మతో తగవు పెట్టుకునేది. మా అమ్మ మాత్రం అసలేం జరిగిందో ముందుగా మమ్మల్నడిగి తెలుసుకునేది. మేము చెప్పినదాన్ని బట్టి మాలో తప్పుంటే మమ్మల్ని అందరిముందే మందలించేది. తప్పు మాది కాకపోతే పక్కింటావిడకి వివరించే ప్రయత్నం చేసేది. ఎదుటివారి మీద ఆరోపణ చేసే ముందు మన వైపు నుంచి ఒకసారి ఆత్మవిమర్శ, స్వయం విశ్లేషణ చేసుకోవడం మంచిదన్న విషయం అమ్మ అనుభవపూర్వకంగా నేర్పింది.

*ఇంటర్మీడియట్ తెలుగు మీడియమ్‌లో చదివాను. బి.ఎస్సీకి వచ్చేసరికి ఇంగ్లీష్ మీడియమ్ అన్నారు. ఒక్కసారిగా ఫిజిక్స్, కెమిస్ట్రీ లాంటి సబ్జెక్టులు ఇంగ్లీషులో చదవాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. ఏం చేయాలో తెలిసేది కాదు. ప్రైవేటు ట్యూషన్ల కెళ్ళే స్థోమతలేదు. నేను కాలేజీలో చదువుతున్నన్నాళ్ళూ - నాన్న పల్లెటూర్లో కౌలుకి వ్యవసాయం చేస్తుంటే, అమ్మ నాతో పాటు బందర్లో ఉండేది. తను రెండో తరగతి మించి చదువుకోలేదు. ఇంగ్లీషు మీడియమ్ పాఠాలు అర్థం చేసుకునేందుకు నేను పడుతున్న అవస్థలు గమనించి, రెండు వీధుల అవతల ఉన్న నోబుల్ కాలేజీ లెక్చరర్ ఒకరి వద్దకెళ్ళిఅడిగింది. ఆయన నాకు ఇంగ్లీషు పాఠాలు అర్థం చేసుకునేందుకు సహాయం చేస్తానన్నారు, అందుకు ఫీజు ఏమిటంటే ఆ భార్యాభర్తలు కాలేజీకి వెళ్ళినప్పుడు వాళ్ళ చిన్న పిల్లల్ని అమ్మ చూసుకోవాలి. ఇదంతా అమ్మ ఆలోచనే.

*మేము అద్దెకుండే ఇంటికి పక్కనే స్టూడెంట్ మెస్ ఒకటి ఉండేది. అమ్మ పొద్దున్నే లేచి ఆ మెస్ వాళ్ళకి సహాయం చేసి, నేను కాలేజీకి వెళ్ళేలోగా వాళ్ళు ఇచ్చిన ఇడ్లీలు తీసుకొచ్చి నాకు పెట్టేది.

*పరీక్షల రోజుల్లో తెల్లవారు ఝామున లేచి చదువుకునే వాడ్ని. నన్ను లేపడం కోసం తను రాత్రంతా మెలకువగా ఉండి, తెల్లవారు ఝామున ఏ మూడింటికో నన్ను నిద్రలేపి అప్పుడు తను పడుకునేది. జీవితంలో ఇలాంటి దశలన్నీ దాటుకుని ఒకస్థాయికి చేరుకున్నాక ఇండియా వెళ్ళే ప్రతిసారీ 'అమ్మా ఏమైనా తీసుకురమ్మంటావా?' అని అడిగితే ఒక్కటంటే ఒక్కసారి కూడా ' నాకు ఇది కావాలి' అని అడగలేదు. నిస్వార్థం, నిష్కల్మషత్వం - ఇలాంటి పదాలకి అమ్మప్రేమని మించిన ఉదాహరణ మరొకటి ఉండదేమో!

*నాన్న చనిపోయాక ఎవరి వద్దా ఉండడానికి ఇష్టపడలేదు. పల్లెటూరిలో స్వతంత్రంగా జీవించడానికి నిర్ణయించుకుంది. రోజూ పొద్దున్నే తను నిద్రలేచే సమయం, ఐదింటికి ఫోన్ చేసేవాడిని. నా ఫోన్ వెళ్ళడం ఐదు నిమిషాలు ఆలశ్యం ఐతే తనే ఫోన్ చేసేది 'ఇంకా ఫోన్ చేయలేదేమిటా ..ఏమైందోనని కంగారు పడుతున్నా' అంటూ. ఎప్పుడూ ఒకటే మాటలు చెప్పేది 'నేను బాగానే ఉన్నాను. అన్నీ బాగానే ఉన్నాయి. అందరూ బాగానే ఉన్నారు. ఏమీ ప్రోబ్లెమ్ లేదు.' అంతే! జ్వరం వచ్చినా, ఎక్కడన్నా పడి దెబ్బలు తగిలినా, తనంతట తనే రెండు మైళ్ళు నడిచి వెళ్ళి వైద్యం చేయించుకుని వచ్చేది. ఊరిలో వాళ్ళు చెబితే తప్ప ఆ విషయం మాకు తెలిసేది కాదు. 'నువ్వు దూరాన ఉన్నావు, నీకు ఎన్నో సమస్యలుంటాయి. ఇవన్నీ చెప్పి నిన్ను కంగారు పెట్టడం ఎందుకని చెప్పలేదు' అని సమర్థించుకునేది. ఈ అలవాటు ఎంతలా కొనసాగిందంటే - ఐదారు నెలలుగా తను అనారోగ్యంతో బాధపడుతుంటే 'అమ్మా.. వచ్చేనెలలో నిన్నుచూడ్డానికి వస్తున్నాను' అని ఫోన్ చేస్తే 'నీకు ఇబ్బంది లేకపోతే, వీలైతే రా..' అని మాత్రమే చెప్పింది. అత్యంత విషాదకరమైన సన్నివేశం ఏమిటంటే నేను వెళ్ళే సరికి వైరల్ ఫీవర్ మెదడుమీద దెబ్బతీసి మనుషుల్ని గుర్తుపట్టే శక్తికోల్పోయింది. 'నన్ను గుర్తు పట్టావా?' అంటే 'నాకు గుర్తు తెలీడం లేదు' అంది. ఈ విషయం విన్న మిత్రులు, సినీ దర్శకులు వంశీగారు నాకంటే ఎక్కువగా బాధ పడ్డారు. 'పత్రికా రచన మీద ఎక్కువసమయం పెడుతుంటే దర్శకత్వం గురించి ఆలోచించడానికి సమయం దొరకడం లేదు. అందుకే ఇంక కథలు వ్రాయడం మానేద్దామనుకుంటున్నా' అన్న వంశీగారు, అమ్మ నన్ను గుర్తు పట్టలేదన్న సంఘటన విని 'మీ

అమ్మగారి గురించి ఒక కథ వ్రాశాక ఇంక కథలు వ్రాయడం తగ్గించుకుంటాను' అన్నారు. క్రిందటి వారం ఫోన్ చేసి 'అమ్మ చనిపోయింది' అని చెప్పినప్పుడు 'ఇప్పుడే ఒక సినిమా మొదలు పెట్టాను. ప్రి-ప్రొడక్షన్ పని జరుగుతోంది. షూటింగ్ మొదలయ్యే లోగా మీ అమ్మగారి గురించి కథ వ్రాస్తాను' అన్నారు వంశీగారు. 'అమ్మ'లు సిద్ధాంతాలు వల్లించడం, నీతి పాఠాలు చెప్పడం కంటే తమ జీవితాలనే ఉదాహరణలుగా మిగిల్చి వెళ్తారు. ఎప్పుడు వెనక్కి తిరిగి చూసినా అమ్మప్రేమని మించిన ప్రేమ ఇంకేదీ కనిపించదు.!! ఎప్పుడో పాతికేళ్ళ క్రిందట వ్రాశానీ కవిత

అమ్మా..!
నాకు గులాబీ పందిళ్ళు అల్లేందుకు
నువ్వెన్ని ముళ్ళదారులు తొక్కి వచ్చావో నాకు తెలుసు,
నన్ను పొత్తిళ్ళలో చేర్చి వెచ్చదనమిస్తుంటే
నిన్ను చలిగాలులు వణికిస్తుంటాయని నాకు తెలుసు,
నా ముందు వెలుగు బాటలు విచ్చుకుంటుంటే
వెనుక నీ జీవితం కొవ్వొత్తిలా కరుగుతోందని నాకు తెలుసు,
రూపులేని నెత్తురు ముద్దకు నువ్వు ఊపిరులూదినప్పుడు
నీ ప్రాణాలెంత విలవిలలాడాయో నాకు తెలుసు,
నాకు తెలియనిదల్లా ఒక్కటే-
'నేను'కు రూపమిచ్చిన నీ ఋణం
ఎలా తీర్చుకోవాలా అని!!

***ఫిబ్రవరి, 2013***

***

చిదంబరానికి గొప్ప అనుమానం వచ్చింది. ఆఫీసుకి వెళ్ళడం , రావడం తప్ప దేన్నీ పట్టించుకోని చిదంబరాన్ని ఈ ఆలోచన తొలిచేస్తోంది. పక్కసీటులో అమితాబ్ బచ్చన్ కూర్చుని 'హలో..' అని పలకరించినా 'ఏమిటోయ్..?' అని కళ్ళెగరేసే చిదంబరానికి ఏదో కోల్పోతున్నానేమోనన్న సందేహం నిద్రపట్టనీయడం లేదీ మధ్యన. అతనికున్న ఏకైక మిత్రుడు సీతారాం దగ్గర తన మనసు విప్పాడు. "ఐతే ఏమిటీ నీ సమస్య?" అసలు పాయింటుకి సూటిగా రమ్మన్నట్లు అడిగాడు సీతారాం. "ఇంట్లోనూ, బంధువులదగ్గరా, ఆఫీసులోనూ కూడా నన్నెవరూ పట్టించుకోవడం లేదేమోనని, నాకసలు విలువే ఇవ్వడం లేదనీ అనిపిస్తోంది.." చిదంబరం ఈ మాత్రం బయటపడడమే ఒక విశేషం. అతడి సంగతి చిన్నప్పట్నుంచీ తెల్సిన సీతారాం పెద్దగా ఆశ్చర్యపడలేదు. "ఇంటికెళ్ళగానే ఏం చేస్తావు?" సీతారాం క్రాస్ ఎగ్జామినేషన్ మొదలుపెట్టాడు. ఇంకోసారి, ఇంకోసారి ఐతే ఏమనేవాడో కానీ, ప్రస్తుత మనోవేదనకి పరిష్కారం కావాలనుకుంటున్నాడు కాబట్టి చిదంబరం ఏమీ దాచుకోకుండా చెప్పడం మొదలెట్టాడు. "ఏముందీ మా గోపీని, అనూని హోమ్ వర్క్ చేశారా అని అడుగుతాను.." ఆరో తరగతి, ఎనిమిదో తరగతిలో ఉన్న పిల్లల గురించి చెప్పాడు. "అడుగుతావా, చూస్తావా?" "అడుగుతానంతే.." "తర్వాత..?" "హోమ్ వర్క్ పూర్తికాకపోతే తిడతాను. మార్కులు తక్కువవస్తే వీపు చేరేస్తాను.." "ఇంటికెళ్ళాక చెల్లాయితో ఏం మాట్లాడుతావ్?" "మాట్లాడేదేముందీ..వంట సరిగాలేకపోతే చివాట్లు పెడతాను.." "తర్వాత.." "కాస్సేపు టి.వి చూసి నిద్రపోతాను.." "ఆఫీసులో కూడా అందరితో తగాదా పడుతుంటావా?" "తగాదా అంటే.. అవసరమైతే తప్పదు మరి..!" "ఒరే చిదంబరం, నువ్వు ఇంట్లోనూ బయటా కూడా ఎక్కడ పొరబాట్లు కనబడతాయా అనే వెదుకుతుంటావు. పొరబాట్లు కనుక్కొని సరిచేయడం మంచి పద్ధతే కానీ నీకు అదే జీవితమై పోయింది. మీ గోపీ హైస్కూల్లో ఆటల్లో ముందుంటున్నాడన్న విషయం ఎప్పుడైనా కనుక్కొని అభినందించావా? అనూ ఎనిమిదో తరగతికే పెద్దవాళ్ళు ప్రశంసించే స్థాయిలో బొమ్మలువేస్తోందని తెలుసా? నీ భార్య మధ్యాహ్నం నువ్వు ఆఫీసుకి వచ్చేశాక, చీరెలకు డిజైన్లు వేసి వచ్చిన ఆదాయంతో చిట్టీలు కట్టి ఇంట్లో సామాన్లు సమకూరుస్తోందని గమనించావా? ఆఫీసులో నీ పక్క సీట్లో ఉన్న కౌసల్య వాళ్ళ అబ్బాయికి విదేశాల్లో చదువుకి సీటు వచ్చింది. అది తెలిశాకైనా 'కంగ్రాచ్యులేషన్స్' చెప్పావా?.. ఊహుఁ.. నీ కివేమీ పట్టవు. మరి నిన్ను చుట్టుపక్కల వాళ్ళు పట్టించుకోవాలంటే.. ఎందుకు చేస్తారా పని? ఎదుటివాళ్ళు నీకు విలువనివ్వాలనుకుంటే నువ్వు ఎదుటివాళ్ళకి విలువనివ్వాలి. అందరిలో నువ్వు ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే అందరిలోనూ ప్రత్యేకతలు చూడ్డం నువ్వు అలవాటు చేసుకోవాలి. పరిసరాలు నిన్ను ప్రతిబింబిస్తాయి.! నువ్వు నవ్వుతూ ఉండు, చుట్టుపక్కల అందరూ నవ్వుతూఎదురౌతారు. ఎదుటివాళ్ళలోని చిన్న చిన్న పొరబాట్లని క్షమించడం అలవాటు చేసుకో, నీలోని లోపాలనీ మిగతావాళ్ళు క్షమిస్తారు. ఇందులో పెద్ద రహస్యం ఏమీ లేదు ..అభ్యాసంతో వచ్చేవే ఇవన్నీ..! రేపట్నుంచీ కొత్త కళ్ళజోడుతో ప్రపంచాన్ని చూడ్డం మొదలుపెట్టు, ప్రపంచానికీ నువ్వు కొత్తగా కనిపిస్తావు! "

*మార్చ్, 2013*

***

"ఏమండీ..మనం ఇల్లు మారాలండీ..?" వనజ ఓ శుభముహూర్తాన భర్తని కదిపింది. "అదేమిటోయ్..ఈ ఇంట్లోకి వచ్చి ఇంకా సంవత్సరం కూడా కాలేదు. పిల్లల స్కూళ్ళకి దగ్గరగా కూడా ఉంటున్నాం. అప్పుడే ఇల్లు మారడం దేనికి?" సందేహం వెలిబుచ్చాడు బుచ్చిబాబు. "మరే..పొద్దున్నే సరళ వాళ్ళుంటున్న ఇంటికి వెళ్ళాను. వాళ్ళ పెరటినిండా ఎన్ని పూల మొక్కలో! మల్లెలు, మందారాలు, సంపెంగలు, నందివర్ధనాలు..అబ్బో అక్కడినుంచి కదలాలనిపించలేదనుకోండి! కాస్త అసూయగా కూడ అనిపించింది. " "వాళ్ళింట్లో పూలమొక్కలుంటే మనం ఇల్లు మారడం దేనికి?" "పూర్తిగా చెప్పనివ్వండీ.. వాళ్ళ సందులోనే ఇంకో ఇల్లు అద్దెకి వచ్చింది. ఆ ఇంటి ముందు బోలెడంత జాగా ఉంది. ఇంచక్కా ఆ ఇంట్లోకి మారితే మనం కూడా పూల మొక్కల్ని పెంచుకోవచ్చు." బుచ్చిబాబు శతవిధాలా వనజకి నచ్చచెప్పాలని చూశాడు కానీ చివరికి ఆమె నిర్ణయానికి తలవొంచక తప్పలేదు. నెలరోజుల్లోనే వనజకి ఇష్టమైన అద్దెఇంట్లోకి మారిపోయారు. వనజ కష్టపడి పెరట్లో పాదులు చేసి రకరకాల పూలమొక్కలు నాటింది. రోజూ ఉదయం, సాయంత్రం వాటికి నీళ్ళు పెట్టడం..లాంటి పనులతో వనజ బిజీగానూఉంది, సంతోషంగానూ ఉంది. దొడ్లో ఉన్న బావికి కరెంటు మోటారు ఉండడం వల్ల నీళ్ళు పెట్టడం ఇబ్బందిగా కూడ లేదు. వేసవి కాలం వచ్చేసింది. వేళాపాళా లేని కరెంటు కోతలు మొదలయ్యాయి. ఎప్పుడు కరెంటు వస్తుందోనని ఎదురుచూడ్డం, వెంటనే మోటరు వేసి నీళ్ళు పట్టడం..వనజకి ఇంకాస్త శ్రమ ఎక్కువైంది.ఈ శ్రమకి తోడు మరో రెండు మూడు వారాలకి బావిలో నీళ్ళు కూడా ఎండిపోయాయి. వనజ గాభరా పడిపోసాగింది. నీళ్ళు సరిగాలేవు,ఉన్ననీళ్ళు తోడదామంటే కరెంటు సరిగాలేదు. ఏపుగా ఎదగాల్సిన మొక్కలు బేలగా ఎండిపోవడం మొదలెట్టాయి.అక్కడికీ రెండు రోజులు వీధికుళాయి నుంచి నీళ్ళు మోసుకొచ్చింది. తనవల్ల కాని పని అది, "ఏమండీ.. నీళ్ళు లేక మొక్కలు ఎండిపోతున్నాయండీ..ఎవరైనా మనిషిని పెట్టయినా వీధిలోంచి నీళ్ళు తెప్పించి పొయ్యాలి.." అసలు ఇబ్బంది అప్పటికి కానీ తెలిసి రాలేదు! పక్కవాళ్ళింట్లో పూలమొక్కలు చూసేందుకు చాలా బావుంటాయి. ఐతే వాటి పోషణకి వాళ్ళు పడే శ్రమని, వాళ్ళకి ఎదురయ్యే సాధకబాధకాలని కూడా గుర్తించాలి. జీవితంలో ఏ ఆనందానికైనా ఒక 'వెల ' ఉంటుంది. ఏ సౌకర్యానికైనా ఒక 'ఖరీదు' ఉంటుంది. If the grass is greener on the other side of the fence, you can bet the water bill is higherఇది తెలుసుకున్న రోజు పక్కవాళ్ళకి ఉన్నవన్నీ మనమూ పొందాలని చేసే ప్రయత్నాల్లో తగిలే ఎదురుదెబ్బలు ఎన్నో పాఠాలు నేర్పుతాయి, 'ఏదీ తనంత తానై నీ దరికి రాదు ' అన్నమాటల్లో ఎంత నిజముందో మళ్ళీ మళ్ళీ గుర్తుచేస్తాయి!

*ఏప్రిల్, 2013*

***

ఓ ప్రఖ్యాత సినీ సంగీత దర్శకుడి సంగీత విభావరికి వెళ్ళడం తటస్థించిందీ మధ్య. మొత్తం 90 మందికిపైగా వాయిద్యకారులే ఉన్నారు. ఒక్కోపాటని ఐదారుగురు గాయనీ గాయకులు కూడా కలిసి పాడారు. అంటే దాదాపు వందమంది కలిసి ఒక పాటకి జీవం పోయాలంటే - ఒకరికి ఒకరికి మధ్య ఎంత సమన్వయం ఉండాలో ఆలోచిస్తే ఆశ్చర్యం అనిపిస్తుంది. సరిగ్గా ఒక వాయిద్యం ఆగగానే ఇంకో వాయిద్యం మొదలవడమో, కొంతసేపయ్యాక ఇంకో వాయిద్యం జతచేరడమో అంతా క్రమబద్ధంగా జరిగిపోతుంది. ప్రదర్శనకి ముందు ఎంతో అభ్యాసం ఉండొచ్చు కానీ ప్రదర్శన సమయంలో ఏ తప్పు చేయకుండా సంపూర్ణమైన సంగీతాన్ని అందించడంలో బృందంలోని ప్రతి సభ్యుడి పాత్రా, ఒకరితో ఒకరు మాట్లాడుకునే సంగీత భాషా ఎంతో ముఖ్యం. ఇవన్నీ తెలీకుండా వినే మామూలు శ్రోతకూడా పాటలోని మాధుర్యానికి పరవశించి పోతాడు. ఒక బృందంగా కలిసి ఆడే క్రికెట్‌లాంటి ఆటలో కూడా అందరు ఆటగాళ్ళ మధ్య సమన్వయం ఉంటేనే ఆ బృందం విజయపథం వైపు నడుస్తుంది. ఏ ఒక్కరు సరిగ్గా ఆడక పోయినా ఆ ఒత్తిడి మిగతా వాళ్ళ మీద పడుతుంది. ఓటమి పాలైన జట్టు తమ ఓటమికి జట్టులోని ఎవరో ఒకరిని ఎత్తి చూపించినా అవన్నీ సమర్థింపులుగానే ఉంటాయి తప్ప ఓటమి ఓటమే! అందరి మధ్యనా ఉండే సమన్వయం గెలుపుకి ఓటమికి గల వ్యత్యాసాన్ని తెలియచేస్తుంది. అందరూ పరిపూర్ణమైన సామర్థ్యంతో ఆడలేకపోవచ్చు కానీ ఒకరి బలహీనతలని మరొకరు కప్పిపుచ్చుతూ, ఒకరినొకరు సమర్థించుకుంటూ అంతిమ లక్ష్యం వైపు సాగినప్పుడే విజేతలుగా నిలుస్తారు. సర్కస్‌లో నలుగురైదురు కలిసి చేసే ట్రెపీజ్ ఫీట్‌ని గమనించారా? ఒకరు విసిరేసిన ట్రెపీజ్‌ని ఇంకొకరు సరిగ్గా అందుకుని ఇంకో వైపుకి చేరి, మళ్ళీ దాన్ని విసిరేస్తే గాలిలో ఎగిరొచ్చిన ఆ ట్రెపీజ్ ఇంకో కళాకారుడు సరైన సమయంలో అందుకుని ఎగరడం.. ఒక్కొక్కరి మధ్యనా ఎంత సమన్వయం ఉండాలి!! ట్రెపీజ్‌ని అందుకోవడంలో కానీ, విసిరెయ్యడంలో కానీ ఒక్క క్షణం తేడా వచ్చినా ఫీట్ రసాభాస ఔతుంది. మనిషి జీవితం కూడా బృందగానం లాంటిది, పదిమంది కలిసి ఆడే ఆట లాంటిది, సమన్వయంతో సాగే సర్కస్ లాంటిది. ఇంట్లో, బయటా, పనిచేసే చోటా ..ఎక్కడైనా పదిమందితో సమన్వయం అవసరం. ఒక్కడే కలిసి సాధించే పనులు కొన్ని ఉండొచ్చు కానీ, చాలా లక్ష్యాల సిద్ధికి ఎంతో మందితో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు ఒకరినొకరు అర్థం చేసుకోవడం (మనం ఎదుటి వారికి అర్థమయేలా ప్రవర్తించడం కూడా!) విజయ సాధనకి ఎంతో అవసరం. అలా సమన్వయం సాధించినప్పుడే మనం పట్టుకోవాల్సిన ట్రెపీజ్ సరైన సమయానికి అందుతుంది. మనం కూడా సరైన క్షణంలో సరైన వేగంతో ట్రెపీజ్ విసిరితేనే ఎదుటివారు దాన్ని అందుకోగలరు. మనం ఒకరి వద్ద సహాయం పొందడం ఎంత అవసరమో, మనం మరొకరికి సహాయం చేయడం కూడ అంతే అవసరం..!

ప్రతి మనిషీ ఓ సంఘజీవి, ప్రతి విజయం ఓ బృందగానం!

***మే, 2013***

***

ఏనుగు, ఆరుగురు అంధుల కథ చాలా మందికి తెలిసే ఉంటుంది. ఈ ఒక్క కథనే వివిధ దేశాల్లో వివిధ సందర్భాల్లో,వివిధ కోణాల్లో అన్వయించుకున్న(కుంటున్న) సంగతి కూడా తెలిసే ఉంటుంది. అనగనగా ఒక ఏనుగు. ఆరుగురు అంధులు ఆ ఏనుగుని తడిమి చూస్తూ ఏనుగు ఎలా ఉంటుంది అనే నిర్ణయానికివచ్చారు. ఏనుగు తొండాన్ని తడిమి చూసినతను 'ఏనుగు అంటే పెద్ద పాములా ఉంటుంది' అన్నాడు. ఏనుగు దంతాలని తడిమి చూసినతను 'ఏనుగు అంటే మొనదేలిన కత్తిలా ఉంటుంది' అన్నాడు. ఏనుగు తోక మాత్రమే తాకి చూసినతను ' లేదు.. లేదు.. ఏనుగు అంటే మెత్తటి తాడులా ఉంటుంది' అన్నాడు. ఏనుగు కాళ్ళని పట్టుకుని చూసినతను 'మీరు చెప్పేదంతా అబద్ధం. ఏనుగు అంటే వెడల్పాటి చెట్టు కాండంలా ఉంటుంది' అన్నాడు. ఏనుగు వీపుని తడిమిచూసినతను ' మీకర్థం కావడం లేదు. ఏనుగు అంటే నిలువెత్తు గోడలా ఉంటుంది' అన్నాడు. 'మీ తెలివి తెల్లారినట్లే ఉందిలే. ఏనుగు అంటే చేటలా ఉంటుంది తెలుసా?' అన్నాడు ఏనుగు చెవుల్ని తడిమి చూసినతను. ఇలాగే మామూలు మనుషులకి కూడ కొన్నిసార్లు మానసిక అంధత్వం ప్రాప్తిస్తుంది. తోటి మనుషులతో స్నేహం నిలబెట్టుకునే విషయంలో, కొన్ని సమస్యలకై పరిష్కారం వెదికే సందర్భంలో, కొన్ని సంఘటనలని అన్వయించుకునే తీరులో ఈ మానసిక అంధత్వం వల్ల మాయపొరలు కమ్ముతాయి, ప్రతికూల ఫలితాలు ఎదురౌతాయి. చాలాకాలం నుంచి వున్న స్నేహితుల్ని కూడా ఒక్క సంఘటనతో అపార్థం చేసుకుని బంధాలు తెంచుకునే వ్యక్తులనిచూస్తుంటాం. 'అతను మా యింటికి వచ్చి వెళ్ళేప్పుడు నేను బయటి వరకూ వచ్చి పంపించానా, అతనేమో నేను వాళ్ళింటినుంచి వచ్చేప్పుడు కనీసం గుమ్మం వరకూ కూడా రాలేదు. నేను వాళ్ళింటికి వెళ్ళినపుడల్లా పండ్లో, స్వీట్సో ఏదో ఒకటి తీసుకెళ్తానా, అతనేమో మా ఇంటికి వచ్చేప్పుడు ఒట్టి చేతులతో వస్తాడు..' లాంటి చిన్నచిన్న విషయాలకే స్నేహాలని తెంచుకునే వ్యక్తులని కూడా చూస్తుంటాం. కొన్నికొన్ని సంఘటనలు ఎదురైనప్పుడు ఆ క్షణంలో చూసిన దాన్ని బట్టి వెంటనే ఒక నిర్ణయానికి వచ్చేసే వ్యక్తులు కూడా మనకి అక్కడక్కడా తారసపడుతుంటారు. ఏదైనా సమస్యలో చిక్కుకున్నప్పుడు ఆలోచనలని పరిమితం చేసుకుని 'ఇదింతే..దీన్నుంచీ తప్పించుకోలేం. నా ఖర్మ ఇలారాసి ఉందంతే' అనుకుని, ఉన్నదాన్ని మరింత జటిలం చేసుకునే మనుషులూ ఎదురౌతుంటారు. వీటన్నింటికీ కారణం- ఏనుగుని అంచనా వేసిన అంధులకి వచ్చిన సమస్యే. ఏ వ్యక్తినీ, సందర్భాన్ని, సమస్యనీ సమగ్రంగా చూడకుండా ఒక చిన్న రంధ్రంలోంచి హ్రస్వదృష్టితో చూడడం. యాజమాన్య పాఠాల్లో 'బిగ్ పిక్చర్'అనే పదప్రయోగాన్నివాడుతుంటారు. ఏ పనిచేసేప్పుడైనా, వివాదంలోకి వెళ్ళినపుడైనా, చిక్కుముడి పడినప్పుడైనా ' సమగ్రమైన విశ్లేషణ' చెయ్యడాన్నే 'బిగ్ పిక్చర్' అనుకోవచ్చు. మన నిత్యజీవితంలో కూడా ఇది యథాతథంగా వర్తిస్తుంది. ఏదో ఒక సందర్భంలో ఎప్పటినుంచో ఉన్న ఓ స్నేహం గురించి కాస్త బాధగా అనిపించిందా? ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుని ఒకరికొకరు తోడుగా స్నేహాన్ని పంచుకున్న క్షణాలన్నింటినీ గుర్తుచేసుకుని, 'ఈ ఒక్క సంఘటన ఏదో చిన్న పొరబాటేమో..కొంచెం అర్థం చేసుకుని సహనం వహిస్తే మంచిదేమో' అన్న ఆలోచనతో మనసుని సంభాళించుకుంటే ఆ బంధాలు పటిష్టమౌతాయి. తీవ్రమైన సమస్య ఉక్కిరిబిక్కిరి చేసినప్పుడు కూడా కాస్త సంయమనం వహించి, అవసరమైతే ఇంకొకరి సహాయం తీసుకుని పరిష్కారం కోసం సమగ్ర విశ్లేషణ చేసినప్పుడు 'ఏనుగు' పూర్తి స్వరూపం అవగతమౌతుంది. ఏ సమస్యకైనా, సందర్భానికైనా 'బిగ్ పిక్చర్' గుర్తుంచుకుంటే జీవితం సరళతరమౌతుందని అనుభవజ్ఞుల సలహా!

*జూన్, 2013*

***

"సుందరం.. పొద్దున్నుంచీ చూస్తున్నా. ఎందుకో అన్యమనస్కంగా కనిపిస్తున్నావ్. చాలా హైరానా పడుతున్నట్లున్నావ్?" "అఁ..అలాంటిదేం లేదే" "నువ్వేదో దాచాలని చూస్తున్నావు కానీ నీ మొహంలో ఆ కంగారు తెలిసిపోతోంది." "ఏం లేదు..పొద్దున్నే షేవ్ చేసుకుంటుంటే మొహం మీద చిన్న గాటు పడింది. అందుకని.." "అందుకని?" "అదే నా ముఖం మరీ అసహ్యంగా ఉందేమోనని..!?" "ఓ అదా! నువ్వు చెప్పేవరకూ మాకెవరికీ ఆ సంగతి తెలీనే లేదు. " ముఖం మీద చిన్న గాటుకే ఎంతో ఫీలైపోయి రోజంతా మూడ్ చెడగొట్టుకునే సుందరం లాంటి వాళ్ళుమనకి తరచూ తారసపడుతూనే ఉంటారు. నిత్యజీవితంలో ఎంతోమందితో వ్యవహరించేప్పుడు చిన్నచిన్న సంఘర్షణలూ, మనస్పర్థలూ, సమస్యలూ సహజమే. కొన్నిసార్లు మనవల్ల జరిగిన చిన్న పొరబాటునో, మనసుకైన చిన్న గాయాన్నో భూతద్దంలో చూసుకుంటాం. అందరూ ఏమనుకుంటున్నారోనని మనలో మనమే ఫీలైపోతుంటాము. చాలాసార్లు మనంతట మనం చెబితే తప్ప మిగతావారికవి తెలిసే అవకాశమే ఉండదు. మనచుట్టూ ఉన్నవారిక్కూడా ఎవరి సమస్యలు వారికుంటాయి. మనలో ఉన్న చిన్నచిన్న లోపాలని పసిగట్టి మనల్ని అంచనా వేసే సమయం, తీరిక వారికి ఉండకపోవచ్చు. స్వల్ప సమస్యలకి చిగురుటాకులా వణికిపోయి, ప్రశాంతతని చెడగొట్టుకుని, మన చుట్టుపక్కల వాతావరణాన్ని కూడా అస్తవ్యస్తం చేసుకుంటాం. చిన్నచిన్న విషయాలకి కాలాన్ని వృథా చేసుకోవడం, మనశ్శాంతిని పోగొట్టుకోవడం మంచిది కాదని అనుభవజ్ఞుల సలహా! ఏ విషయానికి ఎంత ప్రాధాన్యతనివ్వాలో తెలుసుకుని, ఏ ఆలోచనకి ఎంత తావివ్వాలో విచక్షణ ఉపయోగించిఅవసరమైన చోట సంయమనం పాటిస్తే బతుకుబాటలో గతుకులుండవనేది సారాంశం.!

***జూలై, 2003***

***

చాలా సంవత్సరాలుగా సుశీలని, పిల్లలని తీసుకుని ఢిల్లీ టూర్ వెళ్ళాలని శ్రీకాంత్ ప్రయత్నం. ఇప్పటికి వీలైంది. ఢిల్లీలో అడుగుపెట్టగానే చింటూ, బన్నూల ఉత్సాహానికి అంతులేదు. ఐదారు తరగతులు చదువుతున్న పిల్లలకి విహారయాత్రలంటే ఏమిటో ప్రత్యక్షంగా తెలుసుకోవడం చెప్పలేనంత ఉత్సాహాన్నిస్తోంది. సుశీల సంగతి  చెప్పనవసరం లేదు. పెద్దమ్మగారమ్మాయి అమెరికా నుంచి వచ్చినప్పుడు గిఫ్ట్ ఇచ్చిన కెమేరాని బయటికి తీసింది. ఇంకా శీతాకాలపు చలిప్రభావం తగ్గలేదు. ముందుగా రాష్ట్రపతి భవన్‌కి వెళ్ళారు. ఆ ఉద్యానవనాలూ, రకరకాల పూలు చూసి సుశీలకైతే ఇంకో ప్రపంచంలో ఉన్నట్లుంది. ప్రతి చిన్న దృశ్యాన్నీ కెమేరాలో బంధిస్తోంది. పిల్లలు, అమ్మానాన్నలు చెబుతున్న విశేషాలు వింటున్నారు. తెలీనివి అడిగి తెలుసుకుంటున్నారు.సాయంకాలం హోటల్‌కి తీసుకొచ్చిన టాక్సీ డ్రైవర్‌తో శ్రీకాంత్‌కి తగాదా తప్పలేదు. "పోన్లెండి..ఎంతోకొంత ఇచ్చేయండి.. మనం ఉండేది నాలుగు రోజులే. ఇంతదానికి వాడితో తగాదాఎందుకు. ఉన్నన్నాళ్ళు సరదాగా గడిపేద్దాం" అన్న సుశీల మాటలకి "నిజమే కానీ అక్కడో మాట.. ఇక్కడో మాట ఐతే ఎలా..?" శ్రీకాంత్ ఆవేశాన్ని అణచుకుంటూ బదులిచ్చాడు. హోటల్‌లో రూముకి భోజనం తెచ్చిన బోయ్‌తో మళ్ళా తగాదా , చల్లారిపోయిన పదార్థాలు తెచ్చాడని శ్రీకాంత్ ఓ క్లాసు తీసుకున్నాడు. ఉన్న కొద్ది సమయమూ వాళ్ళతో పోట్లాటలెందుకని సుశీల అభిప్రాయం. పిల్లలు తమ గొడవలో తామున్నారు.  ఢిల్లీలో అన్నీ చూసేశాక టూరిస్ట్ బస్‌లో డెహ్రాడూన్ బయలుదేరారు. "అబ్బా..ఆ సీన్ చూడండి ఎంతబావుందో..ఆ లాండ్ స్కేప్ చూడండి.." పిల్లలకంటే ఎక్కువగా ఆనందిస్తోంది సుశీల. "మరీ చిన్నపిల్లలా ఏమిటోయ్ ఆ కేరింతలు!?" అన్నాడు శ్రీకాంత్ . "అవునండి.. మళ్ళీ వస్తామో రామో. ఇన్నాళ్ళకి కుదిరింది ఇవన్నీ చూడ్డం. ఇక్కడ ఉన్న ప్రతిక్షణాన్నీ కెమేరాతో బాటు మనసులో కూడ దాచుకుంటున్నాను." కెమేరా క్లిక్‌లు ఆపకుండానే సమాధానమిచ్చింది సుశీల. మధ్యలో ఓ చోట ఆగినప్పుడు శ్రీకాంత్‌కి బస్సు డ్రైవర్‌తో తగాదా..ముందుగా చెప్పిన ప్రదేశాలన్నీ చూపించడం లేదని. సుశీల మాత్రం ఇవేమీ పట్టకుండా మనసుతో అన్నీ ఆస్వాదిస్తోంది. మధ్యమధ్యలో పిల్లలకి ఆయా ప్రదేశాల గురించి వివరిస్తోంది. బస్సు బయలుదేరగానే శ్రీకాంత్‌తో  మళ్ళీ అంది సుశీల " అనవసరంగా చిన్న చిన్న విషయాలకి మనసు పాడుచేసుకోకండి. ఇక్కడ ఉండేది ఈ వారమే. ఉన్నన్ని రోజులూ ప్రశాంతంగా  గడుపుదాం." "ఉన్నన్ని రోజులూ ప్రశాంతంగా గడపడం.." అనే విషయాన్ని అర్థం చేసుకుని, ఆచరించడమనేది అభ్యసిస్తే మనిషిలో ప్రతికూలాత్మక భావాలు తగ్గుముఖం పడతాయి. ఈ ప్రపంచంలో ఎవరూ శాశ్వతం కాదు, ఏదీ శాశ్వతం కాదు, ఉన్న కొద్ది రోజులూ కోపాలు, తాపాలూ, వాదాలూ, వివాదాలూ నియంత్రించుకోగలిగితే మనిషి జీవితానికి కావలసిన ప్రశాంతత దొరుకుతుందని అనుభవజ్ఞుల సందేశం.  ఎవరికి వారు తెలీకుండానే "నేను శాశ్వతం, సిరిసంపదలు శాశ్వతం, నా కుటుంబం శాశ్వతం, నా పేరు ప్రఖ్యాతులు శాశ్వతం" అనే భావాల్లో బందీలవడమే చాలా సమస్యలకి, బాధలకి  మూలకారణం. మనిషి ఎదగాలి, ఎదుగుదలలో తన ఉనికికి  సార్థకతని ఋజువు చేసుకోవాలి - ఇది నిజమే, కానీ జీవితంతో సహా అన్నీ శాశ్వతమనుకుంటూ ప్రతికూలాత్మక భావాల సాలెగూటిలో చిక్కుకుని, జీవించి ఉండటంలో ఉన్న అసలైన మాధుర్యాన్ని కోల్పోవడం సమర్థనీయం కాదు.  ఎన్నెన్నో సంఘటనలూ, సందర్భాలూ, జీవితాలూ నేర్పే పాఠాలివే.

"అంతము లేని భువనమంతయు పురాతన పాంథశాల;
వి శ్రాంతి గృహంబు; నందు ఇరు సంజెలు రంగుల వాకిళుల్;
ధరా క్రాంతులు పాదుషాలు,
బహరామ్  జమిషీడులు  వేనవేలుగాఁ
గొంత సుఖించి పోయిరెటకో పెజువారికిఁ జోటొసంగుచున్! .."

(ఉమర్ ఖయ్యాం - దువ్వూరు రామిరెడ్డి) ఈ పాంథశాలలో అందరం అతిథులమే అని గుర్తుంచుకుంటే, అసూయలూ, ద్వేషాలూ, తగాదాలు,వైరుధ్యాలూ..ఎదురైనప్పుడు 'ఇది కూడా గడచిపోతుంది.' (This too shall pass) అనే భావాన్ని మర్చిపోకుండా ఉంటే - జీవితమాధుర్యాన్ని మరింతగా ఆస్వాదించగలం..!

*ఆగస్ట్, 2003*

***

కౌముది

"నువ్వు చెప్పేదే శుద్ధ తప్పు.. అసలు విషయమేమిటంటే.." "చాల్లేవోయ్ పెద్ద చెప్పొచ్చావ్..పేద్ద నీకే అంత తెలిసినట్లు.." "మరి నీకు తెలుసనుకుంటున్నావేంటీ..?" "ఏంటీ గొంతులేస్తోందీ..!?"అసలు విషయం మరుగున పడింది, పోట్లాట తారాస్థాయినందుకుంది. ఇద్దరికీ పరిచయమున్న మూడో వ్యక్తి కలిపించుకుని.. "ఒరేయ్.. నిజానికి మీరిద్దరూ చెప్పేదాన్లోనూ కొంత యదార్థముంది. ఎలాగో చెప్పనా..?!" అని వివరించసాగాడు. వాళ్ళిద్దరు వాదులాడుకుంటున్న అంశాన్నే మూడోవ్యక్తి నెమ్మదిగా విశదంగా చెప్పాడు. ఏమి చెప్పాడు అనేదాని కంటే ఎలా చెప్పాడు అనేది వాళ్ళిద్దరి మీదా ప్రభావాన్ని కలిగించింది. "మీరిద్దరూ కరెక్టే" అని మొదలుపెట్టడంతో ఒక విధమైన సామరస్య వాతావరణాన్ని, మిమ్మల్ని నేను అర్థం చేసుకున్నాను అన్న విశ్వాసాన్నీ కలిగించాడు. ఆ తర్వాత సంభాషణ సుగమమైంది. యుగయుగాలుగా ప్రచారంలో ఉన్న పౌరాణిక గాథల్లోనూ, జానపద కథల్లో కూడా ఈ విషయం చాలాచోట్ల ప్రస్తావించబడింది. "నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది" అన్న సామెత కూడా ఉంది. విముఖతని, వ్యతిరేకతిని కూడా ఎదుటివారిని నొప్పించకుండా వ్యక్తపరచవచ్చు. కావల్సిందల్లా కాస్త ఓర్పు, మరికొంత నేర్పు, సరైన మాటల వాడకం. చిన్న వివాదం రాగానే గొంతు పెద్దదిచేసి, నోరు చించుకుంటే ఎదుటివాడిలో కూడా ఇట్టే ఆవేశం పెరిగిపోతుంది. అలా కాక "నువ్వు చెప్పిందంతా విన్నాను.. ఐతే.. " అని మొదలుపెడితే పరిష్కారానికి వేదిక సిద్ధమౌతోంది అన్న విషయం చెప్పకనే చెప్పినట్లవుతుంది. చాలా సందర్భాల్లో వివాదాలు ముదిరిపోడానికి ఇంకోకారణం - వ్యాధి ఒకచోట ఐతే మందు ఇంకోచోట వేసినట్లు, ఎవరి గురించి బాధపడుతున్నామో అతనితో చర్చించడం బదులు అతన్ని వదిలేసి మిగతా అందరివద్దా ఆ విషయాన్ని చెప్పుకోవడం. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకి అచ్చమైన చిరునామాగా విస్తరిస్తున్న అంతర్జాలంలోనూ ఇలాంటివి తరచు గమనించవచ్చు. ఎక్కడో, ఏదో పత్రికలోనో, బ్లాగులోనో, ఎవరో వ్రాసింది ఒకరికి నచ్చదు, లేదా అభ్యంతరకరం అనిపిస్తుంది. సూటిగా వాళ్ళని అడిగి సందేహనివృత్తి చేసుకోడానికి బదులు (దీనికి అన్ని సౌకర్యాలూ ఉన్న కాలం కదా ఇది!) ఇంకోచోట దీన్ని గురించి ఘాటుగా వ్రాస్తుంటారు. అది చూసి ఇంకొకరు తనకి వీలైన మరోచోట ఇంకేదో వ్రాస్తారు. మధ్యలో ఇంకొకరు వచ్చి వివాదంలో ఇంకో కోణాన్ని లేవదీస్తారు. చెరువులో గుర్రపుడెక్కాకు పెరిగినట్లు ఈ చర్చలు పెరిగిపోతాయే తప్ప, చాలా సందర్భాల్లో అసలు విషయం మరుగున పడిపోతుంది. వివాదానికి మూలమైన రచయితకి కొన్నిసార్లు ఈ విషయం తెలియకపోయినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. వీటిల్లో ఇంకోకోణం - 'ఫలానా రచన నాకు నచ్చలేదు' అనడంలో ఎవరికీ ఇబ్బందిలేదు. ఎందుకంటే అందరికీ అన్నీ నచ్చాల్సిన అవసరం లేదు. ఎక్కువ మందికి నచ్చిన రచన ఎక్కువకాలం నిలుస్తుంది లేదంటే కాలం రేపే ధూళిలో కలిసిపోతుంది. 'ఫలానా రచన పరమ చెత్తగా ఉంది. ఆ రచయితకి బుద్ధి ఉండే వ్రాశాడా ?' లాంటి వ్యాఖ్యల వల్ల వ్యక్తిగత అహంభావం తృప్తి పడడం తప్ప వేరే ఉపయోగం ఉంటుందా అనేది ఆలోచించాల్సిన విషయం. వ్యక్తిగత బంధాల్లో, అంతర్జాల పరిచయాల్లో కూడా - పరస్పర గౌరవం, ఇచ్చి పుచ్చుకునే ధోరణి, సంయమనం, ఎదుటివారి భావాలని అర్థం చేసుకునే ఓపిక - లాంటి నిర్మాణాత్మకమైన భావనలు సత్సంబంధాలని నిలుపుతాయి, పెంచుతాయి.

***సెప్టెంబర్, 2003***

***

ఆశించినవన్నీ లభించినా, అనుకున్నవన్నీ అనుకున్నట్లు జరిగినా, అంచనాలన్నీ నూటికి నూరుశాతం నిజమైనా..అది జీవితం అనిపించుకోదు. అనుకోని సంఘటనల సమాహారమే జీవితమని మనందరికీ తెలుసు. అన్నీ తెలిసినా మనకు రుచించని సంఘటనలు ఎదురైనప్పుడు బాధపడడ మనేది అత్యంత సహజం. ఏదో ఫలితం ఆశించి చాలా కష్టపడి పనిచేస్తాం. చివరికి ఫలితం దక్కదు. నిరాశ చుట్టుముడుతుంది. ఏదో గమ్యం కోసం విపరీతంగా పోటీ పడిపరుగులు తీస్తాం. లక్ష్యం సిద్ధించదు. ఎంత ప్రయత్నించినా ఇంతే అన్న నిస్పృహ ఆవరిస్తుంది. మనసారా నమ్మి ఎవరితోనో ఆత్మీయత పెంచుకుంటాం. ఊహించని సంఘటనల ఫలితంగా మన నమ్మకాలు సరైనవి కావని తెలుస్తుంది. లోకమంతా ఇంతే, ఎవర్ని నమ్మాలో ఎవర్ని నమ్మకూడదో తెలీడం లేదనిపిస్తుంది. నిరాశ, నిస్పృహ, దుఃఖం, బాధ..లాంటి భావాలు మనమీద, మన భవిష్యత్తు మీద ఎలాంటి ప్రభావం చూపిస్తాయనేది మన అధీనంలోనే ఉంటుందని పెద్దలు చెబుతుంటారు. వీటికి మూలకారణమైన సంఘటనలని మనం ఎలా స్వీకరిస్తామనే విషయాన్ని బట్టి వాటి ఫలితమైన ప్రతికూలాత్మక భావాలు మనల్ని ఎంతగా బాధిస్తాయనేది ఆధారపడి ఉంటుంది. బాధించిన ప్రతి సంఘటననీ, అపజయానికి దారితీసిన ప్రతి ప్రయత్నాన్నీ, ఓటమి అంచులకి చేర్చిన ప్రతి ప్రయాణాన్నీ..ఓ గుణపాఠంగా చూడగలిగితే ఆయా ప్రతికూలాత్మక భావాలు ఎక్కువగా బాధించవు. జరిగిన సంఘటననీ, ఎదురైన అపజయాన్ని వెంటనే మార్చుకోలేక పోవచ్చు. కానీ అవి నేర్పిన పాఠాలని విశ్లేషించుకుని గుర్తుపెట్టుకుంటే మరోసారి అలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు మరింత సమర్ధవంతంగా వాటిని పరిష్కరించే అవకాశం ఉంటుంది. ఎక్కడ పొరబాటు జరిగింది, ఏ దశలో మనం తప్పుచేశాం, ఎక్కడ అంచనాలు తప్పాయి - ఆయా సందర్భాల్లో వేరే విధంగా వ్యవహరించి ఉంటే ఎలా ఉండేది-అనే విశ్లేషణ అత్యంత విలువైనది. ఓటమికి కారణాలు తెలుసుకుని వాటిని అధిగమించడమే జీవన పురోగమనం.ఈ కోణంలో చూడగలిగితే ఎదురైన ప్రతి చేదు అనుభవమూ మంచి సలహా ఇచ్చిన స్నేహితుడులానే అనిపిస్తుంది.కొన్ని కొన్ని సార్లు ఇలాంటి పరిష్కారాలు, సలహాలు చెప్పినంత సులువు కాకపోవచ్చు కానీ ఆలోచనాధోరణిలో మార్పు అనేది మనిషిని ఆశావాదంతో ముందుకి వెళ్ళేలా చేస్తుంది. మారే ఋతువులు, ఒకదాన్నొకటి అనుసరించే దివారాత్రాలు, చీకటి వెలుగులు ..ప్రకృతిలోని చాలా సంఘటనలు ఇలాంటి పాఠాలని చెప్పకనే చెబుతుంటాయి. పాఠం ఎంత విలువైందో గుణపాఠం అంతకంటే విలువైంది - అంటారు అనుభవజ్ఞులు..!

***అక్టోబర్, 2013***

***

అప్పుడెప్పుడో చదివిన ఓ గల్పిక. మనకి అన్వయించే విధానంలో చెప్పుకుందాం. అదొక గురుకులం. గురువుగారు శిష్యులకి రకరకాల శాస్త్రాలు నేర్పిస్తున్నారు. ఒకరితో ఒకరు సఖ్యంగా ఎలా ఉండాలో కూడా పాఠాల్లో అనువుగా చొప్పించి బోధ చేస్తున్నారు. కానీ శిష్యులలో దాదాపు అందరికీ ఒకరంటే ఒకరికి పడడం లేదు. చిన్న చిన్న విషయాలకే వాళ్ళు కీచులాడుకోవడం గమనించారు గురువుగారు. వాళ్ళని ఏవిధంగా సవ్యమైన మార్గంలో పెట్టాలి అనే విషయం గురించి తీవ్రంగా ఆలోచించారు. ఏదో ఒక బలమైన కారణం ఉంటే మనుషులు తమ స్వభావాలని మార్చుకోగలరన్న విషయం గురువుగారికి తెలుసు. ఓ రోజు ఉదయన్నే శిష్యులందరినీ ప్రత్యేకంగా సమావేశపరిచారు గురువుగారు. "రాత్రి కలలో నాకు భగవంతుడు కనిపించాడు. ఒక ఆశ్చర్యకరమైన విషయాన్ని ఆయన నాతో చెప్పారు. ఆ సంగతి మీతో పంచుకోలేకుండా ఉండలేకపోతున్నాను. భగవంతుడు మీలో ఒకరిని ప్రియ శిష్యుడిగా స్వీకరించి, ఆ ఒక్కరికి అద్భుతమైన శక్తుల్ని ప్రసాదించారట" అని. ఆ ఒక్కరు ఎవ్వరు అన్న విషయం మాత్రం గురువుగారు వెల్లడించలేదు. ఆరోజు నుంచి శిష్యులలో ప్రతి వారూ తమ పక్కనున్న సహ విద్యార్థే ఆ భగవంతుడు అనుగ్రహించిన వ్యక్తేమోనని ప్రతి ఒక్కరితోనూ మర్యాద పూర్వకంగా, గౌరవంగా ప్రవర్తించడం మొదలుపెట్టారు. ఇంతకు ముందు లాగా చీటికి మాటికి వాదులాడుకోవడం క్రమేపీ తగ్గిపోయింది. ఏమైనా సమస్యలు వచ్చినా తగదాకి పోకుండా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే సహనం అలవాటైంది. రోజులు గడిచిన కొద్దీ ఈ భగవదనుగ్రహం ఉన్న ప్రత్యేకమైన వ్యక్తి ఎవరు అన్న ఆసక్తి తగ్గిపోయినా, శిష్యుల ప్రవర్తనలో వచ్చిన మంచి మార్పు మాత్రం అలానే కొనసాగింది. నిత్యజీవితంలో కూడా మనుషులు పక్క నున్న ప్రతి వ్యక్తినీ ఓ ప్రత్యేకమైన వ్యక్తిగా గుర్తించగలిగితే ఎంత బావుంటుంది! మనకి రోజువారీ పనుల్లో తారసపడే ప్రతి ఒక్కరికి తమ సహజసిద్ధమైన స్వభావం వల్ల కొన్ని అలవాట్లు, కొన్ని బలమైన అంశాలూ, కొన్ని బలహీనతలూ ఉంటాయి. అవి మనకి నచ్చనంత మాత్రాన వారితో తగదాపడడం కానీ, వారిని ఎందుకూ పనికిరానివాళ్ళుగా జమకట్టడం కానీ తగ్గిస్తే సామరస్యపూర్వకమైన వాతావరణం పెంపొందే అవకాశం ఉంటుంది. అభిప్రాయబేధాలు వచ్చినప్పుడు చర్చలూ, రాజీ మార్గాలూ అన్వేషించడం వల్ల మనుషుల మధ్యబంధాలు వీగిపోకుండా ఉంటాయి. ఒక్కోసారి ఎదుటి వ్యక్తి కోణంలో చూడగలిగితే కొన్ని సమస్యలు అస్సలు సమస్యలే కాదన్న విషయం అవగతమౌతుంది. అహం, గర్వం, అతిశయం ఎదుటివారి విలువని గుర్తించకుండా చేసే దుర్గుణాలు. వీటి బారిన పడకుండా ప్రతిమనిషినీ మనిషిగా చూడ గలిగిన రోజు ప్రతి మనిషిలోనూ ఏదో ప్రత్యేకత కనిపిస్తూనే ఉంటుంది. ఆ దృక్పథమే పరస్పర గౌరవాభిమానాలని పెంపొందేలా చేస్తుంది.

***నవంబర్, 2013***

***

నేచర్ ఈజ్ మై టీచర్ - అన్నాడెప్పుడో ఓ ఆంగ్లకవి. పంచభూతాల సమ్మేళనమైన ప్రకృతి, మనిషికి జీవనాధారమవడమే కాక ఎన్నెన్నో స్ఫూర్తిదాయకమైన కథలు కూడా చెబుతుంది. వినగలిగే మనసుకి ప్రకృతిని మించిన స్ఫూర్తి ప్రదాత మరొకరు ఉండరు. సానుకూల దృక్పథం గురించి, ఆశావహ భవితవ్యం గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు వ్యక్తుల విజయగాథలని, ఉత్తేజపూరితమైన సంఘటనలని ఉదహరించడం సహజం. ఐతే అన్నిరకాల నీతి కథలూ, స్ఫూర్తి గాథలూ ప్రకృతిలోనే అణువణువులో ఇమిడి ఉన్నాయన్న సత్యాన్ని మన కవులు ఎప్పుడో గ్రహించారు. రాళ్ళు వేసి కొట్టినా పళ్ళనిచ్చే చెట్లూ, రాలిన ఆకులకోసం బెంగపడకుండా కొత్త చివుళ్ళకు ఆహ్వానం పలికే మొక్కలూ, అద్దంలో ఒదిగి ఉండే కొండా, పడి లేచే కెరటాలు, రాత్రికి మెరుపులద్దే నక్షత్రాలు, సహనశీలి భూమాత, చైతన్య రథంపై ఉదయాన్ని వెలిగించే సూర్యోదయం, మరో ఉదయం ఉంటుందని వాగ్దానం చేసే సూర్యాస్తమయం , మారే ఋతువుల విన్యాసం.. ప్రతి ఒక్కటీ సానుకూల దృక్పథాన్ని నేర్పేవే. అందుకే ఏ అంశాన్నైనా బలీయంగా, మనసులో గాఢంగా నాటుకుపోయేలా, అందరికీ అర్థమయేలా, అందర్నీ ఒప్పించేలా చెప్పాలంటే ప్రకృతిని ఆధారం చేసుకోవడమనేది ప్రాచీన సాహిత్యం నుంచి ఉంది. ఏ పౌరాణిక గ్రంథాలని చదివినా ఈ విషయం తేటతెల్లమౌతుంది. ప్రకృతి వైశాల్యాన్ని పాటల్లో పొదిగిన లలితగేయ కవుల్లో నిరంతర ఆశావాది సిరివెన్నెలగారికి పెద్దపీట వెయ్యొచ్చు. " ప్రతి మదిని లేపే ప్రభాతరాగం, పదేపదే చూపే ప్రధాన మార్గం, ఏదీ సొంతంకోసం కాదను సందేశం", " తన వేళ్ళే సంకెళ్ళై, కదలలేని మొక్కలా, ఆమనికై ఎదురు చూస్తు ఆగిపోకు ఎక్కడ", " పడమర పడగలపై మెరిసే తారలకై, రాత్రిని వరించకే సంధ్యా సుందరీ", "నింగి ఎంత గొప్పదైన రివ్వుమన్న గువ్వపిల్ల రెక్కముందు తక్కువేనురా, సంద్రమెంత పెద్దదైన ఈదుతున్న చేపపిల్ల మొప్పముందు చిన్నదేనురా", "నిశా విలాస మెంత సేపురా, ఉషోదయాన్ని ఎవ్వడాపురా" , "ఉరుములేని ఏ మేఘమైన చినుకు లేనిదే, మరిగిపోని ఏ లోహమైన పనికి రానిదే.".. ఇలాంటివి వందలాదిగా ఆయన పాటల్లో అడుగడుగునా కనిపిస్తాయి. కౌముది ముఖచిత్ర కవితల్లో కూడా అధికశాతం ప్రకృతి సత్యాల అన్వయమే అన్నవిషయం పాఠకులు గమనించే ఉంటారు. పరుగుపందెమైన జీవితంలో ఒక్క క్షణం ఆగి ప్రకృతిని గమనించడం అలవాటు చేసుకుని అన్వయించుకోగలిగితే అనంతమైన స్ఫూర్తి లభిస్తుంది. జీవితంలో ఎదురయ్యే చాలా సమస్యలకి సానుకూల పరిష్కార మార్గాలు చూపించగల ప్రకృతి ఓ నమ్మకమైన నేస్తం. భౌతికంగానూ, మానసికంగానూ కూడా మనిషికి ఎంతో మేలుచేసే ప్రకృతి పరిరక్షణ అందరి కర్తవ్యం. నేలకూలుతున్న చెట్లూ, ఇంకిపోతున్న నదులూ, తూట్లు పడుతున్న రోదసి, మాయమౌతున్న అడవులూ, పొగచూరిన సూరీడు .. ఇలాంటివన్నీ కూడ ప్రతిక్షణం మన బాధ్యతని గుర్తుచేస్తుంటాయి.

***డిసెంబర్, 2013***

***

# *2012*

'బతుకు పుస్తకం' ఎవరిది వారికి సొంతం. ఎవరి పుస్తకానికి వారే రచయితలు. ఒక్కో అక్షరం, ఒక్కో వాక్యం, ఒక్కో పేజీ, ఒక్కో అధ్యాయం..కూర్చుకుంటూ వెళ్తుంటే..'బతుకు పుస్తకం' పరిమాణంలో పెద్దదవుతూ ఉంటుంది. ఏదైనా వ్రాయగలిగేది ఒక్కసారే! ఒకసారి వ్రాసేసిన అధ్యాయాలని చెరిపేసి కొత్తగావ్రాయడానికి వీలులేని చిత్రమైన పరిస్థితి. అయితే పాత అధ్యాయాలలో జరిగిన తప్పుల్ని సవరించుకునే అవకాశం రాబోయే అధ్యాయాలు ఎప్పుడూ ఇస్తూనే ఉంటాయి. అది తెలుసుకుని ముందుకు సాగితే 'బతుకు పుస్తకం' అందరికీ ఆదర్శమౌతుంది, వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు ఎంతోకొంత సాధించామన్న తృప్తి మిగులుతుంది. ఇష్టమైన అనుభవాలే ఎదురవ్వడం ఎల్లవేళలా సాధ్యం కాకపోయినా, ఎదురైన అనుభవాలని ఇష్టంగా మలచుకోవడంలోనే 'బతుకుపుస్తకం' రచయిత నేర్పరితనం బయటపడుతుంది. అందరి బతుకుపుస్తకాల్లోనూ బుక్ మార్క్‌లుగా కనిపించేవి కొత్తసంవత్సర ప్రారంభ క్షణాలు. ఈ రాబోయే సంవత్సరం అందరి బతుకు పుస్తకాలకీ ఆనందకరమైన ముడి సరుకుని అందిస్తుందని ఆశిద్దాం.

ఆ మధ్యన హైదరాబాదునుంచి ఒక రీసెర్చి స్కాలర్, ఫోన్ ఇంటర్వ్యూ తీసుకున్నారు. ఇంటర్నెట్ మేగజైన్ నిర్వహణలో ఉండే సాధకబాధకాల గురించి వివరాలు సేకరిస్తూ 'కౌముది' నేపథ్యం గురించి, కౌముదినిర్వహణలో పాలుపంచుకుంటున్న బృందం గురించి వివరాలు అడిగారు. అందులో కొన్ని ప్రశ్నలు సమాధానాలు ఇవీ.. కౌముదికి ప్రేరణ ఏమిటి? ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి మంచి తెలుగు సాహిత్యాన్ని అందించాలన్న సంకల్పమే కౌముది ఆవిర్భావానికి పునాది. ఇంటర్నెట్‌లో ఎన్నో తెలుగు పత్రికలు ఉండగా మీరు కౌముదిని ప్రారంభించడానికి కారణం? ఎన్ని పత్రికలు ఉన్నా, వైవిధ్యం ఉన్న పత్రికలకెప్పుడూ ఆదరణ ఉంటుందనే నమ్మకం, ఇంటర్నెట్‌లో ప్రింట్ పత్రికని చదువుతున్న అనుభూతి కలించాలన్న ఆలోచన 'కౌముది' మొదలుపెట్టడానికి మరికొన్ని కారణాలు. విభిన్నత అన్నదాన్ని ఎలా నిర్వచిస్తారు? కౌముదిలోని శీర్షికలు చూస్తే మీకు స్పష్టంగా తెలుస్తుంది, మేము చెబుతున్న విభిన్నత అంటే ఏమిటో. కౌముది - ఒకనాటి మంచి రచనల పునర్ముద్రణకి, సమకాలీన రచయితల రచనలకీ, ఔత్సాహిక రచయితల రచనలకీ - అందరికీ వేదికగా నిలవడమే కాక, సీరియల్స్, కథలూ, నెలవారీ శీర్షికలూ, హాస్యం, సినిమా, సాహిత్య వ్యాసాలూ, పాఠకులు పాల్గొనే శీర్షికలూ...ఇవన్నీ కౌముది విభిన్నతకి నిదర్శనాలు. కేవలం రచయితల వద్దనుంచీ వచ్చిన రచనలని కూర్చడమే కాక 'కౌముది' స్వయంగా ఇంటర్వ్యూలు చేసి వ్రాసిన శీర్షికలూ , వ్యాసాలూ గత ఐదు సంవత్సరాల్లో వందకు పైగా వచ్చాయి. కౌముది రూపొందడం వెనుక ఎంతమంది కృషి చేస్తున్నారు? కంపోజింగ్, డిజైనింగ్, వగైరా పనులన్నీ కేవలం ఇద్దరి చేతులమీదుగానే జరుగుతున్నా, కౌముది విజయంవెనుక ఎంతో మంది ప్రసిద్ధ, వర్థమాన, ఔత్సాహిక రచయితల / రచయిత్రులూ, పాఠకాభిమానులూ, శ్రేయోభిలాషులూ ఉన్నారు. గత ఐదేళ్ళలో ఒక్క సంచిక కూడా, ఒక్క రోజుకూడా ఆలశ్యం కాకుండా విడుదల చేయడం వెనుకనున్నరహస్యం? రహస్యం ఏమీ లేదండీ...మారుతి రావుగారన్నట్లు 'క్రమ శిక్షణ' కౌముదికో వ్యసనం! సమయాన్ని డాలర్లలో కొలిచే సమాజంలో ఉన్న మీరు ఇంత శ్రమకోర్చి చేస్తున్నందువల్ల మీకు వస్తున్న ప్రతిఫలమేమిటి? ప్రతిఫలం ఆపేక్షించి ఈ పత్రికని మొదలుపెట్టలేదు, ప్రతిఫలం కోసం దీన్ని కొనసాగించడం లేదు. మనసుకు నచ్చినపని, పదిమందికీ మంచిని పంచే పని..ఈ తృప్తే కౌముదికి పాఠకులు, అభిమానులు ఇస్తున్న ప్రతిఫలం. -

***జనవరి, 2012***

***

జీవితంలో రకరకాల మనుషులు తారసపడుతుంటారు. ఎవరి అలవాట్లు వారివి, ఎవరి పద్ధతులు వారివి, ఎవరి నమ్మకాలు వారివి. కొంతమందికి క్రమశిక్షణ అంటే అతిపవిత్రమైన కార్యం. తొమ్మిది గంటలకి బస్సు బయలుదేరుతుందంటే గంటముందే వెళ్ళి వేచిచూడ్డం, ఎవరికైనా ఫలానా టైముకి వస్తానని చెబితే ఖచ్చితంగా అదే సమయానికి వెళ్ళడం, ఎవరినైనా ఫలానా సమయానికి ఇంటికి రమ్మంటే వాళ్ళు రావడానికి ముందే సిద్ధమై ఉండటం, సమయపాలనని క్రమశిక్షణలో విడదీయరాని భాగంగా చూడ్డం, ఏదైనా పని చేస్తాననిమాట ఇస్తే ఎన్ని కష్టాలు ఎదురవనీ , ఎన్ని నష్టాలు రానీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం, ‘క్రమశిక్షణవల్ల ఏమి వస్తుందీ, ఏది రాదూ, ప్రతివిషయంలో ఇంత సిన్సియారిటీ అవసరమా?‘ అనే మీమాంసకి తావులేకుండా అత్యంత స్వల్ప సందర్భాల్లో కూడా తమ సిన్సియారిటీ చూపించడం.. వీరి జీవన విధానం. ఇవన్నీ మంచి లక్షణాలే..తప్పులేదు. ఎవరికీ ఇబ్బంది లేదు. ఐతే చిక్కు ఎక్కడ వస్తుందంటే - ఇంత క్రమపద్ధతిలో నడిచే వాళ్ళకి ఎప్పుడైనా తమ అదుపులో లేని పనులు తాము అనుకున్నట్లు జరగకపోయినా, తాము నియంత్రించలేని మనుషులు తాము అనుకున్నట్లు ప్రవర్తించకపోయినా వెంటనే అప్‌సెట్ అవడమే కాక విపరీతమైన మానసిక ఆందోళనకి గురౌతారు. ఎదుటివారికి వీళ్ళవల్ల ఇబ్బందిలేకపోవచ్చు కానీ, ఎదుటివారు తెలీకుండా కలిగించే ఇబ్బందులని తట్టుకోలేరు. క్రమశిక్షణ,సున్నితత్వం చాలాసార్లు జంటగా సాగుతుంటాయి. మరోరకం మనుషులు ఎదురౌతుంటారు. దేన్నీ సీరియస్‌గా తీసుకోరు.

‘ఫలానా టైముకి వస్తానన్నావు కదా..రాలేదేమిటి? కనీసం రావటం లేదని కబురైనా పంపించలేదు..‘ అంటే ‘

ఓ అదా.. బద్ధకించేశాన్లే..‘అని చాలా సాదాసీదాగా అనేస్తారు.బస్సు బయలుదేరే సమయానికి పరిగెత్తుకుంటూ వస్తారు. ‘ఎందుకంత టెన్షన్ ..కాస్త ముందు రావొచ్చు కదా !?‘అంటే,‘టెన్షనా..? అలాంటిదేం లేదే! రోజూ ఎక్కే బస్సే కదా.. అదే ఆగుతుందిలే‘ అంటారు. మనల్ని రమ్మన్న టైముకి వాళ్ళింటికి వెళితే వాళ్ళింకా నిద్రే లేవరు. ఇలాంటి వాళ్ళు సాధారణంగా దేనికీ అప్‌సెట్ అవ్వరు. ఎందుకంటే దేనిగురించీ ఎక్కువ అంచనాలు పెట్టుకోరు కాబట్టి. ఏతావాతా వీళ్ళని సీరియస్‌గా తీసుకున్న వాళ్ళు అప్‌సెట్ కావాల్సిందంతే! రెండు రకాల అలవాట్లలోనూ బలం ఉందీ, బలహీనతా ఉంది. జీవితం నేర్పే పాఠాలని, అనుభవాలు నేర్పే గుణపాఠాలనీ సరైన రీతిలో అర్థం చేసుకుని ‘ సర్వే జనాః సుఖినో భవంతు‘ అనేలా జీవనవిధానాన్ని మలచుకోవడం ఒక కళ. ఈ సందర్భానికి పూర్తిగా అన్వయించకపోయినా ఆత్రేయగారి ఈ మాటలని ఒకసారి గుర్తుచేసుకుందాం. తాము నవ్వుతూ నవ్విస్తారు కొందరు అందరినీ తామేడుస్తూ ఏడ్పించుతారెందరో కొందరినీ ఈ రెండు కాకుండా - తాము నవ్వుతూ అందరినీ నవ్వించే వారెందరో మనకి తరచు తారసపడాలని మనసారా ఆశిద్దాం!

*ఫిబ్రవరి, 2012*

***

'మళ్ళీ మధుమాసం' అనే నాటికలో రచయిత 'వృద్ధాప్యం అంటే తను చెయ్యవలసిందీ, చెయ్యగలిగిందీ ఏమీ లేదనుకుని తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఖాళీ చేసుకోవడం' అంటాడు. ఇంకా ఆ నాటికలోని పాత్రలతో 'మనస్సుకి వయసు రావడానికి శరీరం అలసిపోవాల్సిన అవసరం లేదు' అనీ, 'జీవితంలో అలిసిపోకూడదు. మనిషి బ్రతికి ఉన్నాడని గుర్తుచేయడానికి ఏదో ఒకటి చేస్తూ ఉండాలి. తీరిక మనిషిని త్వరగా ముసలివాడిని చేస్తుంది.' అనికూడా పలికించారు. నాటిక కథాంశం ఏమిటంటే - 55 సంవత్సరాల వెంకట సుబ్బయ్య ఇంట్లో సామాన్లన్నీ అమ్మేసి కాశీకి వెళ్ళిపోదామని, బేరం పెడతాడు. 70 ఏళ్ళ పుండరీకాక్షయ్య వాటిని కొనుక్కోడానికి వస్తాడు. జీవితం పట్ల అతనికున్న కసి, ఇంకా జీవించాలన్న పట్టుదల ఏదో ఒకటి చేస్తూ బిజీగా ఉండాలన్న తాపత్రయం గమనించిన వెంకట సుబ్బయ్యకి 'వయసుమీద పడడం' అనేది అనుకోవడంలో ఉందని తెలుస్తుంది. కాశీ టిక్కెట్లు రద్దు చేయించడానికి పరుగెడతాడు. ఈ నాటిక రాసినప్పుడు రచయిత వయస్సు 23 సంవత్సరాలు. ఈ నాటిక వ్రాసి 50 సంవత్సరాలు దాటింది. అంటే ఆయన వయసిప్పుడు 73 సంవత్సరాలు! ఆయనకింకా ముసలితనం రాలేదు!! కొంతమంది వయసు మీరకుండానే వృద్ధాప్యాన్ని కొనితెచ్చుకుంటారు. మరికొంతమంది ఎన్నేళ్ళు వచ్చినా వృద్ధాప్యాన్ని పొలిమేర్లకి కూడా రానివ్వరు. వయసు మీద పడుతున్నకొద్దీ మిగత అంశాలతో బాటుగా మనిషిని నీరసపరిచేది తన ఆలోచనా విధానం. తనమీద తనకి నమ్మకం లేకపోవడం, నిరాసక్తత, ఆలోచనల్లో తనకి తాను విధించుకునే పరిమితులు, మనిషిని వయసుని మించిన వృద్ధుడిగా చేస్తాయి. వయసొచ్చాక ఇంకేమీ చెయ్యలేననుకోవడంలో మనిషి మనసిక స్థితి కూడా ప్రముఖపాత్ర వహిస్తుందని శాస్త్రీయ పరిశోధనలు కూడా తేల్చి చెప్పాయి. 'కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులు' అని శ్రీశ్రీ చెప్పాడు. ఐతే 'కొంతమంది వృద్ధులు ఎప్పటికీ యువకులు' అనిపించుకోడానికి మానసిక సంసిద్ధత, స్థిత ప్రజ్ఞత, జీవితం పట్ల సానుకూల దృక్పథం, మొక్కవోని ఆశావాదం.. ఇవన్నీ ఉండాలి. చరిత్రపుటలు వెదికితే అరవయ్యేళ్ళ పైబడ్డాకే ఎన్నో సాధించిన వాళ్ళు కనిపిస్తారు. విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ తన 63వ ఏట చిత్రలేఖనం మొదలుపెట్టాడు.70 ఏళ్ళ వయసు వచ్చేసరికి అంతర్జాతీయంగా తన పెయింటింగ్స్ ప్రదర్శించే స్థాయిని చేరుకున్నాడు. అతిచిన్న వయసులోనే చూపు, వినికిడి శక్తి కోల్పోయిన హెలెన్ కెల్లర్ తన 73వ యేట 'టీచర్' అనే పుస్తకం మొదలుపెట్టి మరో రెండేళ్ళకి ప్రచురించింది. థామస్ ఆల్వా ఎడిసన్ తన 83 ఏళ్ళ వయసులో కూడా శాస్త్రీయ పరిశోధనల్లో మునిగి తేలుతుండేవాడు. వెబ్‌స్టర్ ఇరవైయేడేళ్ళ సుదీర్ఘమైన కృషి చేసి, తన 70వ యేట ఇంగ్లీషు నిఘంటువుని ప్రచురించాడు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలుగా కనిపిస్తాయి. మనకు పరిచయమున్న కొంతమంది గురించి తెలుసుకుందాం.. .. 'మీరు 73 ఏళ్ళ వయసులో కూడా ఏ మాత్రం పదునుతగ్గని ఆలోచనలతో రచనలు ఎలా చెయ్యగలుగుతున్నారు?' అన్న ప్రశ్నకి గొల్లపూడి మారుతి రావుగారు సమాధానం ఇస్తూ 'మనిషి జ్ఞానం, ఆలోచనా శక్తి ఒక పాత్ర లాంటివి. ఖాళీ ఔతున్న కొద్దీ నింపుకుంటూ ఉండాలి. ఇంతకు మించి రహస్యం ఏమీ లేదు' అన్నారు. కేవలం అరు నెలల వ్యవధిలో 'వందేళ్ళ కథకు వందనాలు' శీర్షికలో ప్రసారంకోసం ఆయన 90 ఎపిసోడ్లు రికార్డు చేశారు. కేవలం స్టూడియోలో కెమేరా ముందు కూర్చోవడం కాకుండా ఒక్కో రచయితకీ సంబంధించిన వ్యక్తులు ఎక్కడ ఉన్నారో పరిశోధించి, వారిని సంప్రదించి, సమన్వయించి అప్పుడు రికార్డు చెయ్యాల్సిన పరిస్థితి! మొట్టమొదట్లో మనం ప్రస్తావించుకున్న 'మళ్ళీ మధుమాసం' వ్రాసింది కూడా గొల్లపూడిగారే! ఐదారు నెలల క్రిందట తన 80వ పుట్టిన రోజు జరుపుకున్న సింగీతం శ్రీనివాసరావుగారు సృజనాత్మకతలో యువదర్శకులకి పోటీ పడగలుగుతున్నారు. ఆధునిక సాంకేతిక విప్లవంలో వచ్చిన ప్రతి మార్పూ ఆయనకి కరతలామలకమే! వింజమూరి అనసూయదేవిగారిని ఆమె 90వ పుట్టిన రోజున కలిసినప్పుడు ' మీ జీవితంలో తారసపడిన ప్రముఖుల గురించి వ్యాసాలు వ్రాస్తే ఈ తరానికి చాలా ఉపయోగంగా ఉంటుంది' అని అడిగాను. మరు సంవత్సరమే తన 91వ సంవత్సరంలో 'ఎందరో మహానుభావులు' పుస్తకాన్ని ప్రచురించారు. ఇప్పటికీ ఆమె వ్రాసే వ్రాతప్రతిలో ఒక్క అక్షరం కూడా తప్పులేకుండా చూసుకుంటారు. వాక్య నిర్మాణం సరిగ్గా ఉందా లేదా అన్న విషయం ఒకటికి రెండు సార్లు సరిచూసుకుంటారు. ఐ.ఐ.టి రామయ్యగా అసమానమైన ఖ్యాతి తెచ్చుకున్న చుక్కా రామయ్య గారు టీచర్ వృత్తినుంచి పదవీ విరమణ

చేశాక ఐ.ఐ.టి కోచింగ్ పాఠాలు మొదలుపెట్టారు. ఆయన కోచింగ్ సెంటర్‌లో జరిగే ప్రవేశపరీక్షకి యూనివర్సిటీ ప్రొఫెసర్లు కోచింగ్ ఇచ్చేవాళ్ళన్న విషయం అందరికీ తెలిసిందే! జీవితపు మలిసంధ్యలో నడుస్తూ కూడా నిత్య కృషీవలుల్లా జీవించే ఎంతోమంది సామాన్యుల గురించి తరచూ పత్రికల్లో చదువుతుంటాం.- ఎంతవరకో ఎందుకు.. మీ చుట్టు పక్కలే పరిశీలనగా చూడండి...వయసుని జయించిన వ్యక్తులు చాలమందే ఎదురౌతారు. వాళ్ళంతా 'నీరసించి, నిలిచిపోయే' తరానికి గుణపాఠాలు. ఆలోచనల్లో నిత్యనూతనత్వాన్ని కోల్పోని వ్యక్తులు, ఆత్మవిశ్వాసాన్ని ఆయుధం చేసుకున్న వ్యక్తులు. ఆత్రేయగారేననుకుంటా ఒకచోట వ్రాస్తారు ' వయసుతో పని ఏముంది - మనసులోనే అంతా వుంది!' అని.

*మార్చ్, 2012*

***

కౌముది

మూడు నెలల క్రిందట ఇండియా వెళ్ళాను. దాదాపు ఏడేళ్ళ తర్వాత వెళ్ళడం.. ఈ సారి పర్యటనలో ఒకభాగం పాత మిత్రుల్ని కలుసుకోవడం. ఆ విధంగా ఆనందరావుని (పేరు మార్చాను) 18 సంవత్సరాల తర్వాత కలుసుకునే అవకాశం వచ్చింది. మనిషిలో ఏమీ మార్పు రాలేదు. అదే నవ్వు, అదే హుషారు, పేరుకి తగినట్టు అదే ఆనందం! గత ఏడాదే రిటైరయ్యాడట. వయసువల్ల వచ్చిన మార్పులేవీ అతనిలోని నిత్య సంతోషానికి అడ్డుకట్టవెయ్యలేదు. పిల్లల గురించి అడిగాను. పెద్ద అబ్బాయిలు ఇద్దరూ డాక్టర్ లేనట. ఓ అమ్మాయికి పెళ్ళి చేసి అల్లుడితో పాటు అమెరికా పంపించేశాట్ట. ఇంకో అబ్బాయి డిగ్రీలోనూ, మరో అబ్బాయి ఇంటర్మీడియట్ లోనూ ఉన్నారట. ఈ రోజుల్లో ఐదుగురు పిల్లలు అంటే విచిత్రంగానే ఉంటుంది కానీ ఆనందరావు జీవితమే విభిన్నమార్గంలో నడిస్తూ వస్తోంది కాబట్టి అతని గురించి పూర్తిగా తెలిసిన వాళ్ళకి అది పెద్ద ఆశ్చర్యం కలిగించదు. చాలా సేపు పాత విశేషాలన్నీ మాట్లాడుకున్నాక చెప్పాడు, రెండేళ్ల క్రిందటే కిడ్నీ ఒకటి చెడిపోతే వాళ్ళ పెద్దబ్బాయే తన కిడ్నీని ఇచ్చాట్ట. "నేను వాడికి చెప్పాను. నువ్వంత త్యాగం చెయ్యొద్దురా,చదువుకుంటున్న తమ్ముళ్ళని చూసుకో చాలు.. నాగురించి బాధపడకు. ఉన్నన్నాళ్ళు ఇలానే నవ్వుతూ ఉంటాను. ఎప్పుడు ఫుల్ స్టాప్ పడితే అప్పుడు వెళ్ళిపోతాను.. ఎంతచెప్పినా వినలేదు. సరే..కానీ అనుకున్నా.." అంతా నవ్వుతూనే చెప్పాడు. ఆనందరావు నవ్వుతూ ఉండడం గురించి ఎందుకింత ప్రత్యేకంగా చెబుతున్నానో తెలుసుకోవాలంటే పాతికేళ్ళ క్రిందట జరిగిన అతని పరిచయం దగ్గర మొదలుపెట్టాలి. అప్పట్లో హైదరాబాదులో ఒక ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తూ ఉండేవాడిని. ఓ మిత్రుడి ద్వారా ఆనందరావు పరిచయం జరిగింది. అతనితో పరిచయం ఐన వాళ్ళెవరూ అంత తొందరగా అతన్ని మర్చిపోలేరనడానికి అతని హుషారు, సరదానే కారణం. 'జీవితం ఎంత వడ్డించిన విస్తరి కాకపోతే ఎప్పుడూ అంత హుషారుగా ఉంటాడు! ' అనిపిస్తుంది అతన్ని చూసిన వాళ్ళకి. ఎప్పుడు, ఎక్కడ కనిపించినా దగ్గరలో ఉన్న హోటల్కి తీసుకెళ్ళి టిఫినూ, కాఫీ ఇప్పించేవరకూ వదిలిపెట్టేవాడు కాదు. అతనితో కలిసి ఉన్నంత సేపూ గోదావరి గలగలే. ఓసారి అతన్ని పరిచయం చేసిన మిత్రుడి ఇంటికి వెళ్ళడం తటస్థించింది. ఆ ఇంట్లోనే ఒక పోర్షన్లో ఆనందరావు ఫేమిలీతో అద్దెకుంటాడన్న విషయం అప్పటి వరకూ నాకు తెలీదు. మేము కూర్చుని మాట్లాడుకుంటుండగా ఏడెనిమిదేళ్ళ కుర్రాడు..'అంకుల్ ఏం చేస్తున్నారు?..ఎవరొచ్చారు ఇంటికి? ' అంటూ మా వద్దకి వచ్చాడు. అప్పుడు పరీక్షగా చూశాను.. అతనికి కళ్ళు లేవు. కళ్ళు ఉండాల్సిన చోట రెండు గుంటలు ఉన్నాయంతే. మనిషి ఎంతో అందంగా ఉన్నాడు. ఆనందరావు పోలికలు కనిపిస్తున్నాయి. కొంచెం షాక్ తిన్నాను. అప్పుడు చెప్పాడు మా మిత్రుడు, ఆనందరావు గురించిన వివరాలు.. ఆనందరావుది కులాంతర ప్రేమ వివాహం. ఇద్దరూ ఒకేచోట ఉద్యోగం చేసేవారు. ఇద్దరు అబ్బాయిలు, ఒకమ్మాయి సంతానం. మంచి ఇల్లు కట్టుకున్నారు. వాళ్ళిద్దరినీ, వాళ్ళ అందమైన కుటుంబాన్నీ చూసిన వాళ్ళంతా అసూయపడే వాళ్ళట. పిల్లలింకా చిన్నవయసులో ఉండగానే ఆనందరావు భార్యకి కేన్సర్ రావడం, ట్రీట్మెంట్ కోసం అంతవరకూ సంపాదించినదంతా, కట్టుకున్న ఇల్లుకూడా అమ్మేసి ఖర్చుపెట్టడం, ఐనా ఫలితం లేకపోవడం జరిగింది. ఆమె చనిపోయాక పిల్లలని చూసుకోవడానికని తన అక్కగారమ్మాయిని ఇచ్చి మళ్ళీ పెళ్ళి చేశారు. వీళ్ళకిఇద్దరు పిల్లలు పుట్టారు. వాళ్ళలో ఒకబ్బాయే నేను చూసిన కళ్ళులేని బాబు. ఇల్లుఅద్దెకూడా కష్టంగా ఉంటుంటే తన ఇంట్లోనే ఒక భాగంలో ఉండమన్నానని చెప్పాడా మిత్రుడు. బయట ఎప్పుడూ నవ్వుతూ,తుళ్ళుతూ ఉండే ఆనందరావు వెనుక ఇంత భయంకరమైన విషాదం ఉందని చాలా మందికి తెలీదు. ఈ విషయాలన్నీ తెలిశాక ఆనందరావుని కలుసుకున్నప్పుడల్లా నాకే జాలిగా ఉండేది. అతని మాటల్లో కానీ, ముఖంలోకానీ ఇసుమంతైనా దిగులుకానీ, బాధకానీ కనిపించేది కాదు. కనిపించినప్పుడల్లా పిల్లల గురించి అడుగుతూ ఉండేవాడిని. ఓ సారి చెప్పాడు "పెద్దవాడికి మొన్ననే ఎమ్. సెట్ లో బైపిసిలో పదో రాంకు వచ్చింది.రెండో వాడు ఎనిమిదో క్లాసు కదా.. వారమైంది...చెప్పా పెట్టకుండా డబ్బులు తీసుకుని ఇంట్లోంచి పారిపోయాడు...డబ్బులైపోయాక వాడే తిరిగొస్తాడు లెండి.." అదే నవ్వు..అదే హుషారు..! మనిషిలో ఏమాత్రం బెదురులేదు..చింతలేదు.. ప్రాణప్రదంగా ప్రేమించి పెళ్ళిచేసుకున్న భార్య పోయినప్పుడు ఆనందరావు నవ్వుతూనే ఉన్నాడు.. సంపాదించిన ఆస్థి అంతా ఆమె వైద్యానికి ఖర్చు ఐపోయినప్పుడు నవ్వుతూనే ఉన్నాడు, చిన్నపిల్ల

బాధ్యత మీద పడినప్పుడు నవ్వుతూనే ఉన్నాడు, మేనరికం వల్ల కళ్ళులేకుండా బాబు పుట్టినప్పుడు నవ్వుతూనే ఉన్నాడు..ఈమధ్య కిడ్నీ పాడైపోయిందని తెలిసినప్పుడూ నవ్వుతూనే ఉన్నాడు..నవ్వుతూనే బాధలన్నీ ఓర్చుకున్నాడు..నవ్వుతూనే

పరిస్థితులన్నింటినీ ఎదుర్కొన్నాడు..నవ్వుతూనే...ఎప్పుడూ, అందరికీ కనిపించాడు. కనిపిస్తున్నాడు..!

జీవితమే ఒక వైకుంఠపాళి
ఎగదోసే నిచ్చెనలేకాదు
పడదోసే పాములు ఉంటాయి..
చిరునవ్వులతో విషవలయాలను
ఛేదించి ముందుకు పదవోయి..!" (సి.నా.రె)

ఆనందరావుని కలుసుకున్న ప్రతిసారీ..ఏదో జీవితసత్యం తెలుస్తూనే ఉంటుంది!

*ఏప్రిల్,2012*

***

నాలుగునెలల క్రిందట ఇండియా వెళ్ళినప్పుడు జరిగిన ఇంకో సంఘటన పాఠకులతో పంచుకోవాలనిపించింది. దాదాపు పదేళ్ళ తర్వాత మా పల్లెటూరు వెళ్ళాను. వూరిలోకి ప్రవేశించడానికి ముందు మాలపల్లి వస్తుంది. అక్కడికివెళ్ళగానే మాలపల్లి ప్రవేశంలోనే కనిపించిన వెంకయ్య మాస్టారి విగ్రహం చూడగానే ఎన్నో జ్ఞాపకాలు మనసుని తడిమాయి. ఆయన ఇదే మాలపల్లిలో 35 సంవత్సరాలు పైగా నివసించారనుకుంటాను. ఉండేది మాలపల్లి ఐనా, పనిచేసింది మాత్రం మా వూరిలోని ప్రాథమిక పాఠశాలలో. నేను ఐదో తరగతిలో ఉండగా ఆయన 1,2,3 తరగతులకి మాస్టారిగా మా స్కూలుకి వచ్చారు. ప్రత్యక్షంగా ఆయన వద్ద చదువుకోక పోయినా అప్పటినుంచే ఆయనతో సాన్నిహిత్యం ఉండేది. ఆయన మంచి గాయకుడు , పిల్లలకి ఆయన పాటలు వినడం చాలా ఆసక్తిగా ఉండేది. నేను పైచదువులకి వూరు వదిలి వచ్చేశాను. మళ్ళీ యూనివర్సిటీలో చదువుకునేప్పుడు శెలవులకి ఇంటికి వెళ్ళినప్పుడు వెంకయ్యమాస్టారిని రోజూ కలుసుకుంటూ ఉండేవాడిని. అప్పటికి ఆయన మావూరి ప్రాథమిక పాఠశాలకి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తుండేవారు. అదనంగా మా వూరి సబ్ పోస్టాఫీసుకిపోస్టుమాస్టర్‌గా కూడ పనిచేసేవారు. ప్రతిరోజూ ఐదుమైళ్ళ దూరంలో ఉన్న పోస్టాఫీసు నుంచీ రన్నర్ ఒక సంచీలోఉత్తరాలు తెచ్చేవాడు. మహా ఐతే రోజుకి పదో పదిహేనో ఉత్తరాలు వచ్చేవి. వాటిని ఇంటింటికీ ఇవ్వడమే కాకుండా చదువురాని వాళ్ళకి వాళ్ళ ఉత్తరాలు చదివి వినిపించడం, తిరిగి సమాధానాలు వ్రాసిపెట్టడం..ఇవన్నీ ఆయన పనులే. కొన్నిసార్లు ఉత్తరాలు తక్కువగా ఉన్నాయని పోస్టాఫీసుని తీసేసే పరిస్థితి కూడా వస్తే ఆయనే ఇంటింటికీ తిరిగి అందరి సహకారంతో దాన్ని నిలబెట్టారు. మాలపల్లిలోని కుటుంబాలకి చదువుకోవడం గురించి నచ్చజెప్పి అక్కడి పిల్లలు బడిమానకుండా చూసేవారు. వూళ్ళో ఎవరికే అవసరమైనా 'వెంకయ్య మాస్టారిని పిలవండి' అంటుండేవారు. కులబేధాలు పూర్తిగా మాసిపోని ఆ రోజుల్లో కూడా ఊళ్ళో ఎవరింట్లో ఏ శుభకార్యం జరిగినా మాస్టారికి ఆహ్వానం వెళ్ళేది. కులాలకి అతీతంగా అందరితో పాటే ఆయన్ని గౌరవించేవాళ్ళు. ఉద్యోగం నుంచి రిటైరయ్యాక కూడా పోస్టాఫీసు కొనసాగడానికి ఆయన చాలా శ్రమించారు. మాలపల్లిలో పిల్లలకి ఉచిత విద్యాబోధన చేసే వాళ్ళు. చివరి వరకూ ఆయనది దిగువ మధ్యతరగతి కుటుంబమే. సహాయం కోసమని ఆయనఒకరిని చేయిచాచి అడగడం నేనెప్పుడూ చూడలేదు, వినలేదు. ఊరికోసం చాలా గొప్ప పనులు చేయకపోవచ్చు, ఆయన జీవన విధానంలో పెద్ద ట్విస్ట్‌లు లేకపోవచ్చు. కానీ అందరికీ తలలో నాలుకలా ఉండేవారు. ఆయన మంచితనం, తనకున్నంతలో ఆయన చేసే పరోపకారం అయన్ని 'అందరి బంధువయా' అనిపించుకునేలా చేసింది. ఉద్యోగరీత్యా నేను ఊరు వదిలివచ్చేసినా, శెలవు మీద వెళ్ళిన ప్రతిసారీ మాస్టారిని కలుసుకోవడం తప్పనిసరిగ జరిగేది. వాళ్ళమ్మాయిని కాపురానికి పంపించడానికి హైదరాబాదు వొచ్చినప్పుడు ఒకసారి మా యింటికి కూడ వచ్చారు. ఆయన చనిపోయి పధ్నాలుగేళ్ళు దాటిందనుకుంటాను. గొప్పగొప్ప నాయకులకి విగ్రహాలు స్థాపించడం విశేషమేమీ కాదు. కానీ సాధారణ బడిపంతులుగా జీవించి కూడా ఊరి ప్రజల మనసుల్లోశాశ్వతంగా నిలిచిపోయిన మాస్టారు 'మంచితనా'నికి నిలువెత్తు నిదర్శనం. మా వూరిలోనూ, చుట్టుపక్కల గ్రామాల్లోనూ ధనవంతులు చాలా మందే ఉన్నారు. ఎవరికీ దక్కని అరుదైన గౌరవం మాస్టారికి దక్కింది. మనిషి విలువని నిర్ణయించేది జీవితకాలంలో తను చేసిన మంచిపనులే కానీ ఆస్థి, అంతస్థు, హోదాలు కావని వెంకయ్య మాస్టారి విగ్రహం నిశ్శబ్దంగా సందేశాన్నిస్తోంది. ఆ విగ్రహం దగ్గర ఆగగానే, మనం లోగడ చాలాసార్లు చెప్పుకున్న - సిరివెన్నెలగారి వాక్యాలు గుర్తొచ్చాయి 'జీవితంలో ఎన్ని కోట్లు సంపాదించేమనేది కాదు, ఎంతమంది హృదయాల్లో కోటలు కట్టగలిగామనేది ముఖ్యం' !!

***మే, 2012***

***

ప్రతిమనిషికీ సహజసిద్ధంగా లభించే విలువైన వనరుల్లో ముఖ్యమైనవి - కాలం, ఆలోచనా శక్తి. సద్వినియోగం చేసుకుంటే అద్భుతమైన ఫలితాలనిచ్చే సమయపాలన, పదునుబెట్టి సక్రమమైన మార్గంలో నడపగలిగితే విజయానికి దారులు వేసే ఆలోచనా విధానం - ఈ రెండూ ఇరు వైపులా పదునున్న ఆయుధాల్లాంటివి. ఈ సంపాదకీయ శీర్షికలోనే  ఒకసారి ప్రస్తావించుకున్నాం - చేయాల్సిన పనుల ప్రాధాన్యతని బట్టి , ఒక క్రమంలో అమర్చుకోగలిగితే(To Do List), రోజులో మనకి లభించే 24 గంటల్లో అన్ని పనులనీ పూర్తిచేసుకోవచ్చు, సమయాన్ని సద్వినియోగం చేసుకోడానికి అది ప్రాథమిక సూత్రం అని. అలాగే ఆలోచించాల్సిన అంశాలని ప్రాధాన్యత ప్రకారం అమర్చుకుని, ఆ క్రమం ప్రకారం ఆలోచనా శక్తికి కేంద్రమైన మెదడుకి వ్యాపకం కల్పించడం మంచిపని అని మానసిక శాస్త్రజ్ఞులు చెబుతున్నారు (To Do List for brain). బందరు హిందూ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లో ద్వైతా శివరామశాస్త్రి గారనే మాథ్స్ లెక్చరర్ ఒకాయన ఉండేవారు. సిలబస్ ఎక్కువగా ఉంది, రివిజన్ చేసుకోడానికి సమయం లేదు అనుకుంటున్నప్పుడు ఆయన ఒక చిట్కా చెప్పారు. ‘మీకుతీరిగ్గా కూర్చుని రివిజన్ చేసుకోడానికి సమయం దొరకదేమో కానీ మెదడుని సక్రమమైన అభ్యాసంలో పెట్టగలిగితే మీకు ఎంత సమయమైనా దొరుకుతుంది. సమయాన్ని టైమ్ టేబుల్ ప్రకారం విభజించుకున్నట్లే మెదడు ఆలోచించాల్సిన అంశాలకి కూడా ఒక టైమ్ టేబుల్ తయారు చేసుకోండి‘ అన్నపుడు ముందుగా మాకేమీ అర్థం కాలేదు. ‘మీరు కాలేజీకి వచ్చేప్పుడు, తిరిగి ఇంటికి వెళ్ళేప్పుడు, ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేప్పుడు, భోజన సమయంలోనూ ఏం చేస్తుంటారు?‘ అని అడిగారు. ‘మీరు చెప్పిన పనులే చేస్తుంటాం సర్‘ అన్నప్పుడు ‘ఆ సమయంలో మీరు ఏం ఆలోచిస్తారు?‘ అని ప్రశ్నని కొంచెం విశదీకరించారు. ‘ఏం అలోచిస్తాం..!? ఏదో ఆలోచిస్తాం. ఏవేవో ఆలోచనలు వస్తుంటాయి‘ అన్నాం. ‘అదే చెప్పేది.. ఆ సమయంలో ఆలోచనలని సబ్జెక్టు రివిజన్‌కి ఉపయోగించండి. మీరు క్రిందటి రోజు చదివిన అంశాలు, లేదా ఈ రోజు ప్రిపేరవ్వాల్సిన అంశాలు ఆ సమయాల్లో గుర్తు తెచ్చుకోడానికి, రివిజన్ చేసుకోడానికి ప్రయత్నించండి. ముందులో చాలా కష్టంగా ఉంటుంది. ఆలోచనలని ఒక అంశం మీద కేంద్రీకరించడం ఇబ్బందిగాఅనిపిస్తుంది. కొంతసేపు ఫరవాలేదనిపించినా, మధ్యలో ఆ పాఠాలూ, సూత్రాలూ గుర్తుకు రాకపోవచ్చు. తరువాత ఖాళీగా పుస్తకం తెరిచినప్పుడు, ఇందాక ఎక్కడ మర్చిపోయారో ఆ అంశం చదవండి. మళ్ళీ కాలేజీనుంచి ఇంటికి వెళ్ళేప్పుడు ఇదే అభ్యాసం కొనసాగించండి..‘ అని చెప్పారు. ముందులో కొంచెం అతిగా అనిపించినా, ఆయన చెప్పిన ‘టు డు లిస్ట్ ఫర్ బ్రెయిన్’ చిట్కా బాగా పనిచేసింది. ఎంత బాగా అంటే, సినిమాకి వెళ్ళేప్పుడు కూడా కెమిస్ట్రీ సూత్రాలని చిన్న పోకెట్ సైజు పుస్తకంలో క్రోడీకరించి వ్రాసుకుని, ఇంటర్వెల్‌లో చదువుకునేంతగా!! ప్రఖ్యాత డిటెక్టివ్ నవలా రచయిత స్వర్గీయ కొమ్మూరి సాంబశివరావుగారు రోజూ ఉదయంపూట వాకింగ్‌కి వెళ్ళినప్పుడు తన నవలలకి కావల్సిన అంశాలని ఆలోచిస్తూ ఉండేవారట. చాలా మంచి నవలల కథాంశాలు ఆయనకి మోర్నింగ్ వాక్ సమయంలోనే స్ఫురించాయట. ఆయన కెరీర్ చివరిరోజుల్లో అనారోగ్యం వల్ల వాకింగ్ వెళ్ళడం తగ్గించడంతో రచనా వ్యాపకం కూడా కుంటుపడిందట. !! మెదడు అనంతమైన శక్తికి ప్రధాన కేంద్రం. సానుకూలమైన ఆలోచనలతో ఆ శక్తిని సద్వినియోగం చేసుకోవడం  విజేత చెయ్యాల్సిన ముఖ్యమైన పనుల్లో ఒకటి. ఆలోచనా స్రవంతిని లొంగదీసుకోవడం, నియంత్రించడం అంత సులభం కాకపోవచ్చు కానీ అసాధ్యం మాత్రం కాదు. అభ్యాసమే దానికి పునాది. ‘మెదడుకి మేత‘ వెయ్యడమే కాక ‘మెదడుకి పదును‘ పెట్టడం కూడా వ్యక్తి వికాసానికి ప్రధానమని మానసిక శాస్త్రజ్ఞుల సలహా.

*జూన్, 2012*

***

దాదాపు పాతికేళ్ళ క్రిందటి సంఘటన.. మిత్రుడొకతను – వాళ్ళమ్మాయి పదో క్లాసు తప్పిందని, లెక్కలు సబ్జెక్టులో కొంచెం సందేహాలు ఉన్నాయి,సహాయం చెయ్యమని అడిగాడు. 'నేనేదో కవిత్వమూ, నాటకాలూ వ్రాసుకునేవాడ్ని. నేను లెక్కలు చెప్పడమేమిటి? అసలు మీకీ ఆలోచన ఎలా వచ్చింది?' అని అడిగాను.'మీరు ఏమైనా వ్రాసుకోండి కానీ,మీరు ఏ విషయమైనా ఎదుటి వారికి తేలిగ్గా అర్థమయ్యేలా చెబుతారు. అందుకే మీ దగ్గర కొచ్చాను' అని నన్ను బలవంతంగా ఒప్పించాడు. ఆ అమ్మాయికి పాఠాలు చెప్పడం, పదో తరగతి లెక్కల్లో ట్రిగొనామెట్రీతో మొదలు పెట్టాను. నాలుగైదు రోజులు ఎంత చెప్పినా ఆ అమ్మాయికి అర్థం కాలేదు.నేను చెప్పే విధానం మార్చి చూస్తే ఎలా ఉంటుందోనని ఆలోచించి, అసలు ట్రిగొనామెట్రీ అంటే ఏమిటి(what) అనే విషయంతో మొదలుపెట్టి, ట్రిగొనామెట్రీ ఎక్కడ వాడతారు(where), ఎందుకు వాడుతారు (why)లాంటి విషయాలన్నీ ఉదాహరణలతో కథలాగా చెప్పాను. అప్పటి వరకూ ప్రాథమిక నిర్వచనాలకి కూడా వెళ్ళలేదు. అవన్నీ అయ్యాక సైన్, కాస్..వగైరా సూత్రాలు చెబుతూ, ప్రతిసారీ అవి నిత్యజీవితంలో ఎలా ఉపయోగపడతాయో(how) వివరించడం మొదలుపెట్టాను. వెంఠనే ఆ అమ్మాయికిపూర్తిగా అర్థమై పోయిందని చెప్పను కానీ, చాలా మార్పు కనిపించింది. నాకే ఏదో సులువు మార్గం దొరికినట్లనిపించి, ప్రతి పాఠానికీ ముందుగా what,where,why,who,whom..ఇలాంటి వన్నీ అయ్యాక అప్పుడు how కి వెళ్ళేవాడిని. త్వరలోనే మంచి ఫలితం కనిపించింది. రెండు నెలల్లో ఆ అమ్మాయి సప్లిమెంటరీలో పాసవడమే కాక మా మిత్రుడు వచ్చి 'ఈ ఇద్దరినీ కూడా మార్చి పరీక్షలకి ప్రిపేర్ చేయించండి. మీకు ఎప్పుడు ఖాళీ ఉంటే అప్పుడే వస్తారు..' అని మరో ఇద్దరిని అప్పజెప్పి వెళ్ళాడు. అలా మొదలైన శిష్యబోధన రెండు మూడేళ్ళలోనే సంవత్సరానికి 80 మందికి చెప్పేవరకూ చేరింది. బోధించేది ఏ సబ్జెక్టు ఐనా సరే (మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) ప్రతి పాఠానికి ఈ 'w' చిట్కా బాగా పనిచేసింది. అంశాన్ని బట్టి వీటి వరుస మారుతుందనుకోండి. తర్వాత ఇదేసూత్రాన్ని వృత్తి జీవితంలో పదిమందికి ప్రెజెంటేషన్స్ ఇచ్చేప్పుడు కూడా అనుసరించడం జరిగింది. ఎదుటి వాళ్ళకి ఏ విషయాన్నైనా చెప్పాలంటే ఈ 'w' లన్నింటికీ సమాధానాలు చెబితే సరిపోతుందనే విషయం అనేక సందర్భాల్లో రుజువైంది. ఇప్పుడీ విషయం ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే – ఇటీవలే ఎక్కడో చదివాను ఈ 'w'ల ఉపయోగం,కేవలం అంశాల వివరణకే కాక సమస్యా పరిష్కారానిక్కూడా పనికొస్తుందట! ఎలాగంటే – వ్యక్తిగత జీవితంలో కానీ, వృత్తి జీవితంలో కానీ ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ముందుగా అసలు సమస్య ఏమిటిఅనే దాని మీద స్పష్టత తెచ్చుకోవాలి. ఈ స్పష్టతా లోపం వల్లనే చాలా సార్లు సమస్య సాలెగూడులా అనిపిస్తుంది, పరిష్కార మార్గమూ కనిపించదు. ఏ సమస్యనైనా కొంచెం స్థిమితంగా what,where,why,who,whom,how కోణాల్లో విశ్లేషిస్తే స్పష్టత వస్తుంది. కొన్నిసార్లు ఈ స్పష్టత తెచ్చుకునే క్రమంలోనే పరిష్కారమూ దొరకవచ్చు. లేదా కనీసం సాలెగూడు విడిపోతుంది, పరిష్కారానికై చేసే ప్రయత్నాలకీఒక స్పష్టత కనిపిస్తుంది. సమస్యని బట్టి ఈ 'w' లలో అన్నింటినీ కానీ, కొన్నింటిని కానీ, సందర్భానికి సరిపోయే వరుసలో విశ్లేషిస్తే మంచి ఫలితాలుంటాయట!

*జూలై, 2012*

***

ధర్మవరపు సుబ్రహ్మణ్యంగారు ఒక జోక్ చెబుతుంటారు.. ఓ చిన్నపిల్లాడికి, వాళ్ళ నాన్న, ఇండియా మ్యాప్ పజిల్ ఇచ్చి పూర్తిచెయ్యమన్నాడు.ఇండియా రాష్ట్రాలన్నీ చిన్న చిన్న చెక్కముక్కలుగా కుప్పపోసి ఉన్నాయి. ఒక్కో చెక్కముక్కనీ మ్యాప్‌లో పెట్టడం వల్ల ఏ రాష్ట్రం ఎలా ఉంటుందో, దేని సరిహద్దులేమిటో తెలుస్తాయని వాళ్ళ నాన్న ఉద్దేశ్యం. ఇచ్చిన రెండు నిమిషాల్లో పరిగెత్తుకుంటూ వచ్చేసి 'ఐపోయింది నాన్నా' అన్నాట్ట ఆ కుర్రాడు.అంత తొందరగా ఎలా పూర్తిచేశాడా అని తండ్రి ఆశ్చర్యపోతుంటే పుత్రరత్నం అసలు సంగతి చెప్పాట్ట 'మ్యాప్ వెనకాల నా ఇష్టమైన హీరో బొమ్మ ఉంది. ఆ హీరో బొమ్మ పూర్తిచేస్తే చాలు, ఇటువైపు ఇండియా మ్యాప్ వచ్చేసింది' అని! ఈ సరదా సంగతి ఇలా ఉంచి - బ్లాక్స్ పజిల్‌నీ,దాన్ని పూర్తిచేసే ప్రక్రియని శ్రద్దగా గమనిస్తే ఎన్నో నిత్యజీవిత సత్యాలు బోధపడతాయి. ఇండియా మ్యాప్, వరల్డ్ మ్యాప్ , బ్యాట్ మేన్ బొమ్మా, జంగిల్ వరల్డ్.. ఏదైనా కానీ - పూర్తిచేశాక వచ్చే బొమ్మ ఏమిటో ముందుగా అర్థం చేసుకుంటాం (బిగ్ పిక్చర్). ఒక్కో ముక్కనీ ఖాళీల్లో సర్దడం మొదలుపెట్టగానే పజిల్ పూర్తిచెయ్యడంలోని ఛాలెంజ్ ఏమిటో కొద్ది కొద్దిగా అర్థమవడం మొదలౌతుంది. విడిగా ఒక్కో బ్లాక్ చూస్తే 'ఓస్ ఇంతే కదా ' అనిపిస్తుంది. ఒక్కోసారి అనుకున్న స్థానంలో సరిపోదు. అది తీసేసి మరోదాన్ని ప్రయత్నించాలి. కాస్సేపయ్యాక విసుగు రావొచ్చు. కొద్ది,కొద్దిగా అనుకున్న రూపం వస్తుంటే సంతోషంగానూ ఉంటుంది. పజిల్ బ్లాక్స్ సంక్లిష్టతని బట్టి కొన్నిసార్లు మధ్యలో వదిలెయ్యాలని పిస్తుంది. ఇంకొన్ని సార్లు కాస్త విరామం ఇచ్చి, మళ్ళీ మొదలుపెడితే కొత్త ఊహలతో మరొకొన్ని బ్లాక్స్‌ని సులువుగా అమర్చవచ్చు. ఒక్కోసారి పక్కవారి సలహాలు అవసరం కావొచ్చు. అన్నీ పూర్తిచేసాక వచ్చే తుదిరూపం మనసునుంచీ చెరగకుండా చూసుకుంటూ, ఆశ, నిరాశల ఊగిసలాటని ఓర్పుతో భరిస్తే, కాస్త నేర్పు, ఇంకాస్త సహనం కలగలిపితే ...పజిల్ బ్లాక్స్ పూర్తిచేయడం అసాధ్యం కాదని ఋజువౌతుంది. మనిషి జీవితంలో చేరుకోవాలకున్న గమ్యాలూ, సాధించాలనుకున్న లక్ష్యాలూ, పరిష్కరించాల్సిన సమస్యలూ... ముక్కలు కలిపే పజిల్స్ లాంటివే. ఏం సాధించాలకుంటున్నామో ఆ స్పష్టమైన రూపం మనసులో ఎప్పుడూ నిలబడి ఉండాలి(బిగ్ పిక్చర్). అనుకున్నది సాధించడానికి మనకున్న వనరులు, శక్తి సామర్థ్యాలు అంచనా వేసుకోవడం మొదటిమెట్టు. ఇవే బిల్డింగ్ బ్లాక్స్. లక్ష్యసాధన దిశగా ముందడుగు వెయ్యడం, ఒక్కో బిల్డింగ్ బ్లాక్‌ని అమర్చుకుంటూ వెళ్ళడం లాంటి ప్రక్రియ. ఒక్కోసారి అంతా గజిబిజిగా అనిపించవచ్చు. అసలు సాధించలేమేమో నన్న అనుమానమూ రావొచ్చు.నిరాశా, నిస్పృహ అవరించినప్పుడు - సాధించాక వచ్చే ఆనందం, తృప్తీ..ఎలా ఉంటాయో ఊహించుకుంటే కలిగే హుషారు, శక్తీ ..ఇవీ మనిషిని ముందుకి నడిపించాలి. మనసులోంచిబిగ్ పిక్చర్ ఎప్పుడూ చెరిగిపోకుండా చూసుకోవాలి. అవసరమైనప్పుడు విశ్రాంతి తీసుకుని కొంతకాలం తర్వాత ప్రయత్నాలు పునఃప్రారంభించడం కూడా ఒక్కోసారి అవసరం కావొచ్చు. నిరంతర సాధన, మొక్కవోని ఆత్మవిశ్వాసం, పట్టుదల, ఓపిక ..ఉన్నంతకాలం ఎంతక్లిష్టమైనా పజిల్ నైనా సాధించవచ్చు ననడానికి వివిధ రంగాల్లోని విజేతల జీవితాలే ఉదాహరణలు.

***ఆగస్ట్, 2012***

***

ఎన్టీఆర్ నటించిన ఓ పాత సినిమాలో ఒక దృశ్యం ఉంది. సినిమా పేరు గుర్తురావడం లేదు. ఎన్టీఆర్ బాత్ టబ్‌లో స్నానం చేస్తూ, నోట్లో సిగిరెట్ పెట్టుకుని ఓ చేత్తో న్యూస్ పేపర్ చదువుతూమరో చేత్తో ఫోన్ పట్టుకుని ఎవరితోనో మాట్లాడుతూ ఉంటాడు. హాస్యం కోసం చిత్రీకరించిన దృశ్యమే ఐనా అదొక మల్టీటాస్కింగ్‌కి ఉదాహరణ! కాలం చాలా వేగంగా మారిపోయింది. నడకలో వేగాన్ని పెంచుకుంది. ఇప్పటి దృశ్యం ఒకటి - రామంపొద్దున్నే కాఫీ తాగుతూ, ఒక చేత్తో సెల్ ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతూ, ఐ-పాడ్ లో ఇ-మెయిల్ చెక్ చేసుకుంటున్నాడు. ఎదురుగుండా టివి లో న్యూస్ ఛానెల్ ఎలానూ రొదచేస్తూనే ఉంది. అది పూర్తయాక వాకింగ్ వెళ్తూ న్యూస్ పేపర్ తీసుకెళ్ళాడు. పార్క్‌లో నడుస్తూ న్యూస్ పేపర్‌చదువుతున్నాడు. మధ్యలో ఎవరికో టెక్స్టింగ్ చేశాడు. ఆఫీసులో అడుగు పెట్టగానే కాన్ఫరెన్స్ కాల్స్‌లోఉంటూనే ఐ-ఫోన్ లో మెయిల్స్ చూస్తున్నాడు. మధ్యలో టేబిల్ మీద నున్న కరస్పాండెన్స్ తిరగేస్తున్నాడు. బిజీ ఆఫీసులో పనిచేసే రామం మాత్రమే కాదు, స్కూటర్ మీద పాల కేన్ పెట్టుకుని ఇంటింటికీ వెళ్ళేయాదగిరి పరిస్థితీ ఇంతే! సెల్ ఫోన్ మోగగానే ఒక చేత్తో స్కూటర్ నడుపుతూ రెండో చేత్తో సెల్‌ఫోన్ చెవిదగ్గర పెట్టుకుని మాట్లాడుతున్నాడు. వెనకాల వాళ్ళు హారన్ కొట్టినా పట్టించుకోవడం లేదు.. ఇదీ ఈ కాలపు మల్టీటాస్కింగ్ !మనిషి మెదడు అసంఖ్యాకమైన ఆలోచనల్ని ఇముడ్చుకోగలదు కానీ వాటిని ఆచరణలో పెట్టినప్పుడు ఒక మెదడే అన్ని పనుల్నీ నియంత్రించాలి. ఒక్కో మనిషికీ ఉన్న వ్యక్తిగత సామర్థ్యాన్ని బట్టి, పరిమితుల్ని బట్టి ఒకేసారి కొన్ని నియమితమైన పనుల్ని మాత్రమే చెయ్యగలరు. అంతకు మించి మెదడుని ఒత్తిడికిగురిచేయడం వ్యక్తిగత ఆరోగ్యానికి మంచిది కాదని మానసిక శాస్త్రవేత్తల సలహా. చాలా పనులు ఒకేసారి చేస్తున్నామని భ్రమిస్తాం కానీ ఫలితాల నాణ్యతని గమనిస్తే ఒక్కో పనిమీద ఆలోచనని కేంద్రీకరించిన సందర్భాలకి, ఒకేసారి అనేక పనులమీద దృష్టి పెట్టినప్పుడు వచ్చే ఫలితాలకీ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. అత్యవసరమైనప్పుడు తప్పదేమో కానీ మల్టి టాస్కింగ్‌ని అలవాటుగానో. వ్యసనంగానో మార్చుకోవడం అంత సమర్థనీయం కాదని శాస్త్రజ్ఞుల ప్రయోగాలు నిరూపిస్తున్నాయి.

***సెప్టెంబర్, 2012***

***

అనగనగా ఓ అడవి.. ఆ అడవిలో ఓ ఏనుగు పిల్ల. స్వేచ్ఛగా అడవంతా తిరుగుతోంది. ఇంతలో ఓ సర్కస్ కంపెనీవాళ్ళు దాన్ని పట్టుకుని తమతో తీసుకెళ్ళారు. శిక్షణనిచ్చి తమ ప్రదర్శనలో భాగం చేయడానికి కసరత్తు మొదలైంది. అప్పుడే అడవినుంచి వచ్చింది కాబట్టి ఎప్పుడెప్పుడు బయటికి వెళ్ళిపోదామా అని ఏనుగుపిల్లకి ఒకటే తహతహ. కదలకుండా ఒక గొలుసుతో బంధించేశారు. గొలుసు తెంచుకోడానికి శతవిధాలా ప్రయత్నించింది. పిల్లఏనుగు బలం సరిపోలేదు. గొలుసుని తెంచుకోలేకపోయింది. మర్నాడు..ఆ మర్నాడు.. ప్రయత్నిస్తూనే ఉంది. ఊహుఁ..గొలుసు తెంచడం సాధ్యం కాలేదు. కొన్నాళ్ళకి ఇంక ఆ ప్రయత్నమే మానుకుంది. సర్కస్ జీవితానికి అలవాటు పడిపోయింది. కాలక్రమేణా పిల్ల ఏనుగు పెద్దదయింది. సర్కస్ యజమానులు దాన్ని కట్టేసిన గొలుసుని మాత్రం ఏమీ మార్చలేదు. చిన్నప్పుడు ఏ గొలుసుని వాడారో ఇప్పుడే అదే ఉంది. నిజానికి ఇప్పుడు ప్రయత్నం చేస్తే ఆ గొలుసు తెంచుకోవడం ఏనుగుకి పెద్ద కష్టం కాదు. కానీ ఆ అస్సలు ఆ ప్రయత్నమేచేయడం లేదు. ఎందుకంటే చిన్నప్పుడు విఫలమైన సంఘటనలే తనలో నిలిచిపోయాయి. ఇప్పుడు ఏనుగుని బంధించి ఉంచింది, గొలుసుకాదు, అక్కడనుంచి తాను తప్పించుకోవడం అసంభవం అన్న భావనే !! ఇలాంటి సందర్భాలు మనకి తారసపడుతూనే ఉంటాయి. మనలో ఇలాంటి మనస్తత్వమున్న వ్యక్తుల్ని చాలా మందిని గమనిస్తూనే ఉంటాము. ఎప్పుడో ఒకసారి కొన్ని ప్రయత్నాలు చేయడం అవి విఫలమవడంతో ఇంక తాము దేనిలోనూ విజయం సాధించలేమని , 'ఇంక నా బ్రతుకింతే' అనుకుని సర్దుకు పోవడం. అలవాటై పోతుంది. ప్రతిదీ అలవాటై పోతుంది. నిరాశ , నిస్పృహ క్షణ, క్షణం దహించేస్తూ ఉన్నా కాస్తయినా ప్రయత్నం చెయ్యాలనిపించదు. కొత్తగా ఆలోచిస్తే ఏమైనా పరిష్కారం దొరుకవచ్చునన్న ఊహ కూడా దగ్గరికి రాదు. అదేమని ఎవరైనా అడిగితే -"ఆఁ.. చాలాసార్లు ట్రై చేశామండీ. వర్కవుట్ కాలేదు.." ఇదీ సమాధానం! మనసుని, ఆలోచనలని ఒక గదిలో బందీలని చేసి చిన్న కిటికీ లోంచి బయటికి చూస్తే పరిమిత ప్రపంచమే కనిపిస్తుంది. విశాల ప్రపంచాన్నిచూడాలంటే, అపరిమితమైన ఆవకాశాలని అందిపుచ్చుకోవాలంటే ఆలోచనలకున్న సంకెళ్ళని తెంచుకోవాలి. పరిమితులు విధించుకున్న ఊహలకి రెక్కలు తొడగాలి. ఆపైన ప్రతికూల పరిస్థితుల్ని సానుకూలం చేసుకునే ప్రయత్నాలకి పదునుపెట్టాలి. ఏదైనా సాధించగలమో లేదో తెలియాలంటే కనీసం ప్రయత్నించి చూడాలి కదా! ప్రయత్నాలు మొదలైనప్పుడు కొత్తదారులు కనిపిస్తాయి, కొత్త పరిష్కారాలుపలకరిస్తాయి.

***అక్టోబర్, 2012***

***

ఎప్పుడో చదివిన గల్పిక - రాయుడు గారంటే ఆ వూళ్ళో అందరికీ గౌరవమూ, భయమూ, అన్నీను. సమస్యలని పరిష్కరించగలడూ, అవసరమైతే సమస్యలని సృష్టించగలడు కూడా. పదవీ, హోదా ఏమీ లేకపోయినా ఆ వూరికి మకుటంలేని మహరాజు రాయుడుగారు. ఓ సుముహూర్తాన వాళ్ళబ్బాయిని స్కూల్లో చేర్చడానికి నిర్ణయించుకున్నారు రాయుడుగారు. ఆ విషయం తెలిసిన టీచర్లు ఒళ్ళు దగ్గరపెట్టుకుని అన్ని ఏర్పాట్లూ చేశారు. అక్షరాభ్యాసం, స్కూల్లో పిల్లలకి చాక్లెట్లు పంచడం..అన్నీ అయ్యాయి. రాయుడు గారు వాళ్ళబ్బాయికి పాఠాలు చెప్పబోయే టీచర్‌ని పిలిచి ఓ విషయం చెప్పారు. " చూడండి మాస్టారూ..మా వాడి పక్కన బొత్తిగా చదువురాని వాడిని కూర్చోబెట్టండి.."

"అదేమిటి రాయుడు గారూ. అందరూ బాగా చదివే వాళ్ళ పక్కన కూర్చోబెట్టమంటారు కదా.మరి మీరు..?" "పంతులూ..నువ్వడిగావు కాబట్టి చెబుతున్నా. విషయం ఏమిటంటే- బాగా చదివేవాడి పక్కనుంటే మావాడు ఏమాత్రం సరిగా లేకపోయినా పక్కవాడితో పోల్చి మా వాడిని దండిస్తారు. దానికంటే చదువు రాని వాడు పక్కనున్నాడనుకో, వాడిని ప్రతిదానికీ మీరు బెత్తంతో దండిస్తూ ఉంటారు కదా..అది చూసి మావాడు, సరిగా చదవకపోతే ఎలా దెబ్బలు తినాల్సొస్తుందో నేర్చుకుంటాడు. పక్కవాడి బాధ చూసి తనకా పరిస్థితి రాకుండా ఉండేందుకు బాగా చదువుతాడు. పక్కవాడి బద్ధకం మా వాడికి గుణపాఠమన్నమాట." - ఇది సరదాకోసం రాసిన గల్పికే ఐనా ఇందులోనూ కాస్త సూక్ష్మార్థం లేకపోలేదు. జీవితంలో అందరికీ అన్ని అనుభవాలూ స్వయంగా ఎదురుకాకపోవచ్చు. అసలు ఏ మనిషీ అన్ని రకాల అనుభవాలనీ తన జీవితకాలంలో పూర్తిగా స్వానుభవంలోకి తెచ్చుకోలేడు. పక్కవాళ్ళకి జరిగిన అనుభవాలని బట్టి కూడా చాలా విషయాలు నేర్చుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా నష్టం కలిగించేవీ, ఇబ్బందులుపెట్టేవీ , ప్రతికూలాత్మకమైన సంఘటనలూ తన దాకా రాకముందే వాటికి దూరంగా ఉండే ప్రయత్నాలు చేయడం, వాటి ఉచ్చులో పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలని వెదుక్కోవడం కూడా విజేతలు అలవరచుకునే ఒక లక్షణం. నీతి శతకాలూ, కొంతమంది జీవితచరిత్రలూ..ఇలాంటి గుణపాఠాలని నేర్పుతాయి. అందుకే పెద్దలు చెబుతారు - కొంతమందిని చూసి ఎలా ఉండాలో నేర్చుకోవడం. కొన్ని సంఘటనలని చూసి విజయసూత్రాలని గమనించడం ఎంత ముఖ్యమో, కొంతమందిని చూసి ఎలా ఉండకూడదో గ్రహించడం, కొన్ని సంఘటనలని చూసి ఏమి చెయ్యకూడదో తెలుసుకోవడం కూడా విజ్ఞుల లక్షణం.

*నవంబర్, 2012*

***

ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటి కా మాటలాడి యన్యుల మనముల్
నొప్పింపక, తా నొవ్వక
తప్పించుక తిరుగువాఁడె ధన్యుడు సుమతీ!

కొన్ని దశాబ్దాల క్రిందట ఒక వార్తా పత్రిక ఉండేది. అది మూతపడి కూడా 30 సంవత్సరాలు దాటిందనుకుంటాను. దానిలో సంపాదకీయాలు ఇదే విధానంలో ఉండేవి. 'ఫలానా రాజకీయవేత్త అలా చేసి ఉండకపోతే బావుండేదని ప్రజలు అనుకోవడం సమంజసమే అనుకుంటున్నాం' ఇలా! ఎదుటివాళ్ళు నొచ్చుకోకుండా, తానూ బాధపడకుండా సంభాషించడం ఒక కళ. భావోద్వేగాలని నియంత్రిస్తూ మానవసంబంధాలకి ఎక్కడా మచ్చరాకుండా మాట్లాడగలిగే వాళ్ళు అందరికీ హితులౌతారు. ముఖాముఖి మాట్లాడుకునేప్పుడైతే ఏమైనా అపార్థాలు వచ్చినా తొలగించుకోడానికీ, చర్చించుకుని పరిష్కరించుకోడానికి సానుకూల సందర్భాలు ఉంటాయి. ఇరవయ్యొకటో శతాబ్దం వచ్చేసరికి మనుషుల మధ్య సంబంధాల విషయంలోనూ, పరస్పర సంభాషణల విధానంలోనూ అనూహ్యమైన మార్పులు సంభవించాయి. ఈ కాలంలో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం అంటే ఫోన్ కాల్స్‌తో బాటు ఇ-మెయిల్స్ ద్వారా ఇ-సంభాషణలు కూడా ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ! ఇ-మెయిల్స్ ద్వారా సంభాషించుకోవడంలో కూడా సుమతీ శతకకర్త సలహాని పాటిస్తే మంచిదని సామాజిక శాస్త్రవేత్తలంటున్నారు. ముఖ్యంగా ఇ-మెయిల్ విషయంలో జరిగేదేమిటంటే -వ్రాసే వాళ్ళు , చదివేవాళ్ళు ఆయా సందర్భాల్లో ఏ మానసిక స్థితిలో ఉంటారో చెప్పలేం. ఇ-మెయిల్ వ్రాసేటప్పుడు ఎంతో ప్రశాంత వాతావరణం ఉండొచ్చు. అందుకున్న వాళ్ళు దాన్ని చదివేటప్పుడు ఏ చిరాకు వాతావరణంలోనో ఉండొచ్చు. మెయిల్‌లోని ప్రతివాక్యం, వ్రాసిన మనిషి మనసులోని భావాన్ని. చెప్పదలచుకున్న అర్థాన్ని అదే స్థితిలో ఎదుటివారికి అందిస్తుందని హామీ ఇవ్వలేం. అదంతా చదివే మనిషి మానసిక స్థితిని బట్టి కూడా ఉంటుంది. ఏదో సరదాగా వ్రాసిన వాక్యమే, ఎదుటివాడి మూడ్ బాగుండకపోతే 'తాడే పామై కరుచును' అన్న పరిస్థితి రావొచ్చు. అందుకనే ఇ-మెయిల్ వ్రాయడంలో కూడా 'నొప్పింపక తానొవ్వక' పద్ధతిని పాటించడానికి చిన్నచిన్న చిట్కాలు సూచిస్తున్నారు అనుభవజ్ఞులు.

ఒక్క మనిషి మనసులోనే ఒక్కో సందర్భాన్ని బట్టి ఒక్కో స్పందన ఉంటుంది. మరి ఇద్దరుమనుషులు అన్నాక అభిప్రాయ బేధాలు ఉండడం సహజమే. ఏదో విషయం గురించి మెయిల్ మీద మెయిల్ సాగుతుంది. అవతలి వైపునుంచి పరిస్థితి సీరియస్ ఐ, మెయిల్‌లో భాష పదునెక్కుతుంది.మనకి ఇంక పొడిగించడం ఇష్టం ఉండదు. అలాగని ముఖం మీద కొట్టినట్లు వ్రాస్తే సంబంధాలు దెబ్బతింటాయి. కానీ అ చర్చకి ఫుల్ స్టాప్ పెట్టాలని ఉంటుంది. వాతావరణం మరింత వేడెక్కకుండాఉండడానికి - చాలా సరళంగా ' మీ భావం నాకు అర్థమయింది (I understand your feelings)' అని ముగింపు వాక్యం ఎంతైనా సహాయపడుతుంది. ఇలా వ్రాయడం వల్ల అవతలి వ్యక్తితో విభేదించినట్లూ ఉండదు, అంగీకరించినట్లూ ఉండదు.. సంయమనం, సహనం ప్రతిఫలించే వాక్యాలు బంధాలని తెంచకుండా సున్నితంగా అభిప్రాయాలని వ్యక్తపరుస్తాయి.

అవతలి వ్యక్తి ఏదో వ్రాశాడు. అతను వ్రాసింది తప్పు అని తెలుసు, దాన్ని సూటిగా చెప్పేసి పర్యవసానాలకి సిద్ధపడడం ఒక మార్గమైతే 'మీరు వ్రాసింది ఇలాంటి అర్థం ఇస్తోంది. అదంత సబబు కాదేమోనని నా అభిప్రాయం. మీరు వ్రాసిందాన్ని నేనేమీ అపార్థం చేసుకోలేదు కదా? (Am I missing something?)' అనే 'నొప్పింపక తానొవ్వక' మార్గం మరొకటి కూడా ఉంది.

కొన్ని సార్లు ఎన్ని మెయిల్స్ ఇచ్చినా అవతలి వైపునుంచి సమాధానం రాదు, చాలా ముఖ్యమైన విషయానిక్కూడా స్పందన ఉండదు ' మీరు తీరికలేని పనుల్లో ఉంటారని తెలుసు. బహుశా ఆ బిజీలో నా లోగడ మెయిల్స్‌కి సమాధానం ఇచ్చే తీరిక లేకపోయి ఉండొచ్చు. ఫలానా పరిష్కారానికి మీ సమాధానం చాలా విలువైనది. మీ విలువైన సమయాన్ని కొంత కేటాయించి సమాధానం ఇస్తే

ఫలానా విషయానికి ఎంతో విలువైన సహాయం చేసిన వారౌతారు.. (I appreciate your valuable time to resolve this issue)` అనే వాక్యాలు అవతలి మనిషిలో స్పందన కలిగించే అవకాశం ఉంది.

ఏదైనా పనిని పురమాయించి వ్రాస్తూ ‘ఈ విషయంలో నా వైపునుంచి ఏమైనా సహాయంకావాలంటే అడగడానికి సందేహించకండి (Let me know if you need any further help on this)` అనే ముక్తయింపునిస్తే ఒక ప్రశాంత వాతావరణం ప్రసారమౌతుందని అనుభవజ్ఞుల సలహా.

ఏ పద్ధతి పాటించినా మానవ సంబంధాలు చాలా సున్నితమైనవని గమనించి మసలుకోవడం మంచిది!

*డిసెంబర్, 2012*

***

# *2011*

'నిన్న మనకు లేదు, రేపు మనది కాదు..నేడే నిజం...నేడే నిజం..' అని శ్రీశ్రీ గారు పాత్ర పరంగా ఒక సినిమాలో వ్రాసినా, నిజానికి నిన్నా, రేపు లేని' నేడు' కి విలువలేదు. 'రేపు' అందించే ఆశావాదాన్ని ఎవరూ కాదనలేరు. నిన్న లోకి జారిపోయిన గతం గురించే ద్వంద్వ వాదాలున్నాయి. గతాన్ని గుర్తు పెట్టుకోవాలని కొందరు అంటే, గతం గతః. అనుకుని మర్చిపోవాలని మరికొందరంటారు. విశ్లేషించి చూస్తే రెండు వాదనల్లోనూ వాస్తవం ఉన్న సంగతి విశదమౌతుంది. గతంలోని మంచిని ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. గతంలోని సంతోషకరమైన సందర్భాలు, మనం విజయం సాధించిన సంఘటనలూ, మన జీవితాలని కాంతిమయం స్నేహాలూ...ఇవన్నీ మనతో ఉండడం ఎంతైనా అవసరం. అవి ఇచ్చే ఉత్సాహ ప్రోత్సాహాలు మనల్ని ముందుకి నడిపిస్తాయి. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాక ఆశావహదృక్పథంతో పురోగమించడానికి దోహదం చేస్తాయి. ఇంక - గతంలోని కష్టాలు, ఎదురైన ఇబ్బందులూ, తగిలిన ఎదురుదెబ్బలూ..వీటి విషయంలోనే మనిషి జాగ్రత్తగా ఉండాలి. అలాంటి వాటిని పదే పదే తలచుకుని బాధపడడంలో ఉపయోగం లేదు, కానీ, అవి నేర్పిన గుణపాఠాలని మాత్రం మరిచిపోకూడదు. గతం నేర్పిన గుణపాఠాలే మరోసారి అలాంటి ప్రతికూల పరిస్థితుల్లోకి వెళ్ళకుండా సహాయం చేస్తాయి. అంటే ఏ కోణంనుంచి చూసినా గతాన్ని గుర్తుపెట్టుకోవడమనేది మనిషికి ఎంతైనా శ్రేయస్కరం. అందుకే డైరీలు, సమీక్షలూ, సమాలోచనలు, పునఃపరిశీలనలూ, జ్ఞాపకాలూ, స్మృతులూ..మనిషి వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తాయని మానసిక శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

మీ అభిమాన పత్రిక 'కౌముది' విజయవంతంగా నాలుగు వసంతాలు పూర్తిచేసుకుని ఐదో సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. నాలుగో వార్షికోత్సవ ప్రత్యేకసంచిక మీ ముందు ఉంది. ఈ సందర్భంలో, ఎప్పటిలానే, గతాన్ని క్లుప్తంగా సమీక్షించుకుంటూ, వర్తమానంలోని ప్రణాళికలని 'కౌముది' అభిమానులతో పంచుకుంటున్నాం.

*జనవరి,2011*

***

వాన కురిస్తే

ఆకసమున హరివిల్లు విరిస్తే
అవి మాకే అని ఆనందించే
కూనల్లారా' అని శ్రీశ్రీ వర్ణిస్తే,
'ఎదగడానికెందుకురా తొందరా
ఎదట బ్రతుకంతా చిందరవందర' అనీ
'పెరిగి పెరిగి పిల్లలే పెద్దలౌదురు
ఆ పెద్దలేమొ కలహిస్తే చిన్నబోదురు'

అని ఆరుద్ర వయసుపెరగడం వల్ల మనం ఏం కోల్పోతున్నామో చెప్పారు. 'పాలుగారు ప్రాయంలో..నీలాగె ఉన్నాను.' అని ఆత్రేయ గారు బాల్యంలోకి తొంగి చూడ్డంలోని నొస్టాల్జిక్ ఫీలింగ్‌కి పాటరూపమిచ్చారు. ఈ మధ్య ఒక కార్యక్రమంలో 'మీకెవరు ఆదర్శం?' అని అడిగినప్పుడు ఒకాయన చెప్పారు 'నాకు ఆదర్శం పసిపిల్లలు'! అని. నిశితంగా పరిశీలిస్తే తమకి తెలియకుండానే చిన్నపిల్లలు చేసే చాలా పనులనుంచి మనం నేర్చుకోదగినవి ఎన్నో ఉన్నాయనిపిస్తుంది. అడుగుల తడబాటుతో కిందపడినా ఏదో ఒకటి ఆసరా చేసుకుని లేచి నిలబడాలన్న ప్రయత్నం, ఆటపాటల్లో గిల్లికజ్జాలు తలెత్తినా వెంటనే మరిచిపోయి పక్కవాళ్ళతో చిరుతిళ్ళు పంచుకునే సహనగుణం, అసూయా, ద్వేషం లాంటి కల్మషాలెరుగని చిరునవ్వులు చిందించే స్వచ్ఛత, కొత్త విషయాలు ఆకళింపు చేసుకోవడంలో ఉండే చురుకుదనం, అర్థంకాని దేన్నైనా ప్రశ్నించి నేర్చుకోవాలన్న తపన, కోపంలో అమ్మ రెండు దెబ్బలు వేసినా మళ్ళీ ఆ ఒడిలోనే వెచ్చదనాన్ని ఆశించే మచ్చలేని నమ్మకం - పసిప్రాయంలో కనిపించే ప్రతి గుణమూ పెద్దలకి పాఠమే ఔతుంది. వయసుపెరిగినా బాల్యంలో కనిపించే స్వచ్ఛతని నిలుపుకోగలిగితే కొన్ని సమస్యలకైనా పరిష్కారం కనిపిస్తుంది. అందుకే పసిపిల్లలే ఆదర్శం అన్నాడాయన. చికాకులు, గందరగోళాలు కలవరపెడుతుంటే .. పసిపిల్లలని చూద్దాం..వాళ్ళతో ఆడుకుందాం.. వాళ్ళనుంచి పాఠాలు నేర్చుకుందాం.. కొంచెంసేపైనా సేదదీరుదాం..!

***ఫిబ్రవరి, 2011***

***

తెలుగు పాఠకులకి, తెలుగు ప్రేక్షకులకి పరిచయం అవసరంలేని ప్రముఖ రచయిత ముళ్ళపూడి వెంకట రమణగారు క్రిందటి వారం కన్నుమూశారు. తెలుగుసాహిత్యంలో ఒక హాస్యరసాధ్యాయం ముగిసింది. అపహాస్యం కాని హాస్యం, స్వచ్ఛమైన హాస్యం, వినూత్నమైన హాస్యం, నొప్పింపక మెప్పించే హాస్యం ఒక పెద్దదిక్కుని కోల్పోయాయి. ఎన్ని రకాల రచనలు చేసినా ముళ్ళపూడి వెంకటరమణ గారి రచనల్లో చాలా చోట్ల ప్రత్యక్షంగానూ, కొన్ని చోట్ల అంతర్లీనంగానూ సాగే హాస్యమే ఆయనకి తెలుగు పాఠకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని కల్పించింది. ఒక గిరీశం, ఒక బారిష్టర్ పార్వతీశం.. ఇంకో అప్పుల అప్పారావు , మరో బుడుగు..ఇరవయ్యో శతాబ్దం గుర్తుపెట్టుకున్న కొన్ని కేరక్టర్స్ ఇవి. ఒక పాత్రని సృష్టించి దాన్ని సార్వజనీనం చేసి, దశాబ్దాలు గడిచినా ఆ పాత్ర నిత్యనూతనంగా నిలిచిపోయేలా చేయడంలో విజయం సాధించిన అతి కొద్ది మంది తెలుగు రచయితల్లో రమణగారు మొదటి వరుసలో నిలుస్తారు. తనదంటూ ఒక శైలిని ఏర్పరచుకుని , తనకంటూ ఒక మార్గాన్ని వేసుకుని రచనలు చేశారు. అందుకే ఆయనవ్రాసిన కథ ఐనా, నవల ఐనా, గల్పిక ఐనా రమణగారి మార్కుగా నిలిచిపోయింది. ఆయన వ్రాసిన రచనలన్నీ ఒక ఎత్తు ఐతే ఆయన వ్రాసిన(వ్రాసుకున్న) 'కోతి కొమ్మచ్చి' ఇంకో ఎత్తు. ఆత్మకథలు ఎవరైనా వ్రాసుకోవచ్చు కానీ, ఉన్నది ఉన్నట్టు వ్రాయడానికి ఎంతో చిత్తశుద్ధి, ధైర్యం, నిజాయితీ ఉండాలి. ఎక్కడా రాజీ పడకుండా భేషజానికి పోకుండా తనకెదురైన దుర్భరమైన పరిస్థితుల్ని యధాతధంగా పదిమందితో పంచుకోవాలంటే ఎంతో ఆత్మ విశ్వాసం కావాలి. అలానే ఎదురైన వ్యక్తుల వ్యక్తిత్వాలని కూడా ఎక్స్ రే తీసినట్లు చెప్పాలన్నా ఎంతో ధైర్యం కావాలి. ఇవన్నీ పుష్కలంగా ఉండబట్టే రమణగారి 'కోతి కొమ్మచ్చి' తెలుగు రచయితల ఆత్మకథల్లో ఒక విశిష్టమైన స్థానాన్ని నిలుపుకుంటుంది. ఎదురైన కష్టాలని సీరియస్‌గా తీసుకుని సెల్ఫ్ పిటీకి లోనవ్వడం కంటే వాటిని అనుభవిస్తూ నవ్వడం అలవాటు చేసుకున్నారు కాబట్టే రమణగారి రచనల్లో హాస్యంతో పాటు కన్నీళ్ళ పొరలు కూడా కొన్ని చోట్ల తొంగిచూస్తుంటాయి. 'కోతి కొమ్మచ్చి' కేవలం రమణ గారి ఆత్మకథ మాత్రమే కాదు. అదొక సమగ్ర వ్యక్తిత్వ వికాస శిక్షణా గ్రంధం! సినీ రచయితగా కూడా వెంకటరమణ గారు సాధించిన విజయాలు చరిత్రలో నిలిచిపోయేవే. బాపు, రమణల సమిష్టి కృషిగానే రూపొందినా, తను రచనలు చేసిన సినిమాల్లో ప్రతి చిన్న పాత్రకీ రమణగారు ఆపాదించే కేరక్టరైజేషన్ టెక్నిక్స్ సినిమా రచయితలు కావాలనుకున్న వారికి ఒక గైడ్‌లా ఉపయోగ పడతాయి. అలనాటి 'స్నేహం', 'ముత్యాలముగ్గు', 'అందాల రాముడు' మొదలైన చిత్రాల్లోని పాత్రలన్నీ దీనికి ఉదాహరణలే. ఈ కోణంలో 'మిస్టర్ పెళ్ళాం' సినిమాని రిఫరెన్స్ గ్రంథంలా చూస్తానని త్రివిక్రమ్ శ్రీనివాస్ చెప్పారొకసారి. తెలుగుపదాలతో రమణగారు చేసినన్ని 'పన్' ప్రయోగాలు ఇంకెవ్వరూ చెయ్యలేదేమో. ఏ ప్రయోగం చేసినా ఆరోగ్యకరంగా నవ్వించడమే ఆయన రచనల ముఖ్యోద్దేశంగా నిలిచింది. శ్రీనాధకవి సార్వభౌముడు షూటింగ్ సందర్భంలో, 1992 చివర్లో అనుకుంటాను, ఓ సాయంకాలం రమణగారిని, బాపుగారిని వారి గెస్ట్ హౌస్‌లో కలుసుకుని కొన్ని గంటల పాటు వారి హాస్య ప్రియత్వాన్ని ప్రత్యక్షంగా ఆస్వాదించే అవకాశం లభించింది. మిత్రుడు వేదగిరి రాంబాబు తన సంపాదకత్వంలో వెలువడుతున్న 'పల్లకి' పత్రికలో 'గిరీశం నమస్కార భాణాలు' -గినభాలు- అనే శీర్షిక రమణగారితో వ్రాయిస్తున్నారపుడు. ఆ పత్రిక ఎక్కువకాలం నడవకపోవడంతో రమణగారి 'గినభాలు' ఫీచర్ కూడా నాలుగైదు వారాలు మించి కొనసాగ లేదని జ్ఞాపకం. రమణగారి కుటుంబసభ్యులకి 'కౌముది' తన ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తోంది. రాతని దూరం చేసుకున్నప్పటికీ బాపు గారి గీతలు మాత్రం నిరంతరం కొనసాగాలని తెలుగు పాఠకులు, ప్రేక్షకులు కోరుకుంటున్నారు. ***మార్చ్, 2011***

***

భాస్కరం  ఆఫీసులో బాగా బిజీ పనిలో ఉండగా సెల్ ఫోన్ మోగింది.

"ఎవరూ?"

"నేను బావా.. ప్రసాద్‌ని. అమ్మని తీసుకుని కోణార్క్‌లో భువనేశ్వర్ వెళ్తున్నాను. ఇంకో నాలుగు గంటల్లో మీ వూళ్ళో ఆగుతుంది. పది నిమిషాలే టైమ్ ఉంటుంది కాబట్టి ఇంటికి రాలేము. అక్కని తీసుకుని స్టేషన్‌కి వస్తావా? అమ్మ చూడాలంటోంది. మళ్ళీ ఎన్నాళ్ళకి కుదురుతుందో..!?" అవతలి వైపునుంచి బావమరిది ప్రసాద్ చెప్పాడు.

"ఆఫీసులో ఇన్స్పెక్షన్ నడుస్తోంది ప్రసాద్. నేను ఆఫీసునుంచి సరాసరి వస్తాను. మీ అక్కని  సూటిగా రైల్వేస్టేషన్ కి రమ్మని ఫోన్ చేస్తావా?"

"సరే బావా.." ఫోన్ పెట్టేశాడు ప్రసాద్. భాస్కరం మళ్ళీ ఆఫీసు బిజీలో మునిగిపోయాడు.   సాయంత్రం స్టేషన్‌కి వెళ్ళి అత్తగారిని, బావమరిదిని కలుసుకున్నాడు. లలిత రాకపోవడం చాలా ఆశ్చర్యం  కలిగించింది.  లలితని చూడలేకపోయినందుకు అత్తగారు చాలా బాధపడింది.

"నేను రెండుమూడు సార్లు ఫోన్ చేశాను బావా..మెసేజ్ కూడా పెట్టాను. అక్క ఇంట్లో లేదేమో మరి.." సాధారణంగా లలిత తనకి చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళదే అనుకుంటూ వెనక్కి బయలుదేరాడు భాస్కరం. ఇల్లు చేరుకునే సరికి రాత్రి ఎనిమిదయింది. కాలింగ్ బెల్ నొక్కాడు. పదినిమిషాల తర్వాత కానీ లలిత  తలుపు తియ్యలేదు.

"ఏమైందోయ్.. ఎన్నిసార్లు ఫోన్ చేసిన లిఫ్ట్ చెయ్యలేదట..?" అప్పుడే లలిత మొహంలోకి చూశాడు భాస్కరం.   కళ్ళు ఎర్రగా ఉన్నాయి. మొహం అంతా కళావిహీనంగా ఉంది. చాలా సేపటినుంచి ఏడుస్తున్నట్లు మొహం మీద తడారిపోయిన కన్నీటి చారికలు చెబుతున్నాయి. భాస్కరం అంత తొందరగా బెంబేలు పడే మనిషి కాదు.

"ఏమైందోయ్..?" అనునయంగా అడిగాడు.

"అదే. క్రిందటి వారం వరలక్ష్మి నన్ను నానా మాటలు అంది కదా. అవే గుర్తొచ్చి బాధ వేసింది.."  చెప్పలేక చెప్పింది.

"ఎప్పుడో వారం క్రిందట జరిగినదానికి ఇంకా అంతలా బాధపడాలా? పైగా ఆవిడ నోటి దురుసుతనమే  బయట పడింది కానీ, నీకేం కాలేదు కదా.."

"అవుననుకోండి..ఐనా గుర్తొచ్చినప్పుడల్లా కన్నీళ్ళు ఆగడం లేదు.."

"అందుకనే మీ తమ్ముడు ఎన్ని సార్లు ఫోన్ చేసినా తియ్యలేదా?"

"ఉదయాన్నుంచి మోగిన ఫోన్‌లు ప్రసాద్ నుంచా?"  విషయం చెప్పాడు భాస్కరం..

"అయ్యో అమ్మని మళ్ళా ఎన్నాళ్ళకి చూస్తానో నండి. నేనీ దిగుల్లో ఉండి ఫోన్ ఎత్తలేదు. రెండు మూడు సార్లు ఫోన్ మోగిన సంగతి గమనించాను కానీ మనసంతా ఏదోలా ఉండి తియ్యబుద్ధి  కాలేదు. అయ్యో బంగారం లాంటి అమ్మని చూసే అవకాశం మిస్సయ్యానే...!?"

"లలితా .. ఓ ఇంగ్లీషు రచయిత ఏమన్నాడో  తెలుసా?  గతం లోని కష్టాల గురించి..జరిగిపోయిన చెడు సంఘటనల గురించి పదే పదే గుర్తు తెచ్చుకుని మనసు చుట్టూ విషాదపు తెరలు దించుకుంటుంటే వర్తమానంలో ముంగిట్లో కొచ్చిన అవకాశాలని కూడా గుర్తుపట్టలేం. మార్చలేని గతం మార్పుకి వేదికైన వర్తమానానికి సంకెళ్ళు వెయ్యకూడదు...!" కాస్త  తేరుకున్నాక లలితకి ఎలా చెప్పాలో మనసులో రిహార్సల్స్ వేసుకున్నాడు భాస్కరం.

***ఏప్రిల్, 2011***

హాఫ్ యియర్లీ పరీక్షలు సమీపిస్తున్నాయి. వెంకట్రావ్ గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతున్నాయి. ఈ పరీక్షల్లో సరిగ్గా మార్కులు రాకపోతే యాన్యువల్ పరీక్షలకి అనుమతించరు. చదివీ..చదివీ.. చదివిందే మళ్ళీ చదివి కష్టపడ్డాడు. ఎలాగైతే హాఫ్ యియర్లీ ఎక్జామ్స్ ఐపోయాయి. 'అమ్మయ్య' అనుకున్నాడు. కాస్త ఊపిరి పీల్చుకునేంతలోనే యాన్యువల్ పరీక్షలు వచ్చేశాయి. మళ్ళీ అదే టెన్షన్.. కంగారు. ఏమౌతుందో? పొరబాటున ఫెయిల్ ఐతే ఇంటర్మీడియట్‌కి వెళ్ళలేడు. అమ్మయ్య!! టెన్త్ ఐపోయింది. మళ్ళీ ఇంటర్మీడియట్ పరీక్షలు.. ఆపైన ఇంజినీరింగ్ పరీక్షలు.. సరే ఎలాగో డిగ్రీ చేతికొచ్చేసింది. ఓకే..ఇంక లైఫ్ లో పరీక్షలు వ్రాసే అవసరం లేదు అనుకున్నాడు. అబ్బే మళ్ళీ తప్పలేదు.. ఎక్కడ ఉద్యోగానికి అప్లై చేసినా ఎంట్రెన్స్ ఎక్జామ్స్ అన్నారు. అబ్బా..ఇంకా పరీక్షలా..? అనుకున్నాడు వెంకట్రావ్. ఎలాగైతే..ఉద్యోగం వచ్చింది. అందునా గవర్నమెంట్ ఉద్యోగం. ఇంక సెటిల్ ఐపోయినట్లే , పరీక్షల గొడవ వొదిలింది అనుకుని దీర్ఘంగా నిట్టూర్చాడు. మూడేళ్ళకి ప్రమోషన్ కోసం మళ్ళీ పరీక్షల ప్రహసనం తప్పలేదు. అదైపోయిందనుకుంటే పిల్లల పరీక్షలొచ్చాయి. వాళ్ళని పరీక్షలకోసం ప్రిపేర్ చెయ్యడంలో తను పరీక్షలు రాసినప్పుడు పడినంత టెన్షనూ పడ్డాడు. ఇదిలా ఉంటే ఉద్యోగంలో ఎన్నో సమస్యలు..ఒక్కో సమస్యా ఒక్కో పరీక్షే.. రిటైరయ్యేవరకూ వాటిని ఎదుర్కోక తప్పలేదు. రిటైరయ్యాక మనవళ్ళని కాన్వెంట్‌కి తీసుకెళ్తూ అనుకున్నాడు..ఊహూ..పరీక్షలు ముగియడం అనేది ఉండదు. ఐతే క్లాసురూమ్ పరీక్షలు..లేకపోతే జీవితంలో పరీక్షలు. ఒకదాని తర్వాత మరోటి అని తెలుసుకోడానికి, సర్దుకోడానికి జీవితకాలం పట్టింది. పరీక్షలు, సమస్యలు ఎదురైనప్పుడు వాటిని ఎలా ఎదుర్కుంటామో, ఫలితం ఏమవుతుందో అని కంగారు పడే బదులు వాటిల్లో ఉత్తీర్ణమయ్యే మార్గాల గురించి, పరిష్కరించుకుని విజయం సాధించే విధానాల గురించి ఆలోచించి, శక్తి యుక్తుల్ని ఆ దిశగా కేంద్రీకరిస్తే సానుకూల ఫలితాలు సాధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయనేది అనేక అనుభవాలు చెబుతున్న పాఠం..!

***మే, 2011***

***

దాదాపు అరేళ్ళ క్రిందట ఇండియా వెళ్ళినప్పుడు ఓ సినీ దర్శకుడ్ని(ఆయన రచయిత కూడా) కలుసుకోవడం జరిగింది. ఆయన చెప్పిన ఒక సంఘటన మీతో పంచుకోవాలనిపించింది. ఆయన ఒక ఫైర్‌బ్రాండ్.! మనసులో ఉన్నది చెప్పడానికి అస్సలు మొహమాటపడని మనస్తత్వం. మరో యువదర్శకుడి సినిమా ఫంక్షన్‌కి ఈయన్ని గెస్ట్‌గా పిలిచారట. ఆ నిర్వాహకులతో ఫైర్‌బ్రాండ్ చెప్పారట "నన్ను ఫంక్షన్స్‌కి పిలవకండి. ఎందుకంటే నేను హిపోక్రసీతో మాట్లాడలేను. మనసులో ఉన్నమాటే పైకి అనేస్తాను. అందువల్ల చాలా సార్లు ఫంక్షన్‌కి వచ్చిన వాళ్ళు అఫెండ్ ఐన సందర్భాలు ఉన్నాయి." అని. ఐనాసరే వాళ్ళు బలవంతం చెయ్యడంతో ఆ ఫంక్షన్‌కి వెళ్ళారట. ఓ యువదర్శకుడి సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్ అది. కళాతపస్వి విశ్వనాథ్‌గారు మరో ముఖ్య అతిథి. ఆ యువదర్శకుడు మాట్లాడుతూ "విశ్వనాథ్‌గారు ఈ ఫంక్షన్‌కి రావడం నా అదృష్టం. ఆయన ముందు మేమందరం పిపీలికాల్లాంటి వాళ్ళం. ఆయన సినిమా తీసిన సినిమాలతో పోలిస్తే నేను సినిమా తీసే సినిమాలు చంద్రుడిలో మచ్చల్లాంటివి..." ఇలా ప్రసంగించాడట. ఆ తరువాత ప్రసంగం ఫైర్‌బ్రాండ్ గారిదే ఈయన లేచి " బాబూ.. నువ్వు విశ్వనాథ్‌గారిని పొగిడిన విధానం బావుంది. నో డౌట్.. విశ్వనాథ్ గారు ఈజ్ గ్రేటెస్ట్ డైరెక్టర్ ఆఫ్ ఆల్ టైమ్స్. ఐతే ఇంకో విషయం నువ్వు గుర్తుపెట్టుకోవాలి. ఒకరిని పొగిడే క్రమంలో నిన్ను నువ్వు అంతగా కించపరుచుకోవాల్సిన పనిలేదు. నువ్వు తీసే సినిమా నీకు తప్పక నచ్చి ఉండాలి. నువ్వు తీసిన సినిమా నీకే చంద్రుడిలో మచ్చలా కనిపిస్తుంటే ప్రేక్షకులకి ఎలా నచ్చుతుంది? మదర్ థెరిసా ఎన్నో మంచి పనులు చేసి ఎంతో పేరు తెచ్చుకున్నారు. మీ అమ్మగారు అంత పేరు తెచ్చుకోలేదని మీ అమ్మని తక్కువగా చూస్తావా ? విశ్వనాథ్‌గారి సినిమాలని మదర్ థెరిసాతో పోలిస్తే నువ్వు తీసే సినిమాలని మీ అమ్మగారితో పోల్చుకో.. " అని తన ప్రసంగాన్ని కొనసాగించారట!

***జూన్, 2011***

***

కొన్ని దశాబ్దాల క్రిందట ఐతే మనుషుల మధ్య సంభాషణా సాధనాలు చాలా తక్కువగా ఉండేవి. ఎదురుపడినప్పుడు మాట్లాడుకోవడం, మహా ఐతే ఉత్తరాలు వ్రాసుకోవడం, మరీ విలాసవంతమైన సంభాషణా సాధనం టెలిఫోన్.. అంతవరకే..! గత రెండు దశాబ్దాలలో సాంకేతిక రంగం తెచ్చిన విప్లవాత్మకమైన మార్పులు - సమాచారసాధనాల మీద, సంభాషణా ప్రత్యామ్నాయాల మీదా కూడా ఎంతో ప్రభావాన్ని చూపించాయి. ఈ రోజుల్లో ఇద్దరు మనుషులు మాట్లాడుకోవాలంటే ప్రత్యామ్నాయాలు కోకొల్లలు. సెల్ ఫోన్, ఎస్.ఎమ్.ఎస్, ఇ-మెయిల్, చాటింగ్, ఫేస్‌బుక్ లాంటి స్వయంకల్పిత సమాజాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు..ఇంకా..ఇంకా! ఇవేమీ లేనప్పుడు సంభాషణాపరంగా అపార్థాలు పరిమితంగా ఉండేవి. - 'ఎందుకలా మాట్లాడావు?' అనో 'అవునూ నా క్రిందటి ఉత్తరానికి నువ్వు జవాబు వ్రాయలేదే?' అనో అంతే.! మరిప్పుడేమో ప్రసార సాధనాలు పెరగడంతో బాటుగా సంభాషణాపరంగా అపార్థాలకి అవకాశాలు కూడా పెరిగిపోయాయి.

* 'నేను ఇ-మెయిల్ ఇచ్చి వారం ఐంది. నువ్వు రిప్లై ఇవ్వకపోయే సరికి నా మీద కోపం వచ్చిందేమో ననుకున్నా..'

'అయ్యో లేదే. నీ ఇ-మెయిల్ అందలేదే..? ఒక్క నిమిషం...ఓ...ఇక్కడ జంక్ మెయిల్ బాక్స్‌లోకి వెళ్ళిపోయింది..'
'అవునా..సారీ నిన్ను అనవసరంగా అపార్థం చేసుకున్నా..'

* దీన్ని రివర్స్ చేసి చూస్తే - కొంతమంది ఏదో మెయిల్లో పంపించమని అడుగుతారు మనం అలానే చేస్తాం. అందుకున్నవాళ్ళు ఆ విషయం తెలియచేయరు. వాళ్ళకి అందిందో లేదోనని మనలో సందేహం అలానే ఉంటుంది. ఇ-మెయిల్ అంటే 'హెలో..' అనడం లాంటిదనీ, వ్రాసిన వాళ్ళకి కనీసం అందినట్లు తెలియచేస్తే ఒక ప్రోటోకాల్ పూర్తవుతుందనీ గుర్తించని అలవాటు వల్ల మరికొన్ని అపార్థాలు. బిసిసిలో వందమందికో రెండొందల మందికో 'నా ఫోటోలు చూడండోచ్..' అనో లేదా ఇంకేదో విషయమో దండోరా వేసి ఒక్కొక్కరి వద్దనుంచి సమాధానం రాలేదని ఎదురుచూడ్డం మరో నిరాశాహేతువు.! సెల్ ఫోన్ విషయంలోనూ ఇవే అపోహలు. వాయిస్ మెసేజ్ పెట్టడం, సమాధానం రాకపోతే కోపం రావడం, అవతలవైపు ఏదో పొరబాటు వల్ల వాయిస్ మెయిల్స్ తుడిచిపెట్టుకుపోవడం.. ఇదొక అపార్థాల వలయం.! ఫేస్ బుక్ విషయానికి వస్తే - మరో సరికొత్త మానసిక విశ్లేషణా గ్రంథం వ్రాయవచ్చునేమో అనిపిస్తుంది.

* 'అవునులే..మేమెందుకు కనిపిస్తాం.. నువ్వు అందరిఫోటోలకీ కామెంట్లు వ్రాస్తావ్. మొన్న మా చంటిగాడు పాకుతున్నాడని మెసేజ్ పెట్టుకుంటే నువ్వు కనీసం లైక్ కూడా పెట్టలేదు..'

'అవునా..? సారీ రా. నేనసలు రెండు రోజులు ఫేస్‌బుక్‌లో లేను. బహుశా నీ మెసేజ్ కిందికి వెళ్ళిపోయి ఉంటుంది.'

* 'అంతేలెండీ..మీకు వెయ్యిమంది ఫ్రెండ్స్ ఉన్నారుగా ..మేమెక్కడ కనిపిస్తాం..'

'అయ్యో ఎందుకంత నిష్ఠూరం వేస్తారు..?'

'మొన్న ఫేస్‌బుక్‌లో ఛాట్ చేస్తుంటే హఠాత్తుగా లాగౌట్ ఐపోయారు. మరీ అంత గౌరవం లేకుండానా?'

'ఓ..అదా..! అప్పుడు కరెంట్ పోయిందండీ. లాప్‌టాప్ షట్‌డౌన్ ఐపోయింది..'

* సమాచార సాధనాల్లో ఎన్ని వైవిధ్యాలొచ్చాయో, అవగాహనా లోపాల్లోనూ అన్ని వైవిధ్యాలొచ్చాయని ఒక విశ్లేషణలో తేలినట్లు తాజా సమాచారం. అప్పుడైనా, ఇప్పుడైనా, ఎప్పుడైనా అపార్థాలకి కారణం - ఒక దృష్టితోనే ఆలోచించడం, ఎదుటి వ్యక్తి కోణంలో ఒక్క నిమిషం ఆలోచించి బెనిఫిట్ ఆఫ్ డౌట్ కి స్థానం ఇవ్వకపోవడం. జీవన శైలుల్లో వేగం పెరిగిపోయింది. వ్యక్తిగత సమస్యలూ పెరిగిపోయాయి. మన సందేశానికి అవతలి వ్యక్తినుంచి స్పందనలేదా..? ఇంకోసారి.. మరొక్కసారి ప్రయత్నించడం తప్పులేదేమో

ఆలోచించండి. అవతలనుంచి సమాధానం రాకపోవడం వల్ల ఫీల్ ఔతున్నామంటే అవతలి వ్యక్తి మీద అభిమానం ఉందనే అర్థం కదా! అలాంటప్పుడు ఇంకోసారి మనమే పలకరిస్తే ఏం పోయింది. మంచితనం మిగులుతుంది, స్నేహభావం పెరుగుతుంది అంతే కదా! ఎదుటి వారి దృష్టితో ఆలోచించడం అలవాటు చేసుకుని కొంచెం సహనం, కొంచెం శాంతం పెంపొందించుకుంటే, సంభాషణా సాధనం ఏదైనా, అపార్థాలకి తావుండదు. పరిచయాలకి, స్నేహాలకి విలువ పెరుగుతుంది - అని ఈ కాలపు మానసికవిశ్లేషకుల సలహా.!

*జూలై 2011*

***

ఈ మధ్యనే చదవడం తటస్థించిన ఈ గల్పికని పాఠకులతో పంచుకోవాలనిపించింది. మూలకథని కొంచెం మార్చి మన నేపథ్యంలో వ్రాస్తున్నాను. అనగనగా ఒక ఆశ్రమం. గురువుగారు శిష్యులకి సమయం విలువగురించి వివరిస్తున్నారు. కొంతమంది శిష్యులు ఇచ్చిన పనుల్ని నియమిత సమయంలో పూర్తి చెయ్యగలుగుతున్నారు. మరికొంతమంది చెయ్యలేక పోతున్నారు. అందరికీ ఇచ్చినవి ఒకే రకమైన సంక్లిష్టత ఉన్నవీ, వాటిని పూర్తిచేయగల సామర్థ్యం కూడా ఇంచుమించు అందరిదీ సమానమే. మరి వాళ్ళల్లో ముందూ వెనుకలు ఎందుకని గురువుగారు ఆరా తీస్తే తెలిసిన విషయం - కొంతమందిలో చేస్తున్న పనిమీద దృష్టి కేంద్రీకరించలేకపోవడం, అనవసరమైన పనులతో కాలాన్ని వెచ్చించి అవసరమైన పనుల విషయం వచ్చేసరికి 'సమయం సరిపోలేదనడం'.. ఈ విషయాన్ని శిష్యులకి సోదాహరణంగా చూపించాలనే ఆలోచనతో గురువుగారు శిష్యులందరినీ ఒకచోట సమావేశపరిచారు.

కాస్త వెడల్పూ, లోతూ ఉన్న ఒక పాత్రని తెప్పించారు. అందులో ముందుగా, అప్పుడే తోటలో కోసుకొచ్చిన తాజా పండ్లని నింపమన్నారు.

శిష్యుడు నింపాడు.

"పాత్ర నిండిందా?"

"నిండింది గురువుగారూ.."

"మరికొన్ని ఫలాలని నింపగలవా?"

"అసాధ్యం.."

"ఐతే ఒక పని చెయ్యి..కొన్ని గులకరాళ్ళని నింపడానికి ప్రయత్నించు.." శిష్యుడు అలానే చేశాడు. పండ్లు ఆక్రమించగా మిగిలిన ఖాళీలలో కొన్ని గులకరాళ్ళని నింపగలిగాడు.

"ఇప్పుడు పాత్ర నిండిందా?" "నిండిపోయింది గురువుగారూ.."

"ఇంకేం ఖాళీ లేదు కదా..?"

"లేదు గురువుగారూ.."

"కొంచెం ఇసుక తీసుకుని దాన్ని నింపడానికి ప్రయత్నించు.."

నిజమే.. పండ్లు, గులకరాళ్ళతో పాత్ర నిండిందనుకున్నాడు కానీ ఇసుక నిండడానికి మరికొంచెం ఖాళీ ఉంది. కాస్త ఇసుకని నింపగలిగాడు. ఈ తతంగాన్నంతా గమనిస్తున్న శిష్యులకి గురువుగారు ఏమి నిరూపించదలచుకున్నారో అర్థం కాలేదు. ఇప్పుడు పాత్రలో పండ్లూ, గులకరాళ్ళూ, ఇసుకా..అన్నీ నిండి ఉన్నాయి.

"ఇప్పుడొక పనిచెయ్యి..మొత్తం పాత్రని ఖాళీ చెయ్యి.." గురువుగారి ఆజ్ఞ ప్రకారం శిష్యుడలానే చేశాడు..

"ఈసారి ముందుగా ఇసుకతో పాత్రని నింపు.."

ఇసుకతో పాత్ర నిండింది.

"ఇంకా ఏమైనా ఖాళీ ఉందా?"

"లేదు గురువర్యా.."

"ఇప్పుడు పండ్లు నింపడానికి ప్రయత్నించు.."

"లేదు గురువర్యా..ఇసుక పాత్ర అంచులవరకూ నిండిపోయింది. ఇంక పండ్లూ ఫలాలూ పట్టే ఖాళీ లేదు.."

"విషయం అర్థమయిందా?..మనకున్న సమయం ఈ పాత్రలాంటిది. అందరికీ ఒకే పరిమాణం గల కాలాన్ని ప్రకృతి ఇచ్చింది. ఐతే కొంతమంది ముందుగా దాన్ని ప్రాధాన్యత గల పనులతో నింపుకుంటారు. అంటే ముందుగా మీరు నింపిన పండ్లూ, ఫలాలూ లాంటివన్న మాట. ముందుగా ప్రాధాన్యత గల పనులని పూర్తిచేస్తే గులకరాళ్ళూ, ఇసుక లాంటి ప్రాథాన్యత లేని లేదా ద్వితీయశ్రేణి పనులకు సమయం ఎప్పుడూ లభిస్తుంది. అలా కాకుండా ముందుగానే ఇసుకలాంటి ప్రాథాన్యతలేని, నిరుపయోగమైన పనులతో కాలాన్ని వృథాచేస్తే అవసరమైన పనులుచేయడానికి సమయం సరిపోదు. లక్ష్యం సాధించలేరు, గమ్యాన్ని చేరుకోలేరు. విజేతలకీ, పరాజితులకి ఉండవలసిన ఎన్నో లక్షణాలలో ఒకటి సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, సాధించవలసిన కార్యాల ప్రాధాన్యతని సరిగ్గా అంచనా వేసుకుని ముఖ్యమైన వాటిని ముందుగా వాటిని పరిష్కరించుకోవడం. అందుకే కొంతమంది ఎన్ని పనులు చేసినా సమయం ఇంకా మిగిలిపోతూనే ఉంటుంది, మరికొంతమంది ఏమీ సాధించకుండానే సమయం పరుగులుతీస్తూ ఉంటుంది.."

*ఆగస్ట్, 2011*

***

అనుకున్న పని ఆశించిన సమయానికి జరగలేదు - నిరాశ !

నచ్చని మనిషి ఎప్పుడూ వదిలిపెట్టకుండా బోర్ కొడుతుంటాడు - చిరాకు!

ఎదురుచూస్తున్న మనిషో, బస్సో, రైలో.. ఇంకా రాలేదు - విసుగు!

పిల్లలో, స్నేహితులో..చెప్పినట్లు చెయ్యలేదు - కోపం!

ఎప్పుడో జరిగిపోయిన చెడ్డ సంఘటన గుర్తొస్తోంది - బాధ!

నిరాశ, చిరాకు, విసుగు, కోపం , బాధ.. ఇంకా ఇలాంటి భావాలు ఎన్నో - అన్నీ ప్రతికూల భావాలే.

పరిసరాల్ని చిందరవందర చేస్తాయి, వర్తమానాన్ని అతలాకుతలం చేస్తాయి. మనకి తెలీకుండానే మనలోని శక్తిని హరించేస్తాయి.. మనతో బాటు మన చుట్టుపక్కల ఉన్న వాళ్ళందరికీ నెగిటివ్ ఎనర్జీనిస్తాయి.. ఇలాంటి ప్రతికూల భావాలన్నింటికీ పరిస్థితులు, ఎదుటివారు, మన నియంత్రణలో లేని సంఘటనలు.. ఇవే కారణమా? అలా అనుకోబట్టే అందరిమీదా, అన్నింటి మీదా విరుచుకుబడుతుంటాం. ఈ నెగిటివ్ ఫీలింగ్స్ వల్ల మనల్ని మనమే దహించేసుకుంటున్నామన్న విషయం తెలుసుకోలేం కాబట్టే వాటికి లొంగిపోతుంటాం.

ప్రతికూల భావాలని అనుకూల భావాలుగా మార్చుకునే శక్తి, మేజిక్ మనలోనే ఉందని తెలుసుకుని, అభ్యసించి, అనుసరిస్తే - మనల్ని మనం కాపాడుకోవడమే కాదు, మన పరిసరాల్ని కూడా తేజోమయం చెయ్యగలమని విజ్ఞుల సలహా!

అనుకున్న పని ఆశించిన సమయానికి జరగలేదు -

ఇదొక సవాల్ కదా. ఎక్కడ తప్పు జరిగిందో విశ్లేషిద్దాం. పొరబాటు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుందాం!

నచ్చని మనిషి ఎప్పుడూ వదిలిపెట్టకుండా బోర్ కొడుతుంటాడు -

ఏదో పాపం! అది అతని బలహీనత. అతన్ని నచ్చలేదనుకోవడం మన బలహీనతేమో కదా. బలహీనతల్ని క్షమించగలగడమే మనలోని బలానికి నిదర్శనం కాదా!? ఎదురుచూస్తున్న మనిషో, బస్సో, రైలో.. ఇంకా రాలేదు -

అనుకోకుండా దొరికిన ఈ అదనపు సమయాన్ని ప్రయోజనకరంగా వాడుకోవచ్చేమో! ఊఁ.. మనం చెయ్యాల్సిన పనుల్ని ఒకసారి ఈ సమయంలో సమీక్షించుకోవడమో, పరిసరాల్ని గమనించి కొత్త విషయాలేమైనా తెలుస్తాయేమో పరిశీలించడమో చేస్తే ఈ సమయం సద్వినియోగం అవ్వొచ్చు కదా!

పిల్లలో, స్నేహితులో..చెప్పినట్లు చెయ్యలేదు - సహనం లేకపోవడం మనలోని లోపం కాదా!?

వాళ్ళు మన మాట ఎందుకు వినలేదో తెలుసుకుని,

అర్థం చేసుకుని వాళ్ళతో చర్చిస్తే ఇద్దరికీ నచ్చే పరిష్కారం దొరకొచ్చు కదా!

ఎప్పుడో జరిగిపోయిన చెడ్డ సంఘటన గుర్తొస్తోంది - గతంలో మంచి సంఘటనలు కూడా జరిగాయి కదా! మనల్ని ఎందరో మెచ్చుకున్న, మన శక్తి సామర్థ్యాలు పది మందీ ప్రశంసించిన, ఆ జ్ఞాపకాలని ముందుకి తీసుకొస్తే మనసుకి మరింత ఉల్లాసం కలగదూ!?

***సెప్టెంబర్, 2011***

***

రైలు పరుగిడుతోంది..చందు రైలు ప్రయాణించే దిశకి అభిముఖంగా కూర్చున్నాడు. అందువల్ల గాలిహోరు అంతగా తెలియడం లేదు. కిటికీలోంచి బయటికి చూస్తున్నాడు. చెట్లు, పొలాలు, టెలిగ్రాఫ్ స్తంభాలు.. దూరమైపోతున్నాయి.. కనిపించినంతమేరా చూస్తున్నాడు. వెనకనుంచి ఏది వస్తోందో తెలీడంలేదు కానీ వెళ్ళిపోయేవి మాత్రం కనుచూపుమేరా అగుపించి స్పష్టం నుంచి అస్పష్టంగా మారిపోతున్నాయి, గతంలోకి జారిపోతున్న వర్తమానంలాగా! చాలాసేపటినుంచి అలానే చూస్తున్నాడు. కాస్సేపటికి విసుగొచ్చింది. కళ్ళముందు కనిపించేవి మాయమైపోవడం, కనిపించనివాటికోసం అలానే చూస్తుండడం..నచ్చలేదు! ఎదుటి సీట్లోకి మారాడు. రైలు ప్రయాణించే దిశవైపు కూర్చున్నాడు. దూరంగా కనిపించేవి దగ్గరకొస్తున్నాయి. అస్పష్టం, స్పష్టమౌతోంది. దూరంగా కనిపించేవాటి గురించి ముందుగానే ఊహించడం, దగ్గరకొచ్చాక తనఊహ కరెక్టో, తప్పో తెలుసుకోవడం..చందూకి ఈ భావన నచ్చింది. సుదూరంగా ఉన్నప్పుడు ఊహ..దగ్గరకొచ్చాక వాస్తవం.. భవిష్యత్తు వాస్తవమైనట్లు! గాలిహోరు ముఖానికి ఇబ్బందిపెడుతున్నా అక్కడ్నుంచీ కదల్లేదు.. అలానే చూస్తున్నాడు.

గతంలోకి చూడడం చాలాసార్లు తేలికగా ఉంటుంది. ఊహలకి, పదునుపెట్టాల్సిన అవసరంలేదు. అన్నీ కదిలిపోయిన అనుభవాలే! గతంలోని మంచినీ,కష్టాలు నేర్పిన గుణపాఠాలనీ అప్పుడప్పుడు గుర్తుచేసుకోవడం సమంజసమే కానీ, ఎప్పుడు గతంలోకే చూస్తుండడం, భవిష్యత్ ప్రణాళికలకి దోహదం చెయ్యదు. ఎదురుకాబోయే వాటిని ముందుగానే ఊహించీ, విశ్లేషించీ వాటిననుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చెయ్యడం..ఇది ముందుచూపు లక్షణం. హోరుగాలులు ముఖానికి తాకవచ్చు, దుమ్మూ ధూళీ కళ్ళకి పరీక్షపెట్టవచ్చు. ఐనా ప్రయాణం ముందుకి సాగుతుంది. భవిష్యత్తుని ఎదుర్కొనే ధైర్యం వస్తుంది.

వ్యక్తిత్వ వికాసాన్ని, దేశభక్తినీ రంగరించి మహాకవి గురజాడ వ్రాసిన వాక్యాలని ఆయన 150వ జయంతి సందర్భంగా మరోసారి గుర్తుచేసుకుందాం.

వెనకచూసిన కార్యమేమోయి
మంచిగతమున కొంచెమేనోయి
మందగించక ముందు అడుగేయి
వెనకపడితే వెనకేనోయి..

***అక్టోబర్, 2011***

***

ఎదురులేకుండా సాగుతోందన్న జీవితం ఒక్కోసారి హఠాత్తుగా ఏదో ఎదురుదెబ్బతో ఆగిపోతున్నట్లనిపిస్తుంది. అంతా హుషారుగా ఉందనుకునేంతలో ఏదో స్తబ్దత జీవితాన్ని చైతన్యరహితం చేస్తుంది. అన్ని సంఘటనలూ మన అదుపులో లేకపోయినా, మనం నియంత్రించగలిగిన కొన్ని ఆలోచనలు, అలవాట్ల ద్వారా బతుకుబండిని ఒక త్రోవలోకి తీసుకురావొచ్చని విజ్ఞులు చెబుతుంటారు. ఇవేమీ క్లిష్టతరమైన సలహాలూ కావు. అందుబాటులో లేని పరిష్కారాలూ కావు.. కొంచెం అభ్యాసం, కాస్త ఓరిమి, మరికొంత వివేచన..ఇవీ కావల్సిన ఇంధనాలు. ఇటీవలే ఎక్కడో చదివిన ఈ ఉపమానం మన నిత్యజీవితాలకి సరిగ్గా సరిపోతుందనిపించి, పునరావృతం చేయడం జరుగుతోంది. వివరాల్లోకి వెళ్తే .. కంప్యూటర్లని నిత్యం వాడేవారికి ఒక విషయం ఎప్పుడూ గుర్తుంటుంది. ఏదైనా ప్రోగ్రామ్ సరిగా పనిచేయనప్పుడు, అనేక ప్రోగ్రాములు కలిసి కంప్యూటర్ సామర్థ్యాన్ని తగ్గించేసినప్పుడు, మరెప్పుడైనా సరే కంప్యూటర్ మళ్ళీ మన అధీనంలోకి రావాలంటే చేసే పని CTRL, ALT, DEL కీస్‌ని కలిపి నొక్కడం. తద్వారా కంప్యూటర్‌లో అంతర్గతంగా ఏమేం పనులు ఎలా జరుగుతున్నాయో తెలిపే టాస్క్ మేనేజర్ వస్తుంది. అప్పుడు అనవసరమైన లేదా ప్రతిస్పందించని ప్రోగ్రాముల్ని తొలగించడం ద్వారానో, ఒక్కోసారి సిస్టమ్‌ని మళ్ళీ స్టార్ట్ చేయడం ద్వారానో పరిస్థితిని చక్కబరచవచ్చు. నిత్యజీవితంలో మనకి ఇబ్బందులూ, కష్టాలూ, చిరాకులూ..వచ్చినప్పుడు, లేదా ఎప్పుడైనా సరే అనవసరమైన ఆలోచనలకి అడ్డుకట్టవెయ్యాలంటే - మనలోనే మనతోనే ఉన్న CTRL, ALT, DEL కీస్‌ని గుర్తించి సందర్భానుసారం వాడటం నేర్చుకుంటే, పరిస్థితుల్ని ఒక కొలిక్కి తెచ్చుకునే అవకాశాలు మెరుగ్గా ఉంటాయనేది సారాంశం.

<CTRL>:మన జీవితాన్ని మనమే అదుపులోకి తెచ్చుకోవాలి. మన ఆలోచనలని మనమే నియంత్రించుకోవాలి.

మనం చేసే పనులకి మనమే నూటికి నూరుశాతం బాధ్యత వహించాలి. మనకేం కావాలో స్పష్టత తెచ్చుకోవాలి.

<ALT>:అనుకున్నవి అనుకున్నట్లు జరగనప్పుడు ప్రత్యామ్నాయాలు(Alternatives) వెదకాలి. అడ్డుగోడ ఎదురైందని ప్రయాణం ఆగిపోకూడదు. కొత్తదార్లు ఏమిటి అనే అన్వేషణ కొనసాగుతూనే ఉండాలి. కలిసిరాని సందర్భాలని, సంబంధాలని మరో కొత్త కోణంలో విశ్లేషించడం అలవాటు చేసుకోవాలి. Alternative అనేది చాలా శక్తివంతమైన, ఆచరణీయమైన ప్రక్రియగా గుర్తించడం విజేతల ముఖ్య లక్షణాలలో ఒకటి.

<DEL>: ఈ విషయం లోగడ చాలాసార్లు చెప్పుకున్నాం. ప్రతికూలాత్మకఆలోచనలని తొలగించుకోవాలి. ప్రతిదానికీ ఎదుటివారినో, పరిస్థితులనో నిందించడం మానుకోవాలి. నెగిటివిటీ అనేది నెమ్మది, నెమ్మదిగా మనిషిని పనికిరాని వాడిగా చేసే స్లో-పాయిజన్! దాన్ని పూర్తిగా మన ఆవరణలోంచి గెంటివేయడమే <DEL 'కీ' చెప్పే సూత్రం.

<CTRL>, <ALT>, <DEL>గుర్తు పెట్టుకుందాం.. ప్రతిభావంతంగా ఉపయోగించుకుందాం..

***నవంబర్, 2011***

***

ముగింపు ముఖ్యం..!

కొత్తగా అనిపిస్తోందేమో కానీ, చాలామందికి చాలా సందర్భాల్లో తమకి తెలీకుండానే అనుభవంలోకి వచ్చే భావమిది. క్రికెట్ గేమ్‌ని గమనించండి. ఓపెనినింగ్ ఇన్నింగ్స్ బావున్నా లేకున్నా చివరి ఇన్నింగ్స్ బావుంటే చాలు, జయాపజయాలతో నిమిత్తం లేకుండా ఆ గేమ్ క్రీడాభిమానుల ఆలోచనల్లో నిలిచిపోతుంది.

ఏ సినిమా ఐనా క్లైమాక్స్ బావుంటే ప్రేక్షకాదరణకి నోచుకునే అవకాశాలు ఎక్కువ. కొన్ని సందర్భాల్లో

'ఆః..సినిమా ముందులో బావుంది కానీ చివర్లో తేలిపోయింది. అస్సలు థియేటర్‌లో కూర్చోలేకపోయాం' అని అనుకున్న వాళ్ళే, మరికొన్ని సినిమాల గురించి 'ముందులో కాస్త సాగతీసినట్లుంది కానీ, చివరి సీన్లు అద్భుతంగా తీశారు..' అనగలరు. ముగింపు హృదయానికి హత్తుకునేలా తీసిన సినిమాలు ప్రేక్షకులకి ఎక్కువకాలం గుర్తుండిపోతాయి.

మీకు బాగా నచ్చిన కథలో, నవలలో ఒక్కసారి గుర్తుతెచ్చుకోండి. వాటిల్లో అధికశాతం ముగింపు బావున్నవే ఐ ఉంటాయి. కొనసాగుతున్న ప్రయాణానికి ముగింపు, కోరుకున్న తీరం ఐతే, ప్రయాణంలో ఎదురైన కష్టనష్టాలు అస్సలు బాధించవు.

స్నేహమో, బాంధవ్యమో తాత్కాలికంగా దూరమైనప్పుడు - విడిపోయే సమయంలో కలిగిన అనుభవాలే మళ్ళీ కలవాలనే భావాన్నో లేదా అస్సలు అలాంటి క్షణాలే వద్దనే భావాన్నో కొనసాగిస్తాయి. అందుకే అంటుంటారు 'డు నాట్ బర్న్ ది బ్రిడ్జెస్' అని.

ఈ ఉదాహరణలని ఇప్పుడు ఎందుకు ప్రస్తావించుకుంటున్నామంటే - ఇది డిసెంబర్ నెల. ఈ సంవత్సరం ముగింపుకి వస్తోంది. సంవత్సరం పొడవునా ఎలాంటి అనుభవాలు ఎదురైనా, ఈ నెలలో మంచి అనుభవాలని, మరపురాని జ్ఞాపకాలని పోగుచేసుకునే ప్రయత్నాలు చేద్దాం. సానుకూల దృక్పథం, సవ్యమైన ఆలోచనలు, పదిమందితో పంచుకునే స్నేహభావాలూ.. మన అలవాట్లలో భాగమైనంత కాలం ఎదురయ్యే ప్రతి సన్నివేశం మంచి ముగింపునే అందిస్తుంది.

***డిసెంబర్, 2011***

***

# *2010*

కాలం లేడిలా పరుగులు తీస్తుంది. కాలం సెలయేరులా నెమ్మదిగా సాగుతుంది. కాలం పసిపాపలా అమాయకంగా నవ్వుతుంది. కాలం క్రూరంగా వికటాట్టహాసం చేస్తుంది. కాలం ఆప్తమిత్రుడిలా భుజం మీద చెయ్యి వేసి నడిపిస్తుంది. కాలం నమ్మించి మోసం చేసి వెన్నుపోటు పొడుస్తుంది. కాలం ఆహ్లాదకరమైన ఆమనిలా ఆకర్షిస్తుంది. కాలం కన్నుపొడుచుకున్నా కనిపించని చీకటి భూతంలా భయపెడుతుంది. కాలం ఎల్లప్పుడూ నాదే అనిపిస్తుంది. కాలం పాదరసంలా కళ్ళముందే జారిపోతుంటుంది. నిజానికి కాలం .. తెల్లకిరణం లాంటిది. తెల్లకిరణం రంగు ఒక్కటే ఐనా అది ప్రతిఫలించే ఉపరితలాన్ని బట్టి ఒక్కోరంగుగా పరావర్తనం చెంది మనకంటికి చేరుతుంది. కాలమూ ఇంతే.. మన జీవన శైలినిబట్టీ, మన మానసిక స్థితిని అనుసరించి, మనకెదురౌతున్న అనుభవాల పరంపర మూలంగానూ..ఒక్కోసారి ఒక్కో రకంగా, ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా అనిపిస్తుంది, కనిపిస్తుంది. !!

***జనవరి, 2010***

***

"అవునూ.. గోపాలం గారబ్బాయి బాగా చదువుతాడట గదా..? ఐ.ఐ.టి.లో కూడా సీటు గ్యారంటీగా వస్తుందట.."

"ఆఁ..ఏం చదవడమండీ..గోపాలమైతే 'మా అబ్బాయికి బద్ధకం ఎక్కువ..ఏదో చదువుతాడు కానీ ఒక పద్ధతి లేదు ..' అంటాడు.."

"మరి వాళ్ళమ్మాయి బాగా పాడుతుందటగదా..ఏదీ రియాలిటీ షో లో కూడా వచ్చిందట.."

"వాళ్ళమ్మాయి గురించా? గోపాలన్నడిగితే ఏమంటాడో తెలుసా ' ఆఁ..దాని బొంద ఏదో కూనిరాగాలు తీస్తుంది..' అని తీసిపారేస్తాడే..?"

"నేను ఆ కార్పొరేట్ ఆఫీసులో పనిచేసే గోపాలం గురించి చెబుతున్నా.."

"అతనేనండీ.. నెలకి యాభయి వేలు జీతం వస్తున్నా 'ఆఁ..ఏం జీతమండీ.. మా బాసు గాడు తెగ ఏడిపిస్తుంటాడు..' అనికూడా అంటుంటాడు.."

ఇలాంటి గోపాలంలు మనకి చాలా మంది తారసపడుతుంటారు. వాళ్ళమీద వాళ్ళకి, వాళ్ళు చేసే పనిమీద వాళ్ళకి, వాళ్ళ కుటుంబసభ్యుల మీద వాళ్ళకి..ప్రేమ, అభిమానం, నమ్మకం, విలువల గుర్తింపు ఉండవు. ఇలాంటి వాళ్ళకి ఎన్ని వున్నా అభిమానించే వారు తక్కువగా ఉంటారు..ఎందుకంటే ఎప్పుడు పలకరించినా నీరసం, నిరాసక్తత, నెగిటివ్ మాటలు. ..

పెద్దలు ఒక మాట అంటారు " పక్కవాళ్ళు నిన్ను ప్రేమించాలని అనుకుంటే ముందుగా నిన్ను నువ్వు ప్రేమించడం నేర్చుకో.." అని! 'నిన్ను నువ్వు ప్రేమించు' అంటే గుడ్డిగా అన్నింటినీ సమర్థించుకోమని అర్థం కాదు. నిన్ను నువ్వు, నువ్వు చేసే వృత్తిని నువ్వు, నీ కుటుంబసభ్యులని నువ్వు..అభిమానించడం. విలువనివ్వడం నేర్చుకో. పొరబాట్లుంటే సరి చేసుకుని ముందుకి వెళ్ళాలి కానీ అందరి ముందూ మనల్ని మనం తేలిక చేసుకోవడం మంచిది కాదు. మన గురించో, మన వాళ్ళ గురించో ఏదో ఒక లోపం గురించి పది మందికీ చెప్పామనుకోండి.. ఈ ప్రపంచంలో ఏ సమస్యా శాశ్వతం కాదు, ఎప్పటికో అప్పటికి పరిష్కారమౌతుంది. ఆ లోపం సరి అయ్యాక మళ్ళీ అందరి దగ్గరికి వెళ్ళి 'అవునూ..ఆ రోజు మా అబ్బాయి అలా చెప్పాను కానీ..వాడిప్పుడూ మారాడండీ..' అని చెప్పలేరు కదా. ఒకవేళ చెప్పినా నెగిటివ్ మాటలు చెవికెక్కినంతగా పోజిటివ్ మాటలు మనసుకెక్కడం కష్టం. ..! అందుకే 'మిమ్మల్ని మీరు అభిమానించడం' అభ్యసించండి. మిమ్మల్ని, మీ వృత్తినీ, మీ వాళ్ళని, మీ స్నేహితుల్ని 'నా' అనుకున్న దేనినీ పదిమంది సమక్షంలో తక్కువచేసి మాట్లాడకండి.. మనమీద మనకి అభిమానం ఉన్నప్పుడు మనలో ప్రతికూల భావాలు తగ్గుతాయి, పదిమందినీ దగ్గరకు చేరుస్తాయి.

*ఫిబ్రవరి, 2010*

***

ఇద్దరు మిత్రులు కొండ వద్దకి చేరుకున్నారు. కొండమీదికి ఎక్కి పైనుంచీ ప్రకృతి దృశ్యాలని ఆస్వాదించాలని ఒక వాళ్ళ ప్రణాళిక. ప్రయాణానికి అన్నీ సిద్ధం చేసుకుని వచ్చారు. కొండ దగ్గరకి రాగానే కొండ ఎత్తూ, పైకి వెళ్ళే మార్గాలూ, అన్నీ చూసుకున్నారు. మొదటి వాడు అన్నాడు.." నేను రాలేనురా బాబూ..అన్నుకున్నదాని కంటే చాలా ఎత్తులో ఉంది. పై వరకూ వెళ్ళడం అంత సులభం కాదు. సులువు సంగతి అలా వుంచి అసాధ్యం కూడా. అ వొంపులు, ముళ్ళ చెట్లూ చూడు. దోవ కూడా సరిగా లేదు. ఇంతకు ముందు ఎవరూ వెళ్ళిన జాడలు కూడా కనిపించడం లేదు. నేను మాత్రం వెనక్కి వెళ్ళి పోతాను.." రెండో వాడు ఎంత నచ్చజెప్పినా మొదటివాడు ఒప్పుకోలేదు. "నువ్వు చెప్పేవన్నీ నువ్వనుకుంటున్నవే..నీకూ ఎక్కేదాకా ఎత్తెంతో తెలీదు.. కావాలంటే నువ్వెళ్ళు.." మొదటి వాడు వెనక్కి తిరిగాడు. రెండో వాడు మాత్రం ముందుకే వెళ్ళాడు. తెలీని త్రోవే అయినా..ఒక్కో మలుపునీ ఒక్కో గమ్యం అనుకుంటూ నెమ్మదిగా ఎక్కడం మొదలెట్టాడు. అనుకున్నదాని కంటే ఎక్కువ టైమే పట్టింది. ఐతే కొంచెం కొంచెం ముందుకి చూస్తూ స్పష్టత తెచ్చుకుంటూ సాగిన ప్రయాణం అతన్ని కొండ చివరికి చేర్చింది... అనుకున్నది సాధించాడు.

చాలా సమస్యలు మనకి పెద్ద పెద్ద కొండల్లా ఉంటాయి. విశ్లేషించకపోతే అంతా అస్పష్టంగానే అనిపిస్తుంది. వాటిని పరిష్కరించడం కూడా అసాధ్యమనిపిస్తుంది. నిరాశా నిస్పృహల్లో ఆత్మవిశ్వాసం లోపిస్తుంది. సహజంగానే అపజయానికి మనమే మార్గాలు వేసుకుంటాం. లోతుగా చూడగలిగితే ఎంత సమస్యనైనా చిన్న చిన్న సమస్యలుగా విభజించుకోవచ్చు. ఒక్కోసారీ, ఒక్కోటి సాధించడం అలవాటు చేసుకుంటే చివరికి ఎంత పెద్ద సమస్యకైనా పరిష్కారం దొరుకుతుంది. ప్రతి చిన్న విజయమూ అత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. పెరిగిన ఆత్మవిశ్వాసం తరువాతి పరిష్కారాన్ని మరింత సులభం చేస్తుంది. ఇదే one at a time టెక్నిక్. చిన్న చిన్న గమ్యాలని చేరుకోవడం విజయసాధనలో ఎంత ముఖ్యమో..అసలు లక్ష్యాన్ని మర్చిపోకుండా ఉండడం కూడా అంతే అవసరం. ....... అంటారు వ్యక్తిత్వ విశ్లేషణా నిపుణులు. దీన్నంతటినీ ఇలా క్లుప్తీకరించారు సిరివెన్నెల ఒక పాటలో "లోతెంతని లెక్కేస్తూ గట్టే దిగనంటుంటే, సెలయేరే సంద్రం ఔతుంది! ఎత్తెంతని అనకుండా ఎక్కేస్తూ పోతుంటే, ఎవరెస్టే శిరసొంచేస్తుంది" అని!

*మార్చ్, 2010*

***

'మాటే మంత్రము..' అన్నాడో సినీ కవి. ఆయన అన్న సందర్భం ఏదైనా నిజంగా మన జీవితంలో మన మాటే మంత్రం. వరాలిచ్చేదీ, శాపం పెట్టేదీ కూడ మన 'మాట మంత్రమే' !! ఈమధ్యనెక్కడో చదివాను. ఒకాయన వాళ్ళ నాన్నగారి గురించి చెబుతూ 'మానాన్న నాకిచ్చిన గొప్ప సందేశం ఒక్కటే. 'నీ మాటే నీకున్న విలువైన ధనం. దాన్ని ఎలా వాడుకుంటావనే దానిమీద నీ విజయాలు ఆధారపడి ఉంటాయి' ' అన్నారు. మనకీ బాహ్య ప్రపంచానికీ మధ్య వారధి నిర్మించడంలో మనం మాట్లాడే మాటలు ప్రధాన పాత్ర వహిస్తాయి. మాట మంచితనం పదిమందినీ దగ్గరకు చేరిస్తే మాటలో పెళుసుతనం ఒక్కొక్కర్నే దూరం చేస్తుంది. మనసులోని భావం పెదాల ద్వారా బయటికి వస్తే ఆ మాటల్లో నిజాయితీ కనిపిస్తుంది. నిజాయితీ గల సంభాషణ మనుషుల మధ్య బంధాలని దృఢపరుస్తుంది. 'కాలు జారినా తీసుకోవచ్చు కానీ నోరు జారితే తీసుకోలేము' అన్నది పెద్దల మాట. ఆవేశంలో ఏదో మాట అనేస్తే మళ్ళీ వెనక్కి తీసుకోవడానికి 'సారీ..' అనొచ్చు కానీ, ఆ అనాలోచితమైన మాటలకి బాధపడిన వారు మామూలు స్థితికి రావడానికి చాలా సమయం పడుతుంది. " వేలు నీదని కన్ను నీదని పొడుచుకుంటే రాదా రక్తం?" అన్నారొకచోట ఆత్రేయ. నా మనసు, నా భావాలు, నా నోరు, నా మాటలు..ఎదుటి వారి గురించి నేనెందుకంత ఆలోచించాలి - అనుకునే వాళ్ళని చాలా మందిని చూస్తూనే ఉంటాం. వాళ్ళ మాటలతో వ్యాపించే ప్రతికూల వాతావరణ ప్రభావం ఏదో సమయంలో వాళ్ళకే ఎదురుతిరుగుతుంది. కొంచెం అటూ ఇటూగా.. వెనకా ముందూ ..అంతే.! మాటలతో కొత్త స్నేహాలని సృష్టించుకోవచ్చు, ఉన్న సంబంధాలని జీవితాంతం నిలుపుకోవచ్చు. అదే మాటతో సంవత్సరాల తరబడి పెంచుకున్న బంధాలని ఒక్క క్షణంలో తుంచుకోనూ వచ్చు, 'నేనే రాజు..నేనే మంత్రి..' అనుకుంటూ ఏకాకిగానూ మిగిలిపోవచ్చు. ఏదైనా కఠినమైన మాట మాట్లాడాల్సి వచ్చినప్పుడు 'ఇదే మాట ఎదుటి వారు మనల్ని అంటే మనం ఎలా తీసుకుంటాం' అని ఒక్క నిముషం ఆలోచించగలిగితే మన మాటల మీద మనకి నియంత్రణ వస్తుంది.! ఇంతకు ముందు చాలాసార్లు చెప్పుకున్నట్లే - ఆవేశం, కోపం, ద్వేషం, అసూయ..లాంటి ప్రతికూల భావాలే మనసుని కలుషితం చేస్తాయి, మాటలనీ వక్రీకరిస్తాయి. సవ్యమైన సంభాషణలతో మంచితనాన్ని నిలుపుకోడానికీ, మంచితనాన్ని పంచడానికీ సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకోవడమే ఉత్తమ మార్గం..!

*ఏప్రిల్, 2010*

***

ఒక రోజు -

"చిన్నూ..హోమ్ వర్క్ పూర్తిచేశావా?"

"ఓ..ఐపోయింది నాన్నా..' "చింటూ..నీ హోమ్ వర్కూ?"

"మరేమో..ముందు నోట్ బుక్ కనిపించలేదు. వెదికే సరికి ఆలీశం అయింది. పెన్నులో ఇంకు ఐపోయింది. అన్నీ చూసుకుని కూర్చునే సరికి కరెంటు పోయింది. కరెంటు వచ్చేసరికి నిద్రపోయాను.. అందుకే హోమ్ వర్క్ చెయ్యలేదు.."

ఇంకో రోజు - "చిన్నూ..సైకిల్ బాగు చేయించుకున్నావా?

"ఓ..చేయించేసుకున్నాను నాన్నా.. "

"చింటూ.. పక్కింటి అంకుల్‌కి పేపర్ ఇచ్చి రమ్మన్నాను. ఇచ్చేశావా?"

"లేదు నాన్నా.. మరేమో.. ఇవ్వడానికి బయలుదేరే సరికి మన టామీ రోడ్డుమీదకి పరిగెడుతుంటే దాన్ని పట్టుకొచ్చాను. తర్వాత వెళుతుంటే మధ్యలో బుజ్జిగాడు కనిపిస్తే పతంగులకోసం వెళ్ళాను. వచ్చేప్పుడు చూసుకుంటే పేపర్ ఎక్కడో పోయింది. పతంగుల కొట్లో వదిలేసినట్టున్నాను. అందుకేఅంకుల్ వాళ్ళింటికి వెళ్ళలేదు.."

మరో రోజు - "చిన్నూ. ఎమ్ సెట్ ప్రిపరేషన్ ఎలా వుంది?"

"అన్నీ రెండు మూడు సార్లు రివిజన్ చేసుకున్నాను నాన్నా.."

"చింటూ..నువ్వూ?"

"కోచింగ్ సెంటర్‌లో సరిగా చెప్పడం లేదు నాన్నా. ముందు బెంచీలో కూర్చో నివ్వలేదు. వెనక బెంచీలో కూర్చుంటే వినిపించడం లేదు. మాస్టారేమో నోట్సు గబగబా చెప్పేస్తున్నారు..."

అదండీ సంగతి!

మనకి ఈ 'చింటూ'లు తరచూ ఎదురౌతుంటారు. ఒక్కోసారి మనలోనే 'చింటూ' ఉంటాడు. ఏదైనా పని పూర్తిచేయలేక పోవడానికి బోలెడన్ని కారణాలు కనిపిస్తాయి. వాటిని ఏకరువు పెట్టడం కూడా చాలా తేలికగా అనిపిస్తుంది. పని పూర్తిచెయ్యడానికి ఒకటే కారణం ఉంటుంది ..అదే 'పట్టుదల'. ఆ పట్టుదల ఉంటే సమస్యలకి పరిష్కారాలు వెదకే లక్షణాలన్నీ వాటంతటవే సమకూరుతాయి. వైఫల్యాలకీ, అపజయాలకీ కారణాలు వెదుక్కుంటూ, వాటిని సమర్థించుకోవడం అలవాటైనంతకాలం మన ప్రయాణం అలానే సాగుతుంది. ఒక్కోసారి నిజమైన కారణాలే ఉన్నా, వాటిని పునరావృతం కాకుండా కృషి చేస్తే, మన మార్గం విజయపథం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ..! 'చింటూ' కి గుణపాఠం నేర్పుతూ 'చిన్నూ' ని ప్రోత్సహించినంతకాలం, అనుకున్నది సాధించడం తేలిక కాకపోవచ్చుకానీ అసాధ్యం కాదు.

***మే, 2010***

***

తెలుగు సినిమా పాటకి కావ్య గౌరవాన్ని ఆపాదించిన అతి కొద్ది మంది గీతరచయితల్లో ఒకరైన వేటూరి గారు మనకికలేరు. సముద్రాల, పింగళి, మల్లాది రామకృష్ణశాస్త్రి ..గార్ల తరం తర్వాత వచ్చిన తరం దేవులపల్లి, సినారె, దాశరథి, ఆరుద్ర, శ్రీశ్రీ కొసరాజు ఆత్రేయ మొదలైన గీతరచయితలది. నిస్సందేహంగా అందరి కలాలనుంచీ, వారి వారి ప్రతిభను బట్టీ, వారి కొచ్చిన అవకాశాలను బట్టీ ఎక్కువగానో, తక్కువగానో మంచి పాటలే, గుర్తుంచుకోదగ్గ పాటలే వచ్చాయి. ఐతే 'ఈయన పాటలతో ఒక శకాన్ని సృష్టించారు' అనదగ్గ మొట్టమొదటి గీతరచయిత ఆత్రేయ కాగా రెండో వారు వేటూరి గారు. అంటే, వారి కలం ఆగిపోగానే ఒక శకం ముగిసిందన్న భావాన్ని ప్రేక్షకుల్లో, శ్రోతల్లో కలిగించిన వారు వీరిద్దరూ.!

అంతకుముందు వరకూ వచ్చిన గీత రచయితల సినీరంగ ప్రవేశాన్నీ, వేటూరి గారి సినీరంగ ప్రవేశాన్నీ పోల్చి చూసుకుంటే వేటూరి గారి ప్రత్యేకత స్పష్టంగా తెలుస్తుంది. ఆయన నెమ్మది, నెమ్మదిగా పాటలు వ్రాస్తూ పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోలేదు, రావడం రావడమే ఒక ప్రభంజనంలాగ వచ్చారు. మొదటి సినిమాతోనే సినీ పరిశ్రమనీ, ఆంధ్రప్రేక్షక లోకాన్నీ ఒక కుదుపు కుదిపారు. ప్రవేశించడంతోనే సంచలనం సృష్టించిన రచయితల్లో వేటూరి మొదటి వారు (తర్వాత పదేళ్ళకి సిరివెన్నెల అలాంటి సంచలనాన్నే సృష్టిస్తూ చిత్రరంగ ప్రవేశం చేశారు). పాటల రచనలో తన విశ్వరూపాన్ని చూపిస్తూ, ఆయన కొనసాగించిన తుఫాను వేగాన్ని అప్పటివరకూ ఉన్న గీతరచయితలెవరూ అందుకోలేక పోయారనడంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు.

కేవలం అయిదు, పదినిమిషాల్లోనే అద్భుతమైన పాట వ్రాయగల ఆయన నేర్పుకి జోహార్లర్పించని దర్శకుడు, సంగీత దర్శకుడు లేరు. ఇంత వేగవంతమైన రచయిత కాబట్టే రెండువేల సినిమాలకి దాదాపు పదివేలపాటలు పైగా వ్రాసి తెలుగు సినిమా చరిత్రలో ఒక సరికొత్త రికార్డు సృష్టించారు.

ఇంత పాండిత్యం, పాటల రచనలో ఒడుపూ, వేగం, వడి ఉన్న వేటూరి గారు పదిహేనేళ్ళకి పైగా, జర్నలిస్టుగా సినిమా పరిశ్రమతో పరిచయాలు ఉన్నప్పటికీ చాలా ఆలశ్యంగా తన 38 వయేట చిత్రరంగప్రవేశం చేయడం విచిత్రంగా అనిపిస్తుంది. అందుకే సినిమా రంగాన్ని 'చిత్రసీమ' అని అన్నారేమో.!

భాషా సౌందర్యం, భావ గాంభీర్యం రెండింటినీ జోడు గుర్రాల లాగ పరిగెత్తించగల వేటూరి అటు పండితుల్నీ, ఇటు పామరుల్నీ సమానంగా ఒప్పించగలిగారు. దర్శక, నిర్మాతల కోరిక మేరకు అల్లరి పాటలు అప్పుడప్పుడూ వ్రాస్తున్నప్పటికీ, ఆలోచన నిండిన పాటలూ, ఎవరూ ఊహించని భావజాలం తన సొంతమేనని చివరి వరకూ నిరూపించుకుంటూ, నిలబెట్టుకుంటూనే ఉన్నారు.

వేటూరి గారిని ప్రత్యక్షంగా కలుసుకునే అవకాశం, సందర్భం ఎప్పుడూ రాలేదు. ఐతే ఆయన ఇంటర్వ్యూలు ఎక్కడ చదివినా 'మావూరి దగ్గర వారే' అనిపించేవారు. ఆయన తన గురువుగా చెప్పుకున్న దైతా గోపాలంగారు, నేను చదువుకున్న ఎలిమెంటరీ స్కూలుకి (కృష్ణాజిల్లాలోని పాపవినాశనం అనే పల్లెటూరు) పక్కనున్న ఇంట్లోనే తన బాల్యాన్ని గడిపారని తెలుసుకున్నప్పుడు మనసు పులకరించింది. వేటూరిగారు బాగా ఇష్టపడే శ్రీకాకుళ ఆంధ్రమహావిష్ణువు దేవాలయం ప్రాంగణమే మా చిన్నప్పటి ఆటపాటలకి రంగస్థలం.! 'మనోహరం' చిత్రంలో చోటుచేసుకున్న ఆయన లలితగీతం 'పుచ్చా పూవుల విచ్చే తావుల..' కృష్ణానదీ తీరపు ఇసుక తిన్నెల మీద పుట్టిందట. ఆయన తన అమ్మమ్మ గారింటికి కొల్లూరు వెళ్ళినప్పుడు కృష్ణానదీ తీరంలో కూర్చుని దూరంగా కనిపించే శ్రీకాకుళం దేవాలయ గోపురాన్ని చూస్తూ ఈ పాట వ్రాశానని చెప్పుకున్నారు.

మా వూరు వెళ్ళినప్పుడు ఆ దేవాలయాన్ని చూసినప్పుడల్లా వేటూరి గారి ఈ పాటే గుర్తొస్తుంటుంది. ఆయన వ్రాసిన పాటలు అందరికీ పరిచయమే కానీ ఆయన వ్రాసిన కథలూ, వచన రచనలూ చాల తక్కువ మందికి తెలుసేమో. క్రిందటేడాది 'కౌముది' ప్రచురించిన ('రచన' నుంచీ పునర్ముద్రితం) 'శ్రీకాకుళే మహాక్షేత్రే' కథ (మళ్ళీ చదడానికి ఇక్కడ క్లిక్ చేయండి) చదివితే అయన వచన రచనకి సైతం మనం ముగ్ధులమైపోతాం. అలానే అయన వ్రాసిన 'కొమ్మ కొమ్మకో సన్నాయి' పుస్తకం రచనా శైలిలో కూడా ప్రతి వాక్యం రసాత్మకంగానే అనిపిస్తుంది. వేటూరి గారి లాంటి కవులు అరుదుగా పుడతారు. అందుకే అందరినీ అంతలా అలరించి, అందరి మనసుల్లో నిలిచిపోతారు.

*జూన్, 2010*

***

కౌముది

రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారు 1974 ప్రాంతాల్లో రత్తాలు-రాంబాబు అనే నవల వ్రాశారు. అది 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో సీరియల్‌గా వచ్చే సమయంలో 'పాఠకుల ప్రశ్నలకి రావిశాస్త్రి గారి సమాధానాలు' అనే శీర్షికకూడా నిర్వహించేవారు. కొంతమంది పాఠకులు రావిశాస్త్రి గారిని 'రత్తాలు రాంబాబు' లో కొన్ని పాత్రల గురించి, సన్నివేశాల గురించి 'ఆ పాత్ర అలా ఎందుకు ప్రవర్తించింది, ఆ సన్నివేశం అలా ఎందుకుంది..?" ఇలాంటి ప్రశ్నలు వేస్తుంటే ఆయన ఇచ్చిన సమాధానం ఇదీ.. "కథ రాసేక, దాన్ని మరింక విడిచి పెట్టక, దాని మానాన్న దాన్ని బతకనివ్వక (లేదా చావనివ్వక) ఆ రాసినవాడు, దాన్ని సాకుతూ, సంరక్షించుకుంటూ, సమర్థించుకుంటూ, నెత్తిని పెట్టుకొని తిరగడం నాకు ఇష్టం లేదు. నిజానికి దగ్గరగా వుంటే కథ కొన్నాళ్ళు ఉండవచ్చు. సత్తువుంటే ఉంటుంది, లేకపోతే పోతుంది. రత్తాలు-రాంబాబు నవల గురించి ఏమైనా తెలియాలంటే, అది నవల వల్లే తెలియాలి కాని నా వల్ల కాదు. అందుచేత, రాసిన ప్రక్రియకి అర్హత ఉండాలి, చదివే వాళ్ళందరిచేతా సెబాస్ అనిపించుకునే అర్హత. చదివే వారికి అర్హత కావాలి. అర్థం చేసుకునే అర్హత. సెబాస్ అనగలిగే అర్హత. రాసే వాళ్ళకి ఏ అర్హతా అక్కర్లేదు. రాయగలిగే అర్హత తప్ప." తెలుగుభాష పుట్టినవద్దనుంచీ లక్షలాది రచనలు వచ్చి ఉంటాయి. ఐతే వాటిల్లో భారతం, భాగవతం లాంటి కొన్ని గ్రంధాలు మాత్రమే ఎన్ని శతాబ్దాలైనా నిలబడ్డాయి. ఈ శతాబ్దంలో వచ్చిన కథలూ, నవలలకి కూడా ఇదే వర్తిస్తుంది. రచనలో సత్తా ఉంటే, పాఠకుల హృదయాలను చేరగలిగితే ఆ రచన చిరంజీవిగా నిలిచిపోతుంది. దానికి వేరే ప్రశంసాపత్రాలూ, ప్రకటనలూ, సమర్థింపులూ అవసరం లేదు. కాలం అందరికంటే పెద్ద న్యాయమూర్తి. దేన్ని తనతో మోసుకెళ్ళాలో , దేన్ని వదిలేసి ముందుకి సాగాలో. కాలానికి బాగా తెలుసు.!

***జూలై, 2010***

***

"అమ్మా..నాకస్సలు చదవబుద్ధి కావడం లేదు.." ఏనిమిదో తరగతి చదువుతున్న చందూ ఇంటికి రావడంతోనే పుస్తకాల సంచీ విసిరికొట్టాడు.

"ఏమైంది చందూ..? పాఠాలు అర్థం కావడం లేదా? ట్యూషన్‌కి వెళ్తావా? ఐనా క్రిందటి ఎక్జామ్స్ వరకూ మార్కులు బాగానే వస్తున్నాయి కదా!?" అనునయిస్తూ అడిగింది చందూ తల్లి.

"అన్నీ అర్థ మౌతున్నాయమ్మా. మార్కులు కూడా బాగానే వస్తున్నాయి. కానీ ఆ భాస్కరం మాస్టారే..?"

"ఏమైంది ఆయనతో? ఏమైనా అన్నారా?"

"ఏమీ అనలేదు ..అదే నా బాధ. నాకు ఎప్పుడూ ఫస్టుమార్కులు వస్తున్నాయా? ఐనా నన్ను మెచ్చుకోకుండా ఎప్పుడూ ఆ హెడ్మాస్టారబ్బాయి శేఖర్ గాడినే మెచ్చుకుంటూ ఉంటారు. వాడు ఏ కొంచెం చేసినా క్లాసులో ఆకాశానికెత్తేసినట్లు అందరి ముందూ పొగిడేస్తారు. నన్నైతే ఎప్పుడూ పొగడరు, గుర్తించరు. అందుకే నాకస్సలు చదవబుద్ధి కావడం లేదు.."

"చందూ..నీకు మంచి మార్కులు వస్తుంటే బాగుపడేది నువ్వా? భాస్కరం మాస్టారా?"

"నేనే ననుకో.."

"మరి భాస్కరం మాస్టారు నిన్ను మెచ్చుకోకపోతే నీకు మార్కులు తగ్గుతాయా?"

"ఊఁ.. లేదూ.."

"మరి ఆయనమీద అలిగి నువ్వు చదువు మీద శ్రద్ధ తగ్గిస్తే ఎవరికి నష్టం..?"

"ఊఁ..నాకే నష్టం." చందూ స్వరంలో ఆలోచన కనబడుతోంది.

"నీ భవిష్యత్తుకోసం నువ్వు చదవాలి. మీ మాస్టారు నిన్ను మెచ్చుకోకపోవడం వల్ల నీకు వచ్చే నాలెడ్జి ఏమాత్రం తగ్గదు. నీకొచ్చే మంచి రాంకు నిన్ను ముందుకి నడిపిస్తుంది. కష్టపడి చదవడం నీ కర్తవ్యం. నీకోసం నువ్వు చదవాలన్న విషయం గుర్తుంచుకో.. ఎదుటి వారి నుంచీ వచ్చే మెప్పులూ, పొగడ్తలూ నీ ప్రాథమిక కర్తవ్యాన్ని పక్కతోవ పట్టించకూడదు.."

అమ్మ చెప్పిన మాటల్లో నిజం చందూకి కొంచెం కొంచెం తెలుస్తోంది. మనకీ చాలా సార్లు చందూకి ఎదురైన పరిస్థితులు ఎదురౌతుంటాయి. విద్యార్థిదశలో, ఉద్యోగం చేసేప్పుడు, బయట పదిమందితో కలిసి పనిచేసేప్పుడు.. ఒక్కోసారి మనకి తగినంత గుర్తింపు రావడం లేదని, ఎవరో మనల్ని పొగడడం లేదని అనిపిస్తుంటుంది. అలాంటి భావన మనలోని క్రమశిక్షణని, అంకిత భావాన్ని, కష్టించే మనస్తత్వాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంటే, ఆలోచించి తీరాల్సిన విషయమే. మన ప్రాథమిక కర్తవ్యం, మనం చేసే మంచి పనులూ వేరే వాళ్ళ ప్రశంసలకోసం నిరీక్షించకూడదు. మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే, నిర్ధరించే సుగుణాలు పక్కవాళ్ళ పొగడ్తలకోసం ఎదురుచూసే స్థితికి రాకూడదు. అప్పుడే మనం 'మనం' గా మిగులుతాం. లక్ష్యం కోసం సాగే మనప్రయాణం నిరాటంకంగా సాగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

*ఆగస్ట్, 2010*

***

మానవత్వం, మనిషితనం, మానవసేవ, నిస్వార్థం, త్యాగం, పరోపకారం..ఇలాంటి పదాలకి నిర్వచనాలు, వివరణలు కోకొల్లలుగా చెప్పుకోవచ్చు. కానీ నిత్యజీవితంలో వీటిని అచరించడం.. అతికొద్ది మందికి మాత్రమే సాధ్యం. ఆ అతికొద్ది మందిలో కొంతమంది గురించి విన్నప్పుడు.. 'ఇది నిజమా..? ఇది సాధ్యమా..? ఇలాంటి మనుషులు మనమధ్యలో ఉన్నారా..?' అనిపిస్తుంది. వీళ్ళు ఏ ఉపమానాల కొలమానాలకీ, ఏ నిర్వచనాల చట్రాలకీ అందరు. అలాంటి ఓ 'వెంకటేశ్వర్లు' గురించి విన్నప్పుడు మీకూ పరిచయం చేయాలనిపించింది.

"మనిషైతే మనసైతే
కనులు కరగాలిరా
కరిగి కరుణ కురియాలిరా
కురిసి జగతి నిండాలిరా.." అన్న దేవులపల్లి గారి వాక్యాలని గుర్తుచేసుకుంటూ, ఈ 'వెంకటేశ్వర్లు' పరిచయమే ఈ నెల 'కౌముది' సంపాదకీయంగా..క్రింది వీడియోలు నాలుగు భాగాలూ పూర్తిగా చూడండి.. ..

(Thanks to Vijay Reddyvari for sharing this link on Facebook. Video Clips courtesy Youtube,Z Telugu)

*సెప్టెంబర్, 2010*

***

పూర్వకాలంలో అరవిందుడు, జయంతుడు అనే వ్యాపారస్తులు మహేంద్రపురి అనే ఊరికి వెళుతున్నారు. మధ్యలో త్రోవ తప్పి ఎక్కడికెక్కడికో వెళ్ళిపోయారు. మార్గమధ్యంలో కనిపించిన ఓ వ్యక్తిని మహేంద్రపురికి దారి ఎటని అడిగారు. అతను ఒకవైపు చూపించి సూటిగా వెళ్ళమన్నాడు. ఇద్దరూ అతను సూచించిన దిశగా నడిచారు. అది వెళ్ళే, వెళ్ళే ఒక నది దగ్గర ఆగిపోయింది. ఇద్దరూ ఆశ్చర్యపోయారు. వాళ్ళని అటువైపు వెళ్ళమని చెప్పినతను నది విషయం చెప్పలేదు. కొద్దిగంటల్లో చీకటి పడబోతోంది. పక్కనే దట్టమైన అడవి ఉంది. రాత్రైతే అక్కడ ఉండడం క్షేమం కాదు. నది దాటటానికి రేపు కానీ, పడవలు కానీ ఏమీ లేవు. అటుగుండా ఎవరూ నదిని దాటిన దాఖలాలు కూడా లేవు. నది ఉధ్రుతంగా ప్రవహిస్తోంది. ఏం చెయ్యాలి?

"ఈ కష్టాలన్నీ వాడి వల్లే వచ్చాయి. మనల్ని తప్పుతోవ పట్టించాడు. అనవసరంగా అడిగాం.." అరవిందుడు విసుక్కుంటున్నాడు. జయవంతుడు దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. మళ్ళీ అరవిందుడే "ఏం మాట్లాడవేంటి? మంచిరోజులు కావు, వద్దంటే వినకుండా నువ్వే బయలుదేరమన్నావు. ఇప్పుడు చూడు.. ఏదీ కాని చోట ఇరుక్కుపోయాం. ఇదంతా నీవల్లా, అదుగో మధ్యలో మనల్ని తప్పుతోవ పట్టించిన వాడివల్లా వచ్చింది.."

"అరవిందా.. ఇప్పుడవన్నీ అనుకోని ఉపయోగముంది చెప్పు. ముందు మనం ఇక్కడ నుంచీ నది దాటే మార్గం ఆలోచించాలి. వచ్చిన తోవలో వెనక్కి వెళ్దామన్నా అడవిలో చిక్కుకుపోతాం.. మనకి నదిని దాటడమొక్కటే మార్గం" జయంతుడు నిశ్చయంగా చెప్పాడు.

"ఎట్లా.. మనకిద్దరికీ ఈతరాదయ్యే?" మళ్ళీ అరవిందుడు నస మొదలెట్టాడు.

జయంతుడు పరిసరాలని పరిశీలించాడు. ఎండిపోయి నేలకి వాలిన ఒకటి కనిపించింది. కాస్త దూరంలో మొనదేలిన రాళ్ళు రెండు మూడు కనిపించాయి. దీక్షగా కూర్చున్నాడు. ఒక గంటసేపట్లోనే కత్తిమొనలాంటి రాళ్ళతో, ఆ చెట్టుకొమ్మని తెప్పలాగా మార్చగలిగాడు.. అరవిందుడు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. తెప్ప సిద్ధమైంది. ఇద్దరూ క్షేమంగా నదిని దాటగలిగారు..

నిత్యజీవితంలో చాలాసార్లు మనకీ అనుకోని నదులు ఎదురౌతాయి. ఎవరి తప్పులో మనల్ని అక్కడికి నెడతాయి, లేదా మనం చేసిన పొరబాట్లే మనల్ని అలాంటి అగ్నిపరీక్షకి గురిచేస్తాయి. అలాంటప్పుడు అరవిందుడిలా గతాన్ని తిట్టుకుంటూ కూర్చునే వాళ్ళు కొందరైతే, జయంతుడిలా పరిష్కారం గురించి ఆలోచిఒడ సమస్యనుంచీ బయటి పడేవాళ్ళు మరికొంతమంది. సమస్యలు ఎదురైనప్పుడు గతం కంటే భవిష్యత్తు గురించి ఆలోచనలన్నింటినీ కేంద్రీకరించాలని అనుభవజ్ఞుల సలహా. జరిగిపోయిన సంఘటనల గురించి తిట్టుకుంటూ కుర్చుంటే మన శక్తి అంతా ప్రతికూలాత్మకంగా మిగిలిపోతుంది. ముందుగా పరిష్కారం గురించి, వివిధ ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించ గలిగితే అనుకోకుండా ఎదురైన నదిని దాటే తెప్పలని తయారు చేసుకోగలం.. సమస్యనుంచి బయటపడ్డాక తీరిగ్గా పోస్ట్‌మార్టమ్ చేసుకుని ఆ పొరబాట్లు పునరావృతం కాకుండా చూసుకోవచ్చు. తనకున్న శక్తియుక్తులని పాజిటివ్ ఎనర్జీగా మలుచుకున్న వాడే విజేతగా ముందుకి వెళ్తాడు అనేది చరిత్ర చెప్పే సత్యం.

***అక్టోబర్, 2010***

***

అదొక స్వామీజీ గురుకులం.. సమయం మధ్యాహ్నం దాటింది. రాత్రి వంట చేయడానికి కట్టెపుల్లలు కావాలి. శిష్యుడు రామలింగడ్ని పిలిచాడు స్వామీజీ.

" కాస్త అడవిలోకి వెళ్ళి వంటచెఱుకు తీసుకురా, రాత్రి వంటకి కావాలి.."

"గురువు గారూ.. అడవిలోకి వెళ్ళి రావాలంటే చాలా సమయం పడుతుంది. ఇప్పుడు వెళితే చీకటి పడేలోగా రాలేనేమో. సాయంకాలమైతే అడవి జంతువులనుంచీ అపాయం ఉంటుంది కదా.."

"ఇటు ఉత్తర దిక్కుగా వెళితే తొందరగానే వచ్చెయ్యొచ్చు..ఈ వైపు వెళ్ళిరా.."

"గురువుగారూ..ఉత్తర దిక్కున క్రిందటి వారమే పెద్ద పులి సంచరించిన ఆనవాళ్ళు కనిపించాయట. అటువెళ్ళడం క్షేమం కాదేమో.."

"పోనీ పడమటి దిక్కుకి వెళ్ళు..వెలుతురు ఎక్కువగానే ఉంటుంది.."

"అక్కడ కోతుల బెడద ఎక్కువగా ఉంటుంది గురువు గారూ. ఒక్కడినే వెళ్ళడం మంచిది కాదేమో.."

"ఐతే సత్యవ్రతుడ్ని వెంట తీసుకువెళ్ళు. అతను కోతులని చెదరకొడుతుంటే, నువ్వు కట్టెపుల్లలు ఏరుకురావొచ్చు.."

"కానీ సత్యవ్రతుడు వేదాలు వల్లెవేయడంలో తీరిక లేకుండా ఉన్నాడు.." అదండీ వరస.. సమస్యలకి పరిష్కారాలు వెదికే గురువులు కొంతమంది ఐతే, పరిష్కారాల్లో సమస్యలు చూసే రామలింగడు జాతివారు మరికొంతమంది. విజేతలకి ఎటువంటి సమస్యలోనైనా పరిష్కారం కనిపిస్తుంది. లేదా దానికోసం అన్వేషిస్తారు. చిగురంత ఆశ కనిపించినా దాన్ని అఖండ జ్యోతిగా మార్చుకుని వెలుగు దారుల్లో పయనించగల నేర్పు, పట్టుదల వారి సొంతం. పరిష్కారంలో కూడా సమస్యని చూసే వారు ఎప్పుడూ సందిగ్ధ సంధ్యల్లోనే మిగిలిపోతారు. అటు వెన్నెల వెలుగులనీ చూడలేరు, ఇటు పగటి వేడిమిని అనుభవించలేరు.

***నవంబర్, 2010***

***

ఒక రోజు.. ముకుందం స్కూటర్ మీద ఆఫీసుకి బయలుదేరాడు. రోజురోజుకీ పెరిగిపోతున్న జంటనగరాల ట్రాఫిక్‌లో స్కూటర్ డ్రైవింగ్ అంటే పద్మవ్యూహాన్ని ఛేదించడమే. ఎక్కడపడితే అక్కడ రెడ్ సిగ్నల్స్.. చిరాకుగా ఉంది. పక్కనే తళతళలాడే కార్లు, మరో వైపు పొగ మేఘాలని వదిలే ఆటోలు, మధ్యమధ్యలో సర్కస్ ఫీట్లు చేస్తే సైకిల్ వాళ్ళు.. అటూ ఇటూ చూస్తుంటే ముకుందానికి బ్లడ్ ప్రెషర్ పెరుగుతోంది. అందరిమీదా విసుగ్గా ఉంది. అసలు వీళ్ళంతా ఇప్పుడే ఎందుకు రోడ్డు మీద ఉండాలి.. ఈ ఆఫీసర్ గాడొకడు. పొద్దున్నే ఇంటికి ఫోన్ చేసి తొందరగా వస్తావా ఛస్తావా అని అరిచాడు. ఎప్పుడూ అంతే, ఎదుటి వాళ్ళ ఇబ్బందుల్ని పట్టించుకోడు. ప్రమోషన్ వాడి చేతిలో ఏడిచింది కాబట్టి అతగాడు ఏం చేసినా పడి ఉండాల్సిందే. వెధవ ట్రాఫిక్ ఎప్పటికి క్లియర్ ఔతుందో..! ఇంకోరోజు.. అదే సమయం. అదే ట్రాఫిక్. అవే సైకిళ్ళు, అవే కార్లు, అవే ఆటోలు. మధ్యలో మన ముకుందం.. చుట్టూ చూశాడు. ఎంత బిజీ రోడ్డు ఐనా ఆహ్లాదంగా అనిపించింది. రెడ్ లైట్ దగ్గర చేయిచాపిన బిచ్చగత్తెకి జేబులోంచి ఐదురూపాయల నోటు తీసిచ్చాడు. ‘చల్లగా పదికాలాలు బతుకు బాబూ..‘ అని దీవించిందామె. ఇటు తిరిగి చేశాడు, పక్కనే ఆగిన కారులోంచి ఎవరో అపరిచితుడు చిరునవ్వు నవ్వాడు. తనూ బదులిచ్చాడు. పొద్దున్నే బయలుదేరేప్పుడు బాబిగాడి గురించి, చింటూ గురించి లలిత ఎంత కమ్మటి కబుర్లు చెప్పింది. ఈ రోజు స్కూల్లో వాళ్ళకి బెస్ట్ స్టూడెంట్ అవార్డులిస్తారట..! రెండు స్కూటర్ల మధ్యనుంచీ దూసుకు వెళ్ళటానికి చూస్తున్న సైకిల్ వాలాకి ముకుందం కాస్త త్రోవ ఇచ్చాడు. ‘షుక్రియా భాయ్... ‘ అంటూ అతను దూసుకు వెళ్ళాడు. అంతా హడవిడిగా ఉన్నా ముకుందానికి మాత్రం పగలే వెన్నెల అన్నట్లుంది..! అదే హైదరాబాదు..అదే రోడ్. అదే ట్రాఫిక్.. అదే సమయం.. అదే ముకుందం....మనసులో ఆఫీసర్ మీద కోపం నిండినపుడు అందరి మీదా అంతులేని కోపం అనిపించింది. మనసులో సంతోషం కెరటాలైనప్పుడు ఎటుచూసినా ఆనందంగానే అనిపించింది. పరిసరాలు ఎప్పుడూ ఒకలానే ఉన్నా మనసు చేసే మాయ వల్లనే విసుగు, ఆహ్లాదం..!! ముకుందానికే కాదు, ఈ సందర్భాలు అందరికీ ఎప్పుడో ఒకసారి ఎదురౌతాయి. పరిసరాలు మనకి ఏం చేశాయి అనేకంటే వాటిని మనం స్వీకరించే కోణంలో, వాటికి స్పందించే మన మనసుని నియంత్రించుకునే విధానంలో మనకి ఆనందం దొరుకుతుంది.. లేదంటే చిరాకూ మిగులుతుంది. పెద్దలెప్పుడో చెప్పినట్లు ‘మనసులో వంకర్లు తీస్తే, లోకంలో వంకర్లన్నీ మాయమౌతాయి..‘. మనసు, ఆలోచనలు అనే రిమోట్ కంట్రోల్‌ని ప్రతిభావంతంగా వాడుకున్నప్పుడు, మనతో బాటు పదిమందికీ ఆహ్లాదాన్ని పంచగలమని అనుభవజ్ఞుల సలహా!

***డిసెంబర్, 2010***

***

# 2009

ఇది 'కౌముది'కి రెండవ పుట్టినరోజు. గత రెండేళ్ళుగా దిగ్విజయంగా సాగుతున్న 'కౌముది'సాహితీ ప్రస్థానాన్ని మీ సమక్షంలో సమీక్షించడమే ఈ నెల ఈ శీర్షిక ముఖ్యోద్దేశం. ప్రారంభ సంచికలో చెప్పినట్లు పాఠకులే 'కౌముది' కి దిశా నిర్దేశకులు, పాఠకుల అభిరుచే 'కౌముది' కి చుక్కాని. గత 24 నెలలుగా ఏ నెలా ఒక్క రోజు కూడా అలశ్యం కాకుండా 'కౌముది' వెలువడడంలో పాఠకులు మాకందించిన స్ఫూర్తి మరువలేనిది ( కాలిఫోర్నియా సమయం ప్రకారం, 'కౌముది' ప్రతి నెలా చివరి రోజున రాత్రి 9.00 గంటలకి విడుదలౌతుంది.) పాఠకుల ప్రతిస్పందనని గమనించి ఎప్పటికప్పుడు కొత్త శీర్షికలని చేరుస్తూ, నడుస్తున్న శీర్షికలకి అవసరమైనప్పుడు మరిన్ని మెరుగులు దిద్దుతూ ముందుకి సాగుతున్న 'కౌముది' కి భవిష్యత్తులో కూడా పాఠకుల అదరణ ఇలానే కొనసాగుతుందని మా దృఢవిశ్వాసం. రెండేళ్ళ ప్రయాణంలో ఈ మైలురాయి వద్ద నిలుచుని ఒక సారి వెనుతిరిగి చూస్తే - ప్రతి నెలా ఒక్కొక్క అంశానికీ లభించిన 'ఫైల్ హిట్స్' ని బట్టీ, మాకు వచ్చిన 'స్పందన' ఇ-మెయిల్స్, ఫోన్ కాల్స్‌ని బట్టి 'కౌముది' లోని అంశాలకి తరచూ మార్పులు చేర్పులు చేస్తున్నాం.ఈ సంగతి మీరంతా గమనించే ఉంటారు. ప్రస్తుతం 'కౌముది' లోని అంశాలని ఐదు తరగతులుగా విభజించి చూడొచ్చు.

(1) ఈ నాటి తరానికి అలనాటి అపురూప రచనలు (సీరియల్సూ, కథలూ కూడా)

(2) ఈ తరం రచయిత / త్రులు 'కౌముది' కోసం ప్రత్యేకంగా వ్రాస్తున్న సీరియల్స్,కథలూ,కవితలూ, వ్యాసాలూ

(3) అహ్వానిత రచయిత / త్రుల తో 'కౌముది' అందిస్తున్న నెలవారీ శీర్షికలు

(4) నెలనెలా పాఠకులు పాల్గొనే శీర్షికలూ

(5) 'కౌముది' సంపాదక బృందం ప్రత్యేకంగా కృషి చేసి, ఇంటర్వ్యూలు నిర్వహించి సమర్పిస్తున్న 'మొదటి సినిమా' 'ఈనెల ప్రత్యేకం' (మొదటి సంవత్సరం వచ్చిన 'విజేత' కథనాలూ ఈ కోవకి చెందినవే)లాంటి వాస్తవ కథనాలూ.. ఇవన్నీ కలిపి నెలకి కనీసం 40 అంశాలు 'కౌముది' లో ఉంటున్నాయి.మళ్ళా వీటిని సీరియల్స్, కథలు, సినిమా, హాస్యం..వగైరా విభాగాలుగా వర్గీకరించి ప్రచురించడం జరుగుతోంది.

చాలామంది పాఠకులకి ఎక్కువగా నచ్చిన విధానాలు - పాత కొత్తల మేలు కలయిక,

కేవలం బయటినుంచీ వచ్చిన రచనలని ప్రచురించడంతో అగిపోక 'కౌముది' బృందం సొంతంగా విశేష కృషిచేసి తయారు చేస్తున్న కథనాలూ,

సామాన్య పాఠకులు సైతం పాల్గొనే శీర్షికలూ..!

ఒకటి రెండు సందర్భాల్లో తప్ప ఏ నెలవారీ శీర్షికైనా కనీసం 12 నెలలు వచ్చేలా శ్రద్ధతీసుకుంటున్నాం.

'మా మంచి టీచర్లు', 'మందారమాల' రెండేళ్ళుగా నిరాటంకంగా సాగుతూ విజయవంతంగా మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాయి.

ఈ 'పాఠకులు పాల్గొనే శీర్షికలు' అనే సరికొత్త ప్రయోగం ఎన్నో కొత్త అనుభవాలని తెలియచేస్తోంది. 'మా మంచి టీచర్లు' శీర్షిక ద్వారా ఎంతో మంది టీచర్లు, విద్యార్థులు దశాబ్దాల తర్వాత కలుసు కోవడం,కొంతమంది పాత మిత్రులు, ఒకప్పటి సహాధ్యాయులు కలుసుకోవడం ('కౌముది' ఉత్తరాల శీర్షిక చూడండి) ఒక మహత్తరమైన అనుభవం.

ఏ అంశం ప్రచురించినా ఏ శీర్షిక నిర్వహించినా..ప్రతిదీ పాఠకుల మనసుకి దగ్గరయేలా చూడడం 'కౌముది' తన ప్రాథమిక బాధ్యతగా గుర్తిస్తోంది. గత 16 వారాలుగా 'కౌముది' కి అనుబంధంగా అందిస్తున్న గొల్లపూడి మారుతిరావు గారి వీక్లీ కాలమ్స్

(ఆడియో తో కూడా) విశేష పాఠకాదరణ చూరగొంటున్నాయి. నెలనెలకో సరికొత్త అందాన్ని సంతరించుకుంటున్న కవర్ పేజీలు, వాటి కవితలు కూడా పాఠకులకి ఎంతో దగ్గరయ్యాయి.

మూడవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభసందర్భంలో మొదలౌతున్న కొన్ని కొత్త అంశాలు -5 సీరియల్స్ (2 అలనాటి ఆణిముత్యాలు, 3 సరికొత్త నవలా రత్నాలు) , 'అమెరికాకమ్మ కథలు', 'అగ్రహారం కథలు', 'అమెరికా ఇల్లాలి ముచ్చట్లు', 'టేకిట్ ఈజీ', ' నానీల్లో భగవద్గీత' నెలవారీ శీర్షికలు.

ప్రజాదరణ పొందిన ప్రస్తుతం ఉన్న అనేక శీర్షికలు యధావిధిగా కొనసాగుతున్నాయి. న్యూజిలాండ్, జెర్మనీ, బోట్స్వానా లాంటి దేశాల్లో మారు మూల ప్రాంతాల్లో ఉంటున్న కొంతమంది తెలుగు వారు ' తెలుగు పుస్తకాలకి కరువు వాచిపోయిన మాకు 'కౌముది' చదువుతుంటే మన రాష్ట్రంలోనే ఉంటూ 'ప్రింట్' పత్రికలు చదువుతున్నట్లే ఉంది' అంటున్నారు. ఇలాంటి అభిమానులకోసమే కాకుండా ప్రపంచంవ్యాప్తంగా ఉన్న తెలుగు పుస్తకాభిమానుల కోసం, ఈ నెల నుంచీ 'ఇంటింటా కౌముది ఉచిత గ్రంథాలయం' అనే సరికొత్త కాన్సెప్ట్‌ని ప్రవేశపెడుతున్నాం.

ఇందులో భాగంగా 'కౌముది' లో ఇంతకాలంగా వస్తున్న రచనలని పుస్తకరూపంలో ప్రింట్‌చేసి ఒక గ్రంధాలయంగా ఏర్పాటు చేసుకునేందుకు సౌకర్యం కల్పిస్తున్నాం. ఇందుకోసం చక్కటి ముఖచిత్రం, విషయ సూచికలతో కలిపి గతంలో వచ్చిన శీర్షికలని ఒక్కోటీ ఒక్కో సింగిల్ పి.డి.ఎఫ్ ఫైలుగా అందిస్తున్నాం. ఈ నెలలో 'ప్రేమ లేని చోటు', 'ఊసులాడే ఒక జాబిలట', ' టాంజానియా ట్రావెలోగ్' పుస్తకాలని ఒక్కోటి ఒక్కొక్క పి.డి.ఎఫ్ గా 'గ్రంధాలయం' విభాగంలో అప్ లోడ్ చేస్తున్నాం. డౌన్ లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకుని, బైండ్ చేసుకుంటే మీ లైబ్రరీకి ఒక మంచి పుస్తకం జత చేరుతుంది. పుస్తక ప్రియులకి బహుమతిగా కూడా ఇవ్వొచ్చు. ప్రతి నెలా మరికొన్ని అంశాలని ఇలానే పుస్తక రూపంలో అందిస్తాం. మమ్మల్ని ప్రతి క్షణం వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న తెలుగు సాహిత్యాభిమానులకిది మా చిరుకానుక. ఈ సాహితీ యజ్ఞంలో మాకు సదా నీడగా నిలిచి ప్రోత్సహిస్తున్న అతిరథ మహారథులూ, అభిమానులూ, ఆత్మీయులూ.... ఎందరో మహానుభావులు..అందరికీ మా హృదయపూర్వక అభివందనాలు..!

***జనవరి, 2009***

***

ఓ రోజు..

వెంక(టావు టి.వి. ముందు కూర్చున్నాడు. ఫిల్మ్ న్యూస్ వస్తున్నాయి.

"బమ్మాండంగా రూపు దిద్దుకున్న చి(తం రెపు విడుదలకు సిదమౌతుంది. సతాదిక చి(తాల దర్శకుడు దీన్ని నిరిమిస్తున్నారు. బారతదేసం గురించి ఈ చితంలో ఎన్నో అదుబుతమైన పాటలు ఉన్నాయి.."

అ యాంకర్ తెలుగు భాషా పటిమని వింటూ, చూస్తూ భరించలేకపోతున్నాడు. ఒళ్ళంతా కంపరమెత్తిపోతోంది. వెంటనే ఛానెల్ మారుద్దామని రిమోట్ కం(టోల్ కోసం చూసాడు. కనిపించలేదు. విసుగొచ్చింది. టి.వి. దగ్గరకెళ్ళి చూస్తే ఛానెల్ మార్చే బటన్ విరిగి పోయి ఉంది.

చి(తవిశేషాలు భయంకరంగా కొనసాగుతున్నాయి "పూర్తి అ(రర్ చి(తంగా ఈ సినిమా మీ ముందుకు రాబోతుంది.." వెంక(టావ్ విసుగు తారాస్థాయికి చేరింది. అర్జంటుగా చానెల్ మార్చాలి..రిమోట్ కం(టోల్ ఎక్కడ చచ్చింది..? 'ఏమోయ్..' భార్యని పిలిచాడు.. "ఎందుకండీ అంత విసుగు.. అ సోఫా వెనకాల చూడండి.." తీసిచ్చింది. అర్జంటుగా ఛానెల్ మార్చాడు. పక్క ఛానెల్ లో 'మిస్సమ్మ' సినిమా వస్తోంది. 'అమ్మయ్య..' అని నిట్టూర్చి హాయిగా సినిమా చూడ్డంలో మునిగిపోయాడు. ఇల్లంతా (ప్రశాంతత అలుముకుంది.

ఇంకోరోజు.. హఠాత్తుగ అర్థరా(త్రి మెలకువ వచ్చింది వెంక(టావుకి. 'అసలు ఈ బాస్ కి బుద్ధి లేదు. ఇందులో నాతప్పేమి ఉందనీ..(ప్రతి దానికీ నన్నే కేకలేస్తాడు.. వాడూ... అ టైలర్ గాడు..బట్టలు కుట్టమని ఇచ్చి ఎన్ని రోజులైంది. రోజూ తిప్పించుకుంటాడు. (ప్రతి రోజూ ఏదో ఒక అబద్ధం చెబుతాడు.. ఆ..శంకరం గాడూ..అప్పు తీసుకునేప్పుడు పాటికి పదిసార్లు వెంట తిరుగుతాడు. అవసరమై అడిగితే మళ్ళీ కనిపిస్తే ఒట్టు. అవును బుజ్జిగాడికి స్కూల్లో ఫస్టు వచ్చిందట. రేపే యానివర్సిరీ. మధ్యాహ్నమే లెటర్ వచ్చింది కదా నాన్న వద్దనుంచీ 'క(రి అవు ఈనిందట. ఈ సంవత్సరం మినుము బాగా పండిందట. ఇంటికి రారా ఒకసారి ' అని రాసాడు. ఒక సారి వెళ్ళి రావాలి. అసలీ బాసూ..అ టైలర్ వెధవా.. శంకరం ఏ(బాసి గాడూ.. బాస్ కి ఎప్పుడు బుద్ధి వస్తుందో..అ టైలర్ ఎప్పటికి నిజంచెప్పడం నేర్చుకుంటాడో. శంకరం గాడి వద్దనుంచీ అప్పు అసలు వసూలౌతుందా? బాసూ..టైలరూ..శంకరం..బాసూ..' అలోచనలు అగడం లేదు. బాసూ. టైలరూ..శంకరంలు బుజ్జి కి స్కూల్లో (ప్రైజు వచ్చిందన్న అనందాన్నీ, నాన్న లెటర్ వచ్చిన సంతోషాన్నీ మింగేస్తున్నాయి. చేదు జ్ఞాపకాలే పదే పదే గుర్తొస్తున్నారు. ఛా..ని(దపట్టేలా లేదు.. ఇప్పుడు వెంక(టావుకి మనో యవనికమీద నుంచీ విసిగించే చి(తాలని తుడిచేసి, అనందాన్నిచ్చే జ్ఞాపకాలని నిలిపేందుకు ఒక రిమోట్ కం(టోల్ కావాలి.!

వెంక(టావుకే కాదు.. (ప్రతికూల అలోచనలతో మనసుని కకావికలం చేసుకునే వారందరికీ జీవితంలోని మధురక్షణాలని గుర్తు తెచ్చుకునేందుకు, అలోచనలని నియం(తించే ఒక రిమోట్ కం(టోల్ ఎప్పుడూ ఉండాలి.

*ఫి(బవరి, 2009*

***

ప్రపంచ గమనంలో వేగం పెరిగింది. ప్రజా జీవితాల్లోనూ వేగం హెచ్చింది. పోటీ తత్వం, పైకెదగాలనే తపన, అందరికంటే ముందుండాలనే అకాంక్ష..వెరసి అనేక విషయాలు మనుషుల మీద 'ఒత్తిడి' ని పెంచుతున్నాయి. సూక్ష్మంగా పరిశీలిస్తే ఈ 'ఒత్తిడి' అనేది రెండు రకాలు. 'అనుకూల ఒత్తిడి' (positive pressure) , 'ప్రతికూల ఒత్తిడి' (negative pressure). పైకెదగాలనే తపన ఉన్నవాళ్ళకి positive pressure అనేది తప్పని సరిగా ఉండాలి. జీవితమంతా సాదా సీదాగా, విశ్రాంతిగా (ఒక విధంగా సోమరి తనంగా) గడిస్తే విజయాలు సాధించడం అంత తేలిక కాదు. ప్రణాళిక బద్ధంగా, సరైన విశ్లేషణతో జరిగే ప్రయత్నాల్లో ఉన్న 'ఒత్తిడి' మనసుమీద ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. 'ఈ పని పూర్తయే తర్వాత కలిగే విజయం ఫలానా ఫలితాన్నిస్తుంది' అన్న స్పష్టమైన అవగాహన, దాన్ని సాధించగలనన్న విశ్వాసం, అ త్రోవలో సాగుతూ కష్టపడే మనస్తత్వం.. అన్నీ కలిసి అ 'ఒత్తిడి'ని మనిషిని ముందుకి నడిపించే చోదకశక్తిగా మారుస్తాయి.మొండి తనానికీ, పట్టుదలకీ సన్నని గీత మాత్రమే అడ్డం. విచక్షణా రహితంగా ముందుకి దూసుకెళ్ళడం మొండితనమైతే ఐతే వ్యూహాత్మకంగా ముందుకి వెళ్ళడం పట్టుదల. పట్టుదల positive pressure ని కలిగిస్తే, మొండితనం చాలా సార్లు అది వున్న మనిషికే కాక పక్కవారికి కూడా ప్రతికూల ఒత్తిడి పెంచుతుంది. మనిషి అదుపులో ఉంచుకోవల్సింది, వీలైతే వదిలించుకోవల్సిందీ ఈ negative pressure. ఈ ప్రతికూల ఒత్తిడి పెరగడానికి అనేక కారణాలు ఉండవచ్చు. ఏం చెయ్యాలో తెలుసుకానీ, ఎలా చెయ్యాలో ఒక ప్రణాళిక లేకపోవడం, 'అయ్యో ఫలానా పని చెయ్యలేకపోతున్నామే' అనే కంగారు.. ఇవన్నీ కలిసి ప్రతికూల ఒత్తిడిని పెంచుతాయి. కొన్ని సార్లు ఎదుటివారు మనపై ప్రతికూల ఒత్తిడిని పెంచే ప్రయత్నాలు చేస్తారు. అవి అర్థం చేసుకుని అ వలలో పడకుండా ఉండడమే మనలోని విచక్షణా జ్ఞానానికి మేలుకొలుపు. ఇంకొన్ని సార్లు మన మనసులోని అసూయ, ద్వేషం, కోపం, పగ లాంటి ప్రతికూల భావాలు మనకి తెలీకుండానే మనలో ప్రతికూల ఒత్తిడిని పెంచుతాయి. 'ప్రతికూల ఒత్తిడి' మనల్ని అవహించినప్పుడు సమర్థవంతంగా చెయ్యదగిన పనులు కూడ సరిగా పూర్తిచెయ్యలేము. కంగారు, అందోళన, బాధ, బరువూ..ఎప్పుడూ మనల్ని తినేస్తుంటాయి కానీ ఫలితం ఉండదు. ప్రయత్నించి, అభ్యసిస్తే ఈ 'ప్రతికూల ఒత్తిడి' ని అధిగమించడం బ్రహ్మ విద్యేమీ కాదు. మానసిక పరిణితి, విశ్లేషణాత్మకమైన అలోచనా విధానం, ఓర్పు, సహనం, మంచి తనం, క్షమా గుణం.. ఇవన్నీ 'ప్రతికూల ఒత్తిడి'ని 'అనుకూల ఒత్తిడి'గా మార్చడంలో ముఖ్యపాత్ర వహిస్తాయి. అందుకే పెద్దలు చెప్పినా, ఏ ప్రవచనాలు చెప్పినా ఈ మంచి గుణాలని పెంచుకోమనేదే సారాంశం. ఈ రాబోయే తెలుగువారి కొత్త సంవత్సరం మనలో ప్రతికూల భావాలని తద్వారా వచ్చే ప్రతికూల ఒత్తిళ్ళనీ తగ్గించి, 'అనుకూల ఒత్తిడి'ని మనలని ముందుకి నడిపించే నేస్తంగా మనకందించి, మనందరికీ శుభప్రదం కావాలని మనసారా అశిద్దాం.

*మార్చ్, 2009*

***

వెంకట్రావ్ ఇంటికి వచ్చే సరికి ఐదేళ్ళ బుజ్జిగాడు తను ఆడుకుంటున్న బొమ్మని నేలకేసి  కొడుతున్నాడు. కీ ఇస్తే తిరిగే బొమ్మ పనిచెయ్యడంలేదని ఏడుస్తున్నాడు. "బొమ్మ పాడైపోతే అలా  నేల కేసి కొడితే బాగు పడదమ్మా.." అంటూ బుజ్జిగాడ్ని ఒళ్ళో కూర్చో పెట్టుకుని బొమ్మని  సరి చెయ్యడం మొదలుపెట్టాడు వెంకట్రావ్. ఎలా బాగు చెయ్యాలో ముందు అర్థం కాలేదు కానీ,  నెమ్మదిగా దాన్ని ఊడదీసి, తన ఇంజినీరింగ్ బుర్రను ఉపయోగించి సరి చెయ్యగలిగాడు. కీ బొమ్మ మళ్ళీ పనిచేసింది. బుజ్జి గాడు మొహంలో నవ్వుల పువ్వులు విరిసాయి. కాలం ఇరవయ్యేళ్ళు  ముందుకి జరిగింది. పాతికేళ్ళు వచ్చిన బుజ్జికి, యాభై యేళ్ళు దాటిన వెంకట్రావుకీ అభిప్రాయబేధాలొచ్చాయి. సొంతంగా బిజినెస్ చెయ్యాలని బుజ్జి ప్లాన్. వద్దు ఉద్యోగమే చెయ్యమని వెంకట్రావ్ వాదన.వాద, ప్రతివాదనలూ, చర్చలూ..సాగుతున్నాయి. తనమాట కొడుకు వినడం లేదని వెంకట్రావుకి పట్టుదల పెరిగింది.

"సరేరా..నీ యిష్టమొచ్చినట్లు చేసుకో. నాకేం సంబధం లేదు " విసురుగా అక్కడినుంచీ వెళ్ళిపోయాడు. 'నాకేం సంబంధం లేదు' అని వెంకట్రావ్ డిక్లేర్ చెయ్యడంతో తండ్రిని ఒప్పించాలని బుజ్జి చేస్తున్న ప్రయత్నాలు ముందుకి సాగలేదు.. చిన్నప్పుడు పనిచెయ్యడం లేదని  బొమ్మని నేలకేసి కొట్టాడు బుజ్జి. ఇప్పుడు కొడుకు తన మాట వినడం లేదని సమస్యని  విసిరి కొట్టాడు వెంకట్రావ్.

కొన్ని సమస్యలు జటిలంగా అనిపిస్తాయి. అంత మాత్రం చేత విసుగుతో చిరాకుతో వాటి నుంచీ పారిపోవడం  పరిష్కారం కాదు. చిక్కు ముడులు పడిన దారం ఉండని విసుగ్గా అటూఇటూ లాగితే  మరిన్ని ముడులు పడతాయే తప్ప ఒక కొలిక్కి రావు. కొంచెం ఓపికగా పరిశీలించి ఒక్కొక్క ముడినీ నెమ్మదిగా విడదీసుకుంటూ రావడంలోనే సమస్యకి పరిష్కారం దొరుకుంతుంది. సహనం, వివేచన, అనుభవసారాన్ని సందర్భానుసారం వినియోగించగల నేర్పు, ఒక్కోసారి ఆత్మీయుల సహకారం.. సమస్యని సాధించడానికి ఎన్నో ఆయుధాలు మన వద్దనే ఉంటాయి. అస్త్ర సన్యాసం చేయడం  యుద్ధంలో గెలుపుకి సూచన కాదు.

*ఏప్రిల్, 2009*

***

'మానవుడే మహనీయుడు..' అంటూ ఆరుద్రగారు మనిషి చేసిన, చెయ్యగలిగిన ఎన్నో అద్భుతాల గురించి ప్రశంసించారు. మానవశక్తికున్న సామర్థ్యం, విలువ అమూల్యం. ఎటువచ్చీ వాటిని ఎలా వాడుకుంటామన్నదే ప్రశ్నార్థకం. వ్యక్తి పునాదులమీదే ఏ వ్యవస్థ ఐనా అవతరిస్తుంది.. వ్యక్తుల సమూహమే కుటుంబంగా, సమాజంగా, సంస్థగా, వ్యవస్థగా రూపుదిద్దుకుంటుంది. ఒక వ్యక్తి మంచి విలువల్ని పాటిస్తూ అదర్శవంతమైన వ్యక్తిత్వాన్ని పెంపొదించుకుంటే తను భాగస్వామిఐన సమూహాన్ని కూడా తన అనుకూల భావాలతో ప్రభావితం చెయ్యగలడు. తన చుట్టూ ఉన్నవారిలో కూడా ఒక విధమైన ఉత్తేజాన్నీ, ఉత్సాహాన్నీ రేకెత్తించగలడు. అందుకే వ్యక్తిత్వ వికాసం అనేది అన్ని రకాల సంస్థలకీ అత్యంత ముఖ్యమైనది. ఒక వ్యక్తి వికాసానికి అవసరమైన గుణాలను బట్టే వ్యవస్థాగతమైన సూత్రాలను కూడా తయారు చేసారేమోనని చాలాసార్లు అనిపిస్తుంది. విజయవంతమైన సంస్థల మార్గదర్శకసూత్రాలను విశ్లేషిస్తే చాలా సార్లు ఈ విషయం ధ్రువపడుతుంది. ఉదాహరణకి - ఒక పారిశ్రామిక సంస్థ యాజమాన్యం 90/10, 80/20 అనే సూత్రాలని ప్రచారం చెయ్యడం గమనించాను. వాళ్ళు జారీ చేసే ప్రతి ప్రకటనలోనూ, ప్రతి ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ ఈ 90/10, 80/20 అనే సూత్రాలని పదే పదే ఉటంకిస్తారు. వాళ్ళ ఉద్యోగులకి కూడా వీటిని తరచూ గుర్తు చేస్తూ ఉంటారు. ముందుగా వీటి అర్థమేమిటో చూద్దాం. 90/10 - అంటే మీరు చేసే పనుల్లో 90 శాతానికి మీరే బాధ్యత వహించండి. విజయాలని మాత్రం మీ ఖాతాలోవేసుకుని వైఫల్యాలని పక్కవాళ్ళమీద నెట్టి వేసే మనస్తత్వాన్ని విడనాడండి. 80/20 అంటే 80 శాతం ఫలితాలని 20 శాతం పనులు విజయవంతం చేయడం ద్వారా సాధించవచ్చు. ఆ 20 శాతం ఏమిటో వివిధ విభాగాలు విశ్లేషించుకోవాలి. తద్వారా ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించాలి. సంస్థలకే కాకుండా ఈ సూత్రాలు విడిగా ఒక్కో వ్యక్తి ప్రవర్తనకి కూడ వర్తిస్తాయా? చూద్దాం.. ఇంతకు ముందు ఒకసారి ఈ శీర్షికలోనే ప్రస్తావించుకున్నట్లు చాలా సార్లు ప్రపంచంలోని సమస్యలన్నీ ఎదుటివాళ్ళ వల్లనే వస్తున్నట్లు, మనం మాత్రం ఎప్పుడూ అదర్శంగానే ఉంటున్నామనీ అనుకోవడం సహజం. ఎదుటివారితో ఘర్షణ వచ్చినప్పుడు, ఎదుటి వారి ప్రవర్తనతో మనఃక్లేశం కలిగినప్పుడు, ఎదుటివాళ్ళ వల్ల మనం మోసపోయామనుకున్నప్పుడు..ఎప్పుడైనా ఒక్క క్షణం చూపుడు వేలుని మన వైపుకి తిప్పుకుని చూసుకుంటే సమస్యకి పరిష్కారం దొరుకుతుంది. సంఘటనలు ఎలా జరిగాయన్న దానికంటే, వాటికి మనం ఎలా ప్రతి స్పందిస్తున్నా మనేది మన మీద తీవ్రప్రభావాన్ని కలిగిస్తుంది. మరి మన స్పందన అనేది మన చేతుల్లో ఉన్నప్పుడు 90/10 సూత్రం ప్రకారం 90 శాతం సార్లు మనల్ని మనం సంస్కరించుకుంటే సరిపోదా? అలోచిద్దాం.. ఎన్నో సార్లు అనవసరమైన విషయాల గురించి అలోచిస్తోనో, వాటి కోసం సమయం వెచ్చించో అసలు పనులకి సమయం సరిపోవడం లేదని ఫిర్యాదు చేస్తుంటాం. విషయం లేదా సమస్య ప్రాధాన్యతని బట్టి సమయం కేటాయించడం నేర్చుకుంటే 80 శాతం విజయాలని 20 శాతం పనులు చక్కబెట్టుకోవడం ద్వారా సాధించవచ్చు. ఆ 20 శాతం పనులని గుర్తించగల నేర్పు, ప్రాధాన్యతని నిర్ణయించుకోగల క్రమశిక్షణా ఉండాలంతే. అందరూ చెప్పే మాటలే మరో సారి గుర్తుచేసుకుందాం 'చాలా మంది విజేతలు కొత్త పనులు చెయ్యరు. మిగతావాళ్ళు చేసే పనుల్నే కొత్తగా చేస్తారంతే'. మనమూ గుర్తు పెట్టుకుందాం..90/10..80/20..!

***మే, 2009***

***

చాలా సంవత్సరాల క్రిందట విడుదలైన ఒక సినిమాలో పొట్టి ప్రసాద్ అనే హాస్యనటుడు ఒక విచిత్రమైన పాత్ర ధరించాడు. అతనో ఆఫీసులో గుమాస్తా. ఒకసారి ఆఫీసరు లేని సమయంలో వాళ్ళింటికి వెళ్ళాల్సి వస్తుంది. అలా వెళ్ళినప్పుడు అనుకోకుండా ఆఫీసరు గారి భార్య చేతులు పట్టుకుంటాడు. అసలే మొహమాటం..చాలా ఫీలైపోయి, మర్నాడు ఆఫీసరు గారిని కలిసి 'సార్..చాలా పొరబాటైపోయింది. నిన్న మీ ఇంటికి వెళ్ళినప్పుడు పొరబాటున మీ భార్యగారి చేతులు పట్టుకున్నాను..' అంటాడు. 'పోనీలేవయ్యా.. అనుకోకుండ జరిగినదానికి అంత ఫీలవ్వాల్సిన దేముంది? ఆ విషయం మర్చిపో..' అని పెద్ద మనసుతో అర్థం చేసుకుంటాడు ఆఫీసర్ గారు. మనవాడు అంతటితో ఊరుకుంటే బాగానే ఉండేది, సీట్లో కూర్చుని ఇంకా ఫీలైపోతూ పక్క నున్న గుమాస్తాతో.. 'నిన్ననేం జరిగిందో..తెలుసా? ' అంటూ అంతా చెప్పేసి 'ఆఫీసర్ గారి క్షమించానన్నారు కానీ ఆయన్ని బాధ పెట్టానేమోనని గిల్టీగా ఉంది..' అంటాడు. పక్క గుమాస్తా కూడా సర్దిచెబుతాడు. అంతటితో ఊరుకోకుండా కనబడిన వాళ్ళందరికీ ఈ విషయాన్ని టాంటాం చేస్తాడు. అదీ సరిపోక పక్క ఊళ్ళోని బ్రాంచి ఆఫీసుక్కూడా ఫోన్ చేసి 'నిన్న ఆఫీసర్ గారి భార్య చేతులు పట్టుకున్నాను...' అని ఇంకా గిల్టీగా చెబుతాడు.. గాయాన్ని కెలికి కెలికి రాచపుండు చెయ్యడం అంటే ఇదే. మనలోనూ కొంతమందికి ఇలాంటి అలవాటు ఉంటుంది. ఏదో చిన్న పొరబాటు జరిగినప్పుడో, ఎవరో ఏదో అన్నప్పుడో తమంతట తామే అందరికీ (అందరికీ అంటే ఇద్దరికే సుమా - అడిగిన వాళ్ళకీ, అడగని వాళ్ళకీ) చెబుతారు. అలా చెప్పడంలో ఒక విధమైన సాంత్వన పొందుతారు. ఎదుటి వారి నుంచీ ఏ కొంచెమైనా సానుభూతి పొందే ప్రయత్నం కూడా కావొచ్చు. కష్టాలనీ ఇబ్బందులనీ ఆత్మీయులతో పంచుకోవడంలో తప్పులేదు కానీ అందరికీ చెప్పడం వల్ల ఆశించిన మంచి కంటే చెడే ఎక్కువ జరుగుతుంది. అందరూ మనలాంటి దృక్పథంతోనే ఆలోచించరు. రకరకాల మనస్తత్వాలు, మనః స్థితులూ ఉంటాయి. అలాంటప్పుడు సానుభూతి కోసం వెళ్ళిన వాళ్ళు పరోక్షంగా హేళన పాలయ్యే అవకాశాలూ ఎక్కువగానే ఉంటాయి. నిజంగా తగిలిన దెబ్బతొందరలోనే మాసిపోవచ్చు కానీ ఇలా అందరికీ చెప్పి ప్రచారం చేసుకోవడం వల్ల దెబ్బ పుండై పోతుంది. ఒకోసారి దెబ్బతగిలిన వాళ్ళు మరిచిపోయినా ప్రచారం చేసేవాళ్ళు ఇంకా కొనసాగిస్తూనే ఉండవచ్చు. అందరితో అన్ని సమయాల్లోనూ అన్ని విషయాలూ పంచుకోవడం అంత మంచిది కాదేమో..మీరూ ఆలోచించండి.!

***జూన్, 2009***

***

కాగితం మీద ఒక గీత గీసి పెద్దదా చిన్నదా అంటే సమాధానం చెప్పగలమా? అదొక గీత అంతే. పక్కన ఇంకో గీత గీస్తే అప్పుడు పెద్దా , చిన్నా అనే తారతమ్యం తెలుస్తుంది. మన జీవితాలు, అనుభవాలు, మన ఆవేశాలూ కూడా ఇలా సాపేక్షమే తప్ప ఏదీ నిరపేక్షం కాదు. అంటే ప్రతి మానసిక స్థితీ, స్పందనా, అనుభూతీ రిలేటివ్ మాత్రమే తప్ప ఆబ్సల్యూట్ కాదు. కొంచెం వివరంగా చూద్దాం. ఒకతన్ని మిత్రుడు అడిగాడట..'ఏమోయ్ చాలా కష్టాల్లో ఉన్నావటగదా!?' అని అందుకతను ' కష్టాల్లో ఉన్న మాట నిజమే కానీ నువ్వన్నట్లు 'చాలా కష్టాలు' అని అనలేను. నాకంటే ఎక్కువ బాధల్లో ఉన్న వారితో పోలిస్తే నా కష్టాలు ఒక లెక్కలోనివి కాదు. నాకంటే సంతోషంగా వున్నవారితో పోలిస్తే అంటావా..బహుశా అవును నా బాధలు వారి కంటే ఎక్కువేనేమో..' అన్నాడట. ఇదీ పెద్ద గీతా, చిన్నగీతా ఉదాహరణకి సరిపోలిందే ఈ విశాలవిశ్వంలో ఎవరి జీవితాలు వాళ్ళవి, ఎవరి అనుభవాలు వాళ్ళవి, ఎవరి కష్ట సుఖాలు వాళ్ళవే కావొచ్చు కానీ పక్కవారితో పోల్చి చూసుకుంటే చాలా సార్లు సాంత్వన దొరుకుతుంది, మనకి మనం ఎక్కడున్నామో తెలుస్తుంది. ఐతే ఈ పోలిక అనేది నిర్మాణాత్మకంగా, సానుకూల దృక్పథంతో, మన ఆలోచనా విధానాన్ని మరింతగా మెరుగు పరిచేదిలా ఉండాలి. ఎలాగంటే - కొన్ని సార్లు జీవితంలో ఏదో సాధిస్తాం. చాలా సంతోషంగా ఉంటుంది. వేడుక జరుపుకుంటాం. తప్పేమీ లేదు. ఐతే ఆ విజయం తలకెక్కి, అహంభావం పెరిగే పరిస్థితి తెచ్చుకోకూడదు. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండడం అన్న ప్రవర్తన అలవాటు కావాలంటే మనకంటే పెద్ద విజయాలను సాధించిన వాళ్ళతో పోల్చి చూసుకోవాలి. మళ్ళీ అది అసూయకీ, అశాంతికీ దారి తియ్యకూడదు. పెద్దవారితో మనల్ని పోల్చుకోవడమనేది, 'మనం సాధించాల్సింది ఇంకా ఉంది, విజయపథంలో ఎక్కాల్సిన మెట్లు చాలా ఉన్నాయి' అన్న పాఠాన్ని నేర్పిన రోజు ఈ పోలిక నిర్మాణాత్మకమౌతుంది. అది మనల్ని ముందుకి నడిపించే ఇంధనం అవుతుంది. అదే విధంగా కష్టాలూ, బాధలూ, బరువులూ కూడా. "అబ్బా..నాకొచ్చిన కష్టాలు పగవాళ్ళకి కూడా వద్దురా బాబూ.." అనుకునే వాళ్ళని చాలా సార్లు చూస్తూనే ఉంటాం. అంతకంటే ఎక్కువ కష్టాలు పడుతున్న వాళ్ళున్నారనే విషయం మర్చిపోయినప్పుడే ఈ భావం కలుగుతుంది. కష్టాలు వచ్చినప్పుడు కృంగిపోవడం కంటే మన కంటే ఎక్కువబాధల్లో ఉన్నవారితో పోల్చి చూసుకోండి. "ఏం ఫరవాలేదు.. వాళ్ళతో పోలిస్తే మన కష్టాలు చిన్నవే. వాళ్ళే అన్ని కష్టాల్లో కూడా మనగలుగుతున్నారంటే మనం కూడా వీటిని తప్పక అధిగమించగలుగుతాం. కావల్సిందల్లా సంయమనం, చిక్కుముళ్ళని విడదీసుకునే నేర్పు, సామర్థ్యం." ఇలా ఆలోచనలని మలచుకున్న రోజు నెగెటివ్ ఎనర్జీ పోజిటివ్ గా మారుతుంది. ఆ చోదకశక్తి కష్టకాలాల్లో సైతం మనల్ని ముందుకి నడిపిస్తుంది. ఇంకా ఉదాహరణలు కావాలా? 'చాలా కష్టల్లో ఉన్నాం' అనుకునే వాళ్ళు ఒక్కసారి ఈ వీడియోలు చూడండి. Video 1 | Video 2 కష్టాలని , సమస్యలనీ మర్చిపొమ్మనీ, నిర్లక్ష్యం చెయ్యమనీ చెప్పడం ఈ విశ్లేషణ ఉద్దేశం కాదు. అవి సహజమైనవే నని తెలుసుకుని ధైర్యంగా పరిష్కారదిశగా అడుగెయ్యమనేది ఇలాంటి నిర్మాణాత్మకమైన పోలికలు చెప్పే గుణపాఠం. మనకి మనమే ఒకలోకంగా.. మన బాధలే నరకంగా, మన సంతోషాలే స్వర్గంగా అనిపిస్తోందా..చిన్న గీతా, పెద్ద గీతా పాఠాన్ని గుర్తుతెచుకోండి. ఈ అతి పెద్ద ప్రపంచంలో మన స్థాయి ఏమిటో తెలుస్తుంది. విజయాలు మనల్ని వాస్తవాలకి దగ్గరగా నిలబెడతాయి. కష్టాలు మనల్ని కుంగదీయకుండా కాపాడుకోగలుగుతాం.

*జూలై, 2009*

***

"సార్..ఈ కాలిక్యులేషన్స్ లో తప్పులున్నాయి. హెడ్ ఆఫీసుకి తిప్పి పంపించాల్సిందే."

"నేను చెప్పినట్టు చెయ్యి. ఇదే ఫైనల్..వెనక్కి పంపించాల్సిన అవసరం లేదు.."

"లేదు సార్..ఒక్క సారి నామాట వినండి.."

"ఒక్క మాట లేదు..రెండు మాటలు లేవు..నేను బాస్ ని . నేను చెప్పినట్టు చెయ్యి.."

ముకుందం అయిష్టంగానే ఆ పని పూర్తిచేశాడు. కానీ బాస్ తన పాయింట్‌ని సరిగా వినలేదన్న అసంతృప్తి మాత్రం మిగిలిపోయింది. సాయంకాలం ఇంటికి వచ్చాడు. స్కూటర్ బయట పెట్టి లోనికి వచ్చాడో లేదో బయటేదో హడవిడి.. పక్కింటివాళ్ళబ్బాయి స్కూటర్ మీదేసుకున్నాడు. పక్కింటి సోమశేఖరం అరుస్తున్నాడు..

"ఏమయ్యా ముకుందం. స్కూటర్ స్టాండ్ సరిగా వెయ్యాలని తెలీదూ..?"

"మీ అబ్బాయి వచ్చి స్కూటర్‌తో ఆడడం అతని తప్పు. దానికి నన్ను అని ప్రయోజనం ఏముంది?"

"ఆఁ.. మా అబ్బాయిది తప్పంటావా? నీదే తప్పు.."

"ఏం మాట్లాడుతున్నారండి..మీ అబ్బాయిదే తప్పు.."

"కాదు నీదే తప్పు.."

"తప్పు నాది కాదు అంటున్నాను..ఏం చేసుకుంటావో చేసుకో.."

"ఏం చేస్తానో చేసి చూపిస్తాను.." ఇద్దరూ సవాళ్ళు విసురుకున్నారు. ముకుందం ఇంట్లోకి వచ్చాడు. ఇద్దరిలోనూ అసంతృప్తే మిగిలింది.

"నాన్నా..రేపు స్కూల్లో ఎక్స్‌కర్షన్ ఉంది. నేనూ వెళుతున్నాను.." కూతురు చెప్పింది. "ఏమీ అవసరం లేదు. ముందు చదువుకో."

"అది కాదు నాన్నా.." ఏదో వివరించబోయింది కూతురు.

"నాకేమీ చెప్పనవసరం లేదు. నేను చెప్పినట్లు చెయ్యి. వెళ్ళు లోపలికి.." ముకుందం కూతురు అసంతృప్తిగానే లోనికి వెళ్ళింది. "ఏమండీ. వాషింగ్ మెషీన్ ఒకటి కొనుక్కుందామండీ.." ముకుందం భార్య ప్రపోజల్ పెట్టింది.

"అంత సేవింగ్స్ మన దగ్గర లేదే.!?"

"ఒక పద్ధతి ఆలోచించాను. నేను కడుతున్న చిట్‌ఫండ్ వచ్చేనెలలో పాడుకుందాం. అలావచ్చిన డబ్బులతో వాషింగ్ మెషీన్ కొనుక్కుందాం. నెలనెలా చిట్ వాయిదా కడితే సరిపోతుంది.."

"ఊఁ.. ఇదేదో బాగానే ఉన్నట్లుంది. సరేలే అలానే చేద్దాం.." ఈ పరిష్కారం ఇద్దరికీ తృప్తినిచ్చింది. ఈ నాలుగు సంఘటనలనీ ముకుందం దృష్టితో చూద్దాం. మొదటి సందర్భంలో ముకుందం ఓడిపోయాడు, ఆఫీసర్ గెలిచాడు (lose - win). రెండో సందర్భంలో ముకుందమూ, పక్కింటి సోమశేఖరమూ ఇద్దరూ ఓడిపోయారు (lose - lose). మూడో సందర్భంలో ముకుందం గెలిచాడు, అతను కూతురు ఓడిపోయింది (win - lose) . నాలుగో సందర్భంలో ముకుందమూ గెలిచాడు, అతని భార్యా గెలిచింది (win - win) ప్రతి వ్యక్తికీ జీవితంలో మరో వ్యక్తితో విభేదించే సందర్భాలు అనేకం ఎదురౌతాయి. అవి అభిప్రాయ బేధాలు కావొచ్చు, సమస్యలు కావొచ్చు, వివాదాలు కావొచ్చు.. వీటిని పరిష్కరించుకోవడానికి అత్యుత్తమ మార్గం విన్-విన్ విధానం. ఇద్దరికీ అమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుక్కొన్నప్పుడు భవిష్యత్తులో ఇంకోసారి అలాంటి విభేదాలు ఉత్పన్నమయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. అందుకే విభేదాలు వచ్చిన ఇద్దరూ సంతృప్తిచెందే విధానం చాలా సార్లు శాశ్వతంగా నిలుస్తుంది. మిగతా మూడు విధానాల్లోనూ అప్పటికప్పుడు సమస్య

పరిష్కారమైనట్లు కనిపించినా lose - win, win - lose లో ఎవరో ఒకరిలోనూ, lose - lose లో ఇద్దరిలోనూ అసంతృప్తి నివురుకప్పిన నిప్పులా మండుతూనే ఉంటుంది. ఎప్పుడో ఒకసారి, ఏదో ఒక రూపంలో అది బయటపడి మరో వివాదానికి దారి తీస్తుంది. అయితే అన్ని సందర్భాల్లోనూ win - win అనేది అప్పటికప్పుడు సాధ్యం కాకపోవచ్చు. అలాంటి తప్పని సరి పరిస్థితుల్లో లూజ్-విన్, విన్-లూజ్, లూజ్-లూజ్ పద్ధతుల్లో దేన్నైనా పాటించి తాత్కాలిక పరిష్కారాన్ని కనుక్కుని, రెండు పార్టీలూ స్థిమిత పడ్డాక win - win దిశలో దానికో ముగింపు తెచ్చుకోవాలి. ఇలాంటివన్నీ మనకి తెలీకుండానే చాలా చోట్ల మనం అమలు చేస్తుంటాం. కొంచెం విచక్షణ, విశ్లేషణ, కాస్తంత ఓపిక, సంయమనం పాటిస్తే చాలా సందర్భాలో win - win పరిష్కారం కనుక్కోవడం అసాధ్యమేం కాదు.

*ఆగస్ట్, 2009*

***



కౌముది

"స్వామీ నాకొక వింత సమస్య వచ్చింది.."

"ఏమిటది శిష్యా..?"

"నాకు రాముడు, భీముడు అనే ఇద్దరు మిత్రులున్నారు. ఇద్దరూ మంచి వారే. ఇద్దరికీ నేనంటే చాలా ఇష్టం. ఇద్దరితోనూ కష్టసుఖాలు పంచుకుంటాను.."

"మరైతే ఇంకేమిటి సమస్య?"

"రాముడితో మాట్లాడేప్పుడు నాకెంతో ఆత్మీయంగా అనిపిస్తుంది. అదే భీముడితో మాట్లాడేప్పుడు ఎందుకో విసుగ్గా ఉంటుంది. అలాగని భీముడు చెడ్డవాడేం కాదు. నేనంటే చాలా అభిమానం. కానీ నాలోనే ఏదైనా లోపం ఉందా? రాముడిలాగ భీముడుని ఎందుకు నేను స్వీకరించలేకపోతున్నానో అర్థం కావడం లేదు. ఈ సమస్య నన్ను తినేస్తోంది.."

"ఊఁ.." అని గురువు దీర్ఘంగా శ్వాస తీసుకుని..

"నువ్వు మాట్లాడేప్పుడు రాముడు ఏమంటాడు..?"

ఒక్కనిమిషం ఆలోచించాక.." ఏమీ అనడు..నేను చెప్పేవన్నీ శ్రద్ధగా వింటాడు.."

"తర్వాత...?" "ఊఁ..తర్వాత తన అభిప్రాయాలనీ, సలహాలనీ చెప్తాడు.."

"మరి భీముడు..?" మరో సారి ఆ సన్నివేశాలని గుర్తుకు తెచ్చుకుంటూ శిష్యుడు చెప్పాడు.

"నేను ఏదైనా చెప్పేటప్పుడు..భీముడు మధ్యలోనే అందుకుని ఏదో చెబుతాడు. నన్ను పూర్తిగా చెప్పనివ్వడు. నేను చెప్పేది పూర్తిగా అతని మనసులోకి వెళ్తుందో లేదో కూడా తెలీదు.."

"అదే నాయనా..అసలు సమస్య..." చిక్కుముడిని తేలిగ్గా విడదీశాడు గురువు.

పబ్లిక్ స్పీకింగ్ అనీ, మాటా-మన్ననా అనీ..రకరకాల శీర్షికలతో మన మాట తీరుని ఎలా మెరుగు పరుచుకోవాలో చాలా మంది వ్రాశారు. ఐతే 'వినడం' కూడా ఒక కళే అనీ, అందునా ఎదుటి మనిషి చెప్పే మాటల్ని శ్రద్ధగా విని, అర్థం చేసుకోవడం వల్ల మరింతగా వారిని ఆకట్టుకోగలమనీ చాలా మంది గుర్తించరు. ఒక్కసారి మన మిత్రులందరినీ గుర్తు తెచ్చుకుని ఎవరిని ఎక్కువగా అభిమానిస్తామో విశ్లేషిస్తే..వారిలో చాలా మంది మనం చెప్పే కష్ట, సుఖాలని సానుభూతితో వినే వాళ్ళే అయ్యుంటారు. ఎలా మాట్లాడాలో తెలుసుకోవడమే కాక ఎప్పుడు మాట్లాడాలో, ఎంతవరకూ మాట్లాడాలో, ఎప్పుడు మాట్లాడ్డం ఆపేసి 'వినడం' అనే ప్రక్రియని ఆచరించాలో తెలుసుకోవడం చాలా అవసరం. పదే , పదే మన మాటలకి అడ్డు తగిలి, మనం చెప్పే వాక్యాన్ని మధ్యలోనే అందుకుని, అక్కడినుంచీ తాము పొడిగించి మనకంటే తమకే ఎక్కువ తెలుసునని నిరూపించుకోవలనుకునే వాళ్ళసమక్షంలో ప్రసన్నత అనేది కొరవడుతుంది. మిత్రులతో ముఖా ముఖి సంభాషించేప్పుడు, మిత్ర బృందాలతో చర్చించేప్పుడు..అన్ని సందర్భాల్లోనూ 'వినడం' అన్న ప్రక్రియకున్న ప్రభావాన్ని గుర్తించగలిగినప్పుడు మంచి వక్తగా, మంచి మిత్రునిగా పేరు తెచ్చుకోవడం సులభం. అనవసరమైనప్పుడు మాట్లాడ్డం ఎంత పొరబాటో, అవసరమైనప్పుడు మాట్లాడక పోవడంకూడా అంతే పొరబాటు. మాట్లాడ్డం , 'వినడం' అనే ప్రక్రియలలో సమతుల్యత సాధించి ఆచరించిన వాళ్ళు పదిమందికీ దగ్గరౌతారు. ఆ సాన్నిహిత్యాన్ని పదికాలాల పాటు నిలబెట్టుకోగలుగుతారు అనేది విజ్ఞుల సలహా.

***సెప్టెంబర్, 2009***

***

ముకుందం చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్నాడు. ఓ చెల్లెలు, ఈ తమ్ముడు. తన వయసు పదేళ్ళు దాటనే లేదు. మావయ్యలూ, బాబాయిలూ... ముగ్గురు పిల్లల బాధ్యతలని తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. 'అవకాశాల కోసం ఎదురుచూడ్డం కాదు..వెదుక్కోవాలి..' అని ఎవరూ చెప్పకుండానే తెలుసుకున్న ముకుందం, ఒంటరి పోరాటం మొదలుపెట్టాడు. ఒకటే ధ్యేయం..ఒకటే గమ్యం. కాలగర్భంలో పదిహేనేళ్ళు గడిచిపోయాయి. అనుకున్నది సాధించాడు. తను ఒక స్థాయికి చేరడమే కాదు, తమ్ముడినీ చెల్లెల్నీ కూడా ప్రయోజనవంతుల్ని చేసాడు. చిన్నప్పుడు నిర్లక్ష్యం చేసిన బంధువులు ఇప్పుడు ముకుందాన్ని చూసి ఈర్ష్య పడడం మొదలు పెట్టారు. ఎప్పుడు కనిపించినా 'నడమంత్రపు సిరి..మేమెక్కడ కనిపిస్తాంలే..' అనే సూటిపోటీ మాటలు ఎదురయ్యాయి. తనకి తెలుసు వాళ్ళని ఆత్మన్యూనతా భావం ఎలా పీడిస్తోందో. ఐనా కోపం తెచ్చుకోకుండా వాళ్ళ పిల్లల్లో ఎవరికి ఎలా సహాయం చేయగలడో తెలుసుకుని, వాళ్ళకీ తనకి చేతనైనంతలో సహాయం చేశాడు. వాళ్ళ కుటుంబాల్లోనూ వెలుగులు నింపాడు. వాళ్ళకీ ముకుందం మంచి తనం విలువ తెలిసొచ్చింది... ఈ కథలో పెద్ద మలుపులేమీ లేవు. ఏమంత థ్రిల్లింగ్ కూడా ఏమీ లేదు. ఇలాంటివి చాలా చూస్తూనే ఉన్నాం, వింటునే ఉన్నాం. చదువుతూనే ఉన్నాం. ఐతే ఇలాంటి సంఘటనల్లో ఇమిడి ఉన్న ఒక అంతర్గత సూత్రాన్ని, నీతిని గ్రహించి ఆచరించడం కొంతమందే చేస్తారు. అదేదో పెద్దపరిశోధించి తెలుసుకోవాల్సిన విషయం కూడా ఏమీ కాదు..చాలా కాలంగా పెద్దలు చెప్పేదే.'సర్వే జనాః సుఖినో భవంతు..' అందరూ బావుండాలి. మనమూ, మన కుటుంబసభ్యులే కాదు..మన పరిసరాలు, మన చుట్టు ఉన్నా సమాజంలో అందరూ బావుండాలనే భావన మనలో ఉండాలి. ఎందుకలా..? అందరినీ మనం బాగు చెయ్యగలమా? మనల్ని మనం చూసుకుంటే సరిపోదా? నిజమే..మనల్ని మనం బాగుచేసుకున్నాక, మన సామ్రాజ్యాలు విస్తరించడంలోనే జీవితమంతా గడపడం కాక 'సర్వే జనాః సుఖినో భవంతు' కోసం మనం ఎంత పాటుపడగలమని ప్రతి వారూ ఆలోచించి ఆచరించాలి. పక్కవాడు మనకంటే తక్కువ స్థాయిలో ఉంటే ఈ సమతుల్యతా లోపం ఎప్పటికైనా సమస్యలకి దారితీస్తుంది. పక్కవాడు మనకంటే ఉన్నత స్థాయిలో ఉంటే వాడి గురించి అసూయ పడడం, తెలీనిద్వేషం పెంచుకోవడం కంటే 'మనలో వీడైనా బావున్నాడు. ఎప్పటికైనా మనకి సహాయం చెయ్యగలడు' అనే భావంతో అతడినీ మంచి భావంతో చూడడం..ఇంతకంటే పెద్ద రహస్యమేమీ లేదు 'సర్వే జనాః సుఖినో భవంతు..'లో. ఇదేదో విప్లవకారులు, సామాజిక వేత్తలు, సంఘ సంస్కర్తలు..మాత్రమే చెయ్యాల్సిన పనికాదు. ఎవరికి సాధ్యమైనంతలో వాళ్ళు 'సర్వే జనాః సుఖినో భవంతు..' ని పాటించిన రోజున సమసమాజం వైపు కొన్ని అంగుళాలైనా ముందుకి నడిచిన వాళ్ళమౌతాం.

***అక్టోబర్, 2009***

***

దాదాపు 30 సంవత్సరాల క్రిందట ఆంధ్ర యూనివర్సిటీ కాంపస్‌లో చదువుకునేప్పుడు గోపాలకృష్ణ అనే మిత్రుడు ఉండేవాడు. లా చదువుతూనే థియేటర్ ఆర్ట్స్‌లో డిప్లమో ఇన్ యాక్టింగ్ కోర్స్ చేస్తుండేవాడు. అతని ద్వారా అదే విభాగంలో రంగస్థల దర్శకుడిగా పనిచేస్తున్న శ్రీ చాట్ల శ్రీరాములు గారు పరిచయమయ్యారు. ఒకరోజు ముగ్గురం కలిసి జగదాంబ జంక్షన్‌లో ఒక రెస్టారెంట్‌కి వెళ్ళాం. చాట్ల శ్రీరాములు గారు సప్లయర్ ని మంచినీళ్ళు తెమ్మని అడగడానికి 'బాబూ..కొంచెం మంచినీళ్ళు తెస్తావా?' అని పిలిచారు. తర్వాత కూడా అతన్ని పిలిచినప్పుడల్లా 'బాబూ..' అని సంబోధించడం గమనించాం. ఆయన్ని అడిగాం 'ఏమండీ..మీకు అతను ఇంతకు ముందే తెలుసా? మీరు 'బాబూ..' అని పిలుస్తున్నారు' అని. 'తెలియదు..సాధారణంగా నేను ఇలాంటి వాళ్ళందరినీ 'బాబూ..' అనే పిలుస్తాను. సామాజికంగా వాళ్ళు మనకంటే తక్కువస్థాయిలో ఉన్న విషయం వేరుగా చెప్పనవసరం లేదు. అలాగని 'అరేయ్..ఒరేయ్.. లేదా ఏయ్.. ఆ అబ్బాయ్...' ఇలా పిలిచి పదే పదే వాళ్ళని తక్కువ చెయ్యడం మంచిది కాదు. అతనికి విలువనిచ్చి ఆప్యాయత చూపించడం వల్ల మనకి పోయేదేమీ లేదు సరికదా..తద్వారా అతనికి మనమిచ్చే ఆనందానికి కొలమానాలుండవు..' అని సమాధానమిచ్చారు. ఆ సంఘటన మా ఇద్దరు మిత్రుల మీదా శాశ్వత ప్రభావాన్ని చూపించింది. రోజూ ఎంతోమంది మనకంటే తక్కువ స్థాయిలో ఉన్నవాళ్ళు ఎదురౌతారు. పేపర్ బోయ్, పాల పాకెట్లు ఇచ్చే అతను, ఇంటికి వచ్చే పనిమనిషి, రిక్షా లాగే అతను, హోటల్లో సప్లయర్స్.. ఎవరో ఒకరితో మాట్లాడకుండా రోజు జరగదు. వాళ్ళకి గౌరవం ఇవ్వడం వల్ల మన గౌరవాన్ని పెంచుకున్నవాళ్ళమౌతాం. ఇందుకోసం మనమేమీ ఖర్చుచెయ్యాల్సిన అవసరం లేదు. మనసులో కొంచెం కరుణ, పిడికెడు జాలి, రవంత ఆప్యాయత.. 'ఒక్క చల్లని పిలుపు వాళ్ళు మనకిచ్చే సమాధానాన్ని మార్చివేస్తుంది. తమనీ గౌరవించే వాళ్ళున్నారన్న భావన ఆ నిత్యజీవిత సమరంలో సతమతమయ్యే వాళ్ళకి ఒక చిరుగాలి స్పర్శలా సోకుతుంది. మంచితనం విత్తనాలు మొలకెత్తుతాయి. అలానే 'ప్లీజ్..థాంక్ యు..' లాంటి చిన్న చిన్న పదాలు సన్నజాజి పూలలాంటివి. సన్నజాజి రేకలు చాలా చిన్నవే ఐనా అవి వెదజల్లే సుగంధం వెలకట్టలేనిది.! మంచితనమూ అంతే..!

***నవంబర్, 2009***

***

"ఏమిటలా ఉన్నావ్? ఎవరి మీద కారాలు మిరియాలు నూరుతున్నావ్?"

"ఇంకెవరి మీద..వాడే ముకుందం గాడు..?"

"ఏమైందేమిటి?" "వాడూ.. ఉన్నవి లేనివి కలిపించి నన్ను నానా మాటలు అంటున్నాడట.."

"ఎవరు చెప్పారు?"

"నాకెలాగో తెలిసిందిలే..నిజం నిప్పులాంటిది కదా. ఐనా వాడికెంత సహాయం చేశాను? ఏమాత్రం కృతజ్ఞత లేదు.."

"ఆగాగు..నీ గురించి అతను అన్నదెప్పుడు ?"

"ఎప్పుడో వారం క్రిందట అట..నాకు నిన్ననే తెలిసింది.."

"చూశావా..అతను వారం క్రిందటే అన్నాడు. కానీ నీకేమీ కాలేదప్పుడు. నీకు నిన్ననే తెలిసింది, నిన్నటి నుంచీ నీలో నువ్వే మథనపడుతున్నావ్. అంటే నిజానికి అతను అన్న మాటలకంటే ఆ మాటలకి నువ్వు రియాక్ట్ ఐనందువల్లే నీలో ఇంత సంఘర్షణ కలిగింది. అతడు అన్న మాటలని విశ్లేషించి, నిజ నిర్ధారణ చేసుకుని , నిజంగానే సమస్య ఉంటే పరిష్కారం చేసుకోవడం ..అది నీకూ మంచిది, అతడికీ మంచిది. ఇలా ఎప్పుడో జరిగిన దానికి ఇప్పుడు ఆవేశం తెచ్చుకుని రియాక్షన్ చూపించడం నీకే మంచిది కాదు. అతడు అన్నాడన్న దాంట్లో నిజమెంతో తెలీదు. నిజంగానే అని ఉన్నా ప్రస్తుతం అతడు సుఖంగానే ఉన్నాడు. బహుశా అతడీ విషయం కూడా మర్చిపోయి ఉండొచ్చు. నిన్ననే ఈ విషయం తెల్సిన నువ్వు మాత్రం మానసిక సంఘర్షణతో అశాంతితో రగిలిపోతున్నావ్. ఇక్కడ నష్టం జరుగుతోంది నీకే. నువ్వు తెలుసుకోవల్సిందేమిటంటే.. ఈ ప్రపంచంలో చాలా సందర్భాల్లో జరిగిన సంఘటనలకంటే ఆయా సంఘటనలకి మనం ప్రతిస్పందించే తీరు మనమీద ప్రభావం చూపిస్తుంది. మనం స్పందించే తీరు అనేది మన నియంత్రణలో ఉంటే ఆయా సంఘటనలు మనమీద కలిగించే ప్రతికూల ప్రభావాలని నియత్రించుకోవచ్చు. ముందుగా నీ ఆలోచనల మీద, నీ రియాక్షన్స్ మీద, నీ ఆవేశం మీద కంట్రోల్ తెచ్చుకో. అప్పుడు మాత్రమే సమస్యలని పరిష్కరించుకునే ఆలోచనలకి అవకాశం ఉంటుంది. చాలా చిన్న సూత్రమిది - నిన్ను నువ్వే కంట్రోల్ చేసుకోలేకపోతున్నావే అలాంటిది వేరే వాళ్ళ ఆలోచనలనీ, ప్రవర్తననీ ఎలా నియంత్రించగలవ్?" జీవితం అంటే మనల్ని మనం జయించుకోవల్సిన యుద్ధం! మనల్ని మనం జయించగలిగిన రోజు వేరెవరూ మనల్ని ఓడించలేరు.!

**డిసెంబర్,2009**

***

# 2008

'మనం ఎక్కడికి వెళ్ళాలో, ఎలా వెళ్ళాలో ప్రణాళిక వేసుకునే ముందుగా మనం ప్రస్తుతం ఎక్కడ వున్నామో తెలుసుకోవాలి ..' అన్నారెవరో. జీవితమనే సుదీర్ఘ ప్రయాణంలో కూడా అక్కడక్కడా కొన్ని మైలురాళ్ళ వద్ద ఆగి గతాన్ని సమీక్షించుకుంటూ, వర్తమానాన్ని బేరీజు వేసుకుంటూ, భవిష్యత్తుకి ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం చాలా అవసరం. కాల గమనంలో ఇలా ఎదురయ్యే మైలురాళ్ళే పుట్టిన రోజులూ, కొత్త సంవత్సరాలూ, వార్షికోత్సవాలూ..! ఇది 'కౌముది' వెబ్ మాస పత్రిక మొదటి వార్షికోత్సవ సంచిక... ఒక్కసారి గత సంవత్సర కాలాన్నీ సమీక్షించుకుంటూ మా అనుభవాలనీ, ఆలోచనలనీ ఆత్మీయులైన పాఠకులతో పంచుకోవాలనేది మా ఈ చిన్ని ప్రయత్నం..

సరిగ్గా సంవత్సరం క్రిందట 2006 డిసెంబర్ లో 'కౌముది' ని ప్రారంభించాలనే ఆలోచనకి బీజం పడింది. ఆరోగ్యవంతమైన, ఆలోచింపచేసే సాహిత్యాన్ని అందిస్తూ..20, 30 సంవత్సరాల క్రిందటి వార, మాస పత్రికల్ని గుర్తుకుతెస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి అందుబాటులో ఉండే రీతిలో ఒక వెబ్ మాసపత్రికని ప్రారంభించాలనేది మా ఆలోచన. మా ఆలోచనని కొంతమంది సాహిత్యాభిమానులతోనూ, ఆత్మీయులతోనూ పంచుకున్నప్పుడు 'మంచి ప్రయత్నం..ముందుకి వెళ్ళండి..' అని ప్రోత్సహించారు. 'వ్యాపారాత్మకమైన కోణం లేకుండా ఇలాంటి పత్రికలు నడపడం కష్టం' అని కొంతమంది హెచ్చరించారు కూడా. అందరి సలహాలని మదింపు వేసుకున్నాక మమ్మల్ని ముందుకి నడిపిన ఒకే ఒక్క అంశం..సాహిత్యాభిలాష. 12 సంచికలని విజయవంతంగా మీ ముందుకి తీసుకొచ్చాం. ఒక్క సంచికని కూడా ఒక్క రోజుకూడా ఆలశ్యం కాకుండా ఖచ్చితంగా మొదటి తేదీకే విడుదల చేయడం జరిగింది. ఈ సంవత్సరకాలంలో కౌముది క్రమ పరిణామాన్ని బేరీజు వేసే అంశాన్ని పాఠకులకే వదిలేస్తున్నాం. మా ప్రయత్నంలో ఎంతవరకూ సఫలీకృతమయ్యామనేది నిర్ణయించాల్సిన విజ్ఞులు మీరే. ఐతే నెలనెలకీ పెరిగిన పాఠకుల సంఖ్య, మాకు అందిన పాఠకుల స్పందన మా ప్రయత్నం వమ్ము కావడం లేదన్న ధైర్యాన్ని, తృప్తినీ కలిగించాయి.

ప్రతినెలా దాదాపు 150 పేజీల ఈ పత్రికని సరైన అంశాలని సేకరించి, అందంగా అలంకరించి క్రమం తప్పకుండా మీ ముందుకి తీసుకురావడమనే ఈ బృహత్తర కార్యక్రమంలో మాకు సహాయపడిన వారు అసంఖ్యాకంగా ఉన్నారు. స్థలా భావం వల్ల అందరినీ మీకు పేరు పేరునా పరిచయం చేయలేక పోయినా కనీసం కొంతమందికైనా పత్రికా ముఖంగా కృతజ్ఞతలు తెలియచేయడం మా బాధ్యతగా భావిస్తున్నాం.

*'కౌముది' లోగో అక్షరాలని రూపొందించిన ప్రముఖ చిత్రకారుడు చంద్ర గారికీ,

*మా ప్రయత్నాన్ని వివరించిన వెంటనే మమ్మల్ని వెన్నుతట్టి ప్రోత్సహించడమే కాకుండా తమ రచనలతో 'కౌముది' కి సాహిత్య గౌరవాన్ని ఆపాదించిన రచయితలూ/రచయిత్రులూ - యద్దనపూడి సులోచనారాణి, గొల్లపూడి మారుతి రావు, వసుంధర, జలంధర , కంఠమనేని రాధా కృష్ణ మూర్తి, వంగూరి చిట్టెన్ రాజు, సత్యం మందపాటి, వడ్డేపల్లి కృష్ణ, హాస్యావధాని శంకరనారాయణ , విన్నకోట రవిశంకర్ గార్లకీ ణఅడిగిన వెంటనే అంగీకరించి క్రమం తప్పకుండా వివిధ శీర్షికలు నిర్వహించిన - సాయి బ్రహ్మానందం గొర్తి, నిమిత, నిషి గంధ, జె.యు.బి.వి.ప్రసాద్ గార్లకీ

*'అ'సామాన్యులు శీర్షికకోసం ఆంధ్రదేశంలో వివిధ ప్రదేశాలు తిరిగి కథనాల్ని సేకరిస్తున్న కందుకూరి రమేష్ బాబు గారికీ ణతమ కంపెనీ వ్యవహారాలలో తలమునకలుగా ఉంటూ కూడా , అభ్యర్థించిన వెంటనే అంగీకరించి 'విజేత' శీర్షికలో తమ అనుభవాలని పంచుకున్న సిలికాన్ వేలీ సి.యి.ఒ లకీ

*'మొదటి సినిమా' శీర్షికలో తమ జ్ఞాపకాలని వివరించిన సినీ దర్శకులకీ, ఈ దర్శకులని సంప్రదించడంలో ఎప్పటికప్పుడు సహాయంచేసిన అన్నే మోహన్ గాంధీ, గొల్లపూడి మారుతీ రావు, సిరివెన్నెల సీతారామ శాస్త్రి, సత్తిబాబు గార్లకీ

*తమ చిత్రాలతో, కార్టూన్లతో 'కౌముది'ని వర్ణ రంజితం చేసిన చంద్ర, జయదేవ్. బాలి, ఈశ్వర్, గార్లకి

*ప్రతి సంచికలోనూ కథలూ, కవితలూ వ్రాసిన అనేక మంది రచయితలు / రచయిత్రులకి

*పాఠకులే నిర్వహించిన శీర్షికలలో పాల్గొన్న పాఠకులకీ పాఠకురాళ్ళకీ

*ఉగాది సాహిత్య పోటీల నిర్వహణలో సహాయపడిన 'రచన' శాయి గారికీ

*అడగకుండానే తమంత తాముగా ముందుకి వచ్చి ఉగాదిపోటీ విజేతలకి పారితోషికాన్ని అందించిన మల్లాది రఘు, శ్యామలగార్లకీ

*దాదాపు సంవత్సరం పాటు 'కౌముది' బానర్ ని ఉచితంగా తమ వెబ్ సైట్లో ఉంచి పత్రిక ఎంతోమంది పాఠకులని చేరడంలో ముఖ్యపాత్ర వహించిన తెలుగు పీపుల్ డాట్ కామ్ కునిశెట్టి ప్రసాద్ గారికీ

*ఆ పాట మధురం శీర్షికకి తగిన పాటలని సమకూర్చడమే కాకుండా, ప్రతినెలా 'కౌముది' తో బాటుగా తమ వెబ్ పేజీని కూడా అప్ డేట్ చేసి అందించిన చిమట శ్రీనివాస్ గారికీ

*ఎన్నో శీర్షికలు విజయవంతం కావడానికి నేపథ్య సహకారం అందించిన గుండా శివచరణ్, దారా సురేంద్ర, దెందుకూరి రఘు గార్లకూ,

*ఇంకా..ప్రతి సంచిక చదవగానే తప్పొప్పులని విశ్లేషిస్తూ మెయిల్స్ పంపించిన వేలాది మంది పాఠకులకీ, పాఠకురాళ్ళకీ .. కేవలం కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం అనడం చిన్నమాటే అవుతుంది. 'కౌముది' ఇలా వెలువడడంలో వీరందరి పాత్రా, ఇంకా ఇక్కడ పేర్కొనలేకపోయిన ఎంతో మంది అభిమానుల పాత్రా మరువలేనిది. కొంతమంది 'మా ఆయువు కూడా మీరు పోసుకుని ఈ పత్రికని ఇలానే కలకాలం నడపండి' అని రాశారు. మరికొంతమంది ' కౌముది చిరకాలం నడవాలని మా ఇష్టదైవాన్ని ప్రార్థిస్తున్నాం.' అని రాశారు. విజయవాడ నుంచీ ఒక సీనియర్ మోస్ట్ జర్నలిస్ట్ 'కౌముదిలో ఒక్కసారి నా ఆర్టికల్ చూసుకోవాలని ఉంది'అని రాశారు ఎక్కడిదీ అనుబంధం అంటే కనిపించే సమాధానం..సారస్వతాను బంధం..తెలుగు సాహిత్యం పట్ల మమకారం..! రెండో సంవత్సరంలో అడుగుపెట్టిన ఈ సందర్భంలో 'కౌముది' ని సుసంపన్నం చేయబోతున్న మరి కొంత మంది ప్రముఖులు మల్లాది వెంకట కృష్ణమూర్తి, శ్రీధర, రాజా, మద్దూరి రాజ్యశ్రీ... వీరందరికీ కూడా ఈ సందర్భంగా అభివందనాలు తెలియచేస్తున్నాం. మీ ఉత్సాహ, ప్రోత్సాహాలు ఉన్నంత వరకూ కౌముది ని ఇలాగే నడపడానికి శాయశక్తులా ప్రయత్నిస్తామని హామీ ఇస్తూ.. నూతన సంవత్సర శుభాకాంక్షలతో...

*జనవరి, 2008*

***

మనిషి సంఘజీవి. మన దైనందిన కార్యక్రమాల్లో పదిమందితో కలిసి పనిచేయడమనేది తప్పనిసరి. ఈ పదిమందిలో మిత్రులుంటారూ, శత్రువులూ ఉంటారు. వీరిద్దరిలోనూ రకరకాల మనస్తత్వాలుంటాయి. మిత్రుల్లో ఎన్ని రకాల మనుషులు ఎలా వున్నా అంత ఇబ్బందిలేదు.. ఎలానూ అందరూ మిత్రులే కాబట్టి. శత్రువుల విషయంలోనే ఎంతో అప్రమత్తత అవసరం. మనం ఎంత మంచిగా , సహనంతో, పరోపకారంతో జీవిద్దామనుకున్నా ఏదో కారణాలవల్ల ఎదుటివారితో మనస్పర్థలొస్తుంటాయి. కొన్ని మనం తెలిసి చేసుకునేవీ, కొన్ని తెలీకుండా జరిగేవీ. ఇలాంటి సందర్భాలే మనకి శత్రుకూటమిని తయారు చేస్తాయి. ఫలనా వాడికి మనమీద కోపం, మనమంటే అసూయ, మనమంటే పడదు - అని తెలిస్తే అదొక పద్ధతి. అలాంటి శత్రువులు మనకి స్పష్టంగా తెలిసిన వాళ్ళే కాబట్టి వాళ్ళతో ఎలా ప్రవర్తించాలో నిర్ణయించుకుని ముందుకి వెళ్ళొచ్చు. ఇంత ఉపోద్ఘాతం చెప్పిందెందుకంటే - విభిన్నమైన తరహా శత్రువుల గురించి. వీళ్ళని అమెరికామెడి చిట్టెన్ రాజు గారి పరిభాషలో చెప్పాలంటే 'గాఢ మిత్రులు - గూఢ శత్రువులు' అనుకోవచ్చు. అంటే మనముందు చక్కగా మాట్లాడుతారు. మనతో ఎంతో ఆత్మీయంగా ఉన్నట్లు నటిస్తారు. వెనకాల గోతులు తవ్వడం, పరోక్షంలో మనగురించి చెడ్డగా మాట్లాడ్డం చేస్తుంటారు..వీళ్ళ ప్రవర్తన గురించి చెప్పడానికే 'నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించడం', 'తేనెపూసిన కత్తి', 'మేకవన్నె పులి'...లాంటి వాక్యాలు పుట్టాయనుకుంటాను. ఎందుకలా చేస్తారు అన్నదానికి పెద్దగా కారణాలు ఉండకపోవచ్చు. ఒక విధంగా ఆలోచిస్తే ఇలా మంచిగా ఉంటూ వెన్నుపోటు పొడుస్తూ ఉండడమనేది ఒక విధమైన మానసిక రుగ్మతగా భావించవచ్చు. ఐతే కారణాలేవైనా ఇలాంటి వాళ్ళని మనం జాగ్రత్తగా గమనించి, మన జాగ్రత్తలో మనం ఉండకపోతే వాళ్ళ కుటిల మనస్తత్వాల వల్ల కలిగే దుష్పరిణామాలకి మనం గురి కావల్సి వస్తుంది. వీళ్ళని 'ఇంటి దొంగలు' గా కూడా భావించవచ్చు. బయటి నుంచీ వచ్చిన దొంగలనైతే తేలికగా గుర్తించవచ్చు కానీ, ఇంటిలోనే మన మధ్యనే ఉంటూ దొంగతనం చేసే వారిని గుర్తించడానికి చాలా నేర్పు కావాలి. 'గాఢ మిత్రులు - గూఢ శత్రువుల' విషయంలో కూడా చాలా జాగ్రత్త అవసరం.. ఒక అడుగు వెనక్కి తీసుకుని మన మనస్తత్వాలని విశ్లేషించుకుంటే- ప్రతి మనిషి మనసులోనూ మెదిలే మానసిక భావాల్లో కూడా ఇలాంటి 'గాఢ మిత్రులు-గూఢ శత్రువులు' ఉంటాయి. అసూయ, ద్వేషం, కోపం, ఆత్మన్యూనతా భావం..ఇలాంటి వన్నీ మనకి తెలీకుండానే మనకి హానిచేసే 'ఇంటిదొంగలు'. బయటినుంచీ మనల్ని ఇబ్బంది పెట్టే పరోక్ష శత్రువులని ఒక కంట కనిపెట్టి ఉండటం ఎంత అవసరమో, మనలోనే ఉంటూ, మనతోనే తిరుగుతూ మనకి హానిచేసే ఈ నెగెటివ్ గుణాల్ని కూడా తగ్గించుకోవడం, అదుపులో ఉంచుకోవడం.. ప్రశాంత జీవనానికి అత్యవసరం..

*ఫిబ్రవరి, 2008*

***

మనుషుల్లో భయపడే మనస్తత్వం విచిత్రంగా ఉంటుంది. కొంతమందికి కొంతమంది మనుషులంటే భయం, కొంతమందికి కొన్ని సందర్భాలంటే భయం, కొంతమందికి కొన్ని ప్రదేశాలంటే భయం..వగైరా. ఇలాంటివి ఎదురైనప్పుడు 'భయం' అనే భావనకి గురవడం ఆయా వ్యక్తుల స్వభావాల్ని బట్టి సహజమే కానీ చాలామంది రాబోయే రోజుల్ని తలచుకుని, జరగబోయే సంఘటనలని ఊహించుకుని భయపడుతుంటారు. ఇలాంటి స్వభావాలకి పరిష్కారం అంత సులువు కాదు కూడా. చాలా మంది మనస్తత్వ శాస్త్రజ్ఞులు చెప్పేదేమంటే మనుషుల్లో అధిక శాతం భయాలు ఊహా జనితమైనవే అని. బయటికి వెళితే యాక్సిడెంట్ ఔతుందేమో,కాలేజీకి వెళ్ళిన అమ్మాయి ఇంటికి క్షేమంగా వస్తుందో రాదో, రేపు ఏమౌతుందో, వృద్ధాప్యంలో పిల్లలు చూస్తారో లేదో.. ఒకటి కాదు..ఇలా..జరగని వాటిని జరుగుతాయేమోనని ఊహించుకుని భయపడుతూ బ్రతకడం వర్తమానంలోని ప్రశాంతతని హరించివేస్తుంది. ఇలాంటి మనస్తత్వం ఉన్నవాళ్ళు రేపు ఎలానూ సంతోషంగా ఉండలేరు సరికదా ఇవ్వాల్టిని కూడా సవ్యంగా ఆస్వాదించలేరు.విషయాలని సరిగా విశ్లేషించకపోవడం, సంఘటనలని సరిగా అంచనా వెయ్యలేకపోవడం, అనవసరమైన అభద్రతాభావం..ఎక్కడో అంతరాంతరాల్లో పేరుకుపోయిన నెగిటివ్ ఫీలింగ్స్.. ఇలా అనవసర భయాలకి ఎన్నో కారణాలుండవచ్చు. అందుకే ఆత్రేయ గారు రాశారొకచోట 'పిరికివాడికి వేయి చావులు, బ్రతుకునిండా ఎండమావులు 'అని. అంటే భవిష్యత్తుని గురించి అలోచించవద్దనీ,రాబోయే సంఘటనల గురించి ఊహించవద్దనీ అర్థం కాదు. తప్పని సరిగా రాబోయే పరిస్థితులగురించి, ఎదురు కాబోయే సంఘటనల గురించీ ఆలోచించాల్సిందే ఐతే ఏదైనా అనుకోనిది ఎదురౌతుందేమోనన్న ఆలోచన వచ్చినప్పుడు 'జాగ్రత్త' గురించి ఆలోచించాలి కానీ భయపడ్డం అలవాటు చేసుకుంటే చురుకుగా ఆలోచించే స్వభావంకూడా తగ్గిపోతుంది. ఆలోచనలని నియంత్రించుకునే గుణం,'భయం' భావన కలిగినప్పుడు అమూలాగ్రం ఆలోచించే మనస్తత్వాన్ని పెంపొందించుకోవడం, 'రాబోయే సంఘటనకి సిద్ధపడే ' స్వభావాన్ని అలవాటుచేసుకోవడం.. 'భయ' భావనని'జాగ్రత్త' భావనగా తర్జుమా చేసుకోగలగడం - ఇలాంటి కొన్ని ప్రయత్నాలు అనవసర భయాలనుంచీ రక్షణ కలిపిస్తాయి. కుచేలరావు మిత్రుడు వద్దకెళ్ళి ' ఏమిటోరా చాలా భయంగా ఉంది.. మా వాడి చదువుకోసం చాలా అప్పులు చేశాను..వాడు తీరుస్తాడో లేదోనని భయంగా వుంది..''అన్నాడు. మిత్రుడిలా అన్నాడు ' చూడు కుచేలరావ్..రెండు విధాలుగా జరగొచ్చు. మీవాడు నీ అప్పులు తీర్చాడనుకో సమస్యే లేదు. తీర్చలేదనుకో ఏమౌతుందీ..అప్పులవాళ్ళు నీ ఇంటి మీదికి వస్తారు అంతే కదా..ఐతే ఏమౌతుందీ మళ్ళీ రెండు ఛాయిస్ లు..నీ పరిస్థితి చూసి జాలిపడి వదిలేస్తే సమస్యే లేదు..ఒకవేళ 'కాదు కూడదూ..తీరుస్తావా చస్తావా' అన్నారనుకో. మళ్ళీ రెండు మార్గాలు ఉంటాయి... వేరే ఉపాయాల ద్వారా తీర్చగలిగితే నష్టమే లేదు. తీర్చలేక పోయావనుకో వాళ్ళు నీ మీద దాడిచెయ్యొచ్చు. ఐతే ఏమౌతుందీ మళ్ళీ రెండు విధానాలు.. చావుతప్పి కన్ను లొట్ట పోవచ్చు. ఫరవాలేదు ఎలాగొలా బతకొచ్చు. ఒకవేళ జాతకం బాగోలేక చనిపోయావే అనుకో..ఏమౌతుందీ.. మళ్ళీ రెండు రోడ్లు....ఐతే స్వర్గానికి వెళ్తావ్.. సమస్యే లేదు.. కాకుంటే నరకానికి వెళ్తావ్ అంతేనా..అక్కడ ఎలానూ మన మిత్రులంతా ఉండనే ఉంటారు కదా..!'' ఇది సరదాకి రాసిన సంభాషణే కానీ..ఇలా సమస్యని ఒక్కో పొరా వొలుచుకుంటే వెళితే తప్పని సరిగా ఎక్కడో పరిష్కారం దొరుకుతుంది. కావల్సిందల్లా భయానికి భయపడకుండా ఉండడం అలవాటు చేసుకోవడమే..!

*మార్చ్, 2008*

***

'గతం' అనేది ఎప్పుడో జరిగిపోయిన సంఘటనల, అనుభవాల, జ్ఞాపకాల సమాహారమే ఐనా వర్తమానం మీదా భవిష్యత్తుమీదా అది చూపే ప్రభావం అపారం. గతాన్ని నిప్పుతో పోల్చవచ్చు. దాన్ని సరిగా ఉపయోగించుకుంటే మనసులో అదొక జ్యోతిలా వెలుగుతూ ఆ వెలుగుల్లో మనల్ని ముందుకి నడిపిస్తుంది.. గతకాలపు ప్రభావాల్ని సరిగా నియత్రించుకోలేక పోతే అ నిప్పే పెద్ద జ్వాలగా మారి వర్తమానాన్నీ, భవిష్యత్తునీ కూడా దహించి వేస్తుంది. గతంలో జరిగిన చేదు సంఘటనలు పదే పదే మనల్ని వెంటాడుతుంటే ఆ గతం పెను నిప్పు... ఆ గతంలోని విజయాలు మనకి ఉత్ప్రేరకాలుగా పనిచేసి మనల్ని మరింత ఉత్తేజితుల్ని చేస్తున్నాయంటే గతం ఒక మార్గదర్శి. మనోయవనిక మీద పదే పదే ప్రదర్శించబడే మానసిక చిత్రాలే మన ఆలోచనలని ప్రభావితం చేస్తాయి. ఆ ఆలోచనలే మనల్ని ముందుకి నడిపించి మన దైనందిన కార్యకలాపాలని నియంత్రణ చేస్తుంటాయి. ఉన్నతమైన విజయాలు సాధించాలంటే అందుకు అనువైన మానసిక స్థితి ఉండాలి. అంటే మనసులో పదే పదే తరంగితమయ్యే అలోచనలు ఆశావహంగా, ఉత్సాహంతో, ఉత్తేజంతో 'నేనున్నానని నిండుగ పలికే' నేస్తాల్లా ఉండాలి. గతంలో మనం సాధించిన విజయాలు, మనం చేసిన మంచి పనులు, మనకి మంచి పేరు తెచ్చిన సంఘటనలు, మనల్ని కాంతివంతం చేసిన స్నేహాలూ, సంఘటనలూ..వాటిని గుర్తుకుతెచ్చే జ్ఞాపకాలూ ఇందుకు దోహదం చేస్తాయి. కానీ సాధారణంగా మనసు మన మాట వినదు. ఎప్పుడో జరిగిపోయిన పొరబాట్లు, చేదు అనుభవాల్ని మిగిల్చిన సంఘటనలు, నమ్మిన వ్యక్తులు చేసిన మోసాలూ,కలిగిన నష్టాలూ, వివాదాలూ, విరోధాలు..ఇవన్నీ పదే పదే గుర్తొచ్చి నపుడే వస్తుంది చిక్కంతా. మనసు అనే తెరమీద ఈ ప్రతికూల చిత్రాలు పదే పదే ప్రతిబింబించినపుడే చీకటి భావాల కూపమౌతుంది మనసు. ప్రతికూల భావాలు పదే పదే ప్రతిధ్వనిస్తూ ఉంటే కక్ష సాధింపు సాధ్యమేమో కానీ ముందుకి సాగడం, సాగి విజయం సాధించడం అసంభవం. కొంచెం తేలిక భాషలో చెప్పుకుంటే - ఒక వాడుక ఉంది 'మంచి వాళ్ళనుంచీ ఎంత నేర్చుకోవచ్చో, చెడ్డ వాళ్ళనుంచీ అంత నేర్చుకోవచ్చు. మంచి వాళ్ళనుంచీ ఎలా ఉండాలో నేర్చుకున్నట్లే, చెడ్డ వాళ్ళ నుంచీ ఎలా ఉండకూడదో నేర్చుకోవచ్చు' అని. అలానే గతంలోని నష్టాలనుంచీ, పొరబాట్లనుంచీ గుణపాఠాలు నేర్చుకుని వాటిని పునరావృతం కాకుండా చూసుకోవడం ఉత్తముల లక్షణం. వాటిని పదే పదే తలచుకుని మానసిక అశాంతికి లోనుకావడం తెలివితక్కువతనం. ఓ కోతికి ఓ పింగాణీ జాడీ కనిపించిందంట. లోపల ఏముందో చూద్దామని గుప్పిట మూసి చెయ్యిలోనికి పెట్టింది. ఏదో చేతికి తగిలింది. గుప్పిటనిండా వాటిని తీసుకుని చెయ్యి బయటికి లాగడానికి ప్రయత్నించింది. కానీ పిడికిలి బయటికి రావడం లేదు., ఎందుకంటే లోనికి వెళ్ళేటప్పటికంటే ఇప్పుడు మరింత పెద్దగా ఉంది కదా.. ఏం చెయ్యడం. వాటిని వదిలేసి మళ్ళీ గుప్పిట మామూలు పరిమాణానికి వస్తే కానీ చెయ్యి బయటికి రాదు. వదిలెయ్యాలి ఎప్పుడో ఎదురైన చేదు సంఘటనలని కూడా అక్కడే వదిలేసి అవి నేర్పిన పాఠాలేమైనా ఉంటే వాటిని తోడు తీసుకుని, అలనాడెప్పుడో మనల్ని అలరించిన సుందర దృశ్యాలని మనసులో నింపుకుని తూరుపు వెలుగుల కోసం ముందుకి సాగాలి..

*ఏప్రిల్, 2008*

***

పిల్లల్లో ఒక లక్షణాన్ని పరిశీలించారా? (బహుశా మీ చిన్నప్పుడు మీరూ ఇలానే చేసి ఉంటారేమో గుర్తు తెచ్చుకోండి. ) పిల్లలని పాఠ్య పుస్తకాలు చదవమనీ, హోమ్ వర్కు చెయ్యమనీ కూర్చో బెట్టండి..కడుపునొప్పి ఒళ్ళు నొప్పులూ, తల నొప్పి,..ఒకటేమిటి...రకరకాల రుగ్మతలూ వరుసగా ఒక దాని తర్వాత ఒకటి వచ్చేస్తాయి.. అదే ఆడుకోవడానికి వెళ్ళమనో, టి.వి.చూడమనో, లేదా కామిక్ పుస్తకాలు చదువుకోమని చెప్పండి. అంతవరకూ ఉన్న నొప్పులన్నీ మటుమాయమై పోతాయి. ఈ లక్షణాన్ని పెద్దల్లో కూడా గమనించవచ్చు. ఆఫీసు పనిలో లేని ఆసక్తి బయట విషయాల్లో విపరీతంగా ఉంటుంది కొంతమందికి. వీటన్నింటికీ కారణం..చాలా సులభంగా చెప్పదగిందే. చేసే పనిమీద ఆసక్తి ఉందా లేదా అనేది. ఏ పనైనా ఆసక్తితో చేస్తే శరీరమూ సహకరిస్తుంది, మనసూ అహ్లాదభరితంగా ఉంటుంది. ఇష్టం లేని పనిచేసినప్పుడు అది నిజంగా అంత భారమైన పని కాకపోయినా, చాలా శ్రమ అనిపిస్తుంది. సగం మనసుపెట్టి చేసే పని ఇచ్చే ఫలితాలు కూడా అలానే ఉంటాయి. చాలా మంది చాలా చోట్ల విజయం సాధించలేకపోవడానికి ఒక కారణం వాళ్ళు చేసే పనిమీద మనసు పెట్టకపోవడం.. ఎంచేతంటే అసక్తి లేదు కాబట్టి. పూర్తి అసక్తి పెంచుకుని మనసుని లగ్నం చేసి ఏ పని చేసినా అంతిమ విజయం లభిస్తుంది. అసక్తి ఉన్నచోట పట్టుదల పెరుగుతుంది. పట్టుదల పెరిగినప్పుడు విజయతీరం చేరే దాకా పయనించే శక్తి లభిస్తుంది. ఈ ప్రయాణంలో ఎదురయ్యే అటంకాలన్నింటినీ ఎదిరించే అత్మ స్థైర్యం మనకి కొండంత అండగా నిలుస్తుంది. ఇష్టపడి పనిచేస్తే మనకి సత్ఫలితాలు లభించడమే కాక, మన ఉత్సాహం, చురుకుదనం మన సహధ్యాయులకి కూడా ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి..

ఐతే అన్ని సార్లూ మనకి ఇష్టమైన పనులే చేసే అవకాశం లభించకపోవచ్చు. అలాంటప్పుడు చేసే పనిమీద ఇష్టం పెంచుకోవడమే విజయ రహస్యం. ఈ పరిష్కారం చెప్పినంత సులుభం కాకపోవచ్చు కానీ అసాధ్యం మాత్రం కాదు. చేపట్టిన కార్యక్రమం ఏదైనా పూర్తిగా మనసుని లగ్నం చేసిన రోజున వ్యక్తికే కాక సంఘానికి కూడా ఉపయోగకరం ఔతుంది. . ఇష్టపడే పనిని ఎంచుకోవడానికే శ్రమిద్దాం..లేదంటే చేయాల్సిన పనిమీద ఇష్టం పెంచుకుందాం.. మనతోబాటు మన చుట్టుపక్కల అందరికీ కొత్త ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ నింపుదాం..!

***మే, 2008***

***

మేఘాలు దూదిపింజల్లా, మెత్తగా ఉన్నట్లు అనిపిస్తాయి. ఐతే సుత్తులతో మోదినా, కత్తులతో కోసినా అవి కరగవు. కానీ ఒక చిరుగాలి తాకిడికి కరిగి, వాన చినుకులై పుడమి తల్లి చెక్కిలిని ముద్దాడుతాయి కొంతమంది మనసుల్లో ఉండే భావాల మేఘాలు కూడా ఎన్నో సంఘటనలకి, సందర్భాలకి స్పందించినట్లు కనిపించకపోయినా ఏదో ఒక చిన్న చిరుగాలి స్పర్శకి కరిగి నీరౌతాయి. మనసు ప్రక్షాళితమౌతుంది. ఆ చిరుగాలి లాంటి ఆ సున్నితమైన సంఘటనలు కళ్ళముందు ఎదురైనవి కావొచ్చు, పుస్తకాల్లో చదివినవి కావొచ్చు, తెరమీదచూసినవి కావొచ్చు. అలా మనసు మూలల్ని స్పృశించే కళారూపాలు మనసుల్లో కొలువుండిపోతాయి. సమాజంలో ప్రజల జీవన విధానం మారిపోయింది. ఎక్కడచూసినా ఉరుకులూ, పరుగులూ... అనిపిస్తాయి ఎటువైపు దృష్టి సారించినా. ఇలాంటి వాళ్ళకి మనం ఏం చెప్పి మాత్రం, ఏం వ్రాసి మాత్రం, ఏం చూపించి మాత్రం ఉపయోగమేమిటి అనిపిస్తుంది కదూ..! కానీ ఈ భావన తప్పు అని చెదురుమదురుగా వచ్చే మంచి రచనలూ, మంచి చలనచిత్రాలూ, మరికొన్ని కళారూపాలూ నిరూపిస్తాయి. ఇటీవలే వచ్చిన 'గమ్యం; చిత్రం చివరి దృశ్యాల్లో గాలి శీను పాత్ర చచ్చిపోతూ 'చచ్చిపోయేటప్పుడు నొప్పి ఉండదు..బాధ ఉంటుంది. మిమ్మల్నందరినీ ఒదిలివెళ్ళిపోతున్నాననే బాధ' అన్న మాటని విని కళ్ళు చెమ్మగిల్లని ప్రేక్షకుడు లేడంతే అతిశయోక్తికాదేమో.. అదీ మనసుని కరిగించిన ఒక చిరుగాలి..! ఇటీవలే విడుదలైన గొల్లపూడి మారుతిరావు గారి అత్మకథ 'అమ్మకడుపు చల్లగా' లో ఒక ఆసక్తికరమైన సంఘటన గురించి వ్రాసారు. అయన ఏడేళ్ళ క్రిందట వ్రాసిన 'సాయంకాలమైంది' నవల చదివి, చర్లపల్లి జైలులో ఉన్న ఒక ఖైదీ సుదీర్ఘమైన ఉత్తరం రాసారు. జైలు అధికారుల సెన్సారు ముద్ర తో మారుతిరావు గారిని చేరిన అ ఉత్తరంలోని కొన్ని మాటలు .." ఈ వాక్యాలు వ్రాసింది నాలుగున్నర సంవత్సరాల క్రిందట ఆంధ్రప్రదేశ్ లో జరిగిన ఒక సంచలనాత్మకమైన హత్యకేసులో ప్రధాన ముద్దాయి. అ హత్య జరిగిన కొద్ది రోజులకి ధైర్యంగా ఒక టివి చానెల్ కి ఇంటర్వ్యూ ఇచ్చాడు కూడా అతడు. ఎంత కరుడుగట్టిన, కఠిన మనస్తత్వం ఉంటేనో కానీ అంతటి ఘోరాలు చెయ్యలేరు. అంత పాషాణ హృదయం ఉన్నవాడిని కూడా కదిలించి కన్నీరు పెట్టించి ప్రతిస్పందింప చేసింది కేవలం 170 పేజీల నవల..! సాహిత్యం , కళారూపం ఏదైనా సరైన రీతిలో రూపుదిద్దుకుని పాఠకుడినీ, ప్రేక్షకుడినీ చేరగలిగితే స్పందించే వాళ్ళు ఉన్నారింకా. సమాజం పూర్తిగా మొద్దుబారిపోలేదు అనడానికి ఇవి అతి చిన్న ఉదాహరణలు మాత్రమే. ఎటుదిరిగీ అ సున్నితత్వాన్ని స్పృశించే కళారూపాలు కావాలంతే.. దేవులపల్లి వారన్నట్లు "మనిషైతే మనసుంటే - కనులు కరగాలిరా - కరిగి కరుణ కురియాలిరా - కురిసి జగతి నిండాలిరా!" అప్పుడే మానవసంబంధాలకి ఒక అర్థం చేకూరుతుంది. మనిషి 'మనస్వి' లా బ్రతికే రోజులొస్తాయి.. ఇలాంటి రచనలు అందించడంలో 'కౌముది' తన శాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉంటుంది. క్రిందటి నెలలో ప్రచురించిన ప్రత్యేక రచన శేషార్థం ఎంతోమందిని ఆకట్టుకుంది. ఇందుకు సాక్ష్యం ఆ ఫైలుకి వచ్చిన 1500 పేజి హిట్స్. వీలైనప్పుడల్లా ఇలాంటి ప్రత్యేక రచనలని ప్రచురిస్తుంది మీ 'కౌముది'.

***జూన్, 2008***

***

ఈ మధ్యనే చదివానీ చిన్నకథానిక, ఇంగ్లీషులో. సౌలభ్యంకోసం పేర్లు తెలుగులో వ్రాస్తాను. - మాధవ్ ఓ పేరున్న పెద్ద కంపెనీ స్థాపకుడు.ఆ కంపెనీని అన్నికోణాల్లోనూ అభివృద్ధి చేయడంకోసం రాత్రీ పగలూ శ్రమిస్తాడు. ఎప్పుడూ మీటింగులూ, కాన్ఫరెన్సులూ, విమానప్రయాణాలూ..జీవితం హడావిడిగా ఉంటుంది. భార్యా బిడ్డలతో గడిపే సమయం కూడ తక్కువే. బిజినెస్ బిజీ.. బిజీ బిజినెస్.. సాయంకాలం ఏదో కష్టమర్ మీటింగ్ కని వెళ్తున్నాడు. కారు త్రారోడ్డు మీద దూసుకుపోతోంది.. సిటీ దాటుతుండగా..హఠాత్తుగా ఒక రాయి వచ్చి కారుకి తగిలింది. వెంఠనే కారు ఆపాడు.. బయటికొచ్చి చూసాడు. సైడ్ డోర్ ఒక మాదిరి డెంట్ పడింది. అసలే మీటింగ్ లేటౌతోందనుకుంటే మధ్యలో ఇదొకటీ..కోపంతో ఊగిపోతూ ఎవరా రాయి విసిరింది అని అటూ ఇటూ చూసాడు. పక్కనే ఉన్న చిన్నపార్కులోనుంచీ ఏడెమినిదేళ్ళ కుర్రాడు గబగబా వచ్చి ‘సారీ సార్..నేనే ఆ రాయి విసిరాను. ఏం చేసేదీ..ఏవ్వరూ ఆపడంలేదు. ఇలా చేస్తే కానీ ఆగరని నేనే రాయి విసిరాను..‘ ‘ఏమిరా..నీకోసం కారు ఆపాలంటే రాయి విసిరి కారుకి ఇంత నష్టం కలిగించాలా?‘ ‘కారు ఆపమన్నది నా కోసం కాదు కాదు సార్..మా అన్నయ్య కోసం..అడుగో..అక్కడ చక్రాల బండిలోనుంచీ కిందపడి కొట్టుకుంటున్నాడే వాడికోసం. అన్నయ్యకి రెండూ కాళ్ళు లేవు. చక్రాల బండిలో నేనే ఈ పార్కుకి తీసుకొచ్చాను. తోస్తుండగా చిన్న గోతిలో పడి బండి తల్లకిందిలైంది. అన్నయ్య బండి కింద చిక్కుకుపోయాడు. నేను ఒక్కడినే తనని లేపలేకపోతున్నాను. రోడ్డుమీదపోయే ఎన్ని వాహనాలకి చెయ్యి ఎత్తి చూపించినా ఆపడంలేదు. అందుకే..ఇలా చెయ్యల్సి వచ్చింది..‘ కన్నీళ్ళతో సంజయిషీ ఇచ్చాడా కుర్రాడు. మాధవ్ మనసులో ఎక్కడో ఒక కదలిక.. వెళ్ళి వాళ్ళన్నయ్యని చక్రాలబండిలో ఎక్కించి, కాస్త దూరంలో ఉన్న వాళ్ళింటివరకూ చేర్చి మళ్ళీ కారెక్కాడు. నిస్సహాయ స్థితిలో ఉన్న ఆ కుర్రాడి మొహమే పదే పదే కళ్ళముందు కదిలింది. కారుకి రాయి తగిలితే కానీ తను ఆగిచూడలేదు..జీవితంలో ఇంత వేగం అవసరమా? పోటీ తత్వం, ముందుకి దూసుకెళ్ళాలన్న తపన, ప్రపంచాన్ని జయించాలన్న ఆతృత..అవసరమే కానీ..జీవితంలోని మౌలిక విలువలూ, సున్నితత్వం, కుటుంబసభ్యులూ, బంధువులూ, స్నేహితులూ..కలిసిపంచుకోవాల్సిన ఆనందాలూ, కన్నీళ్ళూ, త్యాగాలూ, పొరుగువాడికి సాయపడే గుణం.. ఇవన్నీ కూడా జీవితానికి అవసరమే. ఎవరో వచ్చి మన కారుకి రాయి వేసి కొడితేగానీ ఆగనంతటి వేగం అవసరమా?ఒక్కసారి నిలబడి ఆలోచిద్దాం.. .. ''పక్కవాణ్ణి తొక్కుకుంటూ పరిగెత్తే ప్రతీక్షణం..

ఎక్కడికను చిక్కుప్రశ్న విప్పలేరు ఈ జనం..''

***జూలై, 2008***

***

నాకు తెలిసిన వాళ్ళల్లో ఒక పెద్దమనిషి అన్నాడు.." నాకు మనుషుల గురించిన అంచనాలలో ఎప్పుడూ నిరాశ ఎదురవ్వదు. ఎందుకంటే నాకు పరిచయమైన వాళ్ళనెవర్నీ వెంటనే మంచి వాళ్ళని అనుకోను. కాలం గడవాలి..కొన్ని సంఘటనలు జరగాలి.ఆ సంఘటనల వల్ల వాళ్ళలోని లేకి తనం, ఎదుటి వాళ్ళని వాడుకుని వదిలేసే గుణం, మోసపూరిత మనస్తత్వం బయటపడిందా..మరేం ఫరవాలేదు.. ఎలానూ వాళ్ళని మంచి వాళ్ళని అనుకోలేదు కదా. అంచేత నిరాశపడ్డం అనేది జరగదు. ఒక వేళ ఆయా సంఘటనల వల్ల వాళ్ళలో మంచితనమే బయటపడిందనుకోండి..మరీ మంచిది.. ఆశించని మంచి ఫలితం కాబట్టి ఇంకా సంతోషం వేస్తుంది. అంచేత ఏ పరిస్థితుల్లోనూ నాకు ఎవరి గురించీ నిరాశ అనిపించదు ". ఇంకో మిత్రుడన్నాడు.."అదేమిటో చాల పరిచయాలవల్ల నాకు నిరాశే మిగులుతోంది" అని. ఎందుకంటే "ఎదురైన ప్రతి ఎదకీ అంకితమౌతుంటాను. కనబడిన ప్రతివాళ్ళూ మంచి వాళ్ళే అనుకుంటాను. చాలా సన్నిహితంగా మసలుతుంటాను. ఏ సహాయం అడిగినా వెనకా ముందూ అలోచించకుండా చేసేస్తుంటాను. కానీ కొంతమంది ఎందుకో ఆ మంచితనాన్ని నిలబెట్టుకోలేరు. పరీక్షాసమయాల్లో వాళ్ళ అసలు బుద్ధులు బయటపడి 'అరే..ఇలాంటి వాళ్ళతోనా ఇంతకాలం స్నేహం చేసింది' అని బాధ పడుతుంటాను. హృదయం గాయపడుతుంది. కోలుకోవడానికి సమయం పడుతుంది..మనుషుల్లో మంచి తనాన్నే చూడ్డమనే స్వభావం ఉన్నంతకాలం ఇలాంటి అనుభవాలు తప్పవేమో.." అంటాడు. మొదటి మిత్రుడు ఎవ్వర్నీ నమ్మడు. రెండో మిత్రుడు అందర్నీ నమ్మేస్తుంటాడు. ఎవరి అనుభవాలు వారికి కొత్తపాఠాలు నేర్పుతుంటాయి.నమ్మడం, నమ్మకపోవడం వ్యక్తిగతంగా వచ్చే అలవాట్లే ఐనా, ఎదుటి వాళ్ళు తన మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమనేది సాధ్యమైనంతవరకూ పాటించడం మంచి మనిషి లక్షణం. నీళ్ళు సాధారణ ఉష్ణోగ్రత వద్ద ఎప్పుడూ చల్లగానే ఉంటాయి. ప్రశాంతంగానే అనిపిస్తాయి. మరిగిపోయే ఉష్ణోగ్రత వద్దనే అందులోని అణువుల్లో ప్రకంపన మొదలౌతుంది. విపరీతమైన ఘర్షణ..ఆవిరి..పొగలూ, సెగలూ.. మనుషులుకూడా చాలా సార్లు మంచిగానే, సౌమ్యంగానే అనిపించవచ్చు. పరీక్షాసమయాల్లోనూ, అత్యంత క్లిష్టతరమైన సందర్భాల్లోనూ కూడా తమ వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా, సంయమనం హద్దులుమీరకుండా, తమ మంచితనాన్ని నిలబెట్టుకోవడమనేది కొంతమందికే చేతనౌతుంది. అలాంటి వాళ్ళ వల్లే మానవత్వం మీద నమ్మకం మిగులుతుంది. !

*ఆగస్ట్, 2008*

***

'అబ్బే ..ఏ పని చేద్దామన్నా టైము సరిపోవడం లేదండీ..' , 'అస్సలు టైము లేదండీ..', ' తీరిక ఏదండీ..?' చాలామంది నుంచీ తరచూ వినిపించే మాటలివి. కొంతమందికి ఏపని చేద్దామన్నా సమయం కనిపించదు. ఎప్పుడూ హడావిడి, గందరగోళం, కళ్ళముందు చక్కబెట్టాల్సిన పనులెన్నో..ఏమి చెయ్యాలో తెలీదు..ప్రపంచం బరువంతా తామే మోస్తున్నట్లుంటారు. మరికొంతమంది ..అదేమిటో..ఎన్నో పనులు చేస్తుంటారు. ఐనా ఎప్పుడూ విశ్రాంతిగా ఉన్నట్లే ఉంటారు. మొహంలో చిరునవ్వులు చెదరనీయరు. ఏమిటీ వ్యత్యాసం..!? కొంతమందికి రోజుకి 24 గంటలూ..మరికొంతమందికి 24 గంటలకంటే ఎక్కువ టైమూ ఉంటుందా? దేశాధ్యక్షుడికైనా, ఆఫీసు గుమాస్తాకైనా, ఇంటిపని చేసే గృహిణికైనా, స్కూలు విద్యార్థికైనా ఎవరికైనా రోజుకి 24గంటలే సమయం ఉంటుంది. తరచి చూస్తే అందరికీ వారి వారి స్థాయినిబట్టి రోజూ చక్కబెట్టుకోవాల్సిన వ్యవహారాలు చాలానే ఉంటాయి. ఐతే వాటిని ఒక క్రమపద్ధతిలో విశ్లేషించుకుని, ముందూ వెనుకా ప్రాధాన్యత నిర్ణయించుకుని, ఒక్కొక్కపనీ ప్రణాళికా బద్ధంగా పరిష్కరించూ వెళితే స్పష్టత ఉంటుంది.లేకపోతే ఎప్పుడూ పని చేస్తున్నట్లే ఉంటారు, ఏ పనీ సమయానికి పూర్తవదు.. చిరాకు, మానసికమైన ఒత్తిడీ, తద్వారా సమస్యలని పరిష్కరించే సామర్థ్యం తగ్గిపోవడం..ఒక సంక్లిష్టమైన వలయం ఏర్పడుతుంది. పని చెయ్యడం కంటే అయ్యో చాలా పనులు మిగిలిపోయాయే అన్న దిగులు ఎక్కువ సమయాన్ని తినేస్తుంది. స్పష్టత, కంగారు తగ్గించుకుని సమస్యాసాధనలో సమయాన్ని వెచ్చించడం, వీలైనంత వరకూ చిన్న పనులైనా పెద్ద పనులైనా ఒక ప్రణాళికని రూపొందించుకుని ముందుకి వెళ్ళడమే కొంతమంది విజయ రహస్యమని శాస్త్రీయ పరిశోధనలు తేల్చిన వాస్తవం. పిల్లలకి విద్యార్థి వయసులో ఉండగానే ఇలా ప్రణాళికా బద్ధంగా చదువుకోవడం అలవాటుచేస్తే చాలా వరకూ ఒత్తిడిని తగ్గించవచ్చు. ఆ అలవాటే వారికి భవిష్యత్తులో వివిధ సమస్యలనీ ఏకకాలంలో పరిష్కరించే గుణానికి పునాదిగా ఉపయోగపడుతుంది...సాధించవలసిన వెన్నో సమయాభావం వల్ల సాధించలేకపోతున్నామని బాధ పడే వాళ్ళు ఒక్క సారి ఈ మార్గం ఎన్నుకుని చూడండి.. అంటున్నారు శాస్త్రజ్ఞులు.

***సెప్టెంబర్, 2008***

***

ఈ ప్రపంచాన్ని ప్రతి వాళ్ళూ తమ సొంతకళ్ళతో చూస్తారు, సొంత అనుభవాలతో మనుషుల్నీ, అనుబంధాలనీ అంచనా వేస్తారు . ఇది సహజం, ఇందులో తప్పేమీ లేదు. ఐతే చాలాసార్లు, చాలామంది పక్క వాళ్ళ అనుభవాలని తమవిగా పోల్చుకుంటారు. పక్క వాళ్ళ చెప్పే మాటలని బట్టి ఇతరులనీ, వాళ్ళ ప్రవర్తననీ అంచనా వేస్తుంటారు. ఇలాంటి మాటలు నెగిటివ్ భావాలతో నిండినప్పుడే కొన్ని చిక్కులు ఎదురౌతాయి. నాకున్న స్నేహితుల్లో ఒకరిద్దరి గురించి చాలా మందికి మంచి అభిప్రాయం లేదు. వాళ్ళు తమని ఎప్పుడో మోసం చేసారనీ, వాళ్ళ వల్ల తమకి చాలా ఇబ్బందులు ఎదురయ్యాయనీ చాలా సార్లు చెప్పేవాళ్ళు. నాతో ఐతే వాళ్ళెప్పుడూ మంచిగానే ఉండేవారు. సంవత్సరాల తరబడి స్నేహంలో ఎప్పుడూ పొరబాట్లు జరగలేదు. మనసు బాధపడే సంఘటనలు ఎదురవ్వలేదు. మిగతావాళ్ళు ఏదో చెప్పారని నేను వాళ్ళని గౌరవించడం మానలేను. మా మధ్య ఉన్న సత్సంబంధాలని వేరే వాళ్ళ కళ్ళద్దాలలో చూసి మరో భావాన్ని పెంచుకోలేను. ఒకరి మీద ఒకరికి అభిప్రాయాలు ఎదురవ్వడమనేది ఇద్దరి ప్రవర్తనలమీదా, ఇద్దరికీ ఎదురైన సంఘటనలమీదా, అప్పటి పరిస్థితులమీదా ఆధారపడి ఉంటుంది. అలానే ఒకే భావం ఎల్లకాలం ఉండాలని నియమంకూడా ఏమీ లేదు. అభిప్రాయాలూ, అనుబంధాలలో మార్పులు రావడం కూడా సహజమే. ఎవరో ఏదో చెప్పారని మనం మన భావాలని, అనుభవాలనీ పక్కకి తోసేసి, పక్క వాళ్ళు చెప్పిన మాటలని బట్టి మన సొంత బంధాలని ప్రభావితం చేసుకోవడమే చాలాసార్లు పొరబాట్లకి దారి తీస్తుంది. సుమతీ శతకకర్త అన్నట్లు 'వినదగు నెవ్వరు చెప్పిన / వినినంతనె వేగపడక వివరింపదగున్/ గనికల్ల నిజము దెలిసిన/ మనుజుడె పో నీతిపరుడు మహిలో సుమతీ!'. ఎవరు ఏ మాట చెప్పినా వినడంలో తప్పులేదు కానీ వాటికి తేలికగా లొంగిపోయి మన సొంత అనుభవాలని కాదని, వేరే మార్గంలో వెళ్ళిపోవడమే అంత సమంజసం కాదని విజ్ఞుల ఉవాచ. ముఖ్యంగా చెప్పుడు మాటలు, చాడీలు, ప్రతికూల భావాలూ..ఇలాంటి వాటి విషయంలో అప్రమత్తంగా ఉండి, మనల్ని మనం నియంత్రించుకోలేకపోతే, కొన్ని విలువైన స్నేహాలని అనవసరంగా కాలదన్నుకోవాల్సి వస్తుంది. అలాంటివి వినక తప్పని పరిస్థితులు వచ్చినప్పుడు వాటిని మనసులో ఓ మూల పడేసి ఉంచండి. అవసరమైతే అలాంటి మనుష్యులతో కాస్త జాగ్రత్తగా ఉండండి..అంతేకానీ మూడో వ్యక్తి మాటలకి మీ ఇద్దరి మధ్య స్నేహాన్ని బలిపెట్టకండి.. - ఇది అనుభవజ్ఞులు చెప్పే మాట. మానవ సంబంధాలూ, స్నేహాలూ, గాలిలో దీపం లాంటివి. నమ్మకం, అర్థం చేసుకోవడం అన్న రెండు చేతులతోనూ, ఇద్దరూ కాపాడుకుంటేనే అవి కలకాలం నిలుస్తాయి. ఇరువురి బ్రతుకులనీ వెలిగిస్తాయి..

***అక్టోబర్, 2008***

***

చిన్నప్పుడెప్పుడో చదివిన పిట్ట కథ.. ఆ రోజు ఆఫీసర్ గారు ఇంట్లోనుంచీ బయలుదేరేప్పుడు శ్రీమతి గారు దేనికో తగాదా పడింది. అయన మూడ్ అంతా పాడైపోయింది. ఆఫీసుకి రాగానే హెడ్ క్లర్క్ కనిపించాడు. పెద్ద తప్పు లేకపోయినా అయన్ని ఛడామడా చివాట్లేసాడు. హెడ్ క్లర్క్‌కి మేనేజర్ అనవసరంగా ఎందుకు కేకలేసాడో అర్థం చేసుకునే సమయం లేదు కాబట్టి తనకీ కోపం పెరిగిపోయింది. కొత్తగా చేరిన టైపిస్ట్ రాధని ఐదు నిమిషాలు లేటైందని అరగంట క్లాసు పీకాడు. అసలే కొత్త ఉద్యోగం..పైగా చిన్న పొరబాటుకి ఇంత క్లాసు తీసుకోవాలా అని తనలో తను కుములి పోయిన రాధ, సాయంకాలం ఇంటికి చేరే సరికి బుజ్జిగాడు "అమ్మా..అమ్మా..నా ప్రోగ్రెస్ రిపోర్ట్ చూడవా? " అంటూ ఎదురొచ్చాడు. . 'మధ్యలో వీడొకడు..ఇంటికి రాగానే అడ్డం పడుతూ..' వాడిని పక్కకి తోసింది. బుజ్జిగాడికి తను చేసిన తప్పేమిటో తెలీదు.. చిన్నబోయిన మొహంతో పక్కకి వెళ్ళాడు. ఇదంతా చూస్తున్న కుక్క పిల్ల టామీ దూరాన్నుంచీ తోకాడించుకుంటూ వచ్చి బుజ్జి గాడిని తలెత్తి చూడసాగింది ఓదార్పు చూపులతో. బుజ్జిగాడు అమ్మతో తిట్టించుకున్న కోపంలో టామీని ఒక్క తన్ను తన్నాడు. టామీ 'కుయ్యో' మంటూ మూలుగుతూ ఒక మూలకి చేరింది. ఇదండీ కథ.. ఎక్కడో ఆఫీసర్ గారి భార్యకి వచ్చిన కోపం చివరికి టామీ దెబ్బలవరకూ ప్రవహించింది, వివిధ వ్యక్తులద్వారా..! అత్తమీద కోపం దుత్త మీద చూపించడం అనే సామెతకిది సరిగ్గా అతికే కథ! కొన్ని కొన్ని సార్లు స్నేహితుల నుంచీ, ఆత్మీయుల నుంచీ, అధికారులనుంచీ, సహాధ్యాయుల నుంచీ ఎదురు చూడని తిరస్కారమో, విసుగో..ఏదో ఒక నెగిటివ్ చర్య ఎదురౌతుంది. మన వైపునుంచీ పెద్ద తప్పు లేకపోవచ్చు. ఐతే అనుకోకుండా ఎదురైన ఈ నెగిటివ్ చర్యకి వెంటనే ప్రతిస్పందించి, బాధపడి లేదా పోట్లాడి..స్నేహాన్నీ, సంబంధాన్నీ మరికొంచెం ఇరుకున పెట్టుకునేకంటే ఒక్కక్షణం 'ఇది నిజంగా మనమీద కోపం కాదేమో..తనకి ఎక్కడో ఏదో జరగడం వల్ల అది మనమీద చూపిస్తున్నాడేమో.. కాస్త సహనం వహిద్దాం..కొంతసేపటి తర్వాత పలకరించి చూద్దాం..' అనుకుని కాస్త ఓర్పు వహించగలిగితే చాలా అకారణమైన స్పర్థలు సర్దుకుంటాయి. (ఒకవేళ అది నిజమైన కోపమే ఐతే ఆ పరిస్థితిని సంబాళించుకునే విధానం వేరు) ..చాలాసార్లు `may be life is pinching them ` అనుకుని కాస్త 'బెనిఫిట్ ఆఫ్ డౌట్' ఇచ్చి చూస్తే చిన్న పొరబాట్లు పెద్దవి కాకుండా సమసిపోయే అవకాశం ఉంటుంది. ప్రయత్నించి చూడండి..

***నవంబర్, 2008***

***

ఇటీవలే ప్రపంచ రికార్డు స్థాపించిన సచిన్ టెండూల్కర్ మాట్లాడుతూ..‘ నామీద రాళ్ళు వేసిన వాళ్ళున్నారు. వాటన్నింటినీ మైలురాళ్ళుగా మార్చుకుంటూ నేను నిర్దేశించుకున్న లక్ష్యం వైపు సాగిపోయాను..‘ అన్నాడు. ఆశయ సిద్ధికోసం, లక్ష్య సాధన కోసం జరిగే ప్రస్థానంలో అనేక అవరోధాలూ, విమర్శలూ ఎదురవ్వడం సహజం. ఆ విమర్శలు నిర్మాణాత్మకమైనవైతే తప్పని సరిగా వాటిని విశ్లేషించుకుని మన గమనాన్ని సరిదిద్దుకోవాలి. అలాకాకుండా, కొన్నిసార్లు, కొంతమంది కేవలం మనల్ని మార్గం మళ్ళించడానికి అనేక కువిమర్శలు చేస్తుంటారు. వాళ్ళ లక్ష్యం కేవలం మనల్ని తప్పుదారి పట్టించడమే. అర్థరహితమైన విమర్శలకి ఉదాహరణలు కావాలంటే రోజూ వార్తాపత్రికలు చూడండి. చాలామంది రాజకీయ నాయకులు చేసేవి అలాంటి వ్యాఖ్యలే. ప్రజాసేవ , ఫలితాలనిచ్చే కార్యక్రమాల ఆచరణ కంటే ఎదుటి పార్టీవారిని దుమ్మెత్తిపోయడం, వాళ్ళు మళ్ళా వీళ్ళ మీద మరింత బురద జల్లడం... ఇలాంటి వాటి వల్ల ఎంత సమయం, మానవ వనరులూ వృధాఔతాయో వేరుగా చెప్పనవసరం లేదు. వ్యక్తిగత జీవితంలో కూడా ఇలా ‘దుమ్మెత్తి పోసే‘ విమర్శలకి సమాధానాలిస్తూ పోతే అసలు లక్ష్యం పక్కదోవ పడుతుంది. పూర్వకాలంలో ఓ రైతు ఒక కోతిని పెంచుకున్నాడు. అతనికి వ్యవసాయం పనుల్లో ఆ కోతి ఎంతో సహాయకారిగా ఉండేదంట. వాళ్ళ సాహచర్యం చాలా సంవత్సరాలు కొనసాగింది. ఓ రోజు కాలు జారి ఆ పొలంలో ఉన్న నూతిలో పడిపోయింది కోతి. రైతు వచ్చి చూసి, సహాయంకోసం చుట్టుపక్కల వాళ్ళని పిలిచాడు. అందరూ..” ఆఁ..ఇప్పుడు అ కోతిని బయటికి తీసి మాత్రం ఉపయోగమేముంటుందీ..అసలే ముసలిదై పోయింది. దాన్ని అందులోనే ఉండిపోనీ..”అని సలహాఇచ్చారు. కోతిని అ నూతిలోనే పూడ్చిపెట్టేందుకు తలాకాస్త మట్టిని నూతిలో వెయ్యసాగారు. మీద పడుతున్న మట్టిని, దుమ్ముని తప్పించుకోడానికి ఒళ్ళంతా దులుపుకుంటూ. ఆ ప్రయత్నంలో ఒక్కో మెట్టే పైకి పాకడం మొదలెట్టింది. కోతి.. దుమ్ము పోసే వాళ్ళు పోస్తూనే ఉన్నారు. కోతి దులుపుకుని పైకి పాకుతూనే ఉంది. చివరికి ‘దుమ్మెత్తిపోసిన‘ వాళ్ళకి ఆశ్చరం కలిగిస్తూ కోతి పైకి వచ్చేసింది. తన లక్ష్యం సాధించింది. నిత్య జీవితంలో తారసపడే ఈ ‘దుమ్మెత్తి పోసే‘ వాళ్ళందరకీ సమాధానాలిస్తూ సమయం వృధా చేసుకునే కంటే, అనుకున్న గమ్యాన్ని చేరుకుని లక్ష్యసాధనతోనే వాళ్ళకి సమాధానం చెప్పడం స్థిత ప్రజ్ఞుల లక్షణం.!సచిన్ చెప్పిందదే. చేసి చూపించిందదే.!

***డిసెంబర్, 2008***

***

# *2007*

'కౌముది' అంటే వెన్నెల..! వెన్నెల.. పేరు వింటేనే మనసంతా ఒక విధమైన 1హ్లాద భావన పరచుకుంటుంది వెన్నెలకి చిన్నా, పెద్దా తారతమ్యంలేదు, ఎడారీ, మైదానం భేదంలేదు, శ్వేతసౌధం, పూరిగుడిసె వ్యత్యాసం లేదు. జగమంతా తన చందన శీతల కిరణాలతో హాయి ప్రసరిస్తుంది. చీకటి భావాన్ని తరిమేసి వెలుగుపూల వర్షంతో అవనీతలాన్ని అభిషిక్తం చేస్తుంది. ఇలాంటి చల్లటి వెన్నెలలాంటి రచనల్ని నెలనెలా మీ ముందుకి తెస్తూ, మీ ముంగిట్లో సాహితీ కిరణాలతో రంగవల్లులు దిద్దే ఈ చిన్ని ప్రయత్నం వెనకనున్న ప్రేరణ ఏమిటంటే

ఆలోచన..హృదయస్పందన..

విశ్లేషణ.. సరికొత్త కోణాల ప్రేరణ..

వినోదం.. నవ్వుల విందుభోజన,

కౌముది పంచే సాహితీ సంపద మనందరికోసం..!!

లబ్ధప్రతిష్ఠులైన రచయిత / త్రుల రచనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ, వర్ధమాన రచయిత / త్రుల కొత్త కలం విన్యాసాల్ని పరిశీలిస్తూ, పాఠకులనీ రచయితలుగా తీర్చిదిద్దే ప్రయత్నాల్ని ఆదరిస్తూ.. ఒక సరికొత్త పత్రికని ప్రారంభించాలన్న ఆలోచనే 'కౌముది' ఆవిర్భావానికి పునాది. ఈ కొత్త ప్రయత్నానికి సంబంధించిన ఆలోచనని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కొంతమంది సాహితీ మిత్రులతో పంచుకోగానే విశేషమైన ప్రతిస్పందన లభించింది. కొత్త కొత్త సలహాలతో అందరూ ముందుకెళ్ళమని ప్రోత్సహించారు. కాలిఫోర్నిలోని కొంతమంది సాహితీ మిత్రులతో కలిసి ఒక సంపాదకవర్గంగా ఏర్పడి ఈ కొత్త పత్రికకి రూపురేఖలు నిర్ణయించడం, మా ప్రయత్నానికి చేయూతనిస్తూ అడిగిన వెంటనే రెగ్యులర్ ఫీచర్స్ వ్రాయడానికి పేరున్న వారెందరో ముందుకి రావడం.. ఇలా.. ఇదిగో 'కౌముది' మీ ముందుకి వచ్చింది.

ఎలాంటి లాభాపేక్ష, వ్యాపార దృక్పథం లేకుండాణ కేవలం మంచి తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు సాహితీ ప్రియులకి అందించడమే కౌముది ముఖ్యోద్దేశం. కేవలం హాబీనే ఐనా, నెలనెలా ఇన్ని పేజీల రంగురంగుల పత్రికని రూపొందించడం ఎంత శ్రమతో కూడిన పనో మీకు వేరుగా చెప్పనవసరం లేదనుకుంటాను. ఈ ప్రయత్నంలో కూడా తమ వంతు సహకారాన్నందిస్తున్న మిత్రులందరికీ కృతజ్ఞతలు.

మా ప్రయత్నం గురించి తెలిసిన హితులూ, మిత్రులూ, శ్రేయోభిలాషులూ, సాహితీ ప్రియులూ మాకు శుభాశీస్సులనందించి, ఆశీర్వదించారు. వారందరి అభిమానం, పాఠకుల ఆదరణే 'కౌముది'కి జవజీవాలు. ఉన్నతమైన సాహితీ విలువల్ని కాపాడుతూ, 'కౌముది'ని పాఠకుల పత్రికగా తీర్చిదిద్దే ఈ ప్రయత్నాల్లో మీ అందరి భాగస్వామ్యాన్నీ మనసారా కోరుకుంటున్నాం. మొదటి సంచికపై మీ స్పందనని నిర్మొహమాటంగా తెలియచేయండి. మీ నుంచీ అందే నిర్మాణాత్మకమైన విమర్శలే 'కౌముది'ని కలకాలం వెలిగే సాహితీ వెన్నెల ప్రపంచంగా నిలబెడతాయి. ఆత్మీయమైన మీ ప్రతి స్పందనకోసం ఎదురు చూస్తూ..

***జనవరి,2007***

***

మట్టి వాసనలో ఎదిగిన బాల్యంలో మన ఆటబొమ్మలు మనమే తయారు చేసుకునేవాళ్ళం. బంకమట్టితోనూ, అగ్గిపుల్లలతోనూ, తుమ్మజిగురు తోనూ, పాత కాగితాలతోనూ..ఒక్కటేమిటి.. ఎవరికీ పనికిరానివన్నీ మన ఆటవస్తువులకి ముడిపదార్థాలే. దీపావళి పండుగకైే సూరేకారం తో టపాకాయలు కట్టుకునేవాళ్ళం, ఎండబెట్టిన తాటి పువ్వులతో, పేడ పూతలతో పూలపొట్లాలు కట్టుకునేవాళ్ళం. వినాయక చవితికి ఊరంతా తిరిగి చెట్లు ఎక్కీ, పుట్టలు ఎక్కీ అన్ని రకాల పత్రులూ ఏరుకునేవాళ్ళం. గుళ్ళో వారం రోజులూ, పక్షం రోజులూ సీరియల్ గా సాగిన హరికథలు విని ఆనందించే వాళ్ళం. వర్షం వస్తే కాగితం పడవలూ, గడ్డిపూలమీద వాలే తూనీగలూ..అన్నీ మననేస్తాలే కదూ..! పెదబాలశిక్ష ఎంత జ్ఞానాన్నిచ్చిందీ..! వేమన శతకం, సుమతీ శతకం, విదురనీతులూ..ఎన్ని మంచి మాటలు చెప్పలేదూ..ఎంత వ్యక్తిత్వ వికాసానికి పునాదులు వెయ్యలేదూ..!ఎంత స్వచ్ఛంగా ఉండేవారోజులూ..!? పుట్టినవద్దనుంచే ప్లాస్టిక్ బొమ్మలూ, పాకడం వచ్చేసరికీ మరింత ఖరీదైన ఇంపోర్టెడ్ బొమ్మలూ, పండుగలకి అన్నీ రెడీమేడ్ వస్తువులూ, కేసెట్ లో కథలూ, పలక బదులు మేజిక్ స్లేట్ తోనూ, నోట్‌బుక్ తోనూ, బాల్‌పాయింట్ పెన్నుతోనూ మూడో ఏటనే మొదలైన చదువులు ఇంగ్లీష్ అక్షరాలమీదుగా సాగి కాంపిటీషన్ల రణరంగంలో, రాంకుల కత్తులు దూసుకునీ, నెత్తురోడ్చీ ..పై పైకి..పరుగే పరుగు. ఆగి చూసే తీరకలేదు. పక్కవాడి కంటే ముందే మనం ఎత్తులు వెయ్యాలి..! ..

బాల్యమా..ఈ సాంకేతిక ప్రగతి నీలోని సున్నితత్వాన్ని ఏం చేసింది..!? నీలోని అమాయకత్వాన్ని ఎవరు మింగేశారు? పసితనం లోని స్వచ్ఛత, నిర్మలత్వం ఏ నాగరికతా జవనాశ్వాలు తొక్కేశాయి?.! కాలచక్రం వెనక్కి తిరిగి మళ్ళీ అక్కడికే వెళ్ళాలనిపించేలా, బాల్యాన్ని బాల్యంలా చూసే రోజులు మళ్ళీ వస్తాయా?

*ఫిబవరి, 2007*

***

అంతము లేని ఈ భువన మంతయు పురాతన పాంథశాల - విశ్రాంతి గృహమ్ము, అందు ఇరు సంజెలు రంగుల వాకిళుల్ - ధర్మాక్రాంతులు, పాదుషాలు, బహరాం జమిషీడులు- వేనవేలుగా కొంతసుఖించి పోయిరెటకో..!- " ఈ ప్రపంచం అంతా ఒక పాతబడిన సత్రం.. మనుషులు వస్తుంటారు..వెళ్తుంటారు.. ఎక్కడికి వెళ్ళిపోతారంటే.."కొంత సుఖించి పోయిరెటకో..!". ఉన్నన్ని రోజులూ దక్కే సుఖం 'కొంత' మాత్రమే అంటాడు ఉమర్ ఖయ్యాం. ఈ జీవితంలో ఏదీ పరిపూర్ణంగా అనుభవించలేం కాబట్టి జీవించినన్ని రోజులూ ఎదుటివాడి స్వేచ్ఛకి భంగం కలగకుండా తెలిసినంతవరకూ ఎదుటివాళ్ళని బాధపెట్టకుండా జీవించగలిగితే జీవితానికి "కొంత" సార్థకత సాధించగలిగినట్లేనేమో..! "కదిలిపోయే క్షణాలన్నీ కాలవాహినిలో లీనమౌతాయి - నీతో గడిపిన కాలం మాత్రం - వీడని నీడలా నన్నంటి ఉంటుంది- వెను దిరిగిన నాకు దరహాసాల నందిస్తుంది - వేసారిన మనసుకి వసంతం చూపిస్తుంది" ఇలాంటి క్షణలు కొన్నైనా పోగుచేసుకుని - "జీవితపు మలిసంజెలో నిల్చొని వెనుదిరిగి చూస్తే - నీ కోసం నిలిచిన నేస్తం - నిను వెంటాడే జ్ఞాపకం - ఒక్కరైనా - ఒక్కటైనా మిగిలి ఉంటేనే..." ఈ పురాతన పాంథశాలలో మన మజిలీకి ఒక అర్థం ఉంటుంది. మన ఉనికిని కొంతకాలమైనా, కొంతమందైనా గుర్తుంచుకుంటారు. పరిచయమైన ప్రతి వ్యక్తీ మనకి ఎలా ఉపయోగపడతారా, ప్రతి సంఘటనలోంచి మనకి వచ్చేదేమిటీ - అని లాభనష్టాల బేరీజుతో ప్రతిక్షణం గడిపే వ్యక్తులు కోటలు కట్టగలరేమోకానీ జనహృదయాల్లో చోటు సంపాదించడం సంశయాత్మకమే..! అందుకే అన్నారు "ఒక్కటంటే ఒక్క లైఫే..ఏడిపించకుదాన్ని..!"అని.! మనం నడిచే దారులవెంబడి స్నేహసుమాలు జల్లుకుంటూ ప్రయాణిద్దాం. ఈ పురాతన పాంథశాలలో జగమంత కుటుంబానికి ఆత్మీయతానుబంధాలని పంచిపెడదాం..

*మార్చ్, 2007*

***

వసంతం మళ్ళీ వచ్చింది..పచ్చదనాన్నీ, పూలపరిమళాల్ని, ప్రకృతి శోభల్నీ మళ్ళీ మోసుకొచ్చింది. ఈ 'మళ్ళీ' అన్న పదాన్ని సరిగ్గా గుర్తుంచుకోగలిగితే మనకి బోలెడన్ని నిత్యజీవిత సత్యాలు బోధపడతాయి. మాడ్చేసిన ఎండలు దాటి, ముంచేసిన వానలు ముగిసి, వణికించిన చలిగాలులూ సమాప్తమయ్యా, రాలిన ఆకులమీదుగా కాల చక్రం తిరిగి తిరిగీ మళ్ళీ మధుమాసం వచ్చింది. ఈ ప్రకృతి సత్యాన్ని అనేక కోణాల్లో అన్వయించుకోవచ్చు. ఎండా, వానా, చలీ, వసంతం....ఏవీ శాశ్వతం కాదు.. ఒక దాని తరువాత ఒకటి పునరావృతమౌతాయి అన్నది ఒక సత్యమైతే, ప్రకృతి ఒక క్రమపద్ధతిలో తనని తాను సంస్కరించుకుంటూ ప్రతి సంవత్సరం కొత్త చివుళ్ళేస్తుంది అనేది మరో విషయం. పెద్ద విశ్లేషణ అవసరంలేకుండానే అవగతమయ్యే సంగతి - మనిషి జీవితానికీ, ప్రకృతి ధర్మానికీ ఎంతో అవినాభావ సంబంధముందనేది.మనిషికూడా జీవితంలో ఎన్ని 'ఋతువులు' దాటుకుంటూ నడుస్తున్నా ఎప్పటికప్పుడు తనని తాను సరిదిద్దుకుంటూ, సంస్కరించుకుంటూ 'మధుమాస'వేళని చేరుకోవాలి. ఎండా, వానా, చలీ, శిశిరం.. ఏదీ ఎక్కువకాలం ఉండనట్లే మనిషి బ్రతుకులో కూడా దుఃఖం, బాధా, భయం, కష్టాలూ, వేదనలూ .. ఏవీ శాశ్వతం కాదు. 'కాలం మారుతుందీ.. రేగిన గాయాలు మారుతుందీ..'అన్న కవే ' గుండె మంట లారిపే సన్నీళ్ళూ కన్నీళ్ళు..ఉండమన్న ఉండవమ్మ చాన్నాళ్ళూ..'అన్నాడు. మరో కవి 'కమ్ముకు వచ్చే కాళరాతిరి అంటే - మరో సూర్యోదయానికి చూలాలంట, అలుపనిపించే కలతలేమిటి అంటే - నిజం కాబోయే ఊహల బరువేనంట..!' అన్నాడు. కేవలం ప్రతికూల పరిస్థితులేకాదు, అనుకూల పరిస్థితులు కూడా శాశ్వతం కావాల్సిన అవసరంలేదు.. వసంతం వయసు కొద్ది నెలలే ఐనట్లు. మంచినీ, చెడునీ సమానంగా స్వీకరించే మనఃస్థితిని చేరుకున్నప్పుడు మనిషిని ఏ కష్టమూ కష్టపెట్టలేదు , ఏ బాధా భయపెట్టలేదు. 'నొప్పిలేని నిముషమేది జీవితాన అడుగు అడుగునా.. జననమైన మరణమైన బ్రతుకు అంటే నిత్య ఘర్షణ..' కాబట్టి ప్రకృతి ధర్మాన్ని అర్ధం చేసుకుని జీవనసరళికి అన్వయించుకుంటూ వెళితే చాలా సమస్యలకి పరిష్కారాలు దొరుకుతాయన్న పెద్దల మాటల్లోని యదార్ధం నిజంగా నిజం..!

*ఏప్రిల్, 2007*

***

ఎక్కడో ఎప్పుడో చదివిన గుర్తు - నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ ( లేదా మరో రైలు )సికింద్రాబాదు (లేదా మరో స్టేషన్ ) నుంచీ బయలుదేరింది. రిజర్వుడు కూపే లోకి హడావిడిగా వచ్చాడొకాయన. అటూ ఇటూ వెదుక్కుని తనది అప్పర్ బెర్త్ అని నిర్ధారించుకుని పక్కనున్న మరో ప్రయాణీకుడితో.." ఛీ. ఎప్పుడూ ఇంతే..వాడికి పది సార్లు చెప్పానండీ..లోయర్ బెర్త్ తీసుకోరా అని..వాడు నా మాట వింటేనా..అప్పర్‌బెర్త్‌లో నాకస్సలు నిద్రపట్టదు..ఈ జర్నీ అంతా ఎలానో ఏమో.." . పక్కనతను నిర్లిప్తంగా వుండి పోయాడు. కాస్సేపాగి మళ్ళీ ఇతడే."మా ఆఫీస్ బోయ్ కి అస్సలు బుద్ధిలేదండీ...ఈ అప్పర్ బెర్త్‌లో ఎలా పడుకోవాలో ఈ రాత్రంతా..". ఐనా పక్క ప్రయాణీకుడు..ఏమీ మాట్లాడ లేదు.. మళ్ళీ ఇంకొంచెం సేపటికి ఇతడే "అప్పర్ బెర్త్ అస్సలు పడదండీ నాకు..ఎప్పుడూ లోయర్ బెర్తే ఎన్నుకుంటాను. ఈ సారే ఇలా...అవునండీ.. ఇందాకటినుంచీ నా ఇబ్బంది గురించి పదే పదే చెబుతుంటే, మీరేమిటండీ..నిమ్మకు నీరెత్తినట్లున్నారే తప్ప కనీసం 'అయ్యో' అనికూడా అనరేమిటండీ..?". అప్పుడు పక్కనతను నోరువిప్పాడు.." ఊం..మీకు లోయర్ బెర్త్ రాలేదని, అదో జీవన్మరణ సమస్య ఐనట్లు బాధపడుతున్నారు కదూ.. నా సంగతి తెలుసా..చిన్నప్పుడే అమ్మా నాన్నా పోతే వారాలు చేసుకుని చదువుకున్నాను.ఎలానో ఉద్యోగం తెచ్చుకుని పెళ్ళి చేసుకుంటే, మగపిల్లాడికి జన్మనిచ్చాక కొద్ది రోజులకే నా భార్య చనిపోయింది.. అలానే కష్టపడి వాడిని పెంచుతుంటే పదినెలలయ్యాక తెలిసింది వాడికి మాట వినిపించదనీ, పుట్టుకతోనే చెవిటి వాడనీ. ఒక వైపు చాలీ చాలని జీతం, మరో వైపు చెవిటివాడైన పసివాడు..రెండో పెళ్ళి చేసుకుంటే,కొద్ది రోజులకే ఈ కుర్రాడిని చూసుకోలేనని ఆమె వెళ్ళిపోయింది. ఆలనా పాలనా లేక మా అబ్బాయి రెండేళ్ళకే నూరేళ్ళూ నింపుకున్నాడు. ఇంతలో ఉన్న ఉద్యోగం కాస్తా ఊడిపోయింది. ఇల్లు అద్దెకిచ్చిన యజమాని ఇల్లు ఖాళీ చేయించాడు..ఏదో సత్రంలో ఉందాములే అనుకుంటే, ఓ రోజు అర్ధరాత్రి పోలీసులొచ్చి ఏదో కేసులో దొంగలు దొరకలేదని నామీద కేసు బనాయించి, వాళ్ళ ఉద్యోగం నిలుపుకోడానికని నన్ను జైలుకి పంపించారు..నిన్ననే జైలునుంచీ విడుదలయ్యాను.... ఇన్ని సమస్యలున్న నేనే ఇంత నిబ్బరంగా వుంటే ఆఫ్టాల్ ఒక్క రోజుకి లోయర్ బెర్త్ దొరకలేదని ఇందాకటినుంచీ ఒహటే సణుగుతున్నారు..!?"

జీవితంలో దేనిగురించి బాధపడాలో, దేనిగురించి బాధ పడకూడదో తెలుసుకోవడం.. చాలా అవసరం. మన బాధలు సాధ్యమైనంత వరకూ, ఇతరుల్ని ఇబ్బంది పెట్టకూడదు. సమస్యల తీవ్రత అనేది సాపేక్షమని తెలుసుకుంటే ఎదుటివారిని బాధ పెట్టకుండా బతకొచ్చు. జీవితంలో పైకి వెళ్ళాలంటే తమ కంటే ఎక్కువ స్థాయి వారితో పోల్చుకోవాలి.. జీవితంలో సంతృప్తి కావాలంటే తమకంటే తక్కువస్థాయి లో ఉన్న వారితో పోల్చి చూసుకోవాలి. ప్రపంచం వైరుధ్యాల సమూహం.. మన లక్ష్యాన్ని మనం ఎన్నుకుని, మన ధైర్యాన్ని మనం కూడగట్టుకుని,మన ఆత్మ విశ్వాసాన్ని మనం ప్రోదిచేసుకుని మన గమ్యాన్ని మనం చేరుకోవాలి..!

**మే, 2007**

***

1984లో ఒకసారి హైదరాబాదులోని చిక్కడపల్లిలో ఉన్న 'జ్యోతి' మాసపత్రిక ఆఫీసులో ఒక ప్రముఖ రచయితని మొదటిసారిగా కలుసుకోవడం జరిగింది. అప్పటికే ఆయన నవలలు, నాటికలు చదివి ఉండడంతో , వివాదాల్లో చిక్కుకున్న వ్యక్తే ఐనా ఆయన్ని కలుసుకోవడం ఆసక్తిగానే అనిపించింది. పక్కనే మరో ఇద్దరు కామన్ ఫ్రెండ్స్ కూడా ఉన్నారు.ఆయన మాట్లాడిన పదినిమిషాల్లో ఎనిమిది నిమిషాలు తనని తరచూ కలవడానికి వచ్చే రచయిత్రుల గురించీ, తిరిగి చెప్పాలంటే సభ్యత అడ్డువచ్చేటంత, అశ్లీలమైన భాషలో అనర్గళంగా మాట్లాడాడాయన.. ఇటీవలే హైదరాబాదునుంచీ మిత్రుడు సత్యనారాయణ గారు మాట్లాడుతూ, తన చిన్నతనంలో జరిగిన సంఘటనని ఉదహరించారు..ఆయన చిన్నతనంలో విజయవాడలో ఉండే ఒక మహారచయిత్రిని చూద్దామని వెళ్ళేసరికి వాళ్ళ వీధి మొదట్లో మున్సిపాలిటీ పంపువద్ద పెద్ద గలాటా జరుగుతోందట.రచయిత్రి గారింటి కి వెళ్ళి ఆరా తీస్తే పంపుదగ్గర నీళ్ళ బిందెలకోసం పక్క వారితో హోరాహోరీ పోట్లాడుతూ, దాదాపు వారితో కొట్లాటకి కలయబడే వ్యక్తే మహా రచయిత్రి అని చెప్పారట..! స్త్రీ స్వాతంత్ర్యం గురించి అనర్గళంగా మాట్లాడుతూ, కనిపించిన ప్రతి స్త్రీ మీదా కరుణ రసం కురిపించే పెద్దమనిషి ఒకాయన తెలుసు.. ఇంటివద్ద ఆయన భార్యతో మాత్రం వారికి సంభాషణలుండవు.. ఎక్కడి కెళ్తారో చెప్పరు,ఎప్పుడు వస్తారో చెప్పరు. ఆ మహాతల్లి మాత్రం ఈ సంఘసంస్కర్త కోసం అలా కళ్ళల్లో వత్తులు వేసుకుని గుమ్మం వద్దనే పడిగాపులు పడుతూ ఉంటుంది. మనచుట్టూ ఇలాంటి వారు చాలా మంది తరచూ తారసపడుతూనే ఉంటారు.వీరంతా ఆత్రేయ గారన్నట్లు 'ఎదుటి మనిషికి చెప్పేటందుకె నీతులు ఉన్నాయి'అని మనసా వాచా కర్మణా నమ్మే వ్యక్తులు. ద్వంద్వ ప్రమాణాలూ, మనిషిలో మనిషి, చెప్పేదొకటి - చేసేదొకటీ..ఇలాంటి లక్షణాలు చాలామందిలో ఉండేమాట వాస్తవమే. ఐతే మామూలు మనుషులతో అంత ఇబ్బంది ఉండదు, వాళ్ళతో కల్సి తిరిగే కొద్ది మంది మాత్రమే వాళ్ళ హిపోక్రసీకి బలౌతారు. ఐతే తమ రచనల ద్వారానో, ఉపన్యాసాల ద్వారానో, నటన ద్వారానో, మరో కళ ద్వారానో పబ్లిక్‌ని ప్రభావితం చేసే వారిలో ఇలాంటి 'రెండో మనిషి' చాలా నెగిటివ్ ప్రభావం చూపిస్తుంటాడు. అలాంటి వాళ్ళు తాము పదేపదే వల్లించే నీతి సూత్రాల పరిధిలోనే జీవించాలని బయటివారు అనుకోవడంలో తప్పులేదు.చాలా మంది "వారి గురించి అలా ఊహించుకోవడం మీ తప్పు. వాళ్ళ వ్యక్తిగత జీవితాలని అంచనా వేసేందుకు మీరెవరు?" అని ఎదురు ప్రశ్నిస్తుంటారు. ఇది పూర్తిగా బలమున్న వాదన కాదు. వారు ఆచరించని నీతులు చెప్పే అర్హత వారికుంటుందా? ఆదర్శాలు వల్లించే వారు నీతి బాహ్యమైన పనులు చేసినా వాటిని పట్టించుకోకుండా ఉండడం సాధ్యమయే పనేనా? ఇలాంటి కుహనా నాయకులు తమ నిజస్వరూపం బయటపడే సమయం ఆసన్నమయే వరకూ ఆదర్శవ్యక్తులుగానే చలామణి ఔతారు.. అలాంటి వారిని ఒక కంట కనిపెట్టి వారిలోని 'మరో మనిషి' వల్ల సమాజానికి హాని కలగకుండా చూడడం నిజాయితీ గల ప్రతి వ్యక్తీ చెయ్యాల్సిన పని..!

*జూన్, 2007*

***

"నాక్కొంచెం నమ్మకమివ్వు.. " అంటాడో కవి తన కవితలో. ప్రపంచం కుంచించుకు పోతున్నప్పటికీ, నిత్యజీవితంలో యాంత్రికత, ఉరుకులూ, పరుగులూ పెరిగిపోయి, ఎవరికి వారై పోతున్న ఈకాలంలో ఒకరిమీద ఒకరికి నమ్మకం ఉండడం అంటే గొప్ప విజయం సాధించినట్లే ! ఒక విధంగా చూస్తే మానవ జన్మే నమ్మకం పునాదిగా మొదలౌతుంది. అమ్మ వాస్తవమైతే నాన్న ఒక నమ్మకం. పాలిచ్చి పెంచే అమ్మ తన బిడ్డకి 'ఇడుగో మీ నాన్న" అనగానే అది నమ్మకం అని తెలీని వయసులోనే బిడ్డ తండ్రి చెంతకి చేరతాడు. బుడి బుడి నడకలు నడిచేపుడు తండ్రి అందించిన చిటికెన వేలు బిడ్డకి కొండంత నమ్మకమిస్తుంది. తరువాత జీవన సమరంలో పడిపోయాక వివిధ దశల్లో వివిధ రకాల వ్యక్తులు పరిచయమౌతారు. ఏదో ఒక సందర్భంలో ఒకరిమీద ఒకరు,తాత్కాలికంగానైనా,ఆధారపడక తప్పని పరిస్థితులు ఎదురౌతాయి.. అదో.. సరిగా అప్పుడే ఈ 'నమ్మకం' అనేది ఎంతో విలువైందిగా ప్రస్ఫుటమౌతుంది. వాగ్దానాలు చేసి మరిచిపోయే వాళ్ళూ, గాలిలో మేడలు కట్టి చూపించేవాళ్ళూ, అరచేతిలో స్వర్గం చూపించి మాయమయ్యే వాళ్ళూ చాలా మంది ఎదురౌతారు. అప్పుడు 'నమ్మకం' విలువెంతో తెలుస్తుంది. "నిన్ను నిన్నుగా ప్రేమించుటకూ, నీకోసమె కన్నీరు నించుటకు..నేనున్నానని నిండుగ పలికే తోడొకరుండిన అదే భాగ్యమూ..అదే స్వర్గమూ..!" అన్న వాక్యాలని నిజంచేస్తూ, మనం పూర్తిగా ఆధారపడగలిగిన ఒక నేస్తం దొరకడం జీవితంలో ఒక ఎత్తైతే, అలా దొరికిన స్నేహాన్ని నిలబెట్టుకోవడం మరో ఎత్తు. నమ్మకమైన స్నేహితులు ఉండాలని మనమెలా అనుకుంటామో, ఎదుటువారికి అలాంటి నమ్మకమే ఇచ్చేలా మన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడం కూడా అంతే అవసరం. పరస్పర విశ్వాసం పెంపొందించే స్నేహాలు కలకాలం నిలుస్తాయి. అలాంటి స్నేహాలవల్ల స్నేహితులేకాక వారి చుట్టూ ఉన్న సమాజం కూడా ఉత్తమమైన మానవీయ విలువలతో పురోగమిస్తుంది.

***జూలై, 2007***

***

"అసలు చెప్పొద్దనే అనుకున్నాను. కానీ ఫ్రెండువి కదా అని చెబుతున్నాను..ఫలానా వాడు..నీ గురించి ఫలానా.. అన్నాడు. తెలుసా,," ఎవరో వొచ్చి మనచెవిలో ఊదుతారు. మనకి ఆ మాటలు వినగానే టెంపరేచర్ పెరిగిపోతుంది. 'హుఁ..నన్ను అంతమాట అంటాడా?" అనుకుంటాం.. ఇంకా చాలా అనుకుంటాం. మనలో మనమే. ఆ ఫలానా వాడిని సూటిగా అడగం.. ఎందుకంటే అప్పటికే మనలో ఆవేశం హిమాలయమంతగా పేరుకుపోతుంది. అసలు వాడు నిజంగా, అన్నాడా?..ఒకవేళ అనే ఉంటే అదే మాట అన్నాడా..? ఏ సందర్భంలో అన్నాడు..? ఆ మాటకి ముందూ వెనకా ఏం చెప్పాడు?- అబ్బే ఇవన్నీ ఆలోచించే విచక్షణ ఎక్కుడుంటుందీ..ఒక బాధతో కూడిన ఇగో..అహం..." హుఁ..వాడి కెంత చేశానూ..ఐనా కృతజ్ఞత లేకుండ ఇలా అంటాడా..? ' అనుమానం రాక్షసిపుండవుతుంది... మనలో మనమే కుళ్ళిపోతుంటాం. మహా ఐతే ఇంకొకరి వద్దకెళ్ళి " చూశావా.ఫలనా వాడు..నన్ను ఫలానా అన్నాడట. నాకు ఫలనా వాడు చెప్పాడు..." అంటాం. ఇంకొకరు.."అవును ఫలానా వాడంతే. ఫలానానే కాదు..ఫలానా..ఫలానా..కూడా అనే వుంటాడు.." అంటారు. నిప్పు మరి కొంచెం రాజు కుంటుంది. "అవును నిజమే...ఫలానా..ఫలానా.. కూడా అని ఉండొచ్చు.. ఫలానా వాడు మొహమాట పడి చెప్పి ఉండడు..ఫలానా, ఫలనా అనే కాక..ఫలానా, ఫలానా, ఫలానా.. అని కూడా అని ఉంటే..!?" మన ఆలోచనలకి రెక్కలొస్తాయి. మొట్ట మొదట్లో మనకా కబురు మోసుకొచ్చిన వ్యక్తి తనకి తెలిసిన వాళ్ళందరి వద్దకీ వెళ్ళి మన గురించి 'ఫలనా వాడు' అన్న విషయం ఆకాశవాణి లెవెల్లో ప్రచారం చేసేస్తుంటాడు. ఇంతా చేస్తే 'ఫలానా' అన్నట్లుగా చెప్పబడిన వ్యక్తి మాత్రం సుఖంగా, సంతోషంగానే ఉండొచ్చు. ఎందుకంటే తనామాటలు అని ఉండకపోవచ్చు, అన్నా వేరే మంచి ఉద్దేశంతోనే అని ఉండొచ్చు. మనలో మనం క్షోభ పడిపోతున్న విషయం అతడికి అసలు తెలీదు కదా..(ఏదీ.. మనం అతన్ని ఎదురుపడి అడగనే లేదు కదా..! ) ఇదండీ విషయం. !! చాలా సందర్భాల్లో ఈ విధంగానే మనిషికీ మనిషికీ మధ్య , మనసుకీ మనసుకీ మధ్య, సంబంధ బాంధవ్యాలు దెబ్బతింటాయి. అగాధాలు పెరిగిపోతాయి. కారణం.. మధ్యలో వాడి మాటలు మనసుకి ఎక్కించుకోవడం, అసలు వ్యక్తిని సూటిగా అడగకపోవడం. జీవితం ఇంత క్లిష్టంగా వుండాల్సిన అవసరం లేదు. ఎవరేం చెప్పినా 'వినినంతనే వేగపడక వివరింపదగున్" . కాస్త ఆలోచన, ఆవేశాన్ని అదుపులో ఉంచుకోగల మనస్తత్వం, ఎవరిగురించి మనం మనసులో కుతకుతలాడిపోతుంటామో వాళ్ళతో సూటిగా మాట్లాడగలగడం...-ఇవన్నీ ఆరోగ్యాన్నీ కాపాడుతాయి, అనుబంధాల్ని నిలబెడతాయి. కొంచెం సాధన చేస్తే ఏదీ అసాధ్యం కాదు..!

***ఆగస్ట్, 2007***

***

ఆదర్శాలని బోధించేవాళ్ళు కొంతమంది, ఆదర్శాలని వల్లె వేసేవాళ్ళు కొంతమంది, ఆదర్శాలని ఎలుగెత్తి చాటి చెప్పే వాళ్ళు కొంతమందీ, ఆదర్శాల ముసుగులో స్వలాభం కోసం, సొంత ప్రచారం కోసం పాకులాడేవాళ్ళు కొంతమందీ..ఎవరు నిజమైన ఆదర్శవంతులు? మన సమాజంలో చాలా మందికి ఆదర్శాలు చెప్పిన వాళ్ళమీద ఉన్న భక్తి, వారు బోధించిన ఆదర్శాలు ఆచరించడంలో ఉండదు. ఉదాహరణకి గాంధీ గారి మీద ఉన్న భక్తి గాంధీ గారు చెప్పిన, పాటించిన ఆదర్శాల మీద ఉండదు. అన్నమయ్య కీర్తనలు పాడడంలో ఉన్న ఆసక్తి ఆయన కీర్తనల్లో చెప్పిన సామాజిక సేవాదృక్పథాలని అమలు పరచడంలో ఉండదు. అలానే ఇతర ప్రవక్తలూ, నేతల విషయంలో కూడా. వీళ్ళెప్పుడూ వార్తల్లో వ్యక్తులుగా కనిపిస్తూ ఉంటారు, వ్యక్తిగత ప్రచారాలు ఏమాత్రం కుంటు పడకుండా జాగ్రత్త పడుతుంటారు కూడా.. వీళ్ళకి పూర్తి విరుద్ధంగా కొంతమంది ఉంటారు. వాళ్ళెప్పుడూ వేదికలెక్కరు, ఉపన్యాసాలివ్వరు, పత్రికా ప్రకటనల్లో చోటు చేసుకోరు.వారు అతి సామాన్యంగా కనిపిస్తారు. వాళ్ళకి తెలిసిందల్లా తమకి వీలైనంతలో ఎదుటివారికి సహాయం చేయడం. ఆ సహాయాలు ఏ ఆదర్శాల జాబితా కిందికి వస్తాయో, ఎవరు బోధించిన సూత్రాల పరిధికి చెందుతాయో వాళ్ళకి అనవసరం..అసలు అలాంటివి వున్నాయని కూడా వాళ్ళకి తెలీదు. వీళ్ళకి ప్రచారం అవసరంలేదు..టి.వి.ఛానెళ్ళు తమ గురించి ఎపిసోడ్స్ చూపిస్తాయా అన్న ఆలోచన అస్సలు ఉండదు.. వీళ్ళు ధనవంతులు కానవసరం లేదు, పదవులూ హోదాలు ఉండాల్సిన అవసరం లేదు. వాళ్ళకున్న ఒకే ఒక్క అర్హత..మానవత్వం..! అంతే. వీళ్ళల్లో వికలాంగ విద్యార్థుల్ని ఉచితంగా తన రిక్షాలో స్కూలుకి చేర్చే యాదగిరి ఉండొచ్చు, సికింద్రాబాద్ మోండా మార్కెట్లో చెరుకురసం అమ్ముకుంటూ పేదవాళ్ళకి పెళ్ళిళ్ళు చేసే నూర్ భాయ్ ఉండొచ్చు,గుడిబయట చెప్పులకి కాపలా కాసి వచ్చిన డబ్బుల్లో కొంతభాగాన్ని తనకి పెట్టుడు కాలునిచ్చిన జయపూర్ సంస్థకి పంపించే రామకృష్ణ కావొచ్చు, గత నలభై ఏళ్ళుగా సైకిల్ మీద పచ్చని చెట్లని పెట్టుకుని ఊరూరా తిరుగుతూ వాటిని అందరికీ ఉచితంగా పంచుతున్న రామయ్య కావొచ్చు..! అన్నీ ఉండీ ఇంకా ఏదో లేదనుకునే వాళ్ళకి, వీళ్ళు స్ఫూర్తి దాతలు, జీవితంలో ఆశావహదృక్పథానికి నిలువెత్తు సంతకాలు, మూర్తీభవించిన మానవత్వానికి సజీవ తార్కాణాలు,‘దేహముంది, ప్రాణ ముంది, నెత్తురుంది, సత్తువుంది..ఇంతకంటె సైన్యముండునా ..” అనుకునే ఏకవ్యక్తి సేనలు..! సామాన్యుల్లో అసామాన్యులు...!! - వీళ్ళగురించి ఈ నెల సంపాదకీయం లో ముందుగా ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందంటే..

***సెప్టెంబర్, 2007***

***

ప్రపంచం అద్దం లాంటిదని కొందరంటారు. అంటే మన ప్రతిరూపమే మనకి ప్రపంచం రూపంలో కనిపిస్తుంది. మన మనసు నవ్వుతుంటే ప్రపంచం అంతా అహ్లాదకరంగా కనిపిస్తుంది. మన మనసు అశాంతితో నిండినప్పుడు మన పరిసరాలేవీ సవ్యంగా ఉన్నట్లు అనిపించదు. అంటే చాలా సందర్భాల్లో మన మనసులోని వంకర్లు తీస్తే ప్రపంచంలోని వంకర్లు మాయమౌతాయి..! ఒక కోణంలో నుంచీ ఆలోచిస్తే మనం సమస్యలనుకునే చాలా విషయాలకి పరిష్కారం మనలోనే ఉంటుంది. అన్వేషణ అనేది మనలోనుంచే మొదలయ్యే ప్రవర్తనని అలవాటు చేసుకుంటే, చాలా సంఘటనలకి ఇతరుల్నీ, పరిసరాల్నీ, సమాజాన్నీ నిందించే అవసరం ఉండక పోవచ్చు. ఇదే విషయాన్ని ఇంకో కోణంలోనుంచీ విశ్లేషిస్తూ మిత్రులు శ్రీ సిరివెన్నెల గారు తాజాగా వ్రాసిన ఒక గేయంలో 'శత్రువులు నీలోని లోపాలే.. స్నేహితులు నీకున్న ఇష్టాలే..! " అన్నారు. చూడ్డానికి రెండే వాక్యాలైనా అనంతమైన లాజిక్ దాగివుంది వీటిల్లో. ఒక్కోసారి - ఎవరో మనల్ని ఏదో అంటారు..మనకది చాలా అసందర్భంగా అనిపిస్తుంది. మనకి చటుక్కున కోపం వస్తుంది. ఎదుటివారితో వాదనకో, పోట్లాటకో, కొట్లాటకో దిగుతాం. మరోసారి - మనవాడే, మన మిత్రుడే అని చాలా సహాయం చేస్తాం. వాడు మోసం చేస్తాడు. మన నమ్మకం దెబ్బతింటుంది..సహజంగానే వాడిమీద మనకి వ్యతిరేక భావం పెరుగుతుంది. ఇంకోసారి - మనకంటే బలవంతుడు మనల్ని అకారణంగా బెదిరిస్తాడు. చెయ్యని నేరానికి మనం సంజాయిషీ చెప్పుకోవాల్సి వస్తుంది.. ఇన్ని సందర్భాల్లోనూ తప్పంతే ఎదుటివాడిదేనని స్పష్టంగా తెలిసిపోతుంది కదూ..! ఈ సందర్భాలనే .. " శత్రువులు నీలోని లోపాలే' కోణంలో విశ్లేషిద్దాం. మనల్ని అకారణంగా నిందించిన వాడిని కాస్త సహనంతో ఒప్పించడం చేస్తే, ..!? మనల్ని మోసం చేసిన మిత్రుడిని క్షమించేసి, మరోసారి అలాంటి పొరబాటు చెయ్యకుండా మనల్ని మనం సరిదిద్దుకుంటే!?, బలవంతుడిని ఎదిరించలేని బలహీనతని జయిస్తే! ? మనలోనుంచే పరిష్కారానికి మార్గం కనిపించదూ..!? అసహనం, క్షమాగుణం లేక పోవడం, బలహీనతని జయించ లేకపోవడం..ఇవన్నీ మనలోని లోపాలే కదా..అవే కదా మనకి శత్రువులై బాధించింది..! మరోసారి ఆలోచిద్దాం. మనల్ని చికాకు పరచి, మనశ్శాంతి లేకుండా చేసే చాలా సమస్యలకి పరిసరాల్ని నిందించే బదులు మనలోని లోపాల్ని సరిదిద్దుకుని మన మనశ్శాంతికి, మన సవ్యమైన జీవనానికి మనమే బాటలు వేసుకుందాం.!

***అక్టోబర్, 2007***

***

అనుకోని సంఘటనల సమాహారమే జీవితం .. ఈ అనుకోని సంఘటనలు ఒక్కోసారి సంతోషాన్ని కలిగించవచ్చూ, ఇంకోసారి దుఃఖాన్ని, బాధనీ కలిగించవచ్చు. బాధ, దుఃఖం.. లాంటివి ఎదురైనపుడే తట్టుకునే శక్తీ, ఎదుర్కొనే ఓర్పూ మనిషికి ముఖ్యం. వాటిని పరిష్కరించుకోడానికి కావలిసిన నైతిక బలం, మానసిక స్థైర్యం సమకూర్చుకోవాలంటే ఆ బాధల గురించీ,విపత్కర పరిస్థితుల గురించీ వాస్తవ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి.. మనిషి పుట్టుకా, మరణమూ..ఏదీ కూడా నొప్పిలేని సంఘటన కాదు.. " నొప్పిలేని నిముషమేది..జననమైన మరణమైన జీవితాన అడుగు అడుగునా! నీరసించి నిలిచి పోతే నిమిషమైన నీది కాదు బ్రతుకు అంటె నిత్య ఘర్షణ..!!" ఇంత చిన్న సత్యాన్ని కూడా చాలాసార్లు మరిచిపోతాం కాబట్టే కష్టాలు వచ్చినపుడూ, ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడూ కుమిలిపోతుంటాం.. అయ్యో.. బతుకుబాట ఇలా ఐపోయిందేమిటీ.. సరళంగా, సూటిగా సాగిపోతే బావుండేది కదా అని అనిపిస్తుంది. అంతా సజావుగా నడిస్తే హాయిగానే ఉంటుంది కానీ, ఎదురు దెబ్బలు అనేవి శాశ్వతం కాదనీ, అవికూడా మన జీవనగమనంలో సహజమైన పరిణామాలేననీ అర్థం చేసుకుని, వాటిని అధిగమించేందుకు పరిశ్రమించడం మన కర్తవ్యం. 'బాధ అనే మాట కర్థం..నిను నువే గెలుచు యుద్ధం..!" "యుద్ధం మొదలెట్టందే, ప్రశ్నిస్తూ కూర్చుంటే అపజయమే ఎదురౌతుందీ..". మనలో మనం మథన పడ్డం మానేసి, కర్తవ్యం మీద దృష్టినిలిపి, 'యుద్ధం' మొదలెట్టడమే , ఎదురైన అడ్డుగోడల్ని కూల్చేసేందుకు చెయ్యాల్సిన మొదటి పని. "చేరాలా కలల కోట..రణమేరా రాచబాట..!".అనుకున్నది అందుకోవాలంటే రణాన్నే రాచబాటగా భావించక తప్పదు. . మన లక్ష్యాన్ని అందుకోనివ్వకుండా అడ్డుపడే ప్రతికూల పరిస్థితులతో, మన గమ్యాన్ని చేరుకోనివ్వకుండా ఎదురయ్యే అడ్డుగోడలతో.. 'యుద్ధం', 'రణం', 'పోరాటం' అనివార్యం !! ఈ జీవిత సత్యాన్ని సవ్యంగా అర్థం చేసుకుంటే చిమ్మచీకట్లో కూడా నక్షత్రాలు కనిపిస్తాయి..మండు వేసవి కూడా చిరుజల్లులవైపు త్రోవ చూపిస్తుంది. కావల్సిందల్లా ఆత్మవిశ్వాసం, పట్టుదలా, పోరాటానికి భయపడని మనస్తత్వం..!

***నవంబర్,2007***

***

'చిరునవ్వు వెల ఎంత..మరు మల్లె పువ్వంత..' అన్నాడొక కవి. మరుమల్లె చాలా చిన్నదే కానీ అది వెదజల్లే సువాసన మాత్రం అమోఘం.. ఆ చిన్ని రేకుల్లో దాగిన పరిమళం వెంటాడుతూనే ఉంటుంది. చిరునవ్వు కూడా అలాంటిదే. చిరునవ్వు నిండిన ముఖం, చిరునవ్వుతో పలకరింపు, చిరునవ్వుతో ఇచ్చిన సమాధానం, చిరునవ్వులు నింపుకున్న సంభాషణలు..మనల్ని అందరికీ దగ్గర చేస్తాయి. మన చిరునవ్వు మనతోనే ఉండిపోదు..అది వ్యాపింపచేసే ప్రశాంతత మన చుట్టుపక్కల అందరికీ సుగంధాలు పంచుతుంది. చిరునవ్వు నవ్వడానికి ఏమీ శ్రమ పడాల్సిన అవసరం లేదు. కానైతే మనసులో ఆ భావం ఉండాలి. మనసులోని ప్రశాంతత చిరునవ్వు రూపంలో పెదాలపై వెలగాలి. ఎవరో అన్నట్లు 'చిరునవ్వు పారేసుకున్న వాళ్ళు కనిపిస్తే నీ నవ్వులు కొన్నింటిని అప్పు ఇవ్వు..' కొన్ని చిరునవ్వులతో ఎదుటివారి మనసుల్ని జయించవచ్చు, మరి కొన్ని చిరునవ్వులతో సమస్యలని చిటికెలో పరిష్కరించవచ్చు, ఇంకొన్ని చిరునవ్వులతో శత్రువుల్ని మిత్రులుగా మార్చుకోవచ్చు, చిరునవ్వుకి భాషతో సంబంధంలేదు. దానికదే ఒక విశ్వజనీనమైన భాష.! ఎన్నో అభరణాలు, సిరి సంపదలూ,హోదాలూ పదవులూ ఇవ్వలేని అకర్షణని ఒక స్వచ్ఛమైన చిరునవ్వు ఇస్తుంది. మనలోనే దాగి ఉన్న ఈ బలమైన అయుధాన్ని సరిగ్గా ఉపయోగించడం అలవాటు చేసుకుంటే..'ఎటు చూసినా అందమే..ఏ వైపు వెళ్ళినా అనందమే..'

***డిసెంబర్,2007***

***